శ్రీస్వామివారు పెద్దవారికే గురువులు కాదు పేదవారికి కూడా గురువులు

తాళ్లభూమన్న

కార్యదర్శి, శ్రీవిద్యాప్రకాశానంద గీతాశ్రమము, బీరవెల్లి. (అదిలాబాద్ జిల్లా)

మావూరికి శ్రీ స్వాములవారు రావటానికి కారణము-1978 సం॥లో మహారాష్ట్ర బొంబాయిలో శ్రీస్వాములవారి గీతాజ్ఞానయజ్ఞము జరిగినపుడు - మా బంధువు పులిపేట నర్సయ్యగారు విద్యాగంధము లేనివారైనప్పటికి- శ్రీవిద్యాప్రకాశానందుల గీతా జ్ఞానమునకు వెళ్లి వారి బోధనా పటిమకు అచ్చెరువొంది ఆ బీరవెల్లిలోని (ఆదిలాబాద్ జిల్లా) మాకొరకు గీతామృతమును పానము చేయించుటకు-శ్రీస్వామివారి రచన గీతామకరంద గ్రంథమును తెచ్చారు.

గ్రంథములోని శ్లోకము టీక -ప్రతిపదార్థము విశేష వ్యాఖ్యానము చదువుట వల్ల స్వామివారి పాండిత్య ప్రకర్షకు ఆకర్షితులమై శ్రీస్వామివారిని దర్శించవలెనను కోరిక జనించినది.

అదెంత భాగ్యమో? భగవానుడు కరుణించినటుల మా బీరవెల్లికి దగ్గరలోని నిర్మల్ టౌను బస్టాండు బుక్ స్టాల్లో 'వేదాంత భేరి' పత్రికను అసాల నర్సయ్య గారు కొని తెచ్చారు. అందులో కరీంనగర్ 'మంథని' పట్టణములో శ్రీవిద్యా ప్రకాశానందగిరి స్వాములవారి గీతాజ్ఞానయజ్ఞము 10-12-1978 నుండి 28-12-1978 వరకు జరుగును అని వుంది. ఆలసించక మరునాడే అయిదుగురు సభ్యులము 'మంథని' పట్టణానికి వెళ్ళినాము. సాయంత్రము సభలో శ్రీవారు అనర్గళముగా భాషించే గీతాబోధను విని ఆనందభరితులైనాము. అక్కడ స్వాములవారి పుస్తక నిలయంలో కొన్ని భగవద్గీతలు తీసుకుని వేదాంతభేరి మాసపత్రికకు చందా కట్టినాము. ప్రతినెల స్వాములవారి వేదాంతభేరిలో అలతి అలతి పదాలతో వ్రాసిన అనుభవ పూర్వక గీతావ్యాసాలను చదువుతూ శ్రీ వారికి శిష్యులమైనందుకు సంతసించుచుంటిమి. వేదాంతభేరి మాసపత్రికలో ఆశ్రమ వార్తలు అనే శీర్షికలో హైద్రాబాద్‌లో ఏప్రిల్ 1981 స్వాముల వారి గీతాజ్ఞాన యజ్ఞము జరుగును. తేది (జ్ఞప్తిలో లేదు) అను వార్త చదివి మన ప్రాంతములో స్వాములవారి గీతోపన్యాస కార్యక్రమము జరిపించాలని మాకందరికి కోరిక కలిగింది. బీరవెల్లి నుండి ఐదుగురుము - సత్సంగ భక్తులము హైద్రాబాద్‌లోని స్వామివారి సభకు చేరుకున్నాము. ఉపన్యాసము విన్న తర్వాత మాలో కల్గిన కోరికను స్వాములవారి ప్రధాన శిష్యులైన శ్రీ ఈశ్వర్ గారిని కలిసి మా ప్రాంతములో స్వాముల వారి కార్యక్రమము ఏర్పాటు చేసే అవకాశం ఇప్పించండి, మీకు పుణ్యం ఉంటుంది - అని ప్రేమ, భక్తితో అడిగినాము. మా మాటలకు ఈశ్వర్ గారు- స్వాములవారు సున్నిత మనస్కులు, స్వామి వారికి ఏలాంటి లోటుపాట్లు జరుగకుండ కార్యక్రమము నడుపగల్గుతారా అని? స్వాములవారితో విన్నవించి తెలుపుతామన్నారు. మరునాడు మమ్ముల పిలిచి-

స్వాములవారి అనుమతి లభించింది, ఈ హైద్రాబాద్ యజ్ఞం పూర్తి అవగానే -ఏప్రిల్ 24 -25తేదిలలో రెండు రోజుల కార్యక్రమము పెట్టుకొమ్మన్నారు.

ఇక మా ఆనందానికి అవధులు లేవు. స్వామివారికి పాదాభివందనముచేసి బీరవెల్లి చేరుకున్నాము. ఇక్కడ యల్. రామారెడ్డి ఉపాధ్యాయులు ఉన్నారు. అందరము వారిని కలిసి గీతామకరంద గ్రంథరచయితలైన శ్రీ విద్యాప్రకాశానంద గిరి స్వాములవారు గీతోపన్యాస కార్యక్రమమునకు అనుమతించారు. కావున మన గ్రామపెద్దలందరి సహకారము కావలయును అనగానే తప్పకుండ అందరిని సమావేశ పరచి అడుగుదామన్నారు.

మరునాడు గ్రామ పెద్దలైన యల్. నర్సింహారెడ్డి, యల్. గంగారెడ్డి గార్లను పిలిచి ఉపాధ్యాయులు యల్. రామారెడ్డి గారు శ్రీ స్వాములవారి కార్యక్రమమునకు అందరి సహకారము కోరగా అంత గొప్ప స్వాములు మన గ్రామానికి రావడం మన భాగ్యం, గీతాజ్ఞాన యజ్ఞమును విజయవంతం చేద్దాం-అని హామి ఇచ్చారు. వెంటనే పత్రికలకు ఆర్డరు ఇచ్చి అన్ని గ్రామాలకు పత్రికలు పంపడం జరిగింది. గ్రామస్థులందరు నడుం బిగించి 23-4-1981 నాటికే మార్కండేయ మందిర ఆవరణలో మా అడవిలో నుండి తెచ్చిన 100 గుంజల పచ్చని పందిరి వేయడం జరిగింది.

23-04-1981 సాయంత్రం హైద్రాబాద్ నుండి వచ్చిన స్వాములవారిని హారతి మేళ తాళాలతో ఆహ్వానించి సల్లలింగారెడ్డిగారి గృహములో వారికి విడిది ఏర్పాటు చేశాము. ఎన్నడు, ఎప్పుడు కూడ గీతపైన ఉపన్యాసములు మా ప్రాంతములో జరుగనందున చాల దూరప్రాంతాల నుండి విరివిగా భక్తులు చేరుకున్నారు. అనుకున్న ప్రకారం 24-04-1981, ఉ॥ 7-00 గం॥లకు స్వాములవారు వేదిక నలంకరించి అందరిచే భజనగావించి ఉపన్యాసం ప్రారంభించారు. గంటన్నర 8-30 ని॥ల వరకు ఉపన్యాసం విన్న భక్తులు - ఆహా! కనివిని ఎరుగని గీతాబోధ, గీతలో ఇంతటి నిగూఢమైన జ్ఞానం నిండి నిబిడీకృతమై వుందా! - అని ఆశ్చర్యము, ఆనందము పొందారు. బీరవెల్లి గ్రామస్తుల కృషి ప్రశంసనీయమన్నారు శ్రీ స్వాములవారు.

గీతాచార్యుని కృపతో రెండు రోజుల కార్యక్రమము విజయవంతంగా ముగిసింది. వీడ్కోలు సభలో స్వామి వారిని గుఱించి మాట్లాడుతూ అసాల నర్సయ్యగారు ఎందరో కోటీశ్వరులున్నా నిర్మల్ పట్టణ వాసులను కాదని చిన్న కుగ్రామమైన బీరవెల్లి భక్తుల ఆహ్వానాన్ని మన్నించివచ్చిన స్వామి **"పెద్దవారికే గురువులు కాదు పేదవారికి కూడా గురువులు"** అన్నారు.

సన్మాన సభలో స్వామికి సమర్పణ చేసింది తిరిగి భక్తులకే ఇవ్వడం స్వామి వారి ఉదార గుణానికి తార్కాణం.

శాంతి మంత్రములతో సభ ముగింపు జరిగింది. ఆనాటి నుండి భగవద్గీతపై అభిరుచి కల్గింది. స్వామివారు ఉపన్యాసం జరిపి వెళ్ళిన తర్వాత మా సత్సంగ భక్తులకు- అన్ని గ్రామాలలో గీతా జ్ఞానం విస్తరింప జేయాలి అందుకు కేంద్రంగా గీతాశ్రమనిర్మాణం జరగాలి - అనే శుభ సంకల్పం కల్గింది.

రెండవ సారి స్వాముల వారు బీరవెల్లికి రాక

1983 లో శ్రీ స్వాములవారి గీతాయజ్ఞం గుఱించి ఆదిలాబాద్ భక్తులు మా బీరవెల్లికి కరపత్రములు పంపించారు. ఆ వార్తవిని మేమనుకున్న ఆశ్రమనిర్మాణ స్థలముకొరకు ఉపాధ్యాయులు యల్. రామారెడ్డి గారిని విచారించగా గీతాభిమానులైన యల్. నర్సింహా రెడ్డి, యల్.

గంగారెడ్డి, ముత్యం రెడ్డికి చెందిన సాగుచేయని పొత్తుల భూమి ఉంది మీరు నాతో రండి అడుగుదామన్నారు. సత్సంగ భక్తులందరము వారితో వెళ్ళి రెండవసారి మన బీరవెల్లికి శ్రీ విద్యాప్రకాశానందస్వాములవారు వచ్చుచున్నారు. గీతాశ్రమ స్థాపనకు భూదానమొనర్చి చిరకీర్తి నార్జించండి అన్నారు. కొంతతడవు ఆలోచించి సరే ఇస్తామన్నారు. ఆదిలాబాద్ గీతాయజ్ఞంలో పాల్గొని స్వాములవారిని దర్శించి బీరవెల్లిలో ఆశ్రమనిర్మాణమునకు మూడు రోజుల కార్యక్రమమును అనుమతించవలసిందిగా కోరాము.

తేది. 10-03-1983 రోజున బీరవెల్లి వచ్చుటకు స్వాములవారు అంగీకరించారు. ఆదిలాబాద్ కార్యక్రమము ముగించుకొని స్వాములవారు తేది 9-3-1983 రాత్రికి బీరవెల్లి చేరుకున్నారు.

మరునాడు మార్కండేయ మందిరఆవరణలో సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేయబడిన వేదిక నలంకరించి దిక్కులు మారు మ్రోగునట్లు గీతావాణిని వినిపించారు. ఉదయం పూట కార్యక్రమము ముగించి ఆశ్రమానికి భూదానమొనర్చిన దాతల త్యాగనిరతిని కొనియాడి వారిచ్చిన స్థలములో మంచినీటి బావికి ముహూర్తం (భూమిపూజ) చేశారు.

రెండవ రోజున ఉదయం వశిష్ఠగీతపై వారి దివ్యవాణి వినిపించి శ్రోతలను ఊఱ్ఱూతలూగించారు. ఉదయంపూట కార్యక్రమము ముగింపు జరిగిన తర్వాత భక్తులు స్వామివారిని పాదపూజకు ఆహ్వానించగా-శ్రమను లెక్కచేయక 20 గృహాలను వారి పాదస్పర్శచే పునీతం గావించారు. 3వ రోజు స్వాములవారి ప్రవచనముతో గీతాయజ్ఞం సాంగ మంగళ ప్రదంగా ముగిసింది.

మానవ జన్మ సాఫల్యతకు స్వాములవారు గావించిన గీతోపన్యాసాలు విని ఎందరో పరివర్తన చెంది శ్రీవారికి శిష్యులైనారు. 1984 సం॥లో భక్తుల సహకారంతో ముముక్షునిలయం అనే భవన నిర్మాణం జరిగింది. నాటి నుండి ఆనంద గీతాసత్సంగం అను పేరుతో ప్రతిగ్రామంలో 18 అధ్యాయాల గీతపారాయణ ప్రవచనాలతో గీతాయజ్ఞం అనే కార్యక్రమము మొదలయింది. సద్గురు కృపతో 108 గీతా పారాయణ, గీతా జ్ఞాన యజ్ఞాలు చేయడం జరిగింది.

ముచ్చటగా మూడవ సారి శ్రీస్వాములవారి రాక

1985 సం॥ స్వాములవారి గీతాయజ్ఞాల పర్యటన సందర్భంగా మం॥కోరుట్ల, ॥గ్రా॥ అయిలాపురం. గ్రామానికి భక్తుల కోరికమేరకు రెండు రోజుల గీతోపన్యాస కార్యక్రమమునకు వచ్చుచున్నారని అయిలాపురం భక్తులు మాకు ఉత్తరం వ్రాశారు. భక్తుల సహకారంతో నిర్మించిన ముముక్షునిలయం ప్రవేశమునకు ఊహించని విధంగా స్వాములవారు అయిలాపురం రావడంవల్ల గురువుగారి దర్శన, స్పర్శన, శ్రీవారి పాదపద్మాలతో ఆశ్రమం పునీతం కానుందని సంబరపడ్డాము.

బీరవెల్లి నుండి సత్సంగ భక్తులందరము అయిలాపురం వెళ్ళి స్వామిని దర్శించి ముముక్షునిలయం ప్రవేశానికి దయ చేయవలసిందని ప్రార్థించాము. స్వాముల వారు ఈశ్వర్‌ను పిలిచి పర్యటన డైరి చూచి చెప్పమన్నారు. డైరిని చూచిన ఈశ్వర్ గారు శ్రీ కాళహస్తికి తొందరగా వెళ్ళే అవసరముంది. రేపు పగలు 2. గం॥లకు వచ్చి ఒక గంట మాత్రమే ఉండగల్గుతామన్నారు. అదే మహాభాగ్యమని అక్కడి నుండి బీరవెల్లి చేరుకున్నాము. మరునాడు స్వామిరాకకు ఎదురుచూడగా సరిగ్గా పగలు 2. గం॥లకు

స్వామివారి రథం ఆశ్రమ ప్రాంగణములో ప్రవేశించింది. వేదిక నలంకరించిన స్వామీజీ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ఆధ్యాత్మికోన్నతికై మీలోకల్గిన భగవత్ భక్తి, ఐక్యత, కృషి, పట్టుదల ప్రశంసనీయమన్నారు.

భగవానుడు గీతలో "న మే భక్తః ప్రణశ్యతి, 9-31- అర్జునా! నన్ను నమ్మి నాకొరకు కర్మలనాచరించు భక్తుడెన్నడు చెడడు" అని అభయ మొసంగియున్నాడు. భగవానుడు గీతలోచెప్పిన బోధను ఆలకించి, ఆచరించి మీ జీవితాలను ధన్యము చేసుకొందురుగాక! అంటూ సభకు ముగింపు పలికారు.

దర్శించినంతనే స్వాములవారు మదిలో మెదిలే విధంగా ముందుగానే సిద్ధంగా వుంచిన అశ్వత్థ వృక్షము (రావి) మొలకను శ్రీవారి కరకమలములచే నాటి భక్తులందరిని ఆశీర్వదించి వెళ్ళారు. 1983 సం॥లో గీతాశ్రమ స్థాపన జరిగిన నాటి నుండి ఆశ్రమము దినదినాభివృద్ధి నొందుచు 1995 సం॥ నాటికి 12 సం॥ పూర్తి అయిన సందర్భంగా స్వామివారి బీరవెల్లి గీతాశ్రమములో శ్రీశ్రీశ్రీ దయానందగిరి స్వామి, గాగిల్లాపురం వారి అధ్యక్షతన మహాత్ములను ఆహ్వానించి వైభవముగా "మౌక్తికోత్సవము" జరుపుకున్నాము. శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు 1998. సం॥లో మహాసమాధి నొందిన తర్వాత శ్రీ కాళహస్తి శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపత్యము వహించిన శ్రోత్రియబ్రహ్మనిష్ఠులు సద్గురువులు శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారి ఆధ్వర్యములో తేది 08.09.10 మార్చి 2008 సం॥ సాధుమహాత్ములను ఆహ్వానించి రజతోత్సవాలను మహావైభవముగా జరుపుకున్నాము. పెద్దస్వాములవారు వచ్చిన ఆనవాయితి ప్రకారం స్వామి విద్యాస్వరూపానందగిరి స్వాములవారి ఆధ్వర్యములో ప్రతి రెండు సం॥లకు ఒకసారి మహాశివరాత్రి రోజు ఆశ్రమ వార్షికోత్సవాలు జరుపబడుచున్నవి.

గురుదేవులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాముల వారి అపార కృపావిశేషమువలన భగవద్గీత, భాగవత, రామాయణ, జగద్గురు శంకరాచార్యులవారి ప్రకరణ గ్రంథముల పరిచయము కలిగినది.

"ఊరకరారు మహాత్ములు, వారధముల ఇండ్లకడకు వచ్చుటకెల్లన్,

కారణము మంగళములకు మీరాక శుభంబు మాకు నిజము మహాత్మా" అన్న భాగవతవాణి అక్షరాల నిజమైంది.

గురుదేవులు మా ప్రాంతానికి మాగ్రామానికి రాకుండ ఉన్నట్లైతే వేదాంతజ్ఞానం, సద్గ్రంథపరిచయము, మహాత్ముల దర్శనం, మానవజన్మ తరణోపాయము మాకు లభించేది కాదు. అది లభించిందంటే

"శతకోటిజన్మ సుకృతైః పుణ్యైర్వినా లభ్యతే ॥ అది అనేకజన్మల పుణ్యఫలమనే చెప్పాలి.

కరుణాలయ సుందరమందిర అమృతానంద స్వరూపులు సద్గురువులకు జయము జయము

బిడ్డ ఊయలయందు పరుండి ఏడ్చినచో తల్లి అన్నిపనులు వదలుకొని అచటికి పరుగెత్తుకొని వచ్చి అతని యోగక్షేమములు విచారించునట్లు - భక్తుని మొరను భగవంతుడు ఆలకించుచునే యుండును. కావున దృష్టిని ప్రాపంచికసుఖములనుండి మరల్చి దైవమునందు నిలిపి ఆ దైవముకొరకై పరితపించుడు.

- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి

ప్రశాంతినిలయంలో జరిగిన సాధుసమ్మేళనం

కె.యస్. మూర్తి, ప్రశాంతినిలయం

భగవాన్ శ్రీసత్యసాయిబాబావారి సన్నిధిలో 1987వ సంవత్సరంలో జరిగిన అఖిలాంధ్ర సాధుపరిషత్ సమ్మేళనం గురించీ ఆ సదస్సులో శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాముల వారు సాధకులకొసగిన సందేశం గురించీ క్లుప్తంగా ఈ వ్యాసంలో తెలియ జేయడానికి ఎంతో ఆనందంగా వుంది.

1965వ సం॥లో సంస్థాపించిన సాధుపరిషత్ సమావేశాలు 22 సంవత్సరముల తర్వాత సాక్షాత్తు భగవానుని సన్నిధిలో జరుగడం గొప్ప విశేషమని గౌతమీ జీవ కారుణ్య సంఘం వ్యవస్థాపకులు శ్రీకారుణ్యానంద స్వాములవారు అన్నారు.

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు తమ సందేశంలో "భగవాన్ శ్రీసత్యసాయిబాబావారి సన్నిధిలో సాధుపరిషత్తు సమ్మేళనం జరుగుతున్నది. మహనీయులు చక్కని ప్రబోధాలు చేస్తున్నారు. కాని హృదయంలో ఏమైనా పరిణామం కలిగిందా? ఎక్కడున్న గొంగడి అక్కడే ఉన్నది. పురుషుడు పురుషోత్తముడు కావాలి. నరుడు నారాయణుడు కావాలి. జీవుడు శివుడు కావాలి. మానవుడు దానవుడు కాకుండా కనీసం మానవుడుగా ఉన్నా మంచిదే. మాయ దుర్బోధలు చేస్తుంది. ఫలితం "పునరపి జననం పునరపి మరణం". వచ్చే జన్మలో మళ్ళీ మనిషిగా పుడతాడనే హామీ ఏముంది. భగవద్గీత చెప్పింది కొంతసేపే. ఆ కొద్ది సేపట్లోనే తన అజ్ఞానం తొలగి పోయిందన్నాడు అర్జునుడు. అర్జునుడు మనందరి ప్రతినిధి. ఆయనను నిమిత్తంగా పెట్టుకొని కృష్ణపరమాత్మ భగవద్గీతను మనందరికి బోధించినాడు. మనస్సు చంచలమైనది నిజమే, అభ్యాసవైరాగ్యాలచేత దానిని నిలుపవచ్చు అని పరమాత్మ చెప్పాడు. ఆధ్యాత్మిక విషయంలో మనం ప్రధానంగా చేయవలసింది అనుష్ఠానం మాత్రమే. శ్రవణం తర్వాత మననం, నిదిధ్యాసనం చేయాలి. చర్విత చర్వణం చేయాలి, కేవలం శ్రవణం చేతపుణ్యం లభించ వచ్చునేమో కాని మోక్షం లభించడం కష్టం" అన్నారు. తమ సందేశంలో ఇంకా "దీపం పెడితేగాని చీకటి పోదు. వైరాగ్యమనే ప్రమిద, భక్తి అనే నూనె, ఏకాగ్రత అనే వత్తి, ఆత్మ విచారణ అనే అగ్గిపెట్టె ఉంటే - దీపం తప్పక వెలుగుతుంది. మనస్సును మార్గంలో పెట్టడానికి లాలించాలి, బుజ్జగించాలి కాని 'జబర్దస్తీ' చేయవద్దు. మీరేది చెప్పినా అది తిరగబడుతుంది. తిరగబడడం దాని స్వభావం. బోధించాలి. కనుక మనస్సుకు రజస్తమోగుణాలు తొలగి శుద్ధ సత్త్వస్థితి వస్తే ఇంక చేయవలసిందేమీ ఉండదు. మాయ అనే అజ్ఞానం పొర కప్పేసింది. కాని దైవం మనలోనే ఉందని ఘోషిస్తున్నాయి శాస్త్రాలు. గుళ్ళు ఏకాగ్రత కోసం ఏర్పడ్డాయి. దేవుడు గుడి గోడలమధ్యకాదు బ్రహ్మాండ మంతటా నిండి నిబిడీ కృతమై ఉన్నాడు. అరచేత కొండను మోసి, సముద్రాన్ని లంఘించి శ్రీరామచంద్రుని పాదాలచెంత దాసోఽహం అన్న హనుమంతునివలె అహంకారాన్ని అంతమొందించుకొని ఈ జీవితంలో మోక్షాన్ని సంపాదించే ప్రయత్నంలో సర్వేశ్వరుడు మనందరిని అనుగ్రహించుగాక!" అన్నారు.

సాధువులు, శిష్యగణం, భక్తులతో పాటు దేశవిదేశాల నుంచి విచ్చేసిన సాయిభక్తులు, సేవాదళ్ సభ్యులు ఆ సమ్మేళనంలో పాల్గొన్నారు. సాధువులు బాబావారితో తీయించుకున్న గ్రూప్ ఫోటోలో బాబావారి కుడి ప్రక్కన శ్రీవిద్యాప్రకాశానందులను ఎడమప్రక్క శ్రీ భూమానంద భారతులనూ చూడవచ్చు.

యావత్ ఆంధ్రప్రదేశ్‌నుంచీ, పొరుగు రాష్ట్రాల నుంచీ, బెనారస్, ఋషీకేశ్ మొదలగు ప్రాంతాల నుండి వచ్చిన 300మందికి పైగా సాధువులు, సాధుమాతాజీల నుద్దేశించి భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు తమ సందేశంలో "మీరు దేశాన్ని ముందుకు తేవడానికి తగిన శక్తి సామర్థ్యములు కలిగినవారు. భగవంతుడు 'ఏకోఽహం బహుస్యాం' అని సృష్టించాడో అదే విధంగా మీరు కూడ 'ఏకోఽహం బహుస్యాం' నాలో ఉన్న జీవశక్తి వికసించుగాక, ప్రకటించుగాక - అని ఆనందాన్ని తీసుకోవాలి, పొందాలి 'నాయమాత్మా బలహీనేన లభ్యః' మనము బలహీనులమని ఏమాత్రము భావించకుండా సర్వబలములు మన యందున్నవనే విశ్వాసాన్ని పెంచుకుంటే సర్వశక్తులూ మనకు చేకూరుతాయి. మీలో భజనలు తెలిసిన వారు సమాజములో ప్రవేశించి నగర సంకీర్తనం చేస్తూ, సాయంకాలం గ్రామస్థులందరినీ చేర్చి వారితో భజన చేయించండి. ఉపన్యసించగల వారు గ్రామములో ప్రవేశించి ప్రతి సాయంత్రం ఇండ్లకు చేరే రైతులను సమావేశ పరచి భగవత్తత్వాన్ని వారి హృదయాలకు హత్తుకొనేటట్లుగా బోధించండి. ప్రజలు దురభ్యాసముల చేత సంసారములను కూల్చుకొంటున్నారు. వారి దురభ్యాసములను మాన్పించి సదభ్యాసములను పెంపొందింప జేసి వారి కుటుంబాలకు ఆనందాన్ని అందించండి" అన్నారు.

భగవాన్ బాబావారు సమ్మేళనంలో చేసిన సమాజసేవా ప్రబోధానికి సాధువులు ముక్త కంఠంతో ప్రతిస్పందించారు.

ధ్యానము అత్యావశ్యకము

పరమార్థమార్గమున పురోగమించు సాధకునకు ధ్యానము అత్యావశ్యకమైయున్నది. ఒక వస్తువును గూర్చి తదేకనిష్ఠతో ధ్యానించునపుడు ధ్యాతయొక్క చిత్తమంతయు ధ్యేయాకారముగ పరిణమించి పోవును. ఇది ప్రకృతిలోగల నియమము. కీటకము(పురుగు) భ్రమరమును (తుమ్మెదను) నిరంతరము చింతన జేయుటవలన భ్రమరాకారముగ మారుచుండునని లోకప్రతీతి. దీనినే "భ్రమరకీటన్యాయము" అని అందురు. చిత్తము ఒక అద్దము వంటిది. అద్దము తన ముందు (పురోభాగమున) ఏది వుండునో దానిని తనయందు ప్రతిబింబింపజేసికొని తద్రూపమును బొందుచుండును. అట్లే చిత్తమున్ను అసురసంపత్తి, దయ్యపు స్వభావమును దాని ముందుంచిన చిత్తము ఆ అసుర రూపమునే పొందును. దైవసంపత్తి, సత్త్వగుణములను దాని ముందుంచిన చిత్తము ఆ సత్త్వగుణరూపమునే, దైవ సంపద్రూపమునే పొందును. కావున పారమార్థిక శ్రేయమును కోరువారు నిత్యశుద్ధబుద్ధముక్తమగు హృదయమందున్న పరమాత్మనే ధ్యానించుచు చిత్తమును దానియందే ప్రతిష్ఠతము చేయవలెను.

- స్వామి విద్యాప్రకాశానంద

శ్రీ శుకబ్రహ్మాశ్రమ గీతాపాఠశాల నా జీవితానికొక సార్థకతను చేకూర్చింది

- చిల్క రాజమ్మ

మాది అదిలాబాద్ జిల్లా లక్ష్మణ చాంద మండలం పారపల్లిగ్రామం. నేను సామాన్య కుటుంబంలో జన్మించాను. మా అమ్మనాన్నలకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. మాలో ఐదవ వాడు మాత్రం పదవతరగతి వరకు చదువుకున్నాడు. తక్కిన వారము ఏమీ చదవలేదు. నేను ఇంటివద్దనే అటలు, కథలు మాత్రం నేర్చుకున్నాను. నేను బ్రహ్మచారిణిగానే ఉంటూ అమ్మ నాన్నల వద్దనే ఉండిపోయాను. బీడీపనులకు వెళ్లుచుంటిని.

మాగ్రామంలో సోమ, శుక్రవారములలో స్వాధ్యాయం జరుగుతుంది. అందులో భవగద్గీత రెండు అధ్యాయములు పలికిస్తారు. భక్తి పాటలు పాడుతారు. నేను కూడ స్వాధ్యాయమునకు వెళ్లుచుంటిని. 1995 సం॥ములో పిప్పర గ్రామం నుండి శ్రీమహేశ్వరానంద స్వాములవారు వచ్చి మాగ్రామం పార్‌పెల్లిలో ఐదు రోజులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిపించినారు. 13-4-1995 తేది పంచమి గురువారం నాడు నేను శ్రీ మహేశ్వరానంద స్వామిజీ వద్ద గురుదీక్షను తీసుకున్నాను. అప్పుడు వారు నాకు స్తోత్రమంజరి ఇవ్వబోయారు. "నాకు చదువురాదు. నాకెందుకు స్వామి! ఈ పుస్తకం?" అని నేను అనగానే "చదువురాదు అనొద్దు. వస్తాది తీసుకో" అని చెప్పి ఆ పుస్తకాన్ని నాకు ఇచ్చారు.

27-11-1995 తేది పార్‌పెల్లిలో ఆశ్రమ స్థాపనకు ముహూర్తం చేశారు. పండ్రెండు సంవత్సరములు నేను ఆ ఆశ్రమంలోనే ఉన్నాను. స్వామిజీ గీతాపారాయణం చేయించే వారు. చదువు లేనందున స్పష్టమైన ఉచ్చారణ తెలవదు. పార్‌పెల్లి ఆశ్రమంలో జరిగే కార్యక్రమాలలో బీరవెల్లి వాస్తవ్యులు కరిపె లక్ష్మితో నాకు పరిచయం కలిగింది. శ్రీశుకబ్రహ్మాశ్రమంలో గీత చాల బాగా నేర్పుతున్నారని లక్ష్మి ద్వారా విని నేను శ్రీశుకబ్రహ్మాశ్రమం వెళ్లి గీత నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాను. 2007 వ సం॥ము వినాయక చవితి నాడు ఇంట్లో నిజామాబాద్‌కు వెళుతున్నాను అని చెప్పి బయల్దేరి హైదరాబాద్ చేరినాను. ఆ మరునాటికి శ్రీశుకబ్రహ్మాశ్రమంచేరాను. పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపా నందగిరి స్వాములవారిని దర్శించి పాదాభినందనం చేసుకొంటిని. నన్నాదరించి అనుగ్రహించిరి. లక్ష్మిఉన్న గదిలోనే నాకు వసతి ఏర్పాటు చేసారు. గీతా తరగతులకు వెళ్లేదాన్ని. గీతాసార్ శ్రీమార్కండేయులుసార్ గీత నేర్పుతున్న పద్ధతి నాకెంతో నచ్చింది. ఇంట్లో చెప్పకుండా వచ్చినందున ఒక నెల తర్వాత మరల ఇంటికి వెళ్లవలసి వచ్చింది.

పార్‌పెల్లి ఆశ్రమం శ్రీ మహేశ్వరానంద స్వాములవారి ఆశీస్సులు పొంది, అమ్మనాన్నల అనుమతి గైకొని 17-4-2008 తేదినాటికి మరల శ్రీ శుకబ్రహ్మాశ్రమం చేరినాను. ఆ రోజే గీతాపాఠశాల ప్రవేశం పొందినాను. మునుపటి వలెనే లక్ష్మి ఉన్న గదిలోనే నాకు వసతి లభించినది. చదువు లేని కారణంగా గీత శ్లోకాలు చూచి చదవాలంటే

చాలా కష్టంగా ఉండేది. మాకు గీత నేర్పించే శ్రీ మార్కండేయ సార్ కష్టమైన పదాలను నల్ల బల్లమీద వ్రాసి అనేకసార్లు మాచేత పలికించేవారు. తెలుగులో అచ్చులు, హల్లులు, గుణింతాలు ఒత్తులు నల్లబల్లమీద వ్రాసి, మాచేత వ్రాయించేవారు, పలికించేవారు. సంయుక్తాక్షరాలను విడగొట్టి పలికించేవారు. ఇలా అక్షరాలు బాగా నేర్చుకున్నాక గీతా శ్లోకాలు చదవడం కొంత సులభమైంది. గీతలోని అధ్యాయాలన్నీ పఠించడం నేర్చుకొన్నాము.

గీత ఒక్కటే కాదు :- విద్యా గంధములేని మేము గీతాగ్రంథముతో బాటు ఈ క్రింది పేర్కొన్న వాటిని గూడ కొంత నేర్చుకొన్నాము.

1. గీతలోని పద్దెనిమిది అధ్యాయములు స్పష్టమైన ఉచ్చారణతో పఠించుట, కొన్నిముఖ్యశ్లోకాలను పదవిభాగ అర్థ తాత్పర్య సహితంగా కంఠస్థము చేయుట.
2. శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రము
3. శివసహస్రనామ సోత్రము.
4. శ్రీ లలితా సహస్రనామ స్తోత్రము
5. పురుష సూక్తమ్
6. మంత్ర పుష్పమ్
7. **సంస్కృతము :-** పరిచయ, బాలబోధినీ, చిన్న చిన్న వాక్యములు దేవనాగరి లిపియందు వ్రాయుట, చదువుట. శిష్టాచార, గృహసంభాషణ వాక్యములు మాట్లాడుట.
8. **ఆంగ్లము :-** నామవాచక పదములను ఆంగ్లలిపిలో వ్రాయుట, చదువుట
9. **హిందీ :-** చిన్నవాక్యములను చదువుట, వ్రాయుట.
10. **యోగ :-** శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో నిత్యము నిర్వహింపబడుతున్న ఉచిత యోగశిక్షణా కేంద్రము ద్వారా ముప్పై రోజులు **యోగపరిచయ** పూర్తి చేసుకొని కొన్ని ఆసనాలు, ప్రాణాయామములు నేర్చుకొన్నాము. గీత నేర్పించిన శ్రీ సి. మార్కండేయ సారే యోగా కూడా నేర్పించారు.

ఆశ్రమం మాకందించిన సాయం :-

1. గీతాపాఠశాలలో చేరి గీత నేర్చుకున్నందుకు పోస్టాఫీసులో నాపేరుతో పదివేల రూపాయలు పొదుపు ఖాతాలో ఆశ్రమం వారు జమచేశారు.
2. అనారోగ్య సమయంలో ఆశ్రమం కారులో తీసుకెళ్లి ఉచిత వైద్యం అందిస్తున్నారు.
3. స్వగ్రామం వెళ్లునపుడు ఛార్జీలు ఇచ్చి స్టేషన్‌వరకు ఆశ్రమ వాహనాన్ని పంపుతున్నారు.
4. సంవత్సరమునకు రెండుసార్లు కొత్తబట్టలు ఇస్తున్నారు.
5. పూజ్య స్వాములవారు మరియు ఇతర ఆశ్రమవాసులందరూ మమ్ములను అభిమానంతో చూస్తుంటారు. నేను ఈ గీతా పాఠశాలలో చేరి పూజ్య శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి అనుగ్రహంతో జన్మను ధన్యం చేసుకొన్నాను. నాడు నిరక్షరకుక్షిని, నేడు భగవద్గీతను సుస్పష్టంగా చదువగలుగుచున్నాను. ఆశ్రమనివాసం, ఆశ్రమగీతాపాఠశాల నాజీవితానికొక సార్థకతను చేకూర్చాయి.

-ఓమ్ -

మనస్సును బాహ్యం నుండి అంతర్ముఖమొనర్చి ఆత్మయందు స్థాపించి పరమాత్మనే ధ్యానించాలి. ఆత్మేతరమగు దేనినీ చింతించరాదు.

- స్వామి విద్యాప్రకాశానంద



గీతామకరందము విశ్వతత్త్వప్రకాశానందము

- లొల్ల విశ్వమోహనరావుఎం.ఏ., బి.ఇడి.,
(రాజమండ్రి)

శ్రీకాళహస్తీశ్వర క్షేత్రమున పవిత్ర సువర్ణముఖీ నదీతీరమున శ్రీశుకబ్రహ్మాశ్రమమును స్థాపించి వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమముల ద్వారా ముముక్షువులను చైతన్య పరచి వేదాంతాన్ని మాన్యులకు, సామాన్యులకు చక్కని సాదృశ్యముల ద్వారా వివరించి ఆచరణాత్మక విజ్ఞానము నందించి తరించిన తపస్వి, తేజస్వి, యశస్వి, మనస్వి - శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు.

వేదముల సారాన్ని, సనాతన సర్వధర్మ మార్గము లను సమన్వయపరచి ఉపనిషత్తులకు, భగవద్గీతకు, బ్రహ్మసూత్రములకు విశ్వజనీనమైన వ్యాఖ్యానములతో వేదాంతాన్ని సామాన్యుల మస్తిష్కములకు చేర్చిన సుమనస్కులు శ్రీస్వాములవారు. దివ్యము, భవ్యము, నవ్యము, శ్రావ్యము, అమృతమయమగు ఉపమానములతో భగవద్గీతకు విపులమగు వ్యాఖ్యతో గీతామకరందమును ముముక్షువులు తనివి తీరగ్రోలునట్లు వ్రాసిన తపస్వి వారు.

దేశమంతటా పర్యటించి 108గీతా జ్ఞాన యజ్ఞ ములు నిర్వహించి తన మధుర భాషణముచే ఆర్షజనులలో జ్ఞాన జ్యోతిని ప్రజ్వలింపజేసిన తేజస్వి.

బృందావనములో సలలిత రాగ సుధారసములను గోపీజన కేళిపై కురిపించి గోపవధూటి హృదయ పద్మములను వికసింపచేసినట్టి వేదవేద్యుడగు శ్రీకృష్ణపరమాత్మ కురుక్షేత్ర రణరంగమున శోకసంవిగ్నమానసుడై యున్న పార్థుని కార్యోన్ముఖుని గావించుటకై పార్థ వ్యాజమున జనసామాన్యమున కంతటికిని గీతను ఉపదేశము చేసెననుట తథ్యము.

శ్రీకృష్ణుడు అనుగ్రహించిన ధర్మామృతమగు గీతకు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు గీతామకరందము ద్వారా విద్యాప్రకాశములను, జ్ఞానానందములను పారమార్థిక జనుల హృదయాంత రాళములలో ఉద్దీపనము చేసిన యశస్వి.

నవనీత చోరుడు నిగూఢముగ నుంచిన గీతాపెన్నిధిని ఆనంద గిరిధరుని కృపాకటాక్షములతో వెదికి తీసి అలతి అలతి పదములతో జనసామాన్యమున కందించి ధన్యత చెందిన సమాహితుడు శ్రీ స్వామివారు. భక్తుడైన కన్నప్పవైపే కన్నప్పగించి కృపాదృష్టితో వీక్షించు త్రినేత్రుని మనః సంకల్పమును దృష్టియందిడుకొని దృష్టిదోషములకు వైద్యసేవలందించుటకై ఆశ్రమములో భక్తకన్నప్ప కంటి ఆసుపత్రిని నెలకొల్పి కంటి వైద్యము ద్వారా ఆర్తులకు ప్రకాశానందములను, విద్యాలయముల ద్వారా విద్యాప్రకాశములను అందించిన మనస్వి వీరు.

భగవద్గీతను తన గళంతో, కలంతో పరివ్యాప్త మగునట్లు చేయుటయే గాక ధార్మిక గ్రంథసృజనలో అనితర సాధ్యమైన ప్రక్రియలతో వివిధ జ్ఞాన రత్నాకరము లను మథించి అనర్ఘ జ్ఞానరత్నాలను అందించి మహర్షి శుకబ్రహ్మగా ప్రస్తుతింపబడిన విద్యావాచస్పతి స్వామి.

స్వామి శ్రీవిద్యాప్రకాశానందగిరి గారి లేఖిని నుండి వెలువడిన గీతామకరందము నందలి విస్తృత విషయవివరణము, వ్యాఖ్యాన శైలి కర్ణపేయంగాను, శ్రవణానందంగాను వుంటుంది. భాష ప్రసన్న గంభీరంగా, ధీరలలితంగా వుంది విలక్షణమైన శైలితో అలరారుచున్నది.

భక్తి, ఆధ్యాత్మిక సాహిత్యంలో శ్రీవిద్యా ప్రకాశానందగిరిస్వామి వారి స్థానము కైలాసశిఖరము. "గీతామకరందము" ఈ శతాబ్ది ఆధ్యాత్మిక గ్రంథముగా శాశ్వత యశస్సు గడించినదని చెప్పవచ్చును.

గీతామకరంద గ్రంథముపై విహంగ వీక్షణమే అయినా గంభీరముగ ద్యోతకపడు శ్రీవిద్యాప్రకాశానంద గిరి స్వామివారి పాండితీ పటిమ, సంవిధాన చాతుర్యము, వస్తువైభవము, జ్ఞానదృష్టి గీతామకరంద ప్రాశస్త్యమును శ్రీస్వామివారి అనుగ్రహముతో ప్రస్తుతించుచున్నాను.

గీత - విశ్వవాఙ్మయమున మహత్తర గ్రంథ రాజము. నరనారాయణుల తపః ఫలితము. శ్రీవేదవ్యాస మహర్షి ఛందోబద్ధమొనర్చిన దివ్య వాఙ్మయము. మహనీయులగు ఆ మువ్వురు తపస్సంపన్నుల కృపావిశేషము. సర్వధర్మ సమన్వయమైన విశ్వమత గ్రంథము. గీత యందలి గంభీరభావములు, అంతులేని అర్థపరంపరనుబట్టి లోకోత్తర సర్వోపయోగ గ్రంథమని శ్రీస్వామివారు ప్రస్తుతించిరి.

గీత "ధ" కారముతో ప్రారంభమై "మ" కారముతో సమాప్తమగుటను బట్టి గీత ధర్మగ్రంథమనిరి. విశ్వ సాహిత్యమున పెక్కు గీతలున్నను (వసిష్ఠగీత, బ్రహ్మగీత, పరాశరగీత) భగవద్గీతయను దానికే గీత యనునామము చక్కగ రూఢిపడినదనిరి. భగవద్గీత యను నామమునందే విశాల భావము ద్యోతక మగుచున్న దనియు ప్రపంచమున గల ప్రముఖ భాషలన్నిటి యందును అనువదింప బడినదనియు, శ్రీకృష్ణుడు కురుక్షేత్ర సంగ్రామమున వేద వేదాంతముల సారమంతయు పిండి అర్జునునకు యోగయుక్తుడై భగవద్గీతను బోధించెననియు, యోగ నిష్ఠా సంజనితము కనుకనే గీతకు అంతటి అఖండశక్తి ఉద్దీపించినదనిరి.

వేదముల సారము ఉపనిషత్తులు, ఉపనిషత్తుల సారము భగవద్గీత. కావున గీతను అనుష్ఠించి భవ దుఃఖములు బాపుకొనవలెనని, గీతయందెంతయో విజ్ఞాన భండారమున్నదని, గీతామహిమను శ్రీకృష్ణ డొక్కడు మాత్రమే సంపూర్ణముగ నెఱిగి యున్నాడనియు, తక్కిన వారందరును ఒకింత మాత్రమే తెలిసికొనియున్నారని సర్వదేశములకు సర్వకాలములకు, సమస్త మతములకు, సమస్త సంప్రదాయములకు చెందిన సార్వభౌమ గ్రంథమనిరి.

ప్రస్థానత్రయమునందు ప్రస్తుతింపబడిన గీతను ఆశ్రయించిన, సామాన్య జీవితము దివ్య జీవితముగ మాఱి క్రమముగ మానవుడు మాధవుడుగ పరిణతి

జెందగలడనిరి. శోకరాహిత్యము, ఆనందప్రాప్తి గీతవలన కలుగు ఫలములనియు అర్జునుని విషాదమును అంత మొందించిన గీత అందఱి భవరోగములను నివారణ చేయగల దనియు, జాతి, మత, కుల, వయోవిచక్షణలేక సర్వులును గీతాపఠనమునకు, గీతాజ్ఞాన సముపార్జనకు అధికారులేయని స్వామి ఘంటా పథముగ వక్కాణించిరి.

సిద్ధాంతమును ఏకరవు పెట్టుటకంటె అనుష్ఠానమును నొక్కి చెప్పుట గీతాచార్యునకు పరమప్రీతి కనుకనే పరమాత్మను గుఱించి ఒకింత తెలియజేసి, పరమాత్మను చేరుటకు వలసిన సాధన సంపత్తిని విస్తారముగ గీతయందు వివరించెననిరి.

శీల నిర్మాణమునకు విశేషప్రాధాన్యము నొసంగుచు గీతాచార్యుడు జ్ఞేయమును తక్కువగ జెప్పి జ్ఞానమును విస్తారముగను, ధ్యేయమును రవ్వంత జెప్పి ధ్యానమును మిక్కుటముగను, సాధ్యమును ఒకింత ప్రతిపాదించి సాధనను బహుళముగను ప్రచారము చేసెననియు, గీత ఆచరణాత్మక విజ్ఞానమని సూచించిరి. శరీరము ప్రవృత్తియందున్నను, మనస్సును నివృత్తి యందుంచు కొనుమని గీత ప్రతిపాదించినదనిరి.

మోక్షసాధమునకు "కర్మ, భక్తి, ధ్యానము, జ్ఞానము" అను నాల్గును నాలుగు ద్వారములనియు ఏ ద్వారముగుండా వెళ్ళినను ముక్తి ప్రాసాదము లోనికి చేరుకొనవచ్చునని అన్ని మార్గములు జీవుని కైవల్య ధామమునకు జేర్చునని గీతాకారుడు నుడివెననిరి.

కర్మ నాచరించుట యందే ఆనందము పొందు వారికి కర్మ యోగమును, పూజ, ప్రార్థన, జపము మున్నగునవి చేయుచు ప్రీతి నొందువారికి భక్తి యోగమును, చిత్తమును సర్వదా అంతర్ముఖ మొనర్చి ధ్యానము చేయువారి కొఱకు ధ్యాన యోగము లేక ఆత్మసంయము యోగము, జ్ఞానులకు జ్ఞానయోగము, క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగములతో-భిన్న భిన్న మనస్తత్వములు కలవారి నందఱిని సంతృప్తి పఱచుచు సర్వపథములు సత్యములేయని చక్కని సమత్వమును సూచించిన గ్రంథరాజము గీతయని శ్రీస్వామివారు ప్రస్తుతించిరి.

భక్తి, జ్ఞాన, యోగములయొక్క వాస్తవ స్వరూపమును బోధించుటయే గాక, ఏ జీవిని బాధించినను భగవంతుని బాధించినట్లేయని, సమస్త జీవకోటిని ప్రేమించవలెనని, దయ కలిగి వర్తించవలెనని, భూతదయయను మహోత్కృష్ట సుగుణమునకు గీతలో సముచిత స్థానము కలదనియు, గీత వాచావేదాంతము కాదు, అనుష్ఠాన వేదాంతమని కొనియాడిరి.

చిత్తము నిశ్చలముగ నుండుటయే యోగమనియు, సమబుద్ధిగల ధీరుడే మోక్షము నొందగల డనియు, జనులలో పెక్కురు మోక్షము నభిలషించువారే కాని ఆ మోక్షమునకు ప్రతిబంధకముగ నున్న చిత్తమును సరిదిద్దు కొనుటకు యత్నింపరని, విశ్వమంతయు ఒకే భగవత్స్వరూపమని, అజ్ఞానము వలననే అనేకత్వముగ గోచరించు చున్నదనిరి. సామాన్యముగ లోకములో సౌభ్రాతృత్వమును, విశ్వసౌభ్రాతృత్వమును గుఱించి పెద్దలు చెప్పుచుందురు, కాని గీత విశ్వసౌభ్రాతృత్వమును దాటి ఆత్మౌపమ్య దృష్టిని దిగ్దర్శనము చేసి, అంతటను ఒకే ఆత్మ (తానే) వ్యాపించి యుండ సర్వజీవుల యందును

తానే భాసించుచుండ ఇక ఒకరిపై ద్వేషమెట్లు కలుగునని సమత్వ ధర్మమును ప్రతిపాదించి సాధకలోకమునకు మహోపకృతిని కలిగించినదనిరి.

కర్తృత్వము లేకుండ ఈశ్వరార్పణబుద్ధితో చేయబడు ప్రతికార్యము ఒకమహాయజ్ఞమనియు, ఫలము నాశ్రయించక కర్మలను చేయుట, కామ్యకర్మలను వదలుటయే సంన్యాసమనియు, కార్యము ఫలించినను, ఫలింప కున్నను చిత్తమునందు సమబుద్ధిని కలిగి యుండుటయే యోగమనియు, ఇంద్రియ మనంబులను జ్ఞానాగ్నిచే తపింపచేసి వానియందలి మాలిన్యమును పారద్రోలుటయే తపస్సనిరి. కర్మ, భక్తి, జ్ఞాన యోగములన్నియు తుదకు జీవుని పరంధామమునకు జేర్చుననిరి.

భగవంతునియందు ప్రీతి కలిగియుండుటయే భక్తియనియు, భగవంతుని యందుతప్ప అన్యత్ర చిత్తము లగ్నము కాకుండుటయే అనన్యభక్తి యనియు, పరమాత్మ భక్తికి అధీనుడనియు, భక్తియను పుష్పము వికసించి నపుడు మాత్రమే జ్ఞానమను ఫలము ఆవిర్భవించుననియు, అన్నియోగముల కంటెను భక్తియోగము చాల సులభమైన దనియు, నిష్కళంక ప్రేమతో భక్తియోగము నాశ్రయించిన వారు బ్రహ్మానందవారాశియందు ఓలలాడదురని విశదీకరించిరి.

అభ్యాసవైరాగ్యముల చేతను, తత్త్వచింతనాదుల చేతను, ధ్యాన నిష్ఠచేతను మనస్సును లొంగదీసుకొని భవసాగరమును దాటవలెననిరి. ఆత్మానుభూతియే జ్ఞానముయొక్క ఫలము. అదియే మోక్షము. కర్మ కుశలత్వము జ్ఞానము వలన కలుగును, కనుక మహాత్ములు జ్ఞానప్రాప్త్యనంతరము చేయు లోకసేవ నిష్కళంకమై యొప్పుననిరి.

గీత సాధనాభ్యాసకులకు అనేక సాధనా రహస్యములు విశదీకరించిన దనియు, ధైర్యమును విడనాడక సర్వేశ్వరుని పైనను, సద్గురువుపైనను, తనపైనను, పరిపూర్ణ విశ్వాసముంచుకొని స్థిరబుద్ధితో పరమార్థపథమున ముందుకు సాగిపోవలెనని; విషయ విరక్తి, నిరంతర సాధన భగవత్ప్రాప్తికి దారియనియు, విశ్వాసముతో సాధన చేయువారు తప్పక జ్ఞానమును పొందగలరని, ఆధ్యాత్మిక పథమున త్వరితముగ పురోగమించ గలరని గీత వక్కాణించిన దనిరి.

భోగాసక్తులు మోక్షమును పొందజాలరని, ఆధ్యాత్మికోన్నతికి దోహద మొసంగు సత్క్రియల నాచరించ వలెననియు, భోగాసక్తిని త్యజించి, యోగాసక్తిని పెంపొందించు కొనవలెనని, నన్నొకనినే(భగవంతునే) ఆశ్రయింపుమని (మామేకం శరణంవ్రజ), మోక్షమునకు ప్రతిబంధకము చిత్తమందలి దుష్టవాసనలు, దుష్ట సంకల్పములు, దుస్సంస్కారములుకాని దేహము కాదనియు, దేహమును బాధించినచో మోక్షము సిద్ధించునని తలంచుట వెఱ్ఱియనియు, పుట్టను కొట్టినచో పాముచావదనియు, రాగాదుల నిర్మూలనకై చిత్తమును తపింప చేయుటయే తపస్సుకాని, దేహమును శోషింపచేయుట కాదని గీత స్పష్టము చేసినదనిరి.

ముముక్షువులు సాత్త్విక తపస్సును చేపట్టి పరమార్థ స్థితికై యత్నింపవలెనని, మిథ్యాచారములను

విసర్జించి ధ్యానకాలమందు దైవభావన మాత్రముండునట్లు ప్రవర్తించవలెననిరి. జీవితము ఒక యుద్ధరంగము. ప్రతి దినము ధర్మాధర్మములకు, సత్యాసత్యములకు, న్యాయాన్యాయములకు భీకరమగుపోరు మానవుని చిత్తకుహరమున జరుగుచుండును. ప్రతిజీవియు పరమాత్మ నాశ్రయించి దుస్సంస్కారములను పాఱద్రోలి హృదయము ధర్మమయము గావించుకొని పరమానంద మనుభవించవలెననిరి.

అర్జునుని భక్తత్వమే భగవానుని ప్రియత్వమునకు దారితీసి గీతోపదేశమునకు అర్జునున్నే భగవానుడెన్ను కొనుట తటస్థించినదనిరి. గీతయందు పలుతావుల అహింసయే బోధింపబడినదికాని హింస కాదనిరి. సమస్తప్రాణికోట్ల యెడల దయగలిగి యుండుడనియే గీతయందు చెప్పబడినదనిరి.

ఆధ్యాత్మిక వాఙ్మయమున అతివ్యాపకముగా ప్రచారములోనున్న యోగవాసిష్ఠమునకు, భగవద్గీతకు గల విశిష్టతను పరిశీలించిన శ్రీయోగవాసిష్ఠము త్రేతా యుగము నాటిది. భగవద్గీత ద్వాపరయుగాంతము నాటిది. దాదాపు రెండు యుగముల కాలము మధ్యకాలము అయినను యోగవాసిష్ఠ గ్రంథమున ఒక ఉపాఖ్యానము గీతాసంబంధమైన ప్రస్తావనను బట్టి యుగయుగముల క్రిందటనే దానిఖ్యాతి విశ్వమంతటను వ్యాపించిన బృహద్గ్రంథమనియు, మానవుడు తన నిత్యజీవితమున ఎదుర్కొను పలుసమస్యలకు తగు పరిష్కార మార్గములను చూపు గీత నిఘంటువు వంటిదని ఉద్బోధించిరి.

గీతయందు భగవానుడు తొలుదొల్తనే క్రోధము అసురగుణమని, దానిని హృదయ గేహమునుండి తఱిమి గొట్టవలెనని, భోగములు సంసార మహారోగములని, దుఃఖహేతువులని, భయములన్నిటిలోను మరణ భయము చాల గొప్పదనియు, నేను దేహిని దేహమును కాను, నేను క్షేత్రజ్ఞుడను క్షేత్రమును కాదు, నేను త్రిగుణాతీతుడను త్రిగుణములను కాను – అని ఆత్మభావనను అలవాటు గావించుకొనవలెనని, కామమను శత్రువున కాశ్రయ మీయరాదనియు ; కామము, క్రోధము, లోభము అను నీమూడును నరకద్వారములు, అవిజీవునకు వినాశమును గలుగ జేయును కావున వానిని త్యజించవలెననిరి.

ఒకరిని నిందించినచో తన్నుతాను నిందించు కొనినట్లే యగును, కావున అసూయాద్వేషములను దరిజేరనీయక సర్వత్ర ఏకత్వమును గాంచవలెనని పరమాత్మయొక్క అనంత మహా విభూతిని, విశ్వవ్యాపక అనంత శక్తిని సంస్మరించుకొని, గర్వాహంకారాదులను దూరీకృతము గావించుకొని, దృశ్య వస్తువులన్నియు క్షరములనియు, "జాతస్య హి ధ్రువో మృత్యుః" పుట్టినవానికి చావు (వినాశము) తప్పదని, పరమాత్మ ఒక్కడే అక్షరుడు, జనన మరణములు లేనిది ఆ పరమాత్మ స్థితి యొకటియే యని, అక్షరుడగు పరమాత్మనే ఆశ్రయించి భవబంధ రహితుడై, నిర్మలాత్ముడై, నిరామయస్వరూపుడై విలసిల్లవలెననిరి.

గీతాప్రతిభను వర్ణించుటకు వేయి ఫణములుగల ఆదిశేషునకైనను శక్యము కాదనియు, గీతాధ్యయనము పుణ్యమును, అనుష్ఠానము మోక్షమును ప్రసాదించుననిరి.

మహాత్ముల,సచ్ఛాస్త్రముల పరిచయము పూర్వజన్మ సుకృతములని; జీవిత రథ బాధ్యతలను భగవంతునికే ఒప్పగించిన ఆ పరంధాముడే గమ్యస్థానమునకు గొని పోగలడని శ్రీస్వామివారు మార్గ నిర్దేశనము చేసిరి.

అజ్ఞాన వృద్ధులు, నిబిడాంధ కారమున చిక్కుకొని దారితెన్నుగానక సంకటపడువారిని జ్ఞాన వృద్ధులు, ఆధ్యాత్మిక విదులే దరికి జేర్చగలరని, సర్వశాస్త్ర సారమగు గీతను సర్వులు అనుష్ఠింపవలెనని, అన్నియజ్ఞముల కంటె జ్ఞానయజ్ఞము శ్రేష్ఠమని గీత వక్కాణించుచున్నదనిరి. గీతాపఠనము భగవంతుని జపమేయగునని; చక్కెరతో చేయబడిన చిలుకను ఎక్కడ కొఱికినను తీపిగనే యుండునట్లు గీతలోని ఏభావమైనను బ్రహ్మానంద మాధుర్యమును ప్రసాదించునని గీతావైభవమును శ్రీస్వామివారు ప్రశంసించిరి.

గీతను పఠించుటకు కాలనియమము అవసరము లేదనియు, సాధనచేయు చోటు పరిశుద్ధముగ నున్నచో నిద్రితమైయున్న శక్తి త్వరలో జాగృతమై ఆత్మతేజము వెలుగొందుననియు, గీతాపారాయణము పూర్తి అయిన వెనుక మాహాత్మ్యమందలి ఒకటి, రెండు శ్లోకములను తప్పక చదువలెననియు, గీతను చదువ లేనివారు గీతా బోధన జరుగుచోటికి వెళ్ళి శ్రవణము చేసి, ఆచరించి తరించవచ్చునని శ్రీస్వాములవారు ప్రస్ఫుటముచేసిరి. గీతాశ్రవణముచే వెంట వెంటనే ఒకరి తరువాత నొకరు– అర్జునుడు, సంజయుడు తరించిపోవ ఇక తక్కినవారి విషయమై సందేహింపనేల?–అని శ్రీస్వామివారు సంశయనివృత్తిచేసిరి.

ఇంటిలో దీపము వెలిగినను కిటికీల గుండా గాలివీచినచో దీపము ఆరిపోవునట్లు ఇంద్రియ ద్వారముల గుండా విషయసంకల్పములు లోనికి ప్రవేశించినచో జ్ఞానదీపము ఆరిపోవును. కనుక సర్వులు జాగరూకులై ఈశ్వరార్పణ బుద్ధితో కర్తృత్వరహితముగ, నిష్కామముగ కర్మల నాచరించి తరించవలెననిరి.

వేదములనే క్షీరసముద్రమును మథించి శ్రీకృష్ణపరమాత్మ వెలికితీసినట్టి గీతామృతమును సత్పురుషులు మాత్రమే నిరంతరము పానమొనర్చు చున్నారు. అట్టి జ్ఞానామృతమును సర్వులు గ్రోలుచు బ్రహ్మానందము పొందగలరు.

గీతాతత్త్వ సమాశ్రయముచే జనులు భవబంధము లను విచ్ఛిన్నములు చేసుకొని జీవితములను ధన్యము గావించుకొందురుగాక!

ఓం తత్ సత్

ఓం శ్రీకృష్ణార్పణమస్తు.

రాత్రి పరుండబోవునప్పుడు ఇంటిలో నొక పాము జొరబడిన దనుకొనుడు. పెట్టెల సందులలో దూరి, ఎక్కడను కన్పించలేదనుకొనుడు. అత్తఱి ఆ రాత్రి ఆ యింటి యందున్నవారికి నిద్రపట్టునా? ఎట్లయినను మేల్కొని యిల్లంతయు వెదకి వెదకి దానిని సాగనంపుదురుకదా! అట్లే హృదయము లందు అనాదిగ ఆశ్రయము కల్పించుకొని బాధించుచు, దుఃఖసాగరమున బడవైచుచున్న యీ అజ్ఞానము యొక్క అస్తిత్వమును తెలిసికొని వెంటనే మహాత్ములయొక్క సంసర్గము ద్వారా దానిని బయటకు గెంటివేయవలెను.

– శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి

గీతాపాఠశాలలో చేరి నా జన్మను ధన్యం చేసుకొన్నాను

-కరిపె. లక్ష్మి

నేను అదిలాబాద్ జిల్లా, సారంగపూర్ మండలం, బీరవెల్లి గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించాను. మా తల్లిదండ్రులకు ముగ్గురు కుమార్తెలు, ఒక్క కుమారుడు. నేను రెండవ సంతానం. మాలో ఎవ్వరూ చదువుకోలేదు. నేను తల్లిదండ్రుల వద్దనే ఉండి బీడీ పనులకు పోవునప్పుడు మా స్నేహితురాలు శాంత వద్ద అ ఆ, లు క ఖ, లు మాత్రం నేర్చుకున్నాను.

మాగ్రామానికి శ్రీశుకబ్రహ్మాశ్రమం అధిపతులు పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు వచ్చి గీతోపన్యాసాలు చేశారు. అప్పటినుండి శ్రీభూమయ్యగారు, శ్రీ పోస్టు నర్సయ్యగారు గీతాపారాయణం చేయించేవారు. నేనూ వెళ్లి గీతపట్టుకొని కూర్చొని వారితోపాటు పలుకుతూ ఉండేదాన్ని. నాకు చదువు లేకపోవడంతో చాలా కష్టంగా ఉండేది. నేను చిన్న వయస్సులో ఉన్నప్పుడు శ్రీ శుకబ్రహ్మాశ్రమం స్వాములవారు పూజ్యశ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామివారు వచ్చి గీతోపన్యాసా లిచ్చినపుడు మాగ్రామంలో ఒకరు ఆశ్రమ నిర్మాణానికి నేల ఇచ్చారు. ఆ ఆశ్రమానికి పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానంద స్వాములవార్లు మాగ్రామానికి వచ్చి గీతోపన్యాసాలు ఇస్తూ వుండేవాడు. నేను కూడా ఆ సభలకు హాజరగుచుంటిని. ఆ సభలలో పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు ఇలా ప్రకటచేశారు :- "గీతను నేర్చుకోవాలనే ఉత్సాహం ఉన్నవారు మా ఆశ్రమానికి వస్తే అక్కడ గీత నేర్పించడానికి ఒక సంస్కృత పండితుడు ఉన్నాడు. చక్కగా స్పష్టంగా నేర్పిస్తాడు. మీరు శ్రద్ధగా నేర్చుకోవచ్చు, భోజనాది వసతున్నీ ఉచితంగా కల్పిస్తాము. అమ్మగార్లు వస్తే ప్రత్యేక వసతులు ఏర్పాటు చేసి శ్రద్ధగా జాగ్రత్తగా చూచుకుంటాము. నిర్భయంగా రావచ్చును." అని చెప్పారు. స్వాములవారు చెప్పిన ఈ ప్రకటన వినగానే నాకు చాలా సంతోషం కలిగింది. గీత నేర్చుకోవాలనే సంకల్పం దృఢమైంది.

శ్రీశుకబ్రహ్మాశ్రమానికి నా ప్రయాణం :- గీత నేర్చు కొనుటకు శ్రీ శుకబ్రహ్మాశ్రమం వెళ్లాలని నిర్ణయించుకున్నాను. కాని అంతదూరం వెళ్లాలంటే మా అమ్మా నాన్నలు ఒప్పుకోరు. నేను గతంలో లక్ష్మణ చంద మండలం పారపెల్లి గ్రామంలోను, ఆరుమూరు తాలుకా పిప్పరలోని ఓంకారాశ్రమం లోను జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వెళ్లే అలవాటుంది. అదే నాకు మంచి సాకు దొరికింది. ఓంకారాశ్రమం మహేశ్వరానంద స్వాముల వారి వద్దకు వెళ్లుచున్నానని, నాలుగైదు రోజులు పదుతుందని చెప్పి 2007 జూలైలో బయల్దేరాను. గురుదేవులే నాకు రక్ష అనుకొని గురుదేవుల మీద భారంవేసి ఒంటరిగా బయల్దేరి హైదరాబాద్ వచ్చాను. ఏ బస్సు ఎక్కాలో తెలవదు. కండక్టర్ సహాయంతో తిరుపతి బస్సెక్కి తిరుపతికి వచ్చి, అక్కడ నుండి శ్రీకాళహస్తి వచ్చి శ్రీ శుకబ్రహ్మాశ్రమం చేరుకున్నాను. గురుదేవులను దర్శించి వారికి పాదనమస్కారం చేసుకున్నాను. గురుదేవులు అనుగ్రహించి నాకు వసతి కల్పించారు. మొదటి నెలలో ధ్యానమందిరంలో సేవ చేశాను. కానీ నాకు గీతమీదే మనసుంది. బ్రహ్మచారిణి ప్రమీలమ్మ నన్ను ప్రోత్సహించి స్వామీజీని అడగమన్నది. ఆమె సలహామేరకు నేను స్వామీజీని కలుసుకొని గీతనేర్చుకోవాలన్న నా దృఢమైన కోరికను

స్వాములవారికి విన్నవించుకున్నాను. స్వాములవారి అనుగ్రహంతో తేది 20-8-2007న గీతాపాఠశాలలో చేరాను.

గీతా పాఠశాల ఉపాధ్యాయులు గౌరవనీయులు శ్రీసి. మార్కండేయులు సార్ వద్ద గీత నేర్చుకోవడం మొదలైంది. నాకు చదువు లేనందువల్ల శ్లోకాలు చదవడం చాలా కష్టంగా ఉండేది. ఒక్కశ్లోకం సరిగ్గా పలకడానికి, చదవడానికి మొదట్లో మూడు నాల్గురోజులు పట్టేది. నల్లబల్లమీద తెలుగు అచ్చులు, వర్గలు వారీగా హల్లులు, గుణింతాలు, ఒత్తులు ఇలా అన్నీ వివరంగా సార్ నేర్పించారు. స్వాములవారు సభలో చెప్పిన విధంగానే ఇక్కడ మా ఉపాధ్యాయులు గీతాశ్లోకాలు పాదాలు, పదములుగా సంయుక్తాక్షరాలు ఎలా పలకాలో స్పష్టంగా చెబుతూ మాచేత అనేక మార్లు పలికించే వారు. ఒక రోజున చాలా కష్టమైన పదం వచ్చింది. మాసార్ ఓపిగ్గా ఎన్ని సార్లు చెప్పినా నేను సరిగా చెప్పలేకపోతున్నాను. ప్రక్కనున్న ఒకాయన మాస్టార్‌తో ఇలా అన్నారు. ఏమండీ ఆమెకు అన్ని సార్లు చెప్పటం మీకు బోర్ (విసుగు) అనిపించడం లేదా? అని అందుకు మా సార్ ఇలా అన్నారు. "ఈ తల్లి వల్ల నాకు మంచిగా ఆకలేస్తుంది" అని. ఎంతో ఓర్పుతో నేర్పిస్తూ విసుగులో కూడా మంచినే చూశారు మా సార్.

గీతతో బాటు మేము నేర్చుకున్న యితర అంశాలు :-

బడి ముఖమే ఎఱుగని నేను శ్రీశుకబ్రహ్మాశ్రమంవచ్చి ఈ క్రింది అంశాలు నేర్చుకున్నాను అని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నాను.

1. శ్రీమద్ భగవద్గీతలోని 18 అధ్యాయములు సునాయాసముగ, సుస్పష్టంగా పఠించుట, కొన్ని శ్లోకములకు పదవిభాగం చేసి ప్రతి పదార్థ తాత్పర్యములను కంఠస్థం చేయుట.
2. శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రమ్
3. శివ సహస్రనామ స్తోత్రమ్
4. శ్రీ లలితా సహస్రనామ స్తోత్రమ్
5. పురుష సూక్తమ్
6. మన్త్ర పుష్పమ్ - ఇవేగాక

సంస్కృతములోపరిచయ, బాల బోధినీ, చిన్న చిన్న వాక్యములు దేవనాగరి లిపియందు వ్రాయుట చదువుట నేర్పించారు. మరియు తెలుగులో నున్న నామవాచక పదములను ఆంగ్లలిపిలో వ్రాయుట చదువుట.

హిందీలో చిన్న చిన్న వాక్యములను చదువుట, వ్రాయుటకూడ ఇచట నేర్పించారు.

శ్రీ శుకబ్రహ్మాశ్రమము వారిచే ఆశ్రమ ప్రాంగణములో ప్రతిరోజు నిర్వహింపబడుచున్న ఉచిత యోగ శిక్షణా కేంద్రములో ఆసనములు, కొన్ని ప్రాణాయామములు అభ్యసించితిని. దీనికి కూడా శ్రీ సి. మార్కండేయ సారే యోగా మాస్టారు.

1. శ్రీశుకబ్రహ్మాశ్రమము వారు గీతాపాఠశాలలో చేరి గీత నేర్చుకున్నందుకు ఉపకార వేతనం రూపేణ పోష్టాఫీసులో నాపేరుతో పదివేల రూపాయలు పొదుపు ఖాతాలో జమ చేశారు.

అనారోగ్యం అయినప్పుడు మనిషిని తోడుపంపి డాక్టరు వద్దకు కారులో తీసుకపోయి వైద్యం ఖర్చు వారే పెట్టి వైద్యసహాయం అందిస్తున్నారు. అమ్మ నాన్నలను చూచివచ్చుటకు స్వగ్రామం వెళ్లునపుడు పోనురాను ఛార్జీలకు పైకం ఇస్తున్నారు. సంవత్సరమునకు రెండు సార్లు కొత్త బట్టలు ఇస్తున్నారు.

పూజ్యస్వాములవారు, గీతాపాఠశాలఉపాధ్యాయులు, వృద్ధాశ్రమం వారు, మరియు ఇతర ఆశ్రమ వాసులందరూ మమ్ములను అభిమానముతో చాలామంచిగా చూసుకుంటారు. నేను ఈ గీతాపాఠశాలలో చేరి పూజ్యశ్రీ విద్యాప్రకాశానంద గిరి స్వాములవారి అనుగ్రహంతో జన్మను ధన్యం చేసుకొన్నాను. నాడు అక్షరాలు కూడా రాని నేను నేడు ఈ గీతాపాఠశాలలో చేరి భగవద్గీతను సుస్పష్టంగా చదువ గల్గుతున్నాను. ఆశ్రమ నివాసం ద్వారా నా జీవితాన్ని ధన్యం చేసుకొన్నాను.

- ఓమ్ -

శాకాహారిగా మార్చిన స్వామివారి దివ్య సందేశాలు

- చుక్కల ఎల్లయ్య
(చుక్కల నిడిగల్లు)

మహాతపస్సంపన్నులు, శ్రీ శుకబ్రహ్మాశ్రమ సంస్థాపకులు, గీతామకరందం గ్రంథరచయితులు అగు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి పాదార విందములకు వందనములు.

శ్రీస్వాములవారు బోధించిన ఈక్రింది ఉపదేశములు నాకు స్ఫూర్తి నిచ్చినవి.

1. మనిషిలో సనాతన ధర్మాలు అలవడాలంటే ముందుగా శరీరశుద్ధి అవసరం. ఈ శుద్ధి సాత్వికాహార సేవనంచే సిద్ధించును.

ఆహారశుద్ధి ద్వారా -శరీర శుద్ధి
" - మానసిక శుద్ధి
" -వాచిక శుద్ధి - కలుగుతాయి.

మనిషిలో మరియు మనస్సులోని మాలిన్యాలను తొలగించు కుంటే అతడు అన్ని వేళలా బాగుంటాడు, శాంతి సుఖాలతో జీవిస్తాడు.

నీవు ఏమి తినెదవో చెప్పినచో, నీవు ఎవరివో చెప్పెదను.

If you tell me what you eat,
I will tell you who you are.

నిరంతరము సత్సాంగత్యము కలిగి, దుస్సాంగత్య మును విడువుము. రాజసిక, తామసిక (మద్య మాంసాదుల) ఆహారము వదలి సాత్వికాహారమును సేవింపవలెను. ఏ దురలవాట్లను దరికి చేర్చరాదు.

2. రాత్రి శయనించుటకు ముందు తాను ఆరోజు ఏమైనా తప్పులు, దోషములు చేశానా? అని ఆలోచించుకుని, అలా తప్పులు చేసి ఉంటే వాటికి పశ్చాత్తాపపడి, మరలా ఆ తప్పులు చేయకుండా ఉండులాగున ప్రతిజ్ఞ పూనవలెను. మరలా ఆ తప్పులు చేయరాదు అని తలచి దైవప్రార్థన చేసి పరుండవలెను.

3. సేవకు మించిన సద్గుణములేదు. అది లోకసేవయగు గాక, దైవసేవయగు గాక, గురుసేవ యగుగాక, సంఘసేవ యగు గాక! ఏ సేవ అయినను అహంభావమును తొలగించి చిత్తశుద్ధిని కలుగజేసి, జీవుని దైవమునకు సన్నిహితునిగా జేయగలదు. కాబట్టి జీవితంలో అవలంబింపదగిన ప్రముఖ గుణమిది.

4. ధర్మాచరణయే మానవుడు కడతేరుటకు ఏకైక మార్గమని యెరుంగవలయును. ధర్మము నుల్లంఘించి ఎవరూనూ దైవమును చేరలేరు. "ధర్మో రక్షతి రక్షితః" ధర్మమును కాపాడినచో, ఆ ధర్మమే మిమ్ములను కాపాడును.

5. నరుడు నరుడుగానే ఎల్లప్పుడు ఉండుట వాంఛనీయము గాదు, నరుడు నారాయణుడు కావలెను, పురుషుడు పురుషోత్తముడు కావలెను.

ఈ విధముగా శ్రీస్వాములవారి బోధలన్నీ నాకు ఎంతో ముందుకు పోవడానికి పురిగొల్పినవి.

శ్రీ స్వాములవారు స్థాపించిన (శ్రీ విద్యా ప్రకాశానంద) ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ నందు ఇంటర్ మీడియట్ చదివాను, అలాగే శ్రీవిద్యాప్రకాశానంద ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ బాలుర డిగ్రీకళాశాల యందు చదివే మహద్భాగ్యం నాకు కలిగింది. అలాగే శ్రీ శుకబ్రహ్మాశ్రమం నందు కొంతకాలం ఆశ్రమమునకు కొంత సేవచేసే భాగ్యం నా పూర్వజన్మ పుణ్యఫలంగా భావించినాను.

గురుదేవులకు చేసిన సేవ వ్యర్థంకాదు. చివరకు దైవగుణం తెలిసుకొనుటకు మార్గము దొరికినందుకు నేను సదా శ్రీశుకబ్రహ్మాశ్రమానికి ఋణపడియున్నాను.

శ్రీశుకబ్రహ్మాశ్రమ ఆధ్వర్యంలో ఆశ్రమ భక్తులచే అప్పటి రామదాసు గారు, రామచైతన్యగారు, చిరంజీవి గార్లతో శ్రీ భగవద్గీతా జ్ఞానసప్తాహం 1996లో మాగ్రామం (చుక్కలనిడిగల్లు, శ్రీకాళహస్తిమండలం)లో జరిపించినాను. ఆ గీతానప్తాహం విని మాగ్రామ ప్రజలు ఎంతో సంతోషించారు. అలాగే ఇప్పుడు పీఠాధిపతులు అగు శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారి ఆధ్వర్యంలో పౌర్ణమి సత్సంగములు 2010లో మాగ్రామంలో నిర్వహించబడినవి. మరియు చుట్టు ప్రక్కల గ్రామాలలో ఈ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించబడినది. అలాగే శ్రీకాళహస్తి మండలములో ప్రభుత్వ పాఠశాలలకు ఆశ్రమంవారు ఉచితముగా నోట్‌పుస్తకాలు, వస్త్రాలు ప్రతిసంవత్సరం ఇస్తారు. ఈ సేవ చేస్తున్నాను. ఈ విధముగా శ్రీస్వాములవారి దివ్యానుగ్రహంవలన నేను శాఖాహారిగా మారి నన్ను నేను తెలుసుకో గలిగేటట్లు అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను.

నేను అనునిత్యం ఇలాగే ఉండేలాగున శ్రీగురుదేవుల కృపాకటాక్షములు నాకు ఉండవలెనని ప్రతిరోజు దైవ ప్రార్థన చేసుకుంటున్నాను.

మహాత్ములందరికి నా శతకోటి వందనాలు.

ఈ ప్రపంచమునగల ప్రతివస్తువున్ను పరిణామ శీలమైనది. ఈనాడు రమణీయముగ నున్న పుష్పమాల రేపటికి వాడిపోవుచున్నది. ఆ మరునాటికి క్రుళ్ళిపోవుచున్నది, నేడెంతయో సుందరముగనున్న సౌధములు, నగరములు కొంతకాలమునకు శిథిలములై కేవల స్మృతిమాత్రముతో శేషించుచున్నవి. ఇప్పు డిచ్చటనున్న అణువు రేపు సూర్యునిలోనికి పోవచ్చును. సూర్యునిలోని అణువు రేపు ఇచ్చటికే రావచ్చును. ప్రతి ఏడుసంవత్సరములకు ఈ శరీరములోని అణువు లన్నియు పోయి క్రొత్త అణువులు చేరునని విజ్ఞానశాస్త్ర సిద్ధాంతము. ఈ ప్రకారముగ దృశ్యమంతయు పరిణామశీలమై యున్నది. కాని యివన్నియు మారుచున్నను, నశించు చున్నను ఏ పరిణామము లేనిదై, అవినాశియై వీని కన్నింటికిని ఆధారమైనట్టి వస్తు వొకటి కలదు. అదియై దైవము. అట్టి దైవమును హృదయము నందు దర్శించుడు.

- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి



శ్రీసద్గురు సేవలో శ్రీగురుపదరేణువులు

- పద్మమల్లికార్జునగౌడ
(వరంగల్లు, సెంట్రల్ జైలు)

దివ్యాత్మ స్వరూపులు
శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారి గ్రంథాలు నాలో ఎంతో మార్పును తెస్తున్నాయి.

నాటికి నేటికి ఎంతో తేడా. ఎంతోమందికి ఇది వర్తిస్తుంది. చాలామంది తమజీవితంలో మార్పు రావటంలేదని అంటారు. జీవితంలో మార్పురావడం ఎంతోసులభం. అందుకు చేయవలసిన దల్లా మన అలవాట్లు మార్చుకోవడమే. అపుడు జీవితమే మారిపోతుంది. సమస్య ఏమిటంటే అలవాట్లే అంతసులువుగా మారవు. అలవాట్లను మార్చుకోవడం లోనే ఉంది అసలు మర్మమంతా! అలవాట్లంటేనే-మనం కావాలని చేసుకొనేవి. అంటే శ్వాసపీల్చటంలా అవి సహజంగా మనకు అబ్బినవి కావు. పెద్దలు నేర్పటం వల్లనో, మన చుట్టూవున్న వాళ్ళను చూసి నేర్చుకోవటం వల్లనో ఈ అలవాట్లు వస్తాయి. అలా కావాలని చేసుకొన్న అలవాట్లను వదులుకోవటంలో వాస్తవానికి ఇబ్బంది ఏమీ లేదు- మనం ఆ అలవాట్లను వదులుకో కూడదని భావిస్తే తప్ప.

జీవితం కడలిపైన పయనించేనావ అయితే, ఎగిసి పడే కెరటాలను జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులకు చిహ్నాలుగా పేర్కొనవచ్చు. ఏ అలలో ఏ బలముందో ఏది ఏం మలుపు త్రిప్పుతుందో? చెప్పడం కష్టం. కొన్ని అలలు ఒడ్డుకు చేర్చితే, మరికొన్ని అగాధంలోకి లాగేయటం కద్దు. అందుకు మనిషికి చిత్త విశ్రాంతి ఎంతో అవసరం. చిత్తమంటే మనస్సు; విశ్రాంతి అనగా అలసిన మనస్సు సేదదీరుట. మనస్సు అనేక కార్యాలతో అలసి పోతుంది. సతమతమవుతూ ఉంటుంది. చిత్తంసేదతీరాలంటే, విశ్రాంతిని పొందాలంటే జీవి అనేక కార్యాలను శుచిగా ఆచరించి - అవిద్యను, అజ్ఞానాన్ని పోగొట్టుకునే ప్రయత్నం చేయాలి.

సేద తీరిన చిత్తం శాంతితో నిండి ఉంటుంది. సుఖదుఃఖాలు, జననమరణాలు మొదలైన భావాలను మనస్సులోకి రాకుండా విడిచినవాడు, కోరికలు, సందేహాలు ఊహలు మొదలైన వాటిని బుద్ధిచేత వదిలేసినవాడు, దృశ్యవాసనలన్నింటినీ వదిలినవాడు మహాత్యాగిగా గుర్తించబడతాడు. ఇందుకు భగవద్గీత చక్కని ఉదాహరణ, ప్రపంచ వ్యాప్తంగా గర్వించదగిన ఆధ్యాత్మిక గ్రంథం “గీతామకరందం.”

భగవద్గీతా మకరందం గూర్చి పూర్తిగా తెలిసిన వాళ్ళు తక్కువ. కేవలం దైవసంబంధ గ్రంథంగా భావించి పూజా మందిరానికి పరిమితం చేసిన వాళ్ళే ఎక్కువ. నిజానికి భగవద్గీత యుద్ధభూమిలో విజయునికి చెప్పిన విషయాలు. ప్రతివ్యక్తి జీవితంలో జరిగిన సంఘటనలలో, ఆత్మవిశ్వాసం కోల్పోయే పరిస్థితులు, మానసిక సంఘర్షణలు ఉండక తప్పదు. అలాంటి సందర్భాల్లో “**గీతా మకరందము**” మమ్మల్ని ఓదార్చింది. భగవద్గీత మొత్తం 18 అధ్యాయాలు చదివితే అందులో మానసిక శారీరక వ్యవస్థలను ఎలా అదుపులో ఉంచుకోవాలో, మానవ జీవనగతిలో అనుసరించ వలసిన

సూత్రాలు ఏమిటో వాటి వివరణ వుంది. మనకు అనేకానేక సందేహాలు వస్తుంటాయి. యోగి ఎవరు? ధర్మం ఏమిటి? హింస అంటే, పాపమంటే? పుణ్యమంటే ఏమిటి? ఇటువంటి సందేహాలకు చక్కని సమాధానం మనకు భగవద్గీతలో లభిస్తుంది. ఆధ్యాత్మిక పరంగా కూడా భగవంతుడు, భక్తి, సృష్టి ఆరాధన, దేవుని గొప్పతనం వంటి ఎన్నోవాటికి ఎంతో సరళంగా వివరించింది. గీత.

భగవద్గీత ఉపనిషత్తుల సారాంశం - ఉపనిషత్తులు వేదాంతం. కావున ప్రాచీన కాలంలో ఆధ్యాత్మికత అంతా ప్రకృతి ఆరాధన నుంచే ప్రారంభమైనదని గమనించవచ్చు. నాడు విజ్ఞానమంటే ఆధ్యాత్మిక జ్ఞానమే. ప్రకృతిని ప్రేమించిన మానవుడే తోటి జీవులకు ప్రేమిస్తాడని తొలిభావన ఆనాడు ఉండేది.

యజ్ఞ ప్రార్థన విస్తరించి ఆధ్యాత్మిక భావనలో క్రియాయోగంగా అవతరించాయి. అందుకే గీతలో అన్ని అధ్యాయాలకు యోగా అని ఉంటుంది. యోగా అంటే భగవంతునితో భక్తుని సంయోగం (విలీనం) అని అర్థం. శారీరక ఆరోగ్య విషయములో ఆహార నియమాలు ఎలా పాటించాలో ఆయా ఆహార గుణాలే మనిషిలోని ప్రవర్తనలకు ఎలా హేతువులౌతాయో వివరిస్తుంది గీత. - గీతామకరందం

భగవద్గీత వలన ఎన్నో అమూల్యమైన విషయాలు తెలుస్తాయి. ధర్మమే జయిస్తుందని, జనన- మరణాలు సహజమని, శోకం మనిషికి మంచిది కాదని, ఈ ప్రపంచంలో ఎవరూ శాశ్వతం కారని, ఉన్నంతలో నలుగురికి మంచి చేయాలని చెబుతుంది.

భగవద్గీత నిత్యపారాయణ గ్రంథం మాత్రమేకాదు. నిత్యజీవన సూక్తి ముక్తావళి కూడా. ఒక్క గీతను క్షుణ్ణంగా పఠిస్తే, సర్వశాస్త్ర పఠనంతో సమానమంటారు. భగవత్స్వరూప తత్త్వజ్ఞాన పరంపర గీత ద్వారా మనకు పూర్తిగా తెలుస్తుంది. మానవుల స్వభావం దైవాసుర సంపద్విభాగయోగం అనే అధ్యాయములోతెలిపారు. కామ క్రోధాలవంటి అంతరంగ శత్రువుల పట్ల అప్రమత్తత వివరణ గీతలో ఉంది. అజ్ఞాని కూడా భక్తియోగం ద్వారా భగవంతుని అనుగ్రహం పొందవచ్చని గీత అభయమిస్తుంది. ఇంత గొప్పగ్రంథం కాబట్టే ఇది దైవవాణిగా గమనించి అర్చిస్తారు. తృష్ణ, మోహం వంటివి వదిలి వేయాలి. నిరాడంబర జీవితంలో యుండాలి భక్తి కూడా -అను ఆదరణీయమైన అమూల్య అభిప్రాయం శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి గీతామకరందంలో కనిపిస్తుంది. సగుణ, నిర్గుణ, ఉపాసననను, తాత్త్విక చింతనను మకరందం ప్రబోధిస్తుంది. జ్ఞాన, కర్మ, భక్తి భావాలందు ఏ మార్గంలోనైనా దేవుని చేరవచ్చుననే సమతాభావం గీత వర్ణిస్తుంది. ఇదే గీతకు గల విశిష్ట లక్షణంకూడా.

> *తనది కాని వస్తువును తనదని భ్రమించి దానిపై వ్యామోహమును కలిగియుండుటయే అజ్ఞానము. ఆ వస్తువుపై మమత్వమును వృద్ధి నొందించుకొనుటయే అవిద్య. ఈ దేహము, ఇంద్రియములు తనవికావు. మనస్సుగాని, బుద్ధిగాని తనవికావు. వీని యన్నింటికిని సాక్షియై వెలుగు ఆత్మయే తాను. తాను దృక్స్వరూపుడు, కూటస్థ అచల-నిర్వికారక్షేత్రజ్ఞుడు. కాబట్టి విచారణచే ఆత్మస్వరూపము నెఱింగి దానియందే నిలుకడ కలవాడై దేహేంద్రియాదులయందు సక్తుడు కాక అసంగముగ వ్యవహరించుచు పరమానందమును జీవుడు బడయవలెను.* **- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి**

నిన్ను మరువకుండుట మాదుజన్మ పుణ్యములే

-కొణిజేటి సుబ్బారావు

ఓం ఓం ఓం   శ్రీ శ్రీ శ్రీ

వేమూరు గ్రామములో వేంచేసి వున్న విఘ్నేశ్వర, వీరభద్ర గంగాపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర మహాదేవుని అనుగ్రహంతో (సద్గురుదేవులు విద్యాప్రకాశానందగిరి స్వాములు వారికి కొణిజేటి సుబ్బారావు) వ్రాసిన పంచరత్నములు --

1. పూజ్యపాద శ్రీప్రకాశ సద్గురూత్తమా
   సర్వోన్నత భాష్యకార గీతామకరంద రచయిత
   సాధుజన ప్రేమాభిమాన సాహిత్య ఛత్రమా
   నిన్ను మరువకుండుట మాదుజన్మ పుణ్యములే.

2. చిత్రవిచిత్ర గతుల నుడివెడు పలుకుల సారము
   హృద్యంతము మరపురాని వీరోచిత ఔదార్యము
   భళారే గీతామకరంద సుప్రబోధ రాజిత
   నిన్ను మరువకుండుట మాదుజన్మ పుణ్యములే.

3. సదోపవాస నందగిరీశ పూర్ణచంద్ర ప్రకాశక
   మలయాళస్వామి శిష్యోన్నత సుశీల భాస్కర
   ఆధ్యాత్మిక ఆనంద ఆశ్రితజన సముదాయక
   నిన్ను మరువకుండుట మాదుజన్మ పుణ్యములే.

4. అష్టోత్తర శతగీతాజ్ఞాన యజ్ఞనిర్వహణ
   విద్యవైద్య పరిపోషక పరమహంస పరివ్రాజక పండిత
   ఉపనిషత్ వేదాంత సుశ్లోక సుభాషణ చతురత
   నిన్ను మరువకుండుట మాదుజన్మ పుణ్యములే.

5. విద్యా వినయ సంపన్న సమప్రభావ భాసిత
   పాలభాగ త్రిపుంద్ర, శోభవిభూతి విరాజిత
   మందస్మిత దరహాస మృదుభాషణ చతురత
   నిన్ను మరువకుండుట మాదుజన్మ పుణ్యములే.

ఉదయము 8గం.లకు ఎండలో నిలబడినచో నీడ చాలా పొడవుగా కన్పించును. ఆ నీడ తగ్గవలెనని కాని, నశించవలెనని కాని అభిలషించినచో అందులకు ఒకే ఒక ఉపాయము కలదు. దానిని కొట్టినను, తిట్టినను, ఛేదించినను ఏమియు ప్రయోజనము లేదు. సూర్యుడు పైకి లేచిన చాలును. అదియే దాని వినాశమునకు ఉపాయము. ఎంతెంత సూర్యుడు పైకి లేచుచుండునో అంతంత నీడ తగ్గుచుండును. సూర్యుడు నడినెత్తి పైకి వచ్చినపుడు అసలు నీడయే ఉండదు. అట్లే కామమను నీడను నశింపజేయుటకై జ్ఞాన సూర్యుని పైకి లేపవలయును.

-శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వామి

శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారికి నేను ఎంతో ఋణపడి యున్నాను

పేరం పురందర్, ఎం.ఏ., (మంగళగిరి కండ్రిగ)

శ్రీరామ

గీతామకరంద ప్రాశస్త్యము

1994 సం॥ము మానాన్నగారు నేను మహా శివరాత్రిరోజున శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శనం చేసిన తర్వాత మానాన్న నన్ను శ్రీశుకబ్రహ్మాశ్రమమునకు తీసుకెళ్ళారు. అదే నా మొదటి ఆశ్రమ ప్రవేశము. వివిధ వృక్షములతో ప్రశాంత వాతావరణములోనున్న ఆశ్రమము నన్ను ఎంతగానో ఆకర్షించింది. అప్పటివరకు స్వామి వారిని నేరులో దర్శించిందిగాని, వారిరచనలు చదివిందిగాని, గీతోపన్యాసములు వినిందిగాని జరుగ లేదు. అనారోగ్యముతో అభయకుటీరములో విశ్రాంతి తీసుకొంటున్నస్వామిని దర్శించి, పాద నమస్కారం చేసుకొన్నాము. తర్వాత స్వామివారిరచనలు తత్త్వసారము, మానసబోధ లనుకొన్నాను. వేదాంతరహస్యాలను అతిసులభంగా అర్థమయ్యేటట్లు చేసే అవి నన్ను ఎంతగానో ప్రభావితం చేసాయి.

తర్వాత 1995 సం॥ము నవంబరునెల 21వతేది కార్తీక సోమవారమునాడు శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం చేసి మరల ఆశ్రమానికి వెళ్ళడంజరిగింది. ఏ జన్మలోచేసుకొన్న పుణ్యమో, లేక నాయొక్క మహద్భాగ్యమో కాని సద్గురువు (శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి) సద్గ్రంథము (గీతామకరందము) నాకు లభించి నా జీవితగమనాన్ని పూర్తిగా మార్చి వేసింది. నాకు బాల్యం నుంచి కొంత దైవచింతన ఉన్నా దానిని అజ్ఞానంవల్ల సరియైన మార్గంలో కొనసాగించలేదు. (1981 తి.తి.దే. వారి పురాణ ప్రబోధపరీక్షలో ద్వితీయ స్థానం పొందినాను). నేను ఎం.ఏ. చదివి వ్యవసాయాన్ని వృత్తిగాకలిగి ఉన్నాను. అప్పటికి నావయస్సు 30. సం॥లు గీతామకరందము అధ్యయనంవల్ల నా జీవితంలో 30సం॥లు అజ్ఞాన అంధకారములో గడిచిపోయాయని తీవ్రంగా ఆవేదన చెందాను. జీవిత లక్ష్యాన్ని గుర్తించాను. పారమార్థికజీవితం వైపు ప్రయాణించాలని నిర్ణయించాను. ప్రాపంచిక విషయాలపై తీవ్రవైరాగ్యం చెందాను.

ఆశ్రమంలో గీతాపాఠశాలలో చేరి గీత నేర్చుకోవాలని, ఆశ్రమసేవ చేయాలనుకొన్నాను. అప్పటికి వివాహముకాలేదు. ఆశ్రమవాసులను సలహాఅడిగాను. వారు భక్తి వైరాగ్యాలు కలిగి ఉండి కుటుంబబాధ్యతలు నెరవేర్చుకొంటూ తరచు ఆశ్రమానికి వచ్చి సాధనా పద్ధతులను నేర్చుకోమని నాకు సలహా ఇచ్చారు. ఈ సలహాలతో 'వేదాంతభేరి' మాసపత్రికకు శాశ్వతచందా--దారుడుగా చేరడం, అప్పటివరకు ఆశ్రమం 'తరపున ప్రచురించిన అన్ని ఆధ్యాత్మిక గ్రంథాలను, గీతోపన్యాసముల ఆడియోక్యాసెట్లు, యోగవాసిష్ఠ క్యాసెట్లు, కొనడం జరిగింది.

నాకు గీత, సంస్కృతపరిచయం లేదు. శ్రద్ధతో, తదేకనిష్ఠతో "గీతామకరందాన్ని" బాగా అధ్యయనం చేసాను. అది పారమార్థికంగా నాకు కలిగే అన్ని సందేహాలను తీర్చింది. దీనికి తోడు స్వామివారి గీతోపన్యాసములు నాకు

ధైర్యాన్ని, ఉత్సాహాన్ని కలిగించాయి. బ్రహ్మచారి గోపాల్‌గారి సంకలనం శ్రీవారి గీతోపన్యాసములు-కుటుంబం పట్ల, సమాజంపట్ల, నా బాధ్యతలు సక్రమంగా నెరవేర్చునట్లు ఉపయోగ పడుతున్నాయి. నా నిత్యజీవితంలో గీతా మకరందము (భగవద్గీత) మార్గదర్శిగా మారింది. గీతాపారాయణ, అధ్యయనం, గీతాశ్లోకాల మననము చేయకుండా - మంచినీరు కూడా తీసుకోకుండా ఇంతవరకూ నియమాన్ని కొనసాగిస్తున్నాను.

నేను గాని, నాకుటుంబములోని వారుగాని శాంతిని, సుఖాన్ని గాని పొందుతున్నా, నా వల్ల సమాజానికి ఏ కొంతమేలు జరిగినా, అది గీతామకరందము (భగవద్గీత) కల్గించిన ప్రోత్సాహమే అని ఘంటాపథంగా తెలియ జేస్తున్నాను. సుమారు 2 సం॥ లలో సుమారు 400 శ్లోకాలు (9 అధ్యాయాలు పూర్తిగా) కంఠతః నేర్చుకొన్నాను. భగవద్గీతయే నా పంచప్రాణాలు. నా సమీప గ్రామాలలో ఎచ్చట దైవకార్యాలు, ధర్మకార్యాలు జరిగినా అచ్చట గీతాపారాయణ వ్యష్టిగాగాని, సమిష్టిగా గాని చేయించడం, గీతలో ఒక అధ్యాయంగాని, లేదా కొన్నిశ్లోకాలపైగాని ప్రవచన చేయడం జరుగుచున్నది. భగవద్గీతలు ఉచితప్రసాదంగా ఇవ్వడం, గీతా పారాయణలు ప్రోత్సహించడం జరుగుచున్నది. గీతా ప్రవచనాలకు స్వామి వారు తరచుగా ఉపయోగించే పారమార్థిక కథలు, నాకు ఎంతగానో ఉపయోగపడు చున్నాయి.

ప్రతినెలా పౌర్ణమిరోజున, పెన్నాలూరిపేట గీతాపారాయణ సంఘంవారిచే జరిపించు పారాయణకు తరచుగా వెళ్ళడం 18 అధ్యాయాలు గీతాపారాయణం చేయడం. మరికొన్నిచోట్ల జరుగు శుక్ల, కృష్ణ పక్ష ఏకాదశిపారాయణలు చేయడం, గృహప్రవేశము, వార్షికోత్సవము, ఆలయకుంభాభిషేకాల సమయాలలో కూడా పారాయణం చేయడం జరుగుచున్నది. గురుదేవుల అనుగ్రహంవల్ల గీతపైకొంత అవగాహన కల్గినందువల్ల నేను ఆధ్యాత్మికానందమును పొందుచున్నాను. ఆయన ఇచ్చిన ప్రోత్సాహంవల్ల గురుఋణంలో భాగంగా సమాజానికి కొంత ఆనందాన్ని పంచుతున్నాను. గీతామృతాన్ని అందించిన జగద్గురువులైన శ్రీకృష్ణపరమాత్మకు, గీతామకరందాన్ని అందించిన గురుదేవులైన **శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారికి**, శ్రీశుకబ్రహ్మాశ్రమానికి **నేను, నాకుటుంబములోనివారు ఎంతో ఋణపడియున్నాము.**

1996 మే నెల 20 వతేదీన స్వామివారివద్ద ఉపదేశం తీసుకొన్నాను. అప్పటినుంచి జపధ్యానాలు, గీతాపారాయణ, నామస్మరణ, కొనసాగిస్తున్నాను. భోజనకాలంలోకూడా ఒక అధ్యాయం, గీతాపారాయణ జరుగుచున్నది. ప్రయాణసమయంలోకూడా గీత దగ్గర ఉంచుకొంటున్నాను.

> ఒకడు చూచుటకు దేవుడుగ కనిపించును. కాని కర్మయందు దిగినచో రాక్షసుడుగ ప్రవర్తించును. మరొకడు చూచుటకు రాక్షసుడుగ (వికారముగ) కనిపించును. కాని కార్యములందు దివ్యత్వమును వెదజల్లును. కావున మనుజుని పట్టి చూపునది కర్మయే కాని తదితరము కాదని నిశ్చయించుకొని విజ్ఞులు దానియందు క్షుణ్ణముగ పవిత్రతను సంపాదించవలెను.
>
> *- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి*



యోగంతో రోగం మాయం

యన్.ఆర్.జగన్నాథన్ (శ్రీకాళహస్తి)

నేను గత ఆరు సంవత్సరాలుగా ఉబ్బసంతో బాధపడుతున్నాను. దేవాలయంవీధిలో మాకు బట్టలఅంగడి ఉన్నది. ఊపిరాడక బాధ ఎక్కువ అయినపుడు కూర్చోలేక అంగడిలోనే పడుకొనేవాడను. ఒక్కొక్కసారి ప్రక్క అంగడి వాళ్ళకు చెప్పి ఇంటికి వెళ్ళిపడుకొనేవాడను. నెలకు మాత్రలకు నాల్గువేల రూపాయలు అయ్యేది. గాలి పీల్చడానికి ఇన్‌హేలర్ ఒక్క వారానికే అయిపోయేది.

శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో ఉచిత యోగ శిక్షణా కేంద్రంలో యోగా ఉచితంగా నేర్పుచున్నారని, అన్నిజబ్బులు నయమవుతాయని కొందరు మిత్రులద్వారా విన్నాను. వెంటనే ఆశ్రమం వెళ్ళి యోగ శిక్షణాకేంద్రంలో ప్రవేశం పొందినాను. యోగాచార్య శ్రీ మార్కండేయులుగారి శిక్షణలో "ముప్పై రోజుల యోగ పరిచయ" శిక్షణాకాలాన్ని పూర్తిచేసుకున్నాను. ఆరోగ్యం చాలా కుదుటపడింది. అంతటితో నేను ఆగకుండా ఈనాటివరకు ప్రతిరోజు ఉదయం ఆశ్రమానికి వచ్చి యోగ సాధన చేసుకుంటూనే ఉన్నాను. ఇప్పుడు మాత్రలు, ఇన్‌హేలర్ వాడేదిలేదు. డాక్టర్ ఖర్చులు, మాత్రల ఖర్చులు మిగిలిపోయాయి. చాలా ఉత్సాహంగా అంగడి నడుపు కొంటున్నాను.

శ్రీ శుకబ్రహ్మ ఆశ్రమంలో యోగాకేంద్రాన్ని స్థాపించి యోగా ద్వారా శారీరకమానసిక స్వస్థతచేకూరుస్తూ సమాజానికి సేవజేస్తున్న పూజ్యశ్రీస్వాములవారిపాదములకు శిరస్సు వంచి నమస్కరించి ధన్యవాదములు తెల్పుతున్నాను.

హరిః ఓమ్ః

> *తుమ్మెద చేవగలిగిన కొయ్యకు గూడ రంధ్రము వేయగలదు. దాని ముక్కు అంతవాడిగా నుండును. ఆ తుమ్మెదయే కమలము నందు ప్రవేశించి మధువు నాస్వాదించు సమయమున సూర్యాస్తమయ సమయము అయి కమలము ముడుచుకొనినచో దానియందు చిక్కుకొని, అధైర్యపడి, తన శక్తి పై విశ్వాసము గోల్పోయి కర్తవ్యము మరచి దిగులుతో చనిపోవును........ అట్లే మనుజుని యందు అఖండమైన శక్తిసామర్థ్యములు కలవు. అవి నిద్రాణములై యున్నవి. అవి ఉన్నవని మనకు తెలియదు. ఎవరైన చెప్పినను వారివాక్యము లందు నమ్మకముండదు. అట్టిచో ఆ శక్తులెట్లు జాగృతములు కాగలవు? అట్లు అవి జాగృతములు కానందువలననే మనుజుడు అధోగతిని జెందుచు మృత్యుసంసారపథమున బడి గిలగిల తన్నుకొనుచున్నాడు. . . . ఈ వైపరీత్యము తొలగిననే తప్ప లోకమున శాంతిసుఖములకు ఆస్కారము లేదు.*
>
> *- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి*

యతిగీతం

- స్వామి వివేకానంద

There is but One - The Free - The Knower- Self!
Without a name, without a form or stain;
In Him is Maya dreaming all this dream.
The witness, He appears as nature, soul,
Know thou art That, Sannyasin bold! Say-
"Om tat, sat, Om!"

శ్రీమాత్రే నమః

జ్ఞానభాస్కరులు పూజ్య శ్రీవిద్యాప్రకాశానంద స్వాములవారు

ఎ.తారాలక్ష్మి ఎం.ఎ, ఎం.ఇడి., ఎమ్.ఫిల్.
శ్రీకాళహస్తి.

సంభాషా దర్శనం స్పర్శః కీర్తనం స్మరణం తథా ।
పావనాని కిలైతాని సాధూనామితి శుశ్రుమ ॥

సాధు సత్పురుషులను దర్శించుట, వారికి పాదాభివందనము సల్పుట, వారితో సంభాషించుట, స్తుతించుట మరియు స్మరించుట మొదలైన చర్యలు మానవునకు శుభమును కలుగజేయు మంగళకర మార్గములుగా మహాత్ములు ఉపదేశించియున్నారు. సమస్త సాధకలోకమును ప్రభావితము చేయగల లోకోత్తర మహనీయుల కోవకు చెందిన పవిత్రాత్మస్వరూపులగు పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి స్మరణ సైతము సాధకులను పునీతము చేయగలదు. వీరి శతజయంత్యుత్సవ వేడుక అఖిలాంధ్రకోటికి ఒక అపూర్వపర్వదినము. వీరు మానవజాతి సముద్ధరణకై, లోక కళ్యాణార్థమై ఆవిర్భవించిన కారణజన్ములు. భగవదనుగ్రహము, సద్గురు మహర్షి మలయాళ స్వాములవారి దివ్యకటాక్షము, అకుంఠితదీక్ష, తపోనిష్ఠ, ఏకాగ్రత మిళితమై మూర్తీభవించిన అపరకారుణ్యమూర్తి శ్రీవారు. వారి దివ్య జీవనమందలి నిబద్ధత, నియమపాలన సర్వులకు ఆదర్శప్రాయము. ఉదయించు సూర్యుడు జగతిని వెలుగులతో నింపునట్లుగ, జ్ఞాన భాస్కరుడైన శ్రీవిద్యా ప్రకాశానందగిరిస్వామి విద్యా ప్రకాశాన్ని ఇంటింటా విరజిమ్మి సాధక లోకపు ఆధ్యాత్మిక జాగృతికి అవిశ్రాంత కృషి సల్పినారు.

శ్రీస్వామివారి పవిత్ర ఆధ్యాత్మిక పరమార్థసేవ బహుముఖంగా విస్తరించింది. అత్యంత శ్రవణానందకరంగా ఉపన్యసించడంలో వారికివారే సాటి. సర్వోత్కృష్టమైన చమత్కారముతో, చెప్పదలచిన అంశమును శ్రోతల హృదయాలకు హత్తుకునేటట్లుగ చెప్పగల వాక్ చతురత వారికి వెన్నతో పెట్టిన విద్య. గంగాఝరి వంటి ఆ వాగ్ధోరణి అందరినీ ఆకట్టుకొనేది. శాస్త్రోక్తమైన ఉదాహరణలతో, హాస్యభరితమైన చిట్టి పొట్టి కథలతో, వివేకానందస్వామి సూక్తులతో, సందర్భానుసారముగ హాస్యాన్ని పండించే ఛలోక్తులతో కొనసాగించే స్వామివారి ప్రవచనాలు సామాన్యుల నుండి సాధుపుంగవుల వరకు ముగ్ధుల్ని చేసేవి. దురవగాహ్యమైన ఆధ్యాత్మిక విషయములను మృదుమధురమగు సర్వసంశయవిచ్ఛేదమగు శైలిలో వివరించెడివారు.

సభలు సమావేశాలతో పాటు పూజ్య స్వామీజీ అనేకమైన గ్రంథములను కూడా రచించారు. వీరి పాండిత్యం లోకవిశ్రుతం. సనాతన ధర్మసంస్కృతికి శ్రీ స్వామివారు ప్రసాదించిన సాహిత్యం అమూల్యం. శ్రీకృష్ణపరమాత్మ శోక మోహగ్రస్తుడైన అర్జునుని నిమిత్తంగా సకల లోకములను అనుగ్రహించుటకు గాను ఎట్టి జ్ఞానోపదేశము గావించినారో అట్టి ఆత్మజ్ఞానాన్ని స్వయంగ విస్తృతమైన సాపేక్ష గ్రంథ పరిశీలన మరియు పరిశోధన గావించి అపూర్వమైన రచనా

సామర్థ్యంలో "**గీతా మకరందం**" అనే మహత్ గ్రంథాన్ని ప్రసాదించారు. ఈ గ్రంథం వారి కృషిలో పర్వతాగ్రం వంటిది. లలితమైన అర్థవంతమైన శైలిలో రచింపబడిన ఈ "**గీతామకరంద**" గ్రంథము వాస్తవముగ మకరందమే. ఇది సకలాంధ్రులకు ఆరాధ్యగ్రంథమై అనేక దేశ విదేశ భాషలలోనికి అనువదింపబడినది. భగవద్గీతపై ఇంతకు మించిన వివరణ గ్రంథము ఇక ఉండబోదు. ప్రతి శ్లోకమునకు విపుల వాఖ్యానముతో సులభమైన, వ్యవహారిక తేట తెలుగు మాటలతో చక్కని దృష్టాంతములతో చదువరులకు ఆసక్తి కలుగు విధముగ, దురవగాహ్యమైన అంశములను సరళముగ సర్వజనులకు బోధపడు రీతిలో వివరించారు. సాధక పాఠకులకు జనించు సందేహము లన్నింటికి తగిన పరిష్కారములను సూచించారు. ఈ గ్రంథము ద్వారా పామరులకు సైతము భగవద్గీతా జ్ఞానము సులభముగా బోధపడగలదు. ఈ గ్రంథమును పఠించిన సాధకునకు గీతాజ్ఞాన వివరణ కొరకు మరేయితర గ్రంథమును సంప్రదించవలసిన పనిలేదు. సాధక పాఠకులకు ఇది అత్యంత ఉపయుక్తమైన గ్రంథము.

శ్రీస్వామివారు రచించిన **పంచరత్నాకరములు** వారి అఖండ ప్రతిభకు నిదర్శనాలు. రామాయణ, భారత, భాగవత, యోగ వాశిష్ఠము మరియు ఉపనిషత్ ఉద్గ్రంథాలను సామాన్య జనులందరూ పఠించలేరు. పఠించినా క్లిష్టమైన విషయములు చదువరులకు అవగాహన కావు. కనుక పై చెప్పబడిన గ్రంథముల నుండి ముఖ్యమగు శ్లోకములను గ్రహించి వానిపై సంగ్రహమైన వ్యాఖ్యానముతో యోగవాశిష్ఠరత్నాకరము. రామాయణ రత్నాకరము, భారతరత్నాకరము, భాగవత రత్నాకరము మరియు ఉపనిషత్ రత్నాకరము అను గ్రంథములను రచించిరి. పండితులకే కాక పామరులకు ఆధ్యాత్మికత అలవడుటకై తత్త్వసారము, మానసబోధ, పాండవగీత, పరమార్థకథలు, ఆధ్యాత్మజడ్జిమెంటు, దివ్యసూక్తులు, యమలోక వార్తలు మొదలగునవి రచించారు.

ఆచరణాత్మక వేదాంతం ఎంత సులభమో చక్కని పద్ధతుల ద్వారా విడమర్చి, అతి సులభమైన భాషలో విభిన్నమైన శైలితో అనేక జీవిత సమస్యలకు ముడిపెట్టి పరిష్కరించి అందరి హృదయాలను స్పృశించునట్లు రచనలు చేయడం శ్రీవారికే చెల్లింది. బ్రహ్మానంద వైభవము. గీతాముచ్చట్లు, ధ్యానపద్ధతి, వైరాగ్య సాధన మొదలైనవి వారి రచనలలో కొన్ని. వీరి రచనలు కొన్ని ఆడియో రూపంలో కూడా విడుదలయినవి. గుర్వాశీర్వాదబలం, జ్ఞానబలం, దైవబలం, తపోబలం మొదలైన బలాలన్నింటిని తన జీవిత కాలములో నిష్ఠతో ఉపయోగించి జ్ఞానవ్యాప్తికి ఉపయోగించిన పూజ్యస్వామీజీ జీవితము సార్థకమైనది.

ఆచరణాత్మక నియమబద్ధమైన జీవనముతో వారు పరిపూర్ణతనొంది తాము తరించి ఇతరులను తరింపజేసిన విధానము సర్వులకు స్ఫూర్తి దాయకము. అనేక మంది జిజ్ఞాసువులు వారి దివ్యజీవనము నుండి ప్రేరణ పొంది, ధార్మిక నైతిక మార్గములను తెలుసుకుని ఆచరించి ధన్యులగుచున్నారు.

మహాత్ములకు మరణం లేదు. సమాజహితం కోసం నిరంతరం తమ తపస్సును ధారపోసి దేశమెల్లడలా బ్రహ్మవిద్యను ప్రకాశింపజేసి ఆధ్యాత్మిక దృక్పథమును విస్తరింపజేసిన సద్గురు మూర్తికి కృతజ్ఞతా పూర్వక నమోవాకములు సమర్పిద్దాం. **గీతా మకరందాన్ని** ఇంటింటా పారాయణ గ్రంథంగా ఆదరిద్దాం. వారు ప్రసరింపజేసిన జ్ఞాన ప్రకాశాన్ని దేదీప్యమాన మొనర్చుదాం. ఆశ్రమానికి మరింతగా సేవచేద్దాం. స్వామి అడుగు జాడలలో నడుద్దాం. సద్గురు కృపకు పాత్రులవుదాం.

వెన్ను నొప్పిపోయింది

పి.ఆర్. ఇందిరా పవార్
W/o పి.ఆర్. మోహన్
శ్రీకాళహస్తి.

నాకు కొంతకాలంగా వెన్నునొప్పి ఉండేది. బద్ధకంగాను, నీరసంగాను ఉండేది. మనస్సు ఆందోళనగాను. అశాంతిగాను ఉన్నట్లు అనిపించేది. యోగాచేస్తే అన్ని ఆరోగ్య సమస్యలు పోతాయని పత్రికల ద్వారా, టీవీలద్వారా వినడమేగాని మాకు యోగా అందుబాటులో వుండేదికాదు. శ్రీశుకబ్రహ్మాశ్రమములో యోగా నేర్పుచున్నారని విని చాలా సంతోషించాను. నేను ఆశ్రమం వచ్చి యోగ శిక్షణాకేంద్రంలో చేరి ప్రతిరోజు ఉదయముననే యోగా తరగతులకు హాజరై వారు నేర్పించు ఆసనములు, క్రియలు, పాణాయామములు శ్రద్ధతో నేర్చుకున్నాను. క్రమం తప్పని నిత్యసాధనవల్ల నా ఆరోగ్యంలో మార్పులు గమనించాను. వెన్నునొప్పి తగ్గింది. నీరసం, బద్ధకం మాయమయ్యాయి. మనస్సులో ఆందోళన తగ్గి ప్రశాంతత ఏర్పడింది. ఇపుడు నా ఆరోగ్యం చాలా బాగుంది. మా యోగాగురువు శ్రీ సి. మార్కండేయులుగారు నన్ను తన బిడ్డలాగా చూసుకుంటూ నాలో ధైర్యాన్ని కల్గించేవిధంగా చక్కని సలహాలతో నాలో వున్న భయాన్నీ, ఆందోళనలను తొలగించి శారీరక మానసిక ఆరోగ్యానికి తోడ్పడ్డారు. నా కుమార్తెను గూడా ఇక్కడే యోగాలో చేర్పించాను.

పూజ్యశ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాముల వారు శ్రీశుకబ్రహ్మాశ్రమంలో ఉచితయోగశిక్షణా కేంద్రాన్ని స్థాపించి శ్రీకాళహస్తి పట్టణంలోని బాల బాలికలకు స్త్రీ పురుషులకు అందరికి యోగాను అందుబాటులోవుంచి, ఎంతోమందికి ఆరోగ్య సమస్యలను నివృత్తపరచి, నిఃస్వార్థ సమాజ సేవను చేతల్లో చేసి చూపిస్తున్నారు. పూజ్యశ్రీ స్వాములవారు ఎంతో అభినందనీయులు. శ్రీస్వాములవారికి ఇతోధిక ఆయురారోగ్యశక్తి, ఉత్సాహాలను కల్గించాలని భగవంతునిప్రార్థిస్తూ స్వామీజీపాదపద్మాలకు శిరసా నమస్సులు, నా హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాను.

జయ గురుదేవ్.

హరిః ఓమ్

మనుజుడు దేవునివైపు ఒక్క అడుగువేసినచో, దేవుడు మనుజుని వైపు పది అడుగులు వేసి ముందుకు వచ్చునని శాస్త్రములు వచించుచున్నవి. తన కర్తవ్యమును జీవుడు చేసినచో దేవుడు తన కర్తవ్యమును తాను చేయును. కొండ దగ్గరకు వెళ్లి కొండపలుకలేదే అని అనవద్దు. నీవు పలికినచో కొండ పలుకును. నీవు ధ్వని చేసినచో కొండ ప్రతిధ్వని చేయును.

- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి

ఆధునిక యుగంలో అపరవ్యాసులు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామివారు

ఏ. సీతారామారావు ఎం.ఏ.,
(విజయనగరం)

జనన మరణాలమధ్య మానవుడు గడిపేజీవితం ఈ అనంతమైన కాలంలో అణువులో అణుమాత్రం. అందుకే జీవితం క్షణభంగురం అన్నారు. ఈ అత్యల్ప సమయాన్ని మానవుడు సద్వినియోగం చేసుకోడు. వివిధ రకాలైన సంపదలకోసం, సంసారతాపత్రయంలో అనేక విధాలుగా ఈ భౌతిక ప్రపంచంలో అశాశ్వతమైన విషయాలకోసం వెంపర్లాడుతాడు. బాధల్నీ, కష్టాల్నీ కొనితెచ్చుకుంటాడు. అంధకారంలో పాంథునిలా అన్వేషణ సాగిస్తాడు. దారి చూపించే వెలుగుకోసం ఆక్రోశిస్తాడు. నిత్య నిరతిశయా నందమును గలుగజేయు సత్యవస్తువు కోసం ప్రయత్నిస్తాడు. బాధలలో, కష్టాలలో, దుఃఖదాయకమైన ప్రాపంచిక దృశ్యపదార్థముల నుండి దూరంగా తొలగాలన్న భావన స్ఫురించినప్పుడే భగవంతుడు గుర్తుకొస్తాడు. అప్పటికి ఆతని జీవితం చరమదశకు చేరుకుంటుంది. అల్పసమయంలో అనల్పవిషయం బోధించగలిగే గురువు వలననే ఇది సాధ్యమౌతుంది.

సత్యవస్తువును తెలుసుకుని పరమపురుషార్థమును ప్రాప్తింపజేయడానికి శ్రీశుకమునీంద్రులు పరీక్షిత్తునకు ప్రాప్తమైనట్లు, అటువంటి మార్గదర్శి ఈనాటి సమాజానికి ఎంతో అవసరం ఉంది.

శ్రీవ్యాసమునీంద్రులు, శ్రీ శంకరభగవత్పాదులు, స్వామి వివేకానంద ఆదిగా ఎందరో-జీవేశ్వరుల స్వరూపమునందు ఏకత్వాన్ని నిరూపిస్తూ ఎన్నో గ్రంథాలను వెలయించారు. ఆ పరంపరలో 20వశాబ్దంలో పేర్కొనదగిన ప్రసిద్ధులలో శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాముల వారొకరు. నాటినుంచి నేటివరకు వీరందరూ ఉపనిషత్సారమైన భగవద్గీతకు భాష్యాలు వ్రాశారు. స్వామివారు భాష్యం వ్రాయడమే కాదు ప్రవచించారు. పండితులకు, పామరులకు భగవద్గీతను అరటి పండు వొలిచి చేతిలో పెట్టినట్లు స్వామివారు 'గీతామకరందం' రచించి ఆ మకరంద మాధుర్యాన్ని చవి చూపించి, హృదయాలలో స్థానాన్ని సుస్థాపితం చేసుకున్న శుకబ్రహ్మ. శ్రీశుకుల పేరును శాశ్వతం చేస్తూ ఆశ్రమాన్ని స్థాపించి గీతా జ్ఞానయజ్ఞాలను శతాధికంగా నిర్వహించి సనాతన ధర్మానికి మరింత ప్రాచుర్యం కలిగించడంతో పాటు, సాధకులను సన్మార్గంలో ప్రవర్తింప జేయడానికి సుగమమైన మార్గాన్ని దర్శింపజేశారనడంలో సందేహం లేదు.

ఆనాడు ప్రసారమాధ్యమాలు అంతగా లేవు. పత్రికలుకూడా ఆధ్యాత్మిక విషయాలను అంతగా పట్టించుకోలేదనే చెప్పాలి. ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించడం కూడా అంతంత మాత్రమే అలాంటి పరిస్థితులలో 1970 దశకంలో సికింద్రాబాదులో స్వామి చిన్మయానంద గీతోపన్యాసం జరిగినప్పుడు ఈ రచయిత వెళ్లడం జరిగింది. అంతకు ముందు శ్రీవిద్యాప్రకాశానందగిరి గారిని గురించి విన్నా, ప్రవచన కార్యక్రమ సందర్భంగా ఏదో సందర్భంలో శ్రీస్వామివారి ప్రస్తావన ప్రముఖంగా జరిగింది. ఆనాటినుంచి

శ్రీ స్వామివారిని దర్శించాలన్న అభిలాష దృఢమవుతూ వచ్చింది. ఆ అభిలాష అదే దశకంలో తీరింది.

ఒకసారి తిరుపతి వెళ్లి తిరుమలరాయుని సేవించుకుని తిరుగు ప్రయాణంలో శ్రీకాళహస్తి చేరుకున్నాను. శ్రీస్వామివారు ఆశ్రమంలోనే ఉన్నారని, గీతాజ్ఞానయజ్ఞం నిర్వహిస్తున్నారని తెలిసింది. ఆ సాయంత్రం ఆశ్రమంలో గీతాప్రవచనాన్ని వినే భాగ్యం కలిగింది. ఒక్క రోజుమాత్రమే కాళహస్తిలో ఉండే ప్రయత్నంలో వెళ్లిన నేను ఆ యజ్ఞం పూర్తయ్యేవరకు ఉండిపోయేను. శ్రీస్వామివారి ప్రవచనంలో ఇతిహాస పురాణాలను, ఉపనిషత్తులను ఉటంకిస్తూ సాగిన ఆ వాగ్ధారను అనుభవించవల్సిందే! ఆ తరువాత సంవత్సరాలలో ముమ్మారు వినే భాగ్యం కలిగింది. ఆనాడు కొన్న 'గీతామకరందం' గ్రంథాన్ని పలుమార్లు పఠించాను. ఆధ్యాత్మిక విషయాలు తెలుసు కొనడానికి ఈ గ్రంథం నాకెంతో ఉపకరించింది.

అయితే 1981వ సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి అధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహింపబడిన 100వ గీతాజ్ఞానయజ్ఞం "న భూతో న భవిష్యతి". అదొక మహాయజ్ఞం. ఆ యజ్ఞంలో పాలుపంచుకోవడం తీయని జ్ఞాపకం, మాటల కందనిది. వయస్సు మీరుతున్నా శ్రీస్వామివారి ఉత్సాహం, వాగ్ధాటి, వీటిని మించి వారు పరమాత్మునిలో లీనమై తాను దర్శించిన మూర్తిని వేలాది శ్రోతలకు సాక్షాత్కరింపజేసిన తీరు తీపిగుర్తులే!

ఇలాటి మరొక అవకాశం 1987 వ సంవత్సరంలో సికింద్రాబాదులో లభించింది. శ్రీస్వామివారి ప్రవచనాలు తలుచుకుంటే చాలు. ఆ దృశ్యాలు, ఆ వాగ్ధాటి సినిమాలా కళ్లముందు తారాడుతాయి. అవి తలచుకున్నప్పుడల్లా అనిపిస్తూ ఉంటుంది - **"శ్రీస్వామి వారి సన్నిధిలో ఏరూపంలోనైనా జీవించి జీవితాన్ని ధన్యం చేసుకుంటే మేలని"** కాని ఆ పుణ్యం అందరికీ లభించడం దుర్లభం కదా!

అందుకే వారు రచించిన "రత్నాకరము" లన్నిటినీ కొన్నాను. వారి విశ్లేషణలను మళ్లీ మళ్లీ చదువుకుంటూ ఆ గ్రంథాలనే కాదు, శ్రీస్వామివారి హృదయాన్ని కూడ చదవడానికి ప్రయత్నంచేస్తూనే ఉన్నాను. సాధనలో లోపం లేదు. కాని, సాధించగలననడం సాహసమే అవుతుంది.

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారి శతజయంత్యుత్సవ సందర్భంగా పూజ్యశ్రీ స్వాములవారికిది అక్షరప్రాంజలి.

ఓంతత్సత్.

ఒక సుందరమైన కార్డు ఉన్నదనుకొనుము. దాని చుట్టును అనేక నగిషీలు, కత్తిరింపులు, తళుకుబెళుకులు చేయబడినవని ఊహింపుడు. కాని స్టాంపు అతికించకుండ దానిని పోస్టులో వేసినచో గమ్యస్థానము చేరునా? చేరదు. అతి సామాన్యమైన కార్డు అయినను స్టాంపుబిళ్ళ అతికించినచో ఎన్ని వేల మైళ్ళైనను ప్రయాణము సాగించగలదు. అట్లే ప్రాపంచికములైన చదువు సంధ్యలు లేకపోయినను, పవిత్రత, హృదయనైర్మల్యము, బ్రహ్మానుభూతి కలిగియున్నచో ప్రపంచమున కంతకును అతడు వెలుగును ప్రసాదించగలడు. తాను తరించి ఇతరులను తరింపజేయగలడు. శాంతి సుఖములను ఈ జీవితమునందే అనుభవింపగలడు. *- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి*

గురు అనుగ్రహంతో నాకు కదలికలు నిలచినాయి

- తాళంకి నాగేంద్ర గుప్త
(సోమందేపల్లి)

శ్రీశ్రీశ్రీ పరమపూజ్య విద్యాప్రకాశానందగిరి సద్గురు పరబ్రహ్మణే నమః

అనంతపురం జిల్లా సామందేపల్లి నుండి తాళంకి నాగేంద్ర గుప్తా వ్రాసుకొన్న అనుభవము. పూజ్యులు మా తల్లితండ్రులు ధర్మవరంలో శ్రీశ్రీశ్రీ పరమపూజ్య విద్యాప్రకాశానందగిరి స్వాములవారి శిష్యులు. ధర్మవరం నందు 1977లో గీతా జ్ఞానయజ్ఞము స్వామివారు నిర్వహించినారు. అందు విశేషమైన జన బాహుళ్యాన్ని స్వామివారు ప్రభావితం జేశారు. అప్పుడు సినిమాలకు కూడా జనం తగ్గి స్వామివారి ఉపాన్యాసానికి ఎక్కువ మంది వచ్చేవారు. గీతాజ్ఞానయజ్ఞం జయప్రదంగా జరిగినది. గతంలో మాతల్లి, తండ్రి స్వామివారి శిష్యులు. మాతల్లి తండ్రుల అభ్యర్థనమేరకు మా ఇంటికి స్వామివారు విచ్చేసినారు. మా తండ్రిగారి విజ్ఞాపన మేరకు మాకు అంటే తాళంకి నాగేంద్ర గుప్తా మరియు నాతమ్ముడు ప్రభాకర్ గుప్తా తదుపరి నా భార్యమరియు మరదలు కుసుమమ్మ వరలక్ష్మమ్మ గార్లకు తారక మంత్రాన్ని అనుగ్రహించినారు. నాటి నుంటి నా ఆర్థిక ఒడుదుడుకులవల్ల ధర్మవరంనుండి సోమందేపల్లికి చేరినాము. కొన్ని సంవత్సరాలపాటు స్వామి అనుగ్రహించిన మంత్రాన్ని సైతం మరచిపోయినాము. మరల **గీతామకరందం** గ్రంథమును సోమందేపల్లిలో ఉండేబండారు కేశన్న గారు మరియు కొందరు సత్సంగము ద్వారా మరల స్వామివారి నామముయొక్క ఉచ్చారణ నిరంతరం మననం చేయుట ద్వారా ఆధ్యాత్మికం వైపు మరలి శ్రీ శుక బ్రహ్మాశ్రమమునకు పలుమార్లు వచ్చినాము. ఆశ్రమ వార్షికోత్సవము యొక్క స్వామివారి జన్మదిన సందర్భముగా జరుగు పూజ్య మహనీయులైన వారి ప్రసంగంలలో పాల్గొని ఆధ్యాత్మికముగా ప్రభావితం అయినాము. కేవలం స్వామివారి నామస్మరణ ద్వారా ఈ అవకాశం కలిగినది. కాని స్వామివారు ఇచ్చిన మంత్రము మరవడం ద్వారా శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వామివారి పాదములను ఆశ్రయించినాను. వారు నా మననులో ఉండు సంశయములను పలుమార్లు తీర్చినారు మరియు తారక నామాన్ని పొందినాను.

స్వామివారు ఇచ్చిన మంత్రాన్ని నిరంతరము స్మరించుట ద్వారా దుఃఖనివృత్తి అయినది. స్వామివారి శతజయంతి సందర్భంగా నా అనుభవం తెలుపుకొన్నాను.

గత సంవత్సరం ఉపన్యాసాలలో శుకబ్రహ్మాశ్రమం ఉత్తర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సంపూర్ణానందగిరిస్వాముల వారు, విద్యావారధి, సభాముఖంగా ఇలా బోధించినారు– "సముద్రములో నీరు ప్రశాంతంగా ఉంటాయి. నదిలో నీరు కదులుతూ ఉంటాయి. కదిలితే జీవుడు, కదలకపోతే దేవుడు". గురువు యొక్క సంపూర్ణమైన అనుగ్రహంతో నాకు కదలికలు నిలిచినాయి. శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాముల వారి పాదపద్మములకు సమర్పణ.



శ్రీగురుమహిమ అపారము

శ్రీతుమ్మలరాఘవులు ముదిరాజ్
(యం.జలాల్‌పురము, మెదక్ జిల్లా.)

ఓంగురుర్బ్రహ్మా గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరబ్రహ్మా, తస్మైశ్రీగురవేనమః ॥

శ్రీ బ్రహ్మ విష్ణు మహేశ్వర త్రిమూర్తి స్వరూపులైన, సృష్టిస్థితిలయ కారకులైన,“ శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానంద గిరి” సద్గురు స్వాములవారి దివ్యచరణారవిందములకు, యీ దాసానుదాసుడు, శిరఃసాష్టాంగ ప్రణామములు.

శ్రీసద్గురుమూర్తిశిష్యకోటిలోనివాడను నేను. నాపేరు శ్రీతుమ్మలరాఘవులు ముదిరాజ్ (మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం) మన్నేవారి జలాల్‌పురవాస్తవ్యుడను. నాకు నా బాల్యమునుండి, భజన, సత్సంగము, ధార్మిక కార్యక్రమము లంటే చాలప్రీతి.

తేది 10-2-1984 శుక్రవారము రోజున శుకబ్రహ్మాశ్రమములో (శ్రీకాళహస్తి) శ్రీసద్గురు దేవుల దర్శన భాగ్యము కలిగినది. ఆరోజు శ్రీరామతారకమంత్రోపదేశ మును, శ్రీగురుదేవుల అనుగ్రహశ్రీని పొందినాను. నాటినుండి గురుదేవుల ధార్మిక కార్యక్రమములకు వెళ్లు చుండెడివాడను. “శ్రీభగవద్భక్తానంద భజనమాల” అను భజనకీర్తనలు, తత్వములు రచించి గురుపాదపద్మములకు నర్పించినాడను.

ఒకరోజు (తేది. 16.3.1984) నా స్వప్నములో, మాగ్రామములో “శ్రీమద్భగవద్గీత” ప్రవచనములు స్వాములవారు చేస్తున్నట్లు దర్శించినాను. స్వామీజీ ఒకమాటన్నారు. శ్రీభగవద్గీతలో ఈ మూడుశ్లోకాలు పఠించి, అర్థంచేసుకొని, ఆచరించండి, మీజన్మ సార్థకతమవుతుంది అని అన్నారు.

1. శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం -వినాశాయ చ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ - సంభవామి యుగే యుగే
(గీత-4.8)

2.శ్లో॥ అనన్యాశ్చింతయంతో మాం - యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం - యోగక్షేమం వహామ్యహమ్
(9-22)

3.శ్లో॥ తేషాం సతతయుక్తానాం - భజతాం ప్రీతిపూర్వకమ్
దదామి బుద్ధియోగం - తం యేన మాముపయాన్తి తే
(10-10)

పైశ్లోకాలు విన్నవెంటనే మేలుకొని వ్రాసుకొని పఠించుచున్నాను. ప్రతిక్షణం, శ్రీస్వాములవారి ఉపన్యాస మాధుర్యం, మధురకంఠస్వరం, నాకర్ణ పుటములలో యెప్పటికి ప్రతిధ్వనిస్తూనే వున్నాయి.

తేది 8-2-1985నాడు అఖిలాంధ్రసాధుపరిషత్ (కడ్తాల్- మహబూబ్ నగర్) లో మరియు తేది 7.3.-1985 శ్రీసనాతన వేదాంత జ్ఞాన సభలు (విజయవాడలో), తేది 27-12-1985నాడు మా మెదక్ జిల్లా జహిరాబాద్ పట్టణములో శ్రీరామకోటి జపయజ్ఞము భక్తుల కోరికమేరకు



జరిగినవి. అట్టి సభలలో యింకాయెన్నో సార్లు శ్రీగురుదేవుల దర్శన భాగ్యము కలిగినది. శ్రీగురుదేవులు ఉపన్యాసము ప్రారంభించేముందు, హరినామ సంకీర్తన పాడుతు, భక్తులచేత పాడించెడివారు. స్వామీజీ ప్రవచనమంటే వేలకొలది భక్తులు ఇసుక వేస్తేరాలని విధంగా శ్రోతలున్నా సభాప్రాంగణమంతా నిశ్శబ్దంగా వుండి, ఆసక్తిగా వినేవారు. ప్రస్తుతము స్వాముల వారు భౌతికముగా లేకున్నావారి కరుణాకాంతికిరణాలు మదిలో నమ్ముకున్న భక్తులపై, శిష్యులపై సదా ప్రసరింపజేస్తు తోడునీడగా వుంటున్నారు. యిది ముమ్మాటికీ సత్యం.

ఒకరోజు నాకు నడుములో విపరీతమైన నొప్పివచ్చినది. నడువ వీలుకాలేదు. హైద్రాబాద్‌కు నా సోదరుడైన విఠల్ మరియు నా కుమారుడైన గీతాప్రకాశ్ గార్ల సహాయముతో బోన్స్‌స్పెషలిష్టు డాక్టర్ గారి దగ్గరికి వెళ్లినాను. ఎక్స్‌రే తీసి చికిత్సచేశారు. నయముకాలేదు. వేరే డాక్టరును సంప్రదిస్తే ఆపరేషన్ చేయవలసి వస్తుంది అని అన్నారు. దానికి సరేనన్నాను. డాక్టరుగారన్నారు ఆపరేషన్ చేస్తే గ్యారంటీగా నయంకాగలదని చెప్పలేము అని సందేహము వెలిబుచ్చారు. దానికి చాలభయపడినాను తిరిగి నాయింటికి చేరుకున్నాను. మనసులో ఒకటే చింత, యేమికాదంటారు, యోమో చెప్పలేము అంటారు అని. దిగులుగా నాయొక్క భార్య హంసమ్మ, నేను విచారముతో శ్రీమద్గురుదేవులను రాత్రి ధ్యానిస్తూ శోకతప్త హృదయముతో విలపిస్తూ (తేది. 17.6-2011) ఈ తత్త్వమును వ్రాసిపడుకున్నాము.

(తత్వము) హిందుస్తానితోడి - ఆది.)

ఉపయోగమనుకుంటే- నన్నుంచుమా- ॥ని-
రుపయోగమనుకుంటే చాలించుమా -
ఉపయోగమో నిరుపయోగమో ప్రభు ॥ఉ॥
అపరాధిని మీకృపయితనువులో ॥ఉప॥
జీవులయెడ కరుణవహించితిని ॥జీ॥
సేవకుడను మీ- చరణదాసులకు ॥ఉ॥

వైద్యులెందరో ఘన - వైద్యముజేసిన ॥వై॥
సాధ్యముకాదుమీ -సత్కృపలేనిది ॥ఉ॥

భజనలోప్రేమా - భ్రమ తీరగాలేదు ॥భ॥
సుజనుల గోష్ఠింకా - చేయాలనివుంది ॥ఉ॥

నా స్వప్నంలో, శ్రీస్వాములవారు బ్రాహ్మణవేషములో దర్శనమిచ్చి అన్నారు - ఇదుగో, ఈ మాత్రవేసుకో, ఏదీ, నోరుతెరు, అని చెప్పి నా నోటిలో యెదో ఒక మాత్రవేశారు. మళ్లీ ఈవిధంగా చెప్పాడు. యిక యే మందులువాడకు, చక్కగా “వజ్రాసనములో” కూర్చుండి మెడిటేషన్ చెస్తూ శ్వాసను గమనిస్తూ వుండు. నీయొక్క నడుమునొప్పి పూర్తిగా నయంకాగలదు. భయపడకు” అని చెప్పి అదృశ్యమయ్యారు. వెంటనే మేలుకొని నా అర్ధాంగియైన హంసకు స్వప్న వృత్తాంతమును చెప్పి, శ్రీసద్గురు దేవులకు నమస్కరించి ప్రార్థించాము. శ్రీస్వామీజీ యాజ్ఞానుసారము విధిగా వజ్రాసనములో గూర్చుండి ధ్యానము చేయుచున్నాము. పూర్వమువలె యథాప్రకారముగా నా దేహము ఆరోగ్యముగా నున్నది. మా కుటుంబసభ్యులమంతా, మా భజనమండలి భక్తులమంతా, ఆధ్యాత్మిక ధార్మికకార్యక్రమములో పాల్గొంటు శ్రీసద్గురుదేవులను త్రికరణశుద్దిగా నమ్మి ప్రార్థిస్తున్నాము.

కావున“శ్రీవిద్యాప్రకాశానందస్వాములవారి మహిమ అపారము”. వారి ప్రభావము సదామేము నానిత్య జీవితములో, నా అనుభవ పూర్వకముగా తెలుసుకొన్నాము. శ్రీసద్గురు స్వాములవారి కృపాకటాక్షములు, శుభాశీస్సులు మాపై సదా ప్రసరింపజేయుగాక. యని ప్రార్థిస్తున్నారము.

జైగురుదేవ్, హరిః ఓం తత్‌సత్

శ్రీగురుభ్యో నమః

నా శ్వాస - నా ధ్యాస శ్రీస్వాములవారే

- శాఖా బేజేనాయన (కేశవరం)

మొదటిసారిగా 1972 సం॥రం పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణములో జరిగిన శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి భగవద్గీతాజ్ఞాన యజ్ఞంలో 18 రోజులూ పాల్గొన్నాను. అప్పటికి నావయస్సు 12సం॥లు. అయినా స్వాములవారంటే ఎంతో ఇష్టం. వారి ఉపన్యాసములపై ఎంతో ఆసక్తి. అజ్ఞానాన్ని రూపుమాపి జ్ఞానాన్ని అందించి విజ్ఞానం వైపు పయనింపచేస్తాయి. మామూలు మనుషులను భక్తులుగా, భక్తులను భగవత్ స్వరూపులుగా ఆయన తయారు చేయగలరు. వీరి ఉపన్యాసాలు 40 సంవత్సరముల క్రిందట విన్నా ఇప్పటికీ చెవులలో మారుమ్రోగుచున్నాయి, వుంటాయి కూడా.

శ్రీస్వాములవారి ఉపన్యాసాలతో ఎంతో మంది ప్రేరణపొందిన వారిలో నేనూ వున్నాను. జీవితరంగంలో శారీరకంగానుు, మానసికంగానుు, ఆర్థికంగాను ఎన్నో చేదు అనుభవాలు ఎదురైనప్పటికిని గుండె ధైర్యాన్ని ప్రసాదించింది స్వాములవారే.

1990 సం॥రంలో అనపర్తి సనాతన వేదాంత జ్ఞానసభలలో శ్రీస్వాములవారి వద్ద శ్రీకృష్ణమంత్ర దీక్షను పొందినాను. మాంసమయ శరీరాన్ని మంత్రమయ శరీరంగా మార్చినవారు శ్రీస్వాములవారు. శ్రీస్వాముల వారియొక్క ప్రేరణతో 1990 సం॥రంలో మార్గశిర శుద్ధఏకాదశి రోజున తొలిసారిగా గీతాజయంతిని ప్రారంభించినాము. స్వాములవారికృపతో ఇప్పటికి 22 సం॥రంలు వేలమందికి అన్నదానంతో నిర్విఘ్నంగా జరుగుచున్నది. అంతేగాక ప్రతి సం॥రం గీతాజయంతి రోజున ఒక ప్రముఖ స్వామీజీని ఆహ్వానించడం జరుగుతూంది. వచ్చినవారు ఉపన్యాసం చెబుతూ స్వాములవారి జీవితంలోని కొన్ని సంఘటనలు వివరించినపుడు నాకు చాలా ఆనందంగా వుంటుంది.

అలాగుననే స్వాములవారి ప్రేరణతో 2008సం॥రంలో మా గ్రామంలోని పురాతన శివాలయం వద్ద అన్న సంతర్పణ ఏర్పాటు చేసి ప్రతి సం॥రం మహాశివరాత్రి రోజున 10 వేలమందికి అన్న సంతర్పణ చేస్తున్నామంటే కారణం శ్రీస్వాములవారే. అలాగే ప్రతి ఆదివారం మాఇంటి వద్ద కొంతమంది పిల్లలకు నేను భగవద్గీతను నేర్పుచున్నాను. ఆ పిల్లలు భగవద్గీతను నేర్చుకుని శ్లోకాలు చదువుతూంటే నాకెంతో ఆనందం.దానికి మూలం శ్రీస్వాములవారే కదా! ఉన్నస్థితినుండి ఉన్నత స్థితికి తీసుకు వచ్చింది శ్రీస్వాములవారే. మా అమ్మాయి డాక్టర్ మణికృష్ణ యం.బి.బి.యస్, మా అబ్బాయి శివసుబ్బరావు ఇంజనీర్. వీరిద్దరూ శుకబ్రహ్మాశ్రమములో వేసవిశిక్షణా శిబిరంలో పాల్గొన్నవారే. వీరు కూడ ఉన్నత స్థితిని చేరుకున్నారు. స్వాముల వారి అనుగ్రహంతోనే రానున్న కాలంలో "స్వామి విద్యాప్రకాశానంద" ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తాం. అలాగే భగవద్గీతా ప్రచారమంటే గురుదేవులకు ఎంతో ఇష్టం, కావున నేను గీతాప్రచారం నిర్వహిస్తున్నాను. ఇంకా అనేక కార్యక్రమాలలో పాల్గొంటాను. నేటి ఈస్థితికి కారణం -నాశ్వాస- నా ధ్యాస శ్రీస్వాములవారే. నాజీవితం స్వాములవారికి అంకితం చేస్తున్నాను.

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు "బ్రహ్మజ్ఞాని"

బొజ్జాసాధుబాబు (విశాఖ పట్టణము)

శ్రీభగవానుడు తన అవతార విశేషాలను, కళ్యాణగుణములను ఈలోకంలో వ్యాపింపజేయుటకు, ఎందరో మహాపురుషులను పంపుతూ ఉంటారు. అలా పంపిన మహాపురుషులలో మన గురుదేవులు ఒకరు. వారు లోకకళ్యాణం కోసం, తనజీవితాన్ని త్యాగంచేసిన ధన్యజీవి. గీతను ఎన్నోయజ్ఞముల ద్వారా, ప్రజలకు అందించి, **"గీతామకరందం"**ను ఆస్తిక మహాపురుషులకు, భక్తులకు అందజేశారు.

నా స్వానుభవం అయితే, నాకు దేశరక్షణ విభాగం, విశాఖలో ఉద్యోగం. విశాఖలో ఇది చాలాపెద్ద సంస్థ. నాకు వివాహం అయిన తరువాత, కొన్నాళ్ళకు కుటుంబ సమస్యలవలన, నేను ఎంతో మానసిక వ్యథను అనుభవించాను. ఉద్యోగ సమయాలు అయిన తరువాత, ఏమి చేయాలో తోచనిపరిస్థితి. అపుడు నాతోటి కార్మిక సోదరులు, శ్రీగురుదేవుల 'గీతాయజ్ఞం' పోర్టుగ్రౌండ్సులో జరుగుతుందని ప్రకటించారు. అక్కడకు నిన్ను తీసుకొనివెళ్తాను, నీకు స్వామివారి ప్రవచనములు వినడమువలన మానసిక శాంతి లభిస్తుందని, శ్రీగురుదేవుల యజ్ఞానికి తీసుకొనివెళ్ళారు. అప్పటికి నాకు "గీత" మీద అవగాహనలేదు. పీఠాధిపతులు, కాషాయాంబరులైన సన్న్యాసులను చూసిందిలేదు. అదే మొదటిసారి శ్రీస్వాములవారిని చూడడం. నాపూర్వజన్మ సుకృతం ఏమో తెలియదు స్వామివారి 18రోజులు యజ్ఞం తరువాత నిజంగానే నాకు మానసిక శాంతి దొరికింది.

ఈ యజ్ఞం జరిగే అన్నిరోజులు మాతోటి కార్మికులందరం, స్వామిప్రవచనం ఎంతో ఆనందంగా వినేవాళ్లం. ఈవిన్న ప్రవచనాన్ని మరల మామరుసటిరోజు మా,work Shop, Tea బ్రేకులో మననం చేసుకొనేవాళ్ళం. అలాగు, మాకు ఒక 'సత్సంగ్' ఏర్పడింది. అపుడే స్వామివారి "వేదాంతభేరి" ని తెప్పించుకొని, అందులో, శ్రీస్వామివారి ప్రవచనం, అలాగే మిగతా పెద్దల శ్రీసూక్తులను, చదువుకొనేవాళ్ళం. మాతోటి కార్మికులు మమ్మల్ని చూసి, 'సత్సంగ్' సభ్యులండి వీరు, అని ఎంతో గౌరవంగా చూసేవారు. ఎవరైన పదవీ విరమణ చేసినట్లయతే, మా 'సత్సంగ్' తరపున వారికి శ్రీస్వామిరచనలు జ్ఞాపికగా ఇచ్చేవాళ్ళము.

యజ్ఞం జరిగేరోజులలోనే శ్రీస్వామివారు ఉదయం పూట ఒక స్కూల్‌లో "యోగవాసిష్టం" గ్రంథం పైన ప్రవచనాలు అనుగ్రహించేవారు. మంచి మంచి కథలు చెప్పేవారు. ఎంతో మందిశ్రోతలు చాలా భక్తితో వినేవారు. సాయంత్రం సమయంలో యజ్ఞప్రదేశంలో శ్రీస్వామివారి ప్రవచనానికి, తండోపతండాలుగా వేల, వేల సంఖ్యలో జనం. ఎక్కడికి వెళుతున్నారండీ ఈవేల మందిజనం, అని థియేటర్ల యాజమాన్యం వారు మాకు "మొదటి ఆట" కు కలెక్షన్లు తగ్గిపోయాయని ఆవేదన పడుతున్నారని, యజ్ఞవేదికపై, నుండి ఒకరోజు నిర్వాహకులు ప్రకటించారు. అంటే, అంతలా, ఈ యజ్ఞం వైభవంగా జరిగింది.

ఈయజ్ఞం తి.తి.దే. వారి అధ్వర్యంలో పోర్టుగ్రౌండ్సులో 1982వ సంవత్సరం జరిగింది.

ఈయజ్ఞానికి వస్తున్న, నా స్నేహితులు ఒకాయన,

పోర్టుట్రస్టులో ఉద్యోగం. వారు శ్రీస్వామివారిపైన ఉన్న భక్తి భావముతో తన అనుభవాన్ని ఇలా పంచుకున్నారు. వారు C Shift కివెళ్ళి వారి Tea బ్రేక్ ఉదయంలో వారికి దగ్గఅగా ఉన్న శ్రీఆర్యవైశ్యులవారి శ్రీవాసవీభవనంలో "శ్రీస్వామివారి" విడిదికి వెళ్ళారు. "స్వామివారు ఇపుడు ఎలాగ ఉన్నారు? ఏమి చేస్తున్నారు, వారి విశ్రాంతి సదుపాయములు ఎలాగ ఉన్నాయ"ని – ఎంతో ఆసక్తితో ఆ భవనానికి వెళ్ళి చూశారు. "తాను ఎంతో ఆశ్చర్యపోయి నేత్రాలు అశ్రువులతో నిండగా అలాగ నిశేష్టులై ఉండిపోయా" అని చెప్పారు. అయితే, ఆ సన్నివేశం, శ్రీస్వామివారు ఎంతో నిరాడంబరముగా, ఒక కొయ్యబల్లపై తనచేతినే తలదిండుగా చేసుకొని విశ్రమించుచున్నారని, ఎంతో ఆవేదన చెంది, వేల, వేలసంఖ్యలో, తన ఉపన్యాసములతో జనులను మంత్రముగ్ధులను చేస్తున్నవారు – ఇంతసామాన్య జీవితం గడుపుతున్నారని, నాతో తనుచూసిన సన్నివేశాన్ని చెప్పారు.

అత్యంత వైభముగా, ఆనందంగా శ్రీగురుదేవుల పాద దర్శనముతో, సం॥ 1982లో యజ్ఞం ముగిసింది.

శ్రోతలపై గీతా యజ్ఞాల ప్రభావం

ఒకసారి, ఒకపల్లెటూరుకు చిన్నపని మీద వెళ్ళవలసి వచ్చింది. అయితే అక్కడ "నేషనల్ హైవే' స్థల విస్తరణభాగంగా, అక్కడ 'రామాలయం" ను కొంచెం తగ్గించి, తిరిగి పునః ప్రతిష్ఠ కార్యక్రమము జరిగింది. అత్యంత సుందరమైన మూర్తులు, ప్రతిష్ఠింప జేసారు గ్రామస్థులు. హెూమాలు, అభిషేకాలు, అన్నసమారాధనలు అంత్యంత వైభవముగా నిర్వహించారు.

ఆ గుడిలో ఒక 65 ఏళ్లు పైబడిన ఒకాయన పెద్దవారు, మూలగా కూర్చుని, శ్రీస్వామివారి 'గీతాప్రార్థన' చేస్తున్నారు. నాకు ఆశ్చర్యం వేసి, వారిని ఈప్రార్థన ఎక్కడ నేర్చుకున్నారని అడిగాను. వారు, శ్రీస్వామి గీతా మకరందము చదువుతూ ప్రార్థనను కంఠస్థముచేసానని చెప్పారు. శ్రీస్వామి చేసిన గీతాయజ్ఞాలు, ఇతర రచనలను వారు ఎంతో ఆనందంగా కొనియాడారు.

అటువంటి పల్లెటూర్లలో ఉన్న శ్రోతలు, భక్తులు స్వామివారి ప్రవచనాలకు ఆకర్షింపబడి పునీతులగు చున్నారు. ఇదంతా శ్రీస్వామి తపశ్శక్తి వైభవం. ఒకరోజు, మేము పనిచేస్తున్న సంస్థ ప్రధాన అధికారి, ఆకస్మికంగా, తనిఖీలు చేయడానికి వర్కుషాపులోనికి వచ్చారు. మిగతా అధికారులు వారివెంటే ఉన్నారు. అయితే అపుడు సమయం మాకు కేటాయించిన "టీబ్రేక్". విసిట్‌లో భాగంగా మా సత్‌సంఘ్ సభ్యులు కూర్చున్న ప్రదేశానికి వచ్చారు. మేమందరం, వారిని గౌరవిస్తూ నిలుచున్నాము. అపుడు వారు ఇంతమంది ఇక్కడ ఏమిచేస్తున్నారు? అని ప్రశ్నించారు. మేము గీతాపఠనము చేస్తున్నామని చెప్పాం. దానికి వారు మావద్ద ఉన్న "గీతామకరందము" ను చేతిలోనికి తీసుకొని, చూస్తూ చాలా మంచిపనిచేస్తున్నారు. సమయాన్ని చాలా చక్కగా వినియోగ పర్చుకుంటున్నారని, మా సభ్యులందరిని అభినందించి వెళ్ళారు. అలాగ ఎంతోమంది శ్రోతలను శ్రీగురుదేవులు ప్రభావితం చేసారు.

ఎందరో మహాపురుషులు 'గీత' ను వ్రాసారు, ప్రవచనాలు చేసారు. కాని, గురుదేవులు, "గీత" రచించిన విధానము, చాలా విపులముగా, పామరులకు కూడా బోధపడేలా ఉంది. పూజావిధానము, అధ్యాయ ఫలితాలు. మంచి ఉదాహరణములు అందుగలవు. 'తేనె' త్రాగితే, ఎంత తియ్యగా, ఆనందముగా ఆరోగ్యముగా ఉంటుందో అలావిశదముగా వ్రాసారు. "గీత" అంటే సరిగ్గా బోధదపడని

వారు కూడా శ్రీస్వామి యజ్ఞాలవలన ప్రభావితులైనారు. "గీతామకరందము" లేని ఇల్లుగాని, తెలియనిశ్రోతగాని, ఆంధ్రావనిలో ఉండరని నా అభిప్రాయం. శ్రీస్వామివారు "గీత" ప్రవచనాలు "జెమిని' టి.విలో ప్రసారం అవుతున్న సమయంలో ఎంతో మంది శ్రోతలు విని మహదానందం పొందేవారు. శ్రీస్వామివారు తమ తపస్సుశక్తిని అంతాధారపోసి "గీతామకరందము" రచించి లోకోపకారకులైనారు. శ్రీవారిని ఎంత శ్లాఘించినా తక్కువే అవుతుంది.

శ్రీస్వామివారి దివ్యమంగళ విగ్రహాన్ని చూస్తూ, వారి శ్రీసూక్తులు వింటుఉంటే, మాకు ఆనందంకలిగేది. మళ్ళీ శ్రీస్వామి ప్రసంగాలు, కనీసం వారానికి ఒక్కసారైన ప్రసారము చేస్తే బాగుంటుందని, శ్రోతలు ఎందరో కోరుతున్నారు.

మన స్వామివారు గీతాయజ్ఞాలు అన్ని జిల్లాలలో చేశారు. మనలాంటి భాగవతభక్తులను, వారి ప్రవచనాల ద్వారా తరింపజేసారు. టి.టి.డి వారు ఈ యజ్ఞాలకు అధ్వర్యం వహించారు కాబట్టే, యజ్ఞాలు చాలా వైభవముగా, జరిగాయి. శ్రీతిరుమల తిరువతి దేవస్థానం వారు కేసట్ల రూపములో, గురుదేవుల దివ్యోపన్యాసములు ఆంధ్రా ప్రజలకు అందజేసినారు. ప్రస్తుతము నడుస్తున్న "S.V.B.C (శ్రీవేంకటేశ్వరభక్తి చానెల్) ద్వారా, శ్రీగురుదేవుల 'గీతా' ఉపన్యాసములు ప్రసారం చేస్తే బాగుంటుంది.

తిరుమల శ్రీవేంకటాచలపతి యాత్రలో భాగంగా. రెండుసార్లు శ్రీకాళహస్తి క్షేత్రమును దర్శించే భాగ్యం కలిగింది

1. మొదటిసారి శ్రీకాళహస్తి క్షేత్రాన్ని సేవించడానికి వెళ్ళినపుడు మా బంధువు ఇంటిలో విడిది. ఆ బంధువుకు శ్రీకాళహస్తి క్షేత్రం బాగాతెలుసు. వారిని, మాకుటుంబ సమేతంగా, శుకబ్రహ్మ ఆశ్రమము చూడాలని అడిగాను. ఆశ్రమము, వెళదాము దగ్గరగానే వుంది పదండి అని తీసుకొని వెళ్ళారు. సాయంత్రము కావడంవలన చీకటిపడుతున్నది. ఒక శిష్యుడు మాకు దారిచూపుతూ, మమ్మల్ని శ్రీస్వామి వారి సన్నిధికి తీసుకొని వెళ్ళారు. శ్రీస్వామిజీవారు అక్కడ ఉన్న భక్తులకు తమ ప్రవచనం అనుగ్రహించుతున్నారు. మేము వెళ్ళి, శ్రీస్వామిజీ వారికి దాసోహములు చేసాం. శ్రీస్వామివారు మీకు తిరుమల శ్రీవారి దర్శనం అయిందా అని, స్వామిని సేవించుకున్నారా! అని కుశల ప్రశ్నలు వేసారు. ఆశ్రమములో ఉండమని, మమ్మల్ని ప్రేమ పూర్వకంగా ఆహ్వానించారు. తరువాత శ్రీస్వామిజీ శిష్యులు ఆఫీసుకు తీసుకొనివెళ్ళి, మాకు శ్రీగురుదేవుల చిన్న రచనలు కలిగిన పుస్తకాలు ఇచ్చారు. మాకు రైలు ప్రయాణానికి సమయం కావడం వలన శ్రీస్వామి వారి వద్ద అనుమతితో, దాసోహములు సమర్పించు కుంటూ, ఆశ్రమము నుండి బయలుదేరాం.

మరోసారి, తిరుమల శ్రీవారి దర్శనానంతరము, శ్రీకాళహస్తిక్షేత్రం దర్శనానికి వచ్చాం. మాసోదరుని కుమార్తెకు వివాహసమస్య నివారణ నిమిత్తం "రాహువు –కేతువు" పూజ జరిపించడానికి వచ్చాము. పూజాసామగ్రి అంతా తీసుకొని అమ్మాయిని మండపములోనికి తీసుకొని వెళ్ళాం. అయితే ఆమెతో పాటుగా ఇతరులు పూజా మండపములోనికి అనుమతి లభించదని అర్చక స్వాములవారు ప్రకటించారు, పూజాకార్యక్రమము సుమారుగా "2గం॥లు" సమయం పడుతుందని చెప్పారు. ఇంత సమయాన్ని ఊరకనే గడిపేకంటే, శ్రీశుకబ్రహ్మాశ్రమమును దర్శనం చేసుకుందామని మా సోదరుని తీసుకొని బయలుదేరాం. ఆశ్రమములోనికి ప్రవేశించగానే, చల్లని గాలులతో, ఫలపుష్పాదులు కలిగిన వృక్షాలు ఆహ్వానిస్తున్నట్లుగా అనిపించాయి. ఆఫీసు, అన్నపూర్ణశాల చూసుకుంటూ, అక్కడఉ

న్న 'శివాలయం' వద్దకు వచ్చాం. అక్కడ స్వామివారి వీడియోక్యాసెట్లు ద్వారా ప్రవచనాలు ప్రసారం చేస్తున్నారు. కొంతసేపు శ్రీగురుదేవుల గీతాప్రవచనం వినేభాగ్యం కలిగింది. ప్రవచనం చూసిన తరువాత, తీర్థ, ప్రసాదాలు అనుగ్రహించారు. తరువాత శ్రీగురుదేవుల ధ్యాన మందిరం చూసాం. శ్రీస్వామివారి పాలరాతి విగ్రహం భక్తులను ఆకట్టుకొనే విధంగా పద్మాసనంలో కూర్చొని దర్శనం అనుగ్రహించుచున్నట్లుగా ఉన్నారు. ఈవిధముగా, ఆశ్రమమును రెండవసారి చూసే, అదృష్టము కలిగింది. చాలా సంతోషంగా ఉంది.

శ్రీకాళహస్తి క్షేత్రదర్శనానికి వచ్చిన ప్రతిభక్తుడు, తప్పనిసరిగా దర్శించి, సేవించదగిన పవిత్రస్థలము శ్రీశుకబ్రహ్మాశ్రమము.

39వ గీతా మహోత్సవములో, భక్తుల (దాసుని) అనుభవాలు. శ్రీగీతాప్రచారసమితి, మరియు ఆర్యవైశ్య యువజన సంఘం, విశాఖపట్టణం వారు 39వ గీతా మహోత్సవాన్ని నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానంద గిరి స్వాములవారి, గీతాప్రవచనములు అత్యంతవైభవముగా మున్సిపల్ స్టేడియంలో. తేది 15-5-1989 నుండి 4-6-1989 వరకు విశాఖపట్నం. స్టేడియం అంతా భక్తజనులతో పండగ వాతావరణం నెలకొంది. ఎందరో పెద్దలు, మహాపురుషులు, ఈ ఉత్సవమునకు వచ్చి, శ్రీస్వామికి అభినందనలు తెలియజేసి, మంగళా శాసన పూర్వకమైన, శుభాశీస్సులు పొందారు.

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు తమ గీతాయజ్ఞాలు విశాఖనగరంలో జరపడమువలన దాసుని జీవితాన్ని పెద్దమలుపు త్రిప్పి, ఆధ్యాత్మికమార్గంలో ప్రవేశింప జేసారు. శ్రీగురుదేవులు నిత్యం ప్రాతః స్మరణీయులు.

శ్రీగురుదేవుల ఆశీస్సులు అందరిపై ఉండాలి అని భావిస్తూ, ముగిస్తున్నాను.

హరిః ఓం

యతిగీతము

- స్వామి వివేకానంద

మినుకుమినుకను చీకటిన్ మీద మీద!
నలముచుండెడు కొరవిదయ్యంబు పగిది ।
దనరు జ్ఞానమును బాపిరకొనుము వేగ
జననమరణమ్ములకు లాగికొనుచు నేగు ।
జీవితపు తృష్ణనార్పుము శీఘ్రముగను
తన్ను దాగెల్పునట్టి వాదన్ని గెల్చు
దీని తెలియుము లొంగకు దేనికింక ।
ఎత్తిపాడుము కంఠము ఎత్తిపాడు
యతివరా! ధీర! ఓమ్ తత్సదనుచు పాడు ॥

అవని జల్లిన దెద్దియో అదియె పండు
కారణంబునుబట్టియే కార్యముండు !
చెడ్డచెడ్డకు మంచి మంచికిని గల్గు
దీని తప్పించుకొనుటకు తెరవు లేదు ।
రూపుతో బంధనంబుండు రూఢముగను ।
అన్నిటిని మీరియున్నది యాత్మ గాన ।
ఆత్మకును రూపనామధేయములు లేవు ।
అదియె నీవనుభావంబు మది నెరింగి ।
ఎత్తిపాడుము కంఠము ఎత్తిపాడు ।
యతివరా! ధీర! ఓం తత్సదనుచు పాడు ॥

'భారతరత్నాకరం' ఒక విజ్ఞాన భాండాగారం

- ఆచార్య హెచ్.ఎస్. బ్రహ్మానంద
తిరుపతి.

పూజ్యగురువులు శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాముల వారి రచనల్లో 'భారత రత్నాకరం' ఒకటి. వారు 'భగవద్గీతా' ప్రచారకులుగా జగద్విఖ్యాతి నందినవారు. 'గీతామకరంద' మనే వారి వ్యాఖ్యను చదివితే ఒకవిశిష్ట దర్శనంకనిపిస్తుంది. అంత మహావేదాంత విషయాన్ని కూడా అతి సులభంగా అన్ని వర్గాలవారికీ అర్థమయ్యేలా చెప్పటం వారికి ఒక్కరికే సాధ్యమయింది. వారు దానికోసమే పుట్టారని వారిజీవితంలో జరిగిన సంఘటనలు చెబుతాయి.

'భగవద్గీత' భీష్మపర్వంలో ఒకభాగం. కాని గీతను బాగా ప్రవచించాలంటే మొత్తం భారతం మీద, ఇతర పురాణాల మీద చక్కటి అవగాహన ఉండాలి. అందుకే వారి గ్రంథాలను పరిశీలిస్తే ఎంతో అధ్యయనం చేసిన వారని తెలుస్తుంది. ధర్మప్రచారం చేసేవారికి అధీతి- బోధ- అధ్యయనాలు బాగా ఉండాలి. ఆ తరువాతనే ప్రచారార్హత. శ్రీస్వామివారికి గురువుగారి సంపూర్ణ అనుగ్రహంవల్ల ఆ మూడు సిద్ధించాయి. యోగవాశిష్ఠ రత్నాకం. రామాయణ రత్నాకరం అనే గ్రంథాలను వారు రచించిఉన్నారు. అనేక విషయాలమీద వారు వ్రాసినా ఒక అంతస్సూత్రం కనిపిస్తుంది. అదే 'సనాతన వైదిక ధర్మ' ప్రబోధం. మహాభారతంలో వ్యాసమహర్షి సకల వేదాల సారాన్ని, అదనంగా ఉపనిషత్తుల తత్త్వాన్ని నిబంధించి శివకేశవ తత్త్వ స్వరూపంగా ఒక పరతత్త్వ సమన్వయాన్ని సాధించిఉన్నారు. ఇంతకన్నా బోధించదగ్గ విశేషం ఏ గ్రంథంలోను లేదు. ఎక్కడాలేదు. అందుకే వ్యాసమహర్షి ఇలా అని ఉన్నారు.

ధర్మేచార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ ।
యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్క్వచిత్ ॥

(చూ. పు. 714)

(ధర్మ, అర్థ, కామ, మోక్ష సంబంధముగా ఏ విషయములు ఈ గ్రంథమునందు(భారతము నందు) తెలుపబడినవో అవియే ఇతరత్ర కూడా చెప్పబడినవి. దీని యందు లేని విషయములు మరెచటను లేవు)

భారతంలో లక్ష శ్లోకాలున్నాయి. ఇన్ని శ్లోకాలలో ఎన్ని వేల సూక్తులను ధర్మసూక్ష్మాలను, వ్యాసుడు నిబంధించి ఉన్నాడో సాధారణ ప్రతిభావంతుడు ఎవడూ చెప్పలేరు. విద్యాప్రకాశానందస్వామివారి 'భారతరత్నాకరము' వల్లనే దాదాపు 717 పుటల గ్రంథంలో ప్రతి పర్వంలోనూ వ్యాసమహర్షి నిక్షిప్తంచేసిన సుభాషిత రత్నాలను బయటికి తీసి వారు చూపించ గలిగారు. ఇది చాలా లోతైన పరిశోధనవల్లే సాధ్యం. నాకు తెలిసినంతవరకు ఇలాంటి గ్రంథం ఇతర భాషలలో కూడా లేదు. దీన్ని ఇతర భాషలలోకి అనువదించడం కూడా అవసరం. పౌరాణికులు గాని హరికథకులు కాని మొత్తం భారతంలో ఏఏ రహస్యాలు, బోధలు, సూక్తులు ఉన్నాయో తెలుసుకోవాలంటే ఈ గ్రంథం చదివితే చాలు.

వ్యాసమహర్షే ఇది సుభాషితాలకు రత్నాకరం

(సముద్రంలాంటిది) అన్న విషయాన్ని స్పష్టం చేసి ఉన్నారు. మహాభారత మాహాత్మ్యం చెప్పే శ్లోకాలలో ఈ విషయం ఉంది.

యథా సముద్రోభగవాన్ - యథా హి హిమవాన్ గిరిః ।
ఖ్యాతావుభౌ రత్ననిధీ తథా భారత ముచ్యతే ॥ (పు. 716)

(ఐశ్వర్య పూర్ణమగు సముద్రము, హిమాలయపర్వతము రత్నములకు నిధులని ఎట్లు చెప్పబడెనో, అట్లే ఈ భారతమున్ను రత్నస్వరూపములుగు ఉపదేశముల యొక్కయు, కథల యొక్కయు భాండారమని చెప్పబడినది)

శ్రీస్వాములవారు ఒక పర్వంనుండి గ్రహించిన ప్రధానాంశాలను చిన్న వ్యాసంలో పరిచయం చేస్తాను.

మహాభారతం 'జయ' మనే పేరుగల్గింది. ధర్మవిజయమే ఇందలి ప్రధానం. ధర్మ రక్షకుడైన సనాతనుడైన శ్రీ కృష్ణుని కీర్తనమే ఈ ఇతిహాసంలో ప్రధానమని కూడా వ్యాసులవారు చెప్పి ఉన్నారు.

యత్ర విష్ణుకథాదివ్యాః శృతయశ్చసనాతనాః ।
తచ్ఛ్రోతవ్యం మనుష్యేణ పరంపదమిహేచ్ఛతా ॥
(చూ. పు. 210)

(విష్ణువు యొక్క దివ్య కథలు, సనాతనములైన శ్రుతులు ఉన్నట్టి ఈ భారతమును పరమాత్మ పదమును ఇచ్ఛ గించు మనుజుడు అవశ్యము పఠించవలెను)

ఈ అంశాన్ని వివరిస్తూ ఉపోద్ఘాతంలో (పు. 215) శ్రీ స్వాములవారు ఇలా రాస్తున్నారు.

"మనుజుని శ్రేయస్సునకు శ్రద్ధయే ప్రధాన హేతువై యున్నది. భగవంతుని యెడల, శాస్త్రముల యెడల, మహాత్ముల యెడల, మాతా పితరుల యెడల, గురువుల యెడల, భక్తి కలిగియుండుట, వారి వాక్యములందు, ఆత్మయొక్క అస్తిత్వమందు విశ్వాసము కలిగి యుండుట -శ్రద్ధయనబడును. దీనిని గురించి మహాభారతమునందు అనేక ఉదాహరణలు లభించుచున్నవి...."

అంటూ శ్రీకృష్ణుడి పాత్రలో తమ వ్యాఖ్యానాన్ని ప్రారంభించారు. ఇలా చేయటానికి కారణం ఉంది. వ్యాసమహర్షి ఆదిపర్వంలోనే

'భగవాన్ వాసుదేవశ్చ కీర్త్యతేఽత్ర సనాతనః ।
స సత్య మమృతం చైవ పవిత్రం పుణ్యమేవ చ' ॥
అన్నారు (పు.237)

(ఈగ్రంథము యొక్క ముఖ్యవిషయము స్వయముగ సనాతన పరబ్రహ్మ స్వరూపుడైన వాసుదేవుడను శ్రీకృష్ణ భగవానుడు. దీని యందు వారిని గురించిన సంకీర్తనయే గావింపబడినది. వారు సత్య స్వరూపులు, పవిత్రులు, పుణ్య స్వరూపులు)

అందుచేతనే శ్రీకృష్ణుడి పాత్రను పరిచయం చేసి ఇతర ప్రధాన పాత్రలను గురించి సంక్షేపంగా వివరించి ఏఏ పర్వంలో కథ ఏమిటో అతిస్థూలంలో నాలుగు మాటల్లో చెబుతూ సుభాషితాల్ని అతి మనోహరంగా వివరించారు. ఇదే వీరి 'భారత రత్నాకర' గ్రంథస్వరూపం.

1. **ఆదిపర్వం**

ఆదిపర్వంలో కురుపాండవ కుమారుల జన్మ ప్రధానగాథ. దీనికి నేపథ్యంగా దుష్యంతుని కథ, యయాతి కథ మొదలైనవి చెప్పబడ్డాయి. ద్రౌపదీ స్వయంవరం, ధర్మరాజు యువరాజు కావటం. ఇంద్రప్రస్థ నగరం నిర్మించుకొనుట, ఖాండవదహనం కథ వ్యాపించి ఉంది.



ఇంత పెద్ద పర్వంలో స్వామివారు గ్రహించిన సుభాషితాలు చాలా ఉన్నాయి. ప్రధానమైనవి చూద్దాం.

1. **శమీకుడు 'శృంగి' కి బోధించిన 'ధర్మ' స్వరూపం**

పరీక్షిత్తు చనిపోయిన పాముని శమీకుడి మెడలో వేసివెళ్ళిపోయిన తర్వాత తన కుమారుడు శృంగి తండ్రికి జరిగిన అవమానానికి ప్రతీకారంగా వారం రోజులు తరువాత తక్షకుని చేత కఱవబడి పరీక్షిత్తు మరణించు గాక! అని శాపం పెట్టాడు. అప్పుడు శమీకుడు పరీక్షిత్తు చేసిన అధర్మమే అతడిని శిక్షిస్తుంది. నీవు కోపగించుకోవడం సముచితంకాదు. కోపం చాలా చెడ్డది. ఇంద్రియనిగ్రహం (శమం) వల్లనే సిద్ధికలుగుతుంది అంటూ

శమ ఏవ యతీనాం హి క్షమిణాః సిద్ధికారకః ।
క్షమావతామయంలోకః పరశ్చైవ క్షమావతామ్ ॥
(పు. 241)

(క్షమాశీలురగు సాధకులకు శమము (ఇంద్రియ నిగ్రహము) సిద్ధిని కలుగజేయును. ఎవని యందు క్షమ (ఓర్పు) గలదో, అట్టివారికే ఇహలోకము, పరలోకము శ్రేయస్సును కలుగ జేయునవై యుండును)

అందుచేత ఇంద్రియాలను వశ మొనర్చుకో. జయం పొందుతావు - అని బోధించాడు. ఈ బోధలోనే మహా భారత కథా సారాంశమంతా ఇమిడి ఉంది. స్వర్గారోహణంలో ధర్మరాజు పొందిన విజయమిదే. క్షమ వల్ల ఏర్పడే సమత్వ భావననే భారతం 'సారధర్మం' గా చెప్పింది.

2. శకుంతల తనకు తెలీదన్నాడు దుష్యంతుడు. నీవు బయటికి తెలియదన్న సత్యాన్ని గమనిస్తున్న శక్తులు చాలా ఉన్నాయని ఆశ్రమవాసిని శకుంతల గొప్ప ధర్మాలను బోధించి 'సత్యాన్ని' అంగీకరించవయ్యా! అని ప్రబోధిస్తుంది.

మన్యతే పాపకం కృత్వా న కశ్చిద్వేత్తి మామితి ।
విదంతి చైనం దేవాశ్చ యశ్చైవాంతర పూరుషః ॥
(పు.246)

(అసత్యము నుండి దూరముగా నుండు సాధు మహాత్ముల దృష్టియందు ధర్మమే హితకరమైనది. ధర్మ మెపుడును దుఃఖకారకము కానేరదు, మనుజుడు పాపము చేయుచు నన్నెవరును తెలిసికొనుటలేదు - అని తలచును. అది చాల పొరపాటు, ఏలయనగా దేవత లందరును, మరియు అంతర్యామి యగు పరమాత్మ మనుజుడు చేయు పాపమును, పుణ్యమును చూచు ఎఱుగుచున్నాడు.)

శకుంతల ఆశ్రమవాసిని కాబట్టి సత్యాన్ని కాస్త మోటుగానే చెబుతుంది. మూర్ఖుడు చెడునే గ్రహిస్తాడు పంది అమేధ్యాన్ని గ్రహించినట్టు. వివేకవంతుడు మంచినే గ్రహిస్తాడు హంస పాలు నీళ్ళు కలిపిన మిశ్రమం నుండి పాలునేగ్రహించి నట్లు అనిచెబుతూ

నాస్తి సత్యసమో ధర్మో న సత్యాద్ విద్యతే పరమ్ ।
న హి తీవ్రతరం పాపమ్ అనృతాదిహ విద్యతే ॥
(పు. 248)

అని స్పష్టంగాప్రకటించింది (సత్యమునకు సమాన మైన ధర్మము మరియొకటిలేదు. సత్యము కంటె పరమైన ఏదియునులేదు. అసత్యమునకు మించిన పాపము మరియొకటి ఈ ప్రపంచమున లేదు.)

3. యయాతి కుమారుని నుండి యౌవనాన్ని గ్రహించి చివరికి జ్ఞానోదయం కలిగి ఇలా చాటాడు. ఎంతో సంపాదించినా, అనుభవించినా మనిషికి తృప్తి కల్గదు. కాని

'చాలు' అని ఏదో ఒక సమయంలో అనుకొని 'శాంతిని' పొందాలి. భోగేచ్ఛను తొలగించుకోవాలి. లేకపోతే మనిషి పాపాన్ని మూటగట్టుకొంటాడు. కర్మణా, మనసా, వాచా ఎవరు పాపం చేయకుండా ఉంటాడో వాడే పరతత్త్వాన్ని అందుకోగలడు అంటూ.

యదాచాయం న బిభేతి యదాచాస్మాన్నబిభ్యతి ।
యదానేచ్ఛతి నద్వేష్టి బ్రహ్మ సంపద్యతే తదా ॥
(పు. 249)

(ఎపుడు మనుజుడు దేనిని గూర్చి భయపడ కుండునో, ప్రపంచములో ఏ ప్రాణియు అతనిని గూర్చి భయమును పొందకుండునో, ఎపుడాతడు దేనిని వాంఛింపకుండునో, దేనిని ద్వేషింపకుండునో అపుడాతడు పరబ్రహ్మమును పొందును)

4. శుక్రుడు 'దేవయాని' కి చేసిన నీతిబోధ చాలా ఉన్నతమైనది ప్రపంచానికి శాంతి సందేశ మనదగ్గది.

యః పరేషాం నరో నిత్యమతివాదాం స్తితిక్షతే ।
దేవయాని విజానీహి తేన సర్వమిదం జితమ్ ॥
(పు. 250)

(ఎవడు ఇతరుల కఠోర వచనములను సహించు కొనునో, అతడు ఈ జగత్తు అంతటిపై విజయమును పొందినట్టే అని తలంచుము)

5. శుక్రుడి కన్నా అతని శిష్యుడు, వృషపర్వుడు (రాక్షసరాజు) కుమార్తె శర్మిష్ఠకు చేసిన నీతిబోధ ఇంకా గొప్పది. భారతకర్త వేదవ్యాసమహర్షిని విశాలబుద్ధి గలవాడు అని ఇందుకే ప్రశంసిస్తారు. విశ్వమానవతత్త్వసందేశం ఇందులో ఉంది. ఇలాంటి వాటిని పట్టుకొని మనకు అందించిన శ్రీస్వామివారికి ఎంతో ఋణపడి ఉంటాము.

త్యజేదేకం కులస్యార్థే గ్రామస్యార్థే కులం త్యజేత్ ।
గ్రామం జనపదస్యార్థే ఆత్మార్థే పృథివీం త్యజేత్ ॥
(పు. 251)

(కులము యొక్క హితము కొఱకు ఒకని త్యజించవలెను. గ్రామహితము కొఱకు కులమును త్యజించవలెను. పట్టణము యొక్క హితము కొఱకు గ్రామమును త్యజించవలెను. ఆత్మయొక్క హితము కొఱకు ప్రపంచము నంతయు త్యజించవలెను.)

6. భీష్ముడు తన ప్రతిజ్ఞ (సత్యం) ను ఏనాడూ వీడమనని చెబుతూ సత్యం ఎంత గొప్పదో ఇలా అన్నాడు.

పరిత్యజేయం త్రైలోక్యం రాజ్యం దేవేషు వా పునః ।
యద్వాప్యధిక మేతాభ్యాం నతు సత్యం కథంచన ॥
(పు. 252)

(నేను మూడు లోకాలను, దేవతల సామ్రాజ్యమును (స్వర్గాన్నీ) ఈ రెండింటికి మించిన దానినైనను త్యాగము చేయగలను కాని సత్యమును మాత్రము ఎన్నడును త్యజింపజాలను)

7. ధర్మరాజు వ్యాసమహర్షితో తల్లికన్నా గురువులేదని ఇలా చెబుతాడు.

గురోర్హి వచనం ప్రాహుః ధర్మ్యం ధర్మజ్ఞ సత్తమ ।
గురూణాం చైవ సర్వేషాం మాతా పరమకో గురుః॥
(పు. 257)

(ధర్మజ్ఞోత్తముడైన మహర్షీ! గురువుల ఆజ్ఞ ధర్మసంగహితని చెప్పబడినది. మఱియు గురువు లందరిలోను పరమగురువుగా తల్లి యెంచబడినది) తల్లి అనుమతితోనే పంచపాండవులు ద్రౌపదిని వివాహం చేసుకున్నారు.

2. సభాపర్వం

సభాపర్వంలో మాయాద్యూతం, ద్రౌపదీమాన సంరక్షణం, పాండవులు రాజ్యం పోగొట్టుకోవడం, వనవాస ప్రారంభం ఇందులో ప్రధాన విషయాలు.

ఇక్కడ ప్రధానమైనది – దుర్యోధనుడు పెద్దలు ఎవరు చెప్పినా వినకపోయేటువంటి మనస్తత్త్వం. ధృతరాష్ట్రుడు ఇలా చెప్పాడు – 'నాయనా!' ఆపదల్లో దుఃఖపడరాదు, సదా ప్రయత్నశీలుడుగా ఉండాలి, "ప్రమత్తత ఉండరాదు", హృదయంలో వినయమనే సద్గుణం ఉండాలి, అలాంటి చతురుడైన మానవుడు ఎప్పుడూ శుభాన్నే పొందుతాడు'– ఈ మాటలువిని దుర్యోధనుడు ఇలా అన్నాడు.

యస్యనాస్తి నిజా ప్రజ్ఞా కేవలంతు బహుశ్రుతః ।
న స జానాతి శాస్త్రార్థం దర్వీ సూపరసానివ ॥
(పు. 262)

(ఎవనికి స్వతః ప్రజ్ఞలేదో అట్టివాడు అనేక శాస్త్రాలను శ్రవణము చేసినను, గరిటె పాకరసమును తెలిసికొనజాలనట్లు శాస్త్రార్థము నెఱుగకుండును)

పెద్దలైన భీష్ముడు, విదురుడు మొదలైనవారి మాటల్ని నాకు మళ్ళీ చెప్పకండి. నా తెలివితో నేను ప్రవర్తిస్తాను. మీకు అది ఎలాగూలేదు. అని నిరూపించాడు. దానికి తండ్రిని ఒప్పించాడు. తండ్రి అంగీకరించాడు. తరువాత కథ అందరికీ తెలిసిందే. అతని మీద తండ్రికి ఉన్న 'మమత' ఇన్నిటికీ మూలమైంది. అందుకే సంయోధములో అలా తయారయ్యారు.

విదురుడు అన్నాడు "నాయనా! ఈ ప్రపంచంలో మంచి చెప్పేవాడు దొరకడు, దొరికినా ఎవరూ వినరు" అంటూ ఇలా చెప్పారు.

లభ్యతేఖలు పాపీయాన్ నరోఽనుప్రియవాగిహ ।
అప్రియస్యహి పథ్యస్య వక్తా శ్రోతాచ దుర్లభః ॥
(పు. 262)

(ఈ ప్రపంచమున సదా ప్రియముగా పలుకునట్టి మహాపాపిఅయినను లభించ వచ్చుగాని, హితకరమైనను అప్రియవచనములను చెప్పువాడు, వినువాడు మహా దుర్లభుడై ఉండును.) ద్రౌపదీ మానసంరక్షణం జరిగింది. భీముడు అప్పుడు శపథము చేయగా ధృతరాష్ట్రుడు ధర్మరాజును బుజ్జగిస్తూ ఇలా చెబుతాడు. ధృతరాష్ట్రునికి మంచి చెడు తెలుసు. కాని మంచిని చేయదు, పాపాన్నే చేస్తాడు చేయిస్తాడు.

స్మరన్తి సుకృతాన్యేవ న వైరాణి కృతాన్యపి ।
సన్తః పరార్థం కుర్వాణా నావేక్షంతే ప్రతిక్రియామ్॥
(పు. 265)

(మహాత్ములు ఇతరుల ఉపకారాలనే జ్ఞప్తి యందుంచుకొందురు, కాని వారి వైరమును కాదు. వారు ఇతరులకు మేలు చేయుదురే కాని, వారికి ప్రతీకార మొనర్చరు.)

3. వనపర్వం

పాండవులు అడవిలోకి ప్రవేశిస్తున్న సమయంలో వెంటవచ్చిన పౌరులు కూడా ధర్మబోధ చేసారు. అవి కూడా పాండవులలో 'క్షమను' పెంచాయి. చివరికి శ్రీకృష్ణుడు వారికి ఇలా నీతిని బోధించాడు.

స్త్రీయోఽక్షా మృగయా పానమేతత్ కామసముత్థితమ్ ।
దుఃఖం చతుష్టయం ప్రోక్తం యైర్వరోభ్రశ్యతే శ్రియః ॥
(పు. 275)

(స్త్రీల యెడల ఆసక్తి కలిగియుండుట, జూద మాడుట, వేటాడుట, మద్యపానము చేయుట – అను ఈ

నాలుగు విధములైన భోగములు కామజనితములగు దుఃఖములని చెప్పబడినవి. వాని వలన మనజుడు తన ధనమును, ఐశ్వర్యమును కోల్పోవుచున్నాడు.

ధర్మరాజు ద్రౌపదితో 'క్షమ ధర్మము, క్షమ యజ్ఞము, క్షమ వేదము, క్షమ శాస్త్రము–ఈవిధమున తెలిసి కొనువానికి అంతయు క్షమాయోగ్యమై యుండగలదు." అందుకే పాండవులు తరువాత కథలో ఎక్కడా కౌరవులకు కాని, కౌరవ పత్నులకుగాని 'దుర్మార్గం' తలపెట్ట లేదు. వారు అపాయంలో ఉన్నపుడు కాపాడారు కూడా (ఇదే ధర్మనిర్వహణలో పరమోత్తమ విధానమని భారతం ప్రకటించింది. ఆత్మనః ప్రతికూలాన్ని పరేషాం న సమాచరేత్)

ఎందుకు మనం ఇతరుల్ని క్షమించాలి? అంటే ఎవరు ఎలా ప్రవర్తిస్తారో, మనం ఎలా ప్రవర్తిస్తామో ఒక భగవంతునికి తప్ప మరెవరికీ తెలీదు. అతనిపై సర్వకార్యాల భారాన్ని వేసి అసూయాద్వేషాలు లేకుండా జీవించాలి. ఇది ధర్మరాజు మతం. నలుని కథలో ఋతుపర్ణ మహారాజు 'బాహుకుడి' వేషంతో ఉన్ననలునితో ఇలా అంటారు.

సర్వః సర్వం న జానాతి సర్వజ్ఞో నాస్తి కశ్చన ।
నైకత్ర పరినిష్ఠాస్తి జ్ఞానస్య పురుషే క్వచిత్ ॥
(పు. 278)

(జనులందరు అన్నింటిని ఎరుగరు. ప్రపంచములో భగవంతుడు తప్ప సర్వజ్ఞుడు ఎవడును లేడు. మరియు ఒక్కని యందే సమస్త జ్ఞానము ఉండదు.)

అరణ్య పర్వమంతా ఎంతోమంది మహర్షులు బోధించిన ఎన్నో నీతులతో, ధర్మాలతో కూడి ఉంది. అన్నిటి సారాంశమూ ఒకటే. జ్ఞానం సంపాందించాలి. అది భగవంతుని దర్శించడానికి పనికి రావాలి. అలాంటి జ్ఞానమే బ్రాహ్మణ్యం. అది లేనివాడు బ్రాహ్మణుడు కాదు.

చతుర్వేదోఽపి దుర్వృత్తః సశూద్రాదతిరిచ్యతే ।
యోఽగ్ని హోత్రపరోదాంతః స బ్రాహ్మణ ఇతి స్మృతః ॥
(పు. 328)

(నాలుగు వేదములు చదివినప్పటికిని దురాచారియై యుండువాడు శూద్రుని కంటెను అధముడు. అగ్నిహోత్రమందు తత్పరుడు, జితేంద్రియుడు బ్రాహ్మణుడని చెప్పబడును)

ఇంకో ఆశ్చర్యమైన విషయాన్ని వ్యాసుడు చెప్పాడు. మృత్యువు తప్పకుండా వస్తుందని గుర్తించడమే జ్ఞాన సాధనకు మూలమవుతుంది. కాని లోకం చిత్రమైంది.

అహన్యహని భూతాని గచ్ఛంతీహ యమాలయమ్ ।
శేషాః స్థావర మిచ్ఛంతి కి మాశ్చర్య మతః పరమ్ ॥
(పు. 328)

(ప్రపంచమున ప్రతిరోజూ ప్రాణులు యమలోకమునకు ఏగుచున్నారు, కాని తక్కిన వారు మేము మాత్రము ఎచటికి వెళ్ళము, మేము స్థిరముగా ఇచటనే యుందుము–అని తలంచుట ఏది కలదో అంతకు మించిన ఆశ్చర్యమైనది ఏమిగలదు?)

యక్షుడు వరం కోరుకొమ్మన్నాడు. ధర్మరాజు ఇలా అడిగాడు. మనుష్యులందరూ కోరదగినవి.)

జయేఽయం లోభమోహౌ చ క్రోధంచాహం సదా విభో ।
దానో తపసి సత్యేచ మనో మే సతతం భవేత్ ॥ (పు. 331)

(ప్రభూ! నేను లోభము, మోహము, క్రోధము వీనిని జయించగల్గులాగునను, దానము, తపస్సు, సత్యము వీని యందు నామనస్సు సదా తత్పరమై యుండులాగునను వరమొసంగుడు)

ఈ వరాలు కోరినవాడు కాబట్టి ధర్మరాజు ఇంద్రియజయం పొంది, నిర్మోహంతో స్వర్గప్రాప్తిని పొందగలినాడు. ఇదే మానవాళికి భారత సందేశం.

4. విరాటపర్వం

ఇందులో స్వామివారు ఒక సుభాషితాన్ని గుర్తించారు. కృపాచార్యుడు కర్ణుడితో ఇలా అంటాడు.

ఆత్మానం కః సముద్బుధ్య కంఠే బద్ధ్వా మహాశిలామ్ ।
సముద్రం తరతే దోర్భ్యాం తత్పకిం నామ పౌరుషమ్ ॥
(పు. 333)

(తన్నుతాను బంధనము నందుంచుకొని కంఠము నందు పెద్దరాతిని వ్రేలాడ గట్టుకొని, రెండు చేతులతో ఈదుచు ఎవడైన సముద్రమును దాటగలడా? దాని యందేమైన పురుషార్థముగలదా? (నీవు పాండవులతో ద్వారా ఇలాంటిదే అని అర్థం)

4. ఉద్యోగ పర్వం

మనుష్యుడు ఎలా ప్రయత్నిస్తే విజయాన్ని, మనశ్శాంతిని, పరోపకారాన్ని సాధించగలరో ఈ పర్వం చెబుతుంది. అదే శ్రీకృష్ణుని రాయబార రహస్యం.

విదురుడు 'సభ' ఎలా ఉండాలో చెబుతారు. ఇది చాలా గొప్పగా ఉంది.

న సా సభా యత్రన సన్తివృద్ధాః
న తే వృద్ధా న వదంతి ధర్మమ్ ।
నాసౌ ధర్మో యత్ర న సత్యమస్తి
న తత్ సత్యం యచ్ఛలేనాభ్యుపేతమ్ ॥ (పు. 345)

(పెద్దలు లేనిది సభకాదు. ధర్మమును గూర్చి చెప్పనివారు పెద్దలు కారు. సత్యము లేనిది ధర్మము కాదు. కపటముతో నిండినది సత్యము కాదు)

కృష్ణుడు ఏ పక్షంలో ఉంటాడో కూడా ఇలా చెప్పాడు ।
యతః సత్యం యతో ధర్మో యతో హ్రీరార్జవం యతః ।
తతోభవతి గోవిందో యతః కృష్ణస్తతో జయః ॥ (పు. 382)

(ఏవైపు సత్యము, ధర్మము, లజ్జ, సరళత్వము ఉండునో ఆ వైపే శ్రీకృష్ణుడుండను. ఎచట శ్రీకృష్ణ డుండునో అచట విజయ ముండును)

6. భీష్మపర్వం

మహాభారతం 'హింసను' ప్రోత్సహిస్తున్నదని చాలా మంది ఆధునికులు భావిస్తారు. ఇది చాలా తప్పు. వ్యాసమహర్షి ధృతరాష్ట్రునితో ఇలా చెప్పాడు.

ఉపాయ విజయం శ్రేష్ఠ మహుర్భేదేన మధ్యమమ్ ।
జఘన్యఏష విజయో యోయుద్ధేన నిశాంపతే ॥
(పు. 395)

(సామ దానములను ఉపాయములచే యుద్ధమందు విజయమును పొందుట శ్రేష్ఠమనియు, భేదోపాయముచే విజయమును పొందుట మధ్యమమనియు, యుద్ధముచేసి జనసంహార మొనర్చి, శత్రువును ఓడించి, విజయమును పొందుట అధమ శ్రేణికి చెందినదనియు చెప్పబడినది)

హర్షం, ఉత్సాహం, కర్మఫలంపై, ఆసక్తిలేక, విజయప్రాప్తి కోసం దృఢనిశ్చయమున్న శౌర్య సంపన్నులు 50 మంది సైనికులు చాలు, ఎంత పెద్ద సైన్యాన్ని అయినా మట్టుపెట్టగలరు. పాదమును వెనుకకు మరల్చని 5,6 7మంది సైనికులున్నా వారు నిజంగా విజయం పొందగలరు (కౌరవ, పాండుబలాల మధ్యతేడా ఇదే, చూ.పు. 395)

స్వాములవారు భగవద్గీతలోని అతి ప్రధానమైన

దాదాపు 130 శ్లోకాలను ఏరి వివరించారు. (చూ.పు 398.428)

చివర శల్యుడు ధర్మరాజుతో చెప్పిన ఒక 'అర్థ నీతి' ఉంది దాన్ని మాత్రంచూద్దాం.

అర్థస్య పురుషో దాసో దాస స్త్వర్థో న కస్యచిత్ ।
ఇతి సత్యం మహారాజన్ బద్ధోఽస్మ్యర్థేన కౌరవైః ॥
(పు.430)

(మనుజుడు అర్థమునకు దాసుడు, కాని అర్థము దేనియొక్కయు దాసి కాదు. ఇది సత్యమైన వాక్యము. కౌరవులచే నేను అర్థముచే బంధింపబడి ఉన్నాను.)

'అర్థలోభం' చేతనే కౌరవ పక్షంలో 11 వేల అక్షౌహిణుల సైన్యం బంధింపబడిందని దీని అర్థం.

7. **ద్రోణ పర్వం**

శ్రీకృష్ణుడు శంకరుని భక్తుడన్న విషయం ఇందులో చెప్పబడింది. (భీష్మపర్వంలోనూ ఉంది) అశ్వత్థామతో వ్యాసముని ఇలా అంటాడు.

స ఏష రుద్రభక్తశ్చ కేశవోరుద్ర సమ్భవః ।
కృష్ణ ఏవహి యష్టవ్యో యజ్ఞైశ్చైవ సనాతనః ॥
(పు. 436)

(శ్రీకృష్ణుడు శంకరుని భక్తుడు. శంకరుని నుంచియే వారుప్రకటమైరి. కావున యజ్ఞముల ద్వారా సనాతన పురుషుడుగు శ్రీకృష్ణునే ఆరాధించవలెను)

శివకేశవుల అద్వైతాన్ని ఈ సందర్భం నిర్వచిస్తున్నది.

8. **కర్ణపర్వం**

శల్యుడు కర్ణునికి చాలా నీతులు బోధిస్తాడు పైకి నిరుత్సాహ పరిచినట్లున్నా వెనుక ఎంతో రాజనీతి ఉంది. 'హింసను' ప్రోత్సహించేది, సమర్థించేది ధర్మం కాదంటూ శల్యుడు ఇలా అంటాడు.

'యత్ స్యాదహింసా సంయుక్తం సధర్మ ఇతి నిశ్చయః ।
అహింసార్థాయ హింస్రాణాం ధర్మ ప్రవచనం కృతమ్ ॥
(పు. 439)

(ఏ కార్యమందు హింస ఉండదో అదియే ధర్మము. ఇది సిద్ధాంతము. మహర్షులు హింస కలుగకుండ ఉండుటకే ఉత్తమ ధర్మమును ప్రవచించిరి.)

9. **శల్యపర్వం**

సంధి చేసుకోమని దుర్యోధనుడికి కృపాచార్యుడు చెప్పగా దుర్యోధనుడిలా అంటాడు.

న ధ్రువం సుఖమస్తీతి కుతో రాష్ట్రం కుతోయశః
(పు. 440)

(ప్రపంచమున ఏ సుఖమున్ను ఎల్లప్పుడు ఉండదు. ఇక రాష్ట్రము కీర్తి స్థిరముగ నెట్లుండగలవు ?)

ఇంత తెలిసినా యుద్ధానికే సిద్ధపడటం ధుర్యోధనుని మూర్ఖత్వానికి సంకేతం. అర్థచింత అనర్థ హేతువని దీని అర్థం.

10. **సౌప్తిక పర్వం**

కృపాచార్యుడు అశ్వత్థామకు మానవ జీవితంలోని 'కర్మ' రహస్యాన్ని ఈ విధంగా బోధించాడు. ఇంతకంటె తెలుసుకోదగ్గ గుహ్యమైన నీతి ఏదీ లేదు.

అబద్ధా మానుషాః సర్వే నిబద్ధాః కర్మణోర్ద్వయోః ।
దైవే పురుషకారేచ పరం తాభ్యాం నవిద్యతే ॥
(పు. 443)

(మనుజులందరు ప్రారబ్ధము (దైవేచ్ఛ), పురుష ప్రయత్నము (పురుషకారం) అనే రెండు విధములైన కర్మల చేత బంధింపబడియున్నారు. ఈ రెండు తప్ప మరేవియును లేవు)

కౌరవులు, పాండవులు ఎవరెవరు ఎందుకు ఎలా ప్రవర్తించారో ఈశ్లోకం అనుసంధానం చేస్తే తెలిసిపోతుంది.

11. **స్త్రీ పర్వం**

దుర్యోధనాది కౌరవ వీరులు యుద్ధంలో మరణించారని విని శోకిస్తున్న ధృతరాష్ట్రుడిని ఓదారుస్తూ సంజయుడు ఒక 'చురక' లాంటి నీతిని బోధించాడు.

ఆదావేవ మనుష్యేణ వర్తితవ్యం యథాక్రమమ్ ।
యథా నాతీతమర్థం వై పశ్చాత్తాపేన యుజ్యతే ॥
(పు. 446)

(దేనిని గురించి ముమ్ముందు పశ్చాత్తాప పడవలసిన అవసరము లేకుండునో ఆ విధముగ మనుజుడు మొదటనే యథా యోగ్యమున ప్రవర్తించవలెను)

ధృతరాష్ట్రుడు దుర్యోధనాదుల్ని 'మొక్కలుగా' ఉన్నపుడే వంచిఉంటే ఈ యుద్ధం, జననాశనం, దుఃఖం ఇవన్నీ ఉండేవి కావుగా!

అంతా 'కాల' ప్రభావం. కాలానికి ప్రియాప్రియాలు లేవు (పు. 448) శోకాన్ని, భయాన్ని పుట్టించే వేలకొలది స్థానాలు తమ ప్రభావాన్ని మూఢునిపై చూపుతాయి తప్ప పండితునిపై కాదు. (పు.448)

12 **శాంతి పర్వం**

ఈ పర్వం నిండా ధర్మసూక్ష్మాల విచారణ ఉంది. పాండవులకు అంతశ్శత్రుజయాన్ని గురించిన బోధ ఇక్కడి నుంచే ప్రారంభమవుతుంది. స్వాముల వారు 678 సూక్తులను ఈ పర్వంనుండి గ్రహించారు. అన్నీ ఆచరణీయములే.

సహదేవుడు ధర్మరాజుతో ఇలా అంటాడు.

'ద్వ్యక్షరస్తు భవేన్మృత్యుః త్ర్యక్షరం బ్రహ్మశాశ్వతమ్ ।
మమేతిచ భవేన్మృత్యుః న మమేతి చ శాశ్వతమ్ ॥(పు. 458)

(రెండక్షరముల పదమగు 'మమ' (ఇది నాది) అనునది మృత్యువు. మూడక్షరముల పదము 'న మమ' (ఇది నాదికాదు) అనునదియే అమృతము, సనాతన బ్రహ్మము. (మోక్షము)

13. **అనుశాసన పర్వం**

ధర్మసాధన సదాచారం వల్లనే సాధ్యం. ఇదీ ఈ పర్వంలో భీష్మాదులు చేసిన బోధ (విష్ణుసహస్రనామం ఈ పర్వంలోనిదే)

ఆచారాల్లభతే హ్యాయుః ఆచారాల్లభతే శ్రియమ్ ।
ఆచారాత్ కీర్తి మాప్నోతి పురుషః ప్రేత్య చేహచ ॥
(పు. 659)

(సదాచారము వలననే మనుజునకు ఆయుస్సు లభించును. సదాచారము వలననే అతడు సంపదను బడయును. సదాచారము వలననే అతనికి ఇహపరము లందు కీర్తి లభించును)

14. **ఆశ్వమేధిక పర్వం**

ఇందు ఆత్మదర్శనానికి సంబంధించిన ఒక రహస్యం ప్రధానంగా చెప్పబడింది.

ఇషీకాం చ యథా ముంజాత్ కశ్చినిష్కృష్య దర్శయేత్ ।
యోగీ నిష్కృష్య చాత్మానం తథా పశ్యతి దేహతః ॥
(పు. 688)

(ముంజగడ్డి నుండి దర్భను వేరు చేసి చూచునట్లు, యోగి ఆత్మను ఈదేహము నుండి వేరు చేసి చూచుచున్నాడు)

15. **ఆశ్రమవాసిక పర్వం**

ధృతరాష్ట్రుడు, గాంధారీ, కుంతీదేవి విదురునితో కలసి ఆశ్రమవాసానికి వెళ్ళి పోతారు. అరణ్యంలో వ్యాసముని ధృతరాష్ట్రునికి మరలా నీతిని బోధిస్తాడు.

ఏతద్ధి త్రితయం శ్రేష్ఠం సర్వభూతేషు భారత ।
నిర్వైరంచి మహారాజన్ సత్యమక్రోధ ఏవచ ॥
(పు. 708)

(ఎవనితోనూ వైరము లేకుండుట, సత్యము పలుకుట, క్రోధమును సర్వదా వదలివేయుట అను ఈ మూడు సుగుణములు అన్ని ప్రాణులందును శ్రేష్ఠములుగ తలచబడినవి)

16. **మౌసల పర్వం**

ఇందులో ఒకే సూక్తిని స్వాములవారు గ్రహించారు. దీనిని మౌసలపర్వం భారత సర్వస్వం లోని 'నీతి'గా మనం భావించవచ్చు. దీనిని వ్యాసుడు ఇలా చెప్పాడు.

ఏవం బుద్ధిశ్చ తేజశ్చ ప్రతిపత్తిశ్చ భారత ।
భవన్తి భవకాలేషు విపద్యన్తే విపర్యయే ॥ (పు. 710)

(జ్ఞానోద్భవ సమయ మేతెంచినపుడు మనుజుని బుద్ధి, తేజస్సు, జ్ఞానము వికాసమును పొందును. తద్విపరీత సమయమేతెంచినపుడు ఇవి అన్నియు నశించిపోవును)

పాండవుల వికాసానికి మూలమైన శ్రీకృష్ణుడే ఆ జ్ఞానం.

17. **మహాప్రస్థానిక పర్వం**

ఇందులో ధర్మరాజు భీముడికి చెప్పిన ఒక మాట చాలు. మనం జన్మంతా గుర్తుంచుకో దగ్గది

యస్య యద్విహితం వీర సో౽వశ్యం తదుపాశ్నుతే
(పు. 711)

(ఎవరు ఏది చేసికొనునో వాడు దానిఫలమును తప్పక అనుభవించును)

18. స్వర్గారోహణ పర్వం

ఈపర్వంలో వ్యాసమహర్షి ఒక గొప్ప విషయాన్ని ప్రస్తావించారు.

'ఊర్ధ్వ బాహుర్విరౌమ్యేష నచ కశ్చిత్ శృణోతి మే
ధర్మాదర్థశ్చ కామశ్చ స కిమర్థం న సేవ్యతే
(పు. 715)

(నేను రెండు చేతులు పైకెత్తి పెద్దగా ఈ విధముగా చెప్పుచున్నను ఎవరును వినుట లేదు. 'ధర్మము చే మోక్షము కలుగును. ధర్మముచే అర్థకామములున్ను సిద్ధించును. అయినను జనులు అట్టి ధర్మమును ఏల సేవించకున్నారు?)

ధర్మ నిర్వహణ చాలా కష్టమైంది. అయినా వదలరాదు. ఎందుకంటే ధర్మం ఒకటే నిత్యం. సుఖదుఃఖాలు అనిత్యాలు. "జీవాత్మ నిత్యుడు. అతని బంధ కారణమైన అజ్ఞానము అనిత్యము" (చూ .పు. 716)

- శ్రీస్వాములవారి పాదపద్మాలను స్మరిస్తూ ఈ పరిచయవ్యాసం రచించే అవకాశం కల్గించిన పెద్దలకు ననుస్మరిస్తున్నాను. 'ధర్మో రక్షతి రక్షితః' అనే మనుధర్మ సూక్తిని మనమందరం పాటిద్దాం.

మొదటి 260 పుటల వరకు స్వాములవారు భారతంలో భిన్నస్తోత్ర రత్నాలను వ్యాఖ్యానించి ఉన్నారు. పాఠకులు వాటిని తప్పకుండా అనుసంధిస్తే భారతంలో ఆ స్తోత్రాల ప్రాధాన్యం అర్థమవుతుంది.

శ్రీస్వాములవారి కలము, గళము భక్తుల హృదయాలలో అమరమై నిలచినవి

శ్రీప్రమోద చైతన్య స్వాములవారు
(కుంచనపల్లి)

పూజ్యశ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి శతజయంతి ఉత్సవాలు జరుపుకోవటం వారికి మనం చెల్లించే నిజమైన శ్రద్ధాంజలిగా భావిస్తున్నాను. పూజ్యస్వామిజీ చిరస్మరణీయులు. శ్రీశుకబ్రహ్మాశ్రమం స్థాపించి తద్వారా జ్ఞానసేవ చేసిన శ్రేష్ఠవ్యక్తి. గురువుకు తగిన శిష్యులై గురు ఋణం తీర్చుకున్న మహానుభావులు.

శ్రీమద్భగవద్గీతావిద్యను (జ్ఞానాన్ని) యావదాంధ్ర దేశము పర్యటించి గీతాజ్ఞాన యజ్ఞముల ద్వారా అద్భుతమైన ప్రసంగాలు చేసి సార్థక నామధేయులైనారు. భక్తుల హృదయాలలో-భగవంతుని యందు, భగవద్గీత యందు అచంచలమైన భక్తి విశ్వాసములను కలిగించి చిరస్మరణీయు లైనారు.

వీరి కలము, వీరి గళమూ భక్తుల హృదయాలలో అమరమై నిలిచినవి. ఆబాలగోపాలాన్ని అలరించే వీరి వాణి సుమధురమైనది. అందుకే గీతామకరందమై మన్ననలందినది. వీరు అనుగ్రహించిన భక్తకన్నప్ప నేత్రాలయం సమాజహిత చింతకు ప్రతీక. 'అనేక వక్త్రనయనం అనేకాద్భుత దర్శనమన్నట్లు, అనేకమందికి దృష్టినిచ్చి, అనేక మంది ద్వారా చిరంతరంగా చూస్తూనే వున్నారు.

పూజ్యస్వాములవారిని నేను అనేకసార్లు దర్శించి నాను. వారు నా ప్రచారకార్యక్రమాలను అడిగితెలుసుకొని అభినందించి ప్రోత్సహించే వారు. నా దగ్గరలేని వారి రచనలను నాకిచ్చి ఆశీర్వదించేవారు, జ్ఞానప్రచారకుని చాలా సగౌరవంగా చూచేవారు. తిరుగు ప్రయాణం అయ్యేటంత వరకు ఈశ్వర్‌గారికి చెప్పి తగు జాగ్రత్తలు తీసుకొనేవారు.

నెల్లూరులో నిర్వహించే నా(218) గీతాజ్ఞాన యజ్ఞానికి, పూజ్యస్వాములవారిని ఆహ్వానించగా, వారికి ఆరోగ్య అనుకూలంగా లేకున్నా వచ్చి భక్తులను తన్మయపరచేలాగా అనుగ్రహ భాషణం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు. స్వాములవారికి పాదపూజచేసి సన్మానించి వీడ్కోలిచ్చినాము. (సంతోషంగా) స్వాములవారు ఆశ్రమంచేరి వారి సంతోషం భక్తులద్వారా ద్వారా తెలిపినారు.

శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాములవారు వజ్ర సంకల్పులు, వీరు అసాధ్యాలను సుసాధ్యం చేస్తారు, శ్రీశుకబ్రహ్మాశ్రమ బాధ్యతలను గురుశుశ్రూషారూపంగా సేవించి గురుఋణం తీర్చుకుంటున్న ధన్యాత్ములు. వీరి నేతృత్వంలో స్వాములవారి శతజయంతి ఉత్సవాలు విజయవంతంగా జరుగుతుందనీ ఆకాంక్షిస్తున్నాను.

> మట్టిలో వెదకుచుండినచో మాణిక్యము ఏ అదృష్టవంతునకో లభించ వచ్చు. ఏ దురదృష్టవంతునకో లభించకపోవచ్చును. కాని శరీరములో వెదకుచుండినచో, బుద్ధి గుహలో గాలించుచుండినచో ఆత్మయను మాణిక్యము దొరకకపోవుట అనుట ఉండదు. ప్రతి వానికి అది లభించును. **- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి**

గీతా ప్రకాశమకరందం

- శ్రీమాతా పరావిద్యానందగిరి
(యాజ్ఞవల్క్యాశ్రమము, యాచారం)

ఒక పని చేసేటపుడుగాని ఒక మాట మాట్లాడే టపుడు గాని మన పెద్దవారు సమయము, సందర్భము ఉండాలి అంటారు. అటువంటి మంచి సమయము భలే మంచి సందర్భము ఇపుడు మనకు వచ్చాయి. ఏమిటా సమయ సందర్భాలంటే శ్రీ కాళహస్తి శ్రీ శుకబ్రహ్మాశ్రమ సంస్థాపకులు ప.ప. పూజ్యశ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి శత జయంత్యుత్సవములు. ఎందుకు అంటే ఆధ్యాత్మిక పురోభివృద్ధికి బాటలు వేసికొనడానికి ఇదే మంచి అదను. వీటిని సద్వినియోగ పరచుకొనవలసిన బాధ్యత ప్రతి ఒక్క ఆధ్యాత్మిక సాధకునిపైన ఉన్నది.

మంచి రసాల మామిడి పండు ఉన్నదనుకోండి. అది స్వతహాగా తీయగా వుంటుంది. దానిని చిలుక కొట్టిందనుకోండి దాని రుచి చెప్పనలవికాదు. ఇది లోకనానుడి.

శ్రీ మద్భాగవతమును గురించి శుకమహర్షులవారు–

"నిగమ కల్పతరో ర్గళితం ఫలం
శుక ముఖాదమృత ద్రవ సంయుతమ్
పిబత భాగవతం రసమాలయం
ముహురహో రసికా భువి భావుకాః"

వేదమనే కల్పవృక్షమునకు కాచిన పండు భాగవతము. అంతియేగాక అది శుకమహర్షి యొక్క ముఖారవిందము నుండి వెలువడినది, కనుక ఆతని నోటి యందలి అమృత ద్రవము భాగవతములో కలిసినది. రసానికి ఆట పట్టైన ఈ భాగవత ఫలమును ఆరగించి ఓ పరమ భక్తులారా! తరించండి అని చెప్పినారు.

అదే విధంగా శీమద్భగవద్గీత ఉపనిషత్తుల సారాంశం. సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్మ ముఖారవిందము నుండి వెలువడినది. మహర్షి సద్గురు మలయాళ స్వాముల వారికి అతిప్రీతిపాత్రము, ఆపాతమధురమూ అయినది.

అంతియేగాక–

"గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్ర సఙ్గ్రహైః" భగవద్గీతను గానము చేయుటయే కర్తవ్యము. తదితర శాస్త్రములచే ఏమి ప్రయోజనము? అని మహాభారతము నందును, స్కాందపురాణమునందును గీతామాహాత్మ్యము తెలియజేయబడినది.

అటువంటి భగవద్గీత శ్రీ శుకబ్రహ్మాశ్రమ సంస్థాపకులైన శుక మహర్షి వంటి మన విద్యాప్రకాశానంద స్వాములవారి ద్వారా "గీతా మకరందం"గా జాలువారింది. దాని మాధుర్యము ఇక చెప్పనలవియే కాదు. పూజ్యశ్రీ స్వామివారి ద్వారా ప్రవచించబడి, ప్రకటించబడి, ప్రచారం గావింపబడి లక్షలాది జనుల మనసుల దోచుకొనిన "గీతా మకరందం" భగవద్గీతకు సంబంధించిన ప్రతి విషయాన్ని సమగ్రంగా తెలిపిన ఒక అపురూప గ్రంథమని చెప్పుటలో

అతిశయోక్తి ఇంచుకైనా లేదు. భగవద్గీతను ప్రారంభించడానికి ముందు పరిచయము, ఉపోద్ఘాతము అను పేర్లతోనే 210 (పేజీలు) ఉన్నాయంటే శ్రీస్వామివారు "శ్రీమద్భగవద్గీతపై" ఎంత పరిశోధన చేసి "గీతామకరందాన్ని" మనకు ప్రసాదించారో స్పష్టంగా తెలుస్తుంది. ఆధ్యాత్మిక విషయములనే కాక భౌతిక సంబంధమైన ఫలితాలనెన్నింటినో పొంద సులభసాధ్యమైన ఎన్నో రహస్యాలను కూడా ఇందు స్వామివారు పొందుపరచినారు. గీతకు సంబంధించిన ఏ విషయమునైన ఈ మకరందం ద్వారా మనం పొందవచ్చు. తెలుగులోనేగాక అనేక ఇతర భాషలలోనూ తర్జుమా చేయబడిందంటేనే దీనిలో వున్న విశేషమెంతో, స్వామివారి కృషియెంతో మనకు స్పష్టంగా తెలుస్తుంది.

ఆధ్యాత్మిక మార్గంలో అడుగిడిన తొలిరోజులలోనే పూజ్య శ్రీ స్వామివారి దర్శనభాగ్యం ఈ ఉపాధికి కలిగింది. తెల్లని పరిశుభ్రమైన వస్త్రములతో ఈశ్వర్‌గారు తదితర భక్తులు సహాయంతో శ్రీ స్వామివారిని (స్టేజీపై) వేదికపై కూర్చొనబెట్టినారు. శ్రీస్వామివారికి చూపు కూడా సరిగా కనిపించినట్లనిపించలేదు. కాని (మైకు) ధ్వనియంత్రము ముందు పెట్టిన తరువాత ఉపన్యాసం ప్రారంభించగానే వారి కంచుకంఠం గీతావ్యాఖ్యతో ఖంగున మ్రోగింది. చాలా ఆశ్చర్యమని పించింది. అంత పెద్ద వయస్సులో కూడా ఇతర అవయవములు ఏ మాత్రం జీరపోలేదు. భగవద్విభూతికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి. గీతాచార్యుని సంపూర్ణ అనుగ్రహాన్ని పొందిన శ్రీ స్వామివారిని దర్శించుకొని ధన్యులమైతిమని భావించాను.

భగవద్గీత అంటే జీవితంలో అన్ని బాధ్యతలు ముగించుకొని ముసలివారమైన తరువాత విశ్రాంతిగా కూర్చొని ఏ వ్యవహారము చేయలేక, ఏ విషయాలు అనుభవించలేని వయసులో ఆ సమయంలో చదువుకొనే గ్రంథంగా ప్రపంచంలో కొంతమందికి భగవద్గీతపై అభిప్రాయమున్నది. కాని భగవద్గీతను గురించి కొద్దిగా పరిచయమున్నవారికి కూడా ఈ అభిప్రాయం తప్పని తెలుస్తుంది.

జీవితంలో తాననుకొన్నది జరుగుతూ పోతున్నంత వరకు ఏ మానవునికీ వెనుదిరిగి చూచుకొనవలెనన్న ఆలోచన కలుగదు. ఏదైనా ఎదురుదెబ్బ తగిలినపుడే నిలబడి నిదానించి విచారించి చూస్తాడు. 12సం॥లు అరణ్యవాసంలోనూ 1సం॥ము అజ్ఞాతవాసంలోనూ, ఎపుడూ యుద్ధము, యుద్ధము అని కలవరించుతూ–ఎపుడు గడువు అయిపోతుందా అని ఎదురుచూస్తూ, అందుకు కావలసిన అస్త్ర శస్త్ర సముపార్జన కొఱకు తపస్సు కూడా చేసి, యుద్ధమునకు సహకరించు వారినందరనూ సమీకరించుకొన్నవాడు తీరాయుద్ధం ప్రారంభమయ్యేసరికి చేయాలా? వద్దా? అనే మీమాంసలో పడినాడు.

యుద్ధం ప్రారంభించే ముందు

"సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత!"

అంటూ అర్జునుడు– "రెండు సేనల మధ్య నా రథం నిలుపవయ్యా"–అని కృష్ణపరమాత్మకు తెలుపుకొన్నాడు. ఆ వైపు ఎవరున్నారా! చూద్దామని అర్జునుని ఉత్సాహము.

సరేయని జగన్నాటక సూత్రధారుడయిన కృష్ణ పరమాత్మ రథాన్ని తోలుకొని వెళ్ళి నేరుగా భీష్మపితామహుడు, ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు ఉన్నచోట నిలబెట్టాడు. తలఎత్తిన అర్జునునకు వీరే కనిపించారు. చూడగానే నీరుగారిపోయాడు అర్జునుడు.

"ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరి సూదనా॥"



పూలతో పూజించవలసిన వీరిని బాణాలతో ఎలా బాధించమంటావయ్యా - అంటూ మొఱపెట్టుకొన్నాడు.

కృష్ణపరమాత్మ ఒకవేళ రథాన్ని దుర్యోధనాదులకు ఎదురుగా నిలిపివుంటే వారిని చూచిన అర్జునుడు క్రోధావేశంతో వెనుక, ముందు ఆలోచించకుండా గాండీవ మెత్తి యుద్ధానికి సిద్ధమయ్యేవాడేమో!

కాని అలా జరుగలేదు. తాతను, ఆచార్యులను, బంధుబాంధవులను చూచిన అర్జునుడు కర్తవ్యాకర్తవ్య విమూఢ చేతస్కుడై రథంలో చతికిలబడ్డాడు. ఆ సమయంలో కృష్ణపరమాత్మ అర్జునుని కర్తవ్యోన్ముఖునిగా చేయుటకు ఆధ్యాత్మ జ్ఞాన భాండాగారమైన గీతను బోధించారు.

ఇపుడు చెప్పండి, భగవద్గీత జీవితంలో చేయవలసిన పనులన్ని ముగించుకొని ఏమీ చేతకాని వయసులో తెలిసికొనవలసినదా! లేక యుద్ధరంగంలాంటి జీవిత రంగంలో ఎదురయ్యే ఒడిదుడుకులను తట్టుకొని ఎదురొడ్డి ధైర్యంగా నిలువవలసిన యువకులకు కావలసినదా! ఏమి చేయాలో? ఎటు పోవాలో? తెలియని సంకట పరిస్థితులలో తట్టి మేల్కొలిపి సరియైన మార్గమును బోధించే గ్రంథమే భగవద్గీత.

ఇంకొక విషయం కూడా మనం ఇక్కడ గమనించవలసినది వున్నది. అర్జునునికి వచ్చిన సమస్య యుద్ధం చేయాలా! వద్దా! అని. మరి పరమాత్మ అతనిని కర్తవ్యోన్ముఖునిగా చేయుటకు బోధించినది-

"నత్వే వాహం జాతునాసం న త్వం నేమే జనాధిపాః ।
న చైవ న భవిష్యామః సర్వే వయ మతః పరమ్ ॥"

నేను కాని, నీవుకాని, ఈ రాజులు కాని లేనిసమయం భూతకాలంలో లేదు, భవిష్యత్తులోనూ ఉండబోదు.

"నాయం హన్తి న హన్యతే"

ఈ ఆత్మ చంపేది కాదు, చంపబడేది కాదు - అంటూ ఆత్మజ్ఞానాన్ని తెలిపాడు.

అనగా మన సమస్యలన్నింటికి మూలం అజ్ఞానమే. అన్ని సమస్యలకూ పరిష్కారం ఆత్మజ్ఞానమొక్కటే.

"నాన్యః పంథా అయనాయ విద్యతే ।"

దీనికంటే ఇంకొక మార్గం కాని, ఇంకొక ఉపాయం కాని లేదు. ఇది ప్రతి ఒక్కరూ గమనించవలసిన నిత్య సత్యం.

ఈ మధ్య రష్యాలో ఒక సంఘటన జరిగింది. భగవద్గీతయందు కృష్ణ పరమాత్మ -

"ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే ॥"

ధర్మయుద్ధం కంటే క్షత్రియులకు శ్రేయస్కరమైన కర్మ ఇంకొకటి లేదు.

"క్లైబ్యం మాస్మగమః పార్థ"

క్లీబత్వాన్ని అనగా పేడితనాన్ని పొందవద్దు అంటూ యుద్ధం చేయుమని ప్రోత్సహించినాడు - కనుక ఇది హింసాప్రేరకమైన గ్రంథం దీనిని ప్రకటించడం, ప్రచారం చేయడం నిషేధించాలని (కోర్టులో) న్యాయస్థానంలో ఫిర్యాదు కేసు వేశారట రష్యాదేశంలో కొంతమంది ప్రబుద్ధులు.

పరమాత్మ యొక్క హృదయం గ్రహించలేని, పరమార్థతత్త్వాన్ని ఆకళించుకోలేనివారి వ్యర్థప్రలాపనే ఇది. అంతియేగాక మన పవిత్ర గ్రంథాలను ఏదో రకంగా

నివారించి ప్రచారం కాకుండా చేసి యథార్థజ్ఞాన శూన్యులుగా మనలను గావించి బానిసలుగా చేసికొనవలయునను అతి దురాలోచన కూడా కావచ్చు.

క్షత్రియులైన పాండవులు తమ క్షాత్రశక్తితో- అధర్మపరులైన వ్యక్తులతో పీడింపబడుచున్న ఆర్తజనులను రక్షించి ధర్మస్థాపన పరమాత్మ ప్రతినిధులుగా

"స విష్ణుః పృథివీపతి" అన్నట్లు విష్ణ్వంశతో రాజులై చేయవలసియున్నది. అటువంటప్పుడు తమకు జరిగిన అన్యాయాన్నే ఎదుర్కొనలేనివారు ఇతరుల కష్టనష్టాలను ఏవిధంగా తీర్చగలుగుతారు? సామ, దాన, భేద, దండోపాయములు వారికి వున్నవి. అలాగాక పిరికి పందలుగా, చేతకానివారివలె చేతులు ముడుచుకు కూర్చుని తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకొనడానికి శాంతివచనాలు వల్లించుట ధర్మం కాదు కనుక, వారికి యుద్ధం చేయుటయే కర్తవ్యం కనుక, యుద్ధం చేయకపోతేనే వారికి పాపం వస్తుంది. కనుక తద్వారా నరకప్రాప్తి కలుగుతుంది. కనుక యుద్ధం చేయుమని వారిని నిర్దేశించినారు. అంతే కాని హింసను పరమాత్మ ప్రేరేపించలేదు. యుద్ధంలో కాని, విడిగా గాని ఎదుటి వారిని చంపినా తప్పయ్యేటట్లయితే కృష్ణపరమాత్మే స్వయంగా చాలామందిని మట్టుబెట్టారు. నిండుసభలో శిశుపాలుణ్ణి తన చక్రంతో సంహరించారు. అధర్మపరులను ఉపదాసీనతతో ఉపేక్షించడం వారి పాపాన్ని పెంచి నట్లవుతుంది. అంతేగాక వారి దుష్టచర్యల వల్ల దుఃఖిస్తున్నవారి దుఃఖాన్ని పోగొట్టనిపాపం కూడా వస్తుంది. కనుకనే క్షత్రియులకు యుద్ధం చేయుట ధర్మము, చేయకపోవుటయే అధర్మము.

13సం॥లు యుద్ధం, యుద్ధం అని కలవరించి, తపస్సు చేసి శివుని మెప్పించి యుద్ధానికి కావలసిన పాశుపతాస్త్రాన్నే పార్థుడు అడిగాడు గాని మోక్షం అడుగలేదు. అటువంటి అర్జునుడు యుద్ధంలో తమ తాత్కలను, తండ్రులను, ఆచార్యులను, మేనమామలను, మనుమలను, మామలను, బావమరదులను, బంధువులను చంపవలసి వస్తుందని తాత్కాలిక వైరాగ్యంతో పలాయనం చిత్తగించి భిక్షాన్నాన్ని స్వీకరిస్తానన్నాడని కృష్ణపరమాత్మ అంగీకరించాడనుకోండి. అపుడు పరిస్థితి ఎలా వుంటుంది?

చిన్నపిల్లవాడు ఆటలయందు గల ఆసక్తితో బడికి వెళ్ళనని మారాం చేస్తే వాడిని బాధపెట్టడమెందుకని తల్లిదండ్రులు అంగీకరిస్తే ఏమవుతుంది? అతనే పెద్దవాడైన తరువాత చదువు విలువ తెలిసికొని తాను చదువుకొనన నందుకు బాధపడి-నన్నెందుకు చదివించలేదు? - అని ప్రశ్నిస్తే ఆ తల్లిదండ్రులు ఏమని సమాధానం చెబుతారు. నాయనా మేము నిన్ను చదివించాలనే అనుకొన్నాము, కాని నీవే ఆటలాడుకొంటూ బడికి వెళ్ళనని ఏడ్చావు. అందువలన నిన్ను బాధపెట్టడం ఇష్టంలేక వూరకొన్నాము" - అని అంటే ఆ పిల్లవాడు ఏమంటాడో తెలుసాండి! "అయ్యో అలా ఎందుకు చేశారు? నాది అపుడు చదువు విలువ తెలిసికొనే వయసు కాదు. ఇపుడు చదువు విలువ తెలిసింది, కాని పోయిన కాలం రాదు. కనుక మీరు అపుడు నన్ను దండించైనా బడికి పంపిస్తే బాగుండేది" - అని తప్పకుండా అంటాడు.

అర్జునుడు అదేవిధంగా ఒకసారి కాకపోతే ఒకసారైనా విచారణ, వివేకము కలిగి కృష్ణుని తప్పకుండా నిలదీసేవాడే. "స్వామీ! అపుడు ఏమి చేయవలయునో తెలియక యుద్ధం విరమించి భిక్షాన్నంతో జీవిస్తానన్నా ననుకోండి. మీరైనా చెప్పి యుద్ధం చేసేటట్లు నన్ను ప్రేరేపించితే బాగుండేదని వాపోయే పరిస్థితి తప్పకుండా వస్తుంది. ఎందుకంటే అర్జునుని యుద్ధవిముఖత-

స్వభావసిద్ధమైన వైరాగ్యం వలన వచ్చినది కాదు. బంధువ్యామోహంతో దుఃఖంతో కలిగిన తాత్కాలిక విముఖతయే. అది కనుకనే సర్వజ్ఞ పరమాత్మ ఆత్మజ్ఞానాన్ని బోధించి క్షత్రియునకు ఉచితమైన యుద్ధమునకు అర్జునుని సుముఖునిగా చేసినాడు. అందువలననే ఏదైనా లోతుగా విచారించిన తరువాతనే ఒక అభిప్రాయానికి రావడం సముచితం.

కృష్ణపరమాత్మ భగవద్గీతలో అద్భుతమైన కొన్ని పదముల ద్వారా కొన్ని వ్యక్తిత్త్వములను మన యందు ఆవిష్కరింపజేస్తారు. అవే జ్ఞాని, గుణాతీతుడు, భక్తుడు, స్థితప్రజ్ఞుడు మొదలైన పదములు. వారి స్వరూప స్వభావములను అత్యద్భుతంగా దృగ్గోచరమయేటట్లు చేస్తారు. లోతుగా విచారించితే పేర్లు వేరు వేరైనా అందరి స్వరూప స్వభావాలు ఒకటే.

ఆధ్యాత్మిక మార్గంలో సాధన చేసేవారిని సాధకుడు అని, ఆ ఫలితాన్ని పొందినవారిని సిద్ధులు అని, ఆ సిద్ధిని పదిమందికి పంచవలయునని వ్యవహరించేవారిని జీవన్ముక్తులు అని అంటారు. వీరు శ్రీ ఆదిశంకరాచార్యులు వివరించినట్లు "వసంతవల్లోక హితం చరంతః"

వసంత ఋతువు వలె లోకహితం కొఱకు చరించేవారు. ప్రతివ్యక్తి ఆధ్యాత్మిక జ్ఞానంతో పరిపూర్ణు డయితేనే తన వ్యవహారంతో తానే బంధింపబడకుండ ముక్తుడవుతాడు.

భగవద్గీతా విజ్ఞానాన్ని స్వంతం చేసికొన్నవారు గృహస్థులైనా తమకు తెలిసిన దానిని ఆచరిస్తూ తమ కుటుంబ సభ్యులచేత, సంతానంచేత ఆచరింపజేస్తూ మంచి కుటుంబవ్యవస్థను తద్వారా మంచి సద్వర్తన కలిగిన సమాజాన్ని నిర్మాణం చేయగలుగుతారు.

అదేవిధంగా భక్తుడై, గుణాతీతుడై, స్థితప్రజ్ఞుడైన వ్యక్తి సన్న్యాసియైతే పూజ్యశ్రీ స్వామివారివలె తమ జ్ఞానప్రకాశాన్ని నలుదెసలా వ్యాపింపజేసి తమను అనుసరించిన ప్రతిఒక్కరి స్వాతంత్ర్య సిద్ధికి సహకరించగలుగుతాడు.

ఈ పవిత్రమైన శుభసందర్భంలో పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకానందగిరి స్వామివారిని తలచుకొనే సదవకాశం కలిగినందులకు ఆనందిస్తూ-

"హరిః ఓం తత్సత్"

గూడ్సు పెట్టెలపై, 'Return' (త్రిప్పి పంపవలెను) అని వ్రాసి దాని ప్రక్కను ఒక తేది వేయుదురు. అనగా ఆ తేది నాటికి ఆ పెట్టె అరిగిపోవునుగాన దానిని గూడ్సు షెడ్డుకు రిపేరుకుగాను త్రిప్పి పంపవలెనని అర్థము. ఆ త్రిప్పిపంపు తేదిని గూడ్సు పెట్టె తయారైన దినమే నిర్ణయించి దానిపై వేయుదురు. అట్లే బ్రహ్మదేవుడు ఈ దేహ పంజరమును సృష్టిచేసి ప్రపంచమున వదలిన దినమే దాని నొసటపై ***'త్రిప్పిపంపవలసిన దినము'*** *గూడ వ్రాసియుండును. అయితే గూడ్సు పెట్టెలపై తేది కనిపించును, జీవుని నొసట కనిపించదు. దానినే బ్రహ్మవ్రాత, విధిలిఖితము అందురు. కనిపించనంత మాత్రమున అది లేకపోలేదు. మహనీయులందరున్నూ తమ జీవితకాలములోనే ఈ మహాప్రయాణమును గూర్చి యోచించుదురు. వార్ధక్యమురాక పూర్వమే దానిని గూర్చి చింతించి తన్నివారణకు తగినమందు కనిపెట్టుదురు.*

- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి

ఓం సత్యం శాంతం దయ



ఆదర్శజ్ఞాని

- శ్రీవిష్ణుసేవానందగిరి స్వాములవారు,
శ్రీ మలయాళస్వామి సన్న్యాసమఠం,కరీంనగర్

పవిత్రాత్మ స్వరూపులారా? పరమపవిత్రమైన ఈ భరతఖండమునందు నిరాకారుడు, సర్వవ్యాపకమైన భగవంతుడు దుష్టశిక్షణ కొరకు సాకార రూపంతో అనేక అవతారములు స్వయముగా అవతరించి జగత్తునుద్ధరించెను. మనుష్యులందరు తరించుటకు సనాతనమైన బ్రహ్మ జ్ఞానమును అర్జునుని నిమిత్తముగా చేసుకొని వేద స్వరూపమైన భగవద్గీతను బోధించెను. తానే గాక " జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్" అన్నట్లుగా తన స్వరూపులైన మహర్షులను, ఋషులను, మునులను, యోగులను సిద్ధులను, ధర్మానుష్ఠానపరులగు గృహస్థులను సద్భక్తులను, ధర్మరక్షణ, జ్ఞానబోధ కొరకు అవతరింపచేసెను. మనుష్యుడుగా జన్మించిన పిదప బ్రహ్మజ్ఞానమును సంపాదించవలెను. అట్టి పవిత్ర జ్ఞానమును అందించినవారు జ్ఞానులొక్కరే. ఆ జ్ఞానమును మిక్కిలి శ్రద్ధతో గురుసేవ చేసి పొందవలెను. మరియు పాపప్రక్షాళనకు పుణ్యప్రాప్తికొరకు గంగా, యమున, సరస్వతీ, గోదావరి, మొదలైన పవిత్ర తీర్థములు ఏర్పడినవి. వారి వారి స్థాయిననుసరించి జనులు తరించుటకు పుణ్యక్షేత్రములను, పావనములైన యజ్ఞములను, శక్తివంతములైన దివ్యమంత్రములను ఋగ్వేదాది నాలుగు వేదములను, ఉపనిషత్ వాఙ్మయమును, భగవద్గీత రామాయణ భాగవత భారతాది సద్గ్రంథములను నిత్యజీవితమునకు ఉపయోగపడు పద్ధతులను ఏర్పరచిరి.

ఈ వైభవము అంతా ఒక భరతఖండము పైనే ఎక్కువగా కనిపించుచున్నది. సనాతనధర్మమును బోధించుటకు జాతిమత కుల భేదములు లేకుండా ఈ పుణ్యభూమియందు పరంపరానుగతముగా మహాత్ములు వచ్చుచుండిరి. లోకంలో సామాన్య విద్యకే గురువు అవసరమున్నచో, బ్రహ్మవిద్యకు ప్రత్యేకముగా చెప్పవలెనా? తప్పకుండా అవసరము. సద్గురువు లేనిదే ఈ ఆధ్యాత్మికజ్ఞానం పట్టబడదు. ఈ జ్ఞానం లేనిదే జన్మ జన్మల అజ్ఞానము నశించదు."జ్ఞానేన హీనః పశుభిస్సమానః". జ్ఞానంలేనివాడు పశువుతో సమానమని శంకరుల వాక్యము. అట్టి పవిత్ర జ్ఞానము వీతరాగులైన మహాత్ములచెంతనే లభించును.

అట్టివారు వ్యాస, వసిష్ఠ, భరద్వాజ, అత్రి, శుక, సూత, శౌనక నారదాది మహర్షులు; మధ్యకాలంలో బుద్ధ, శంకర, రామానుజ, మధ్వాచార్యులు మొదలైనవారు. నేటి ప్రస్తుత కాలంలో శ్రీ రామకృష్ణ పరమహంస, వివేకానంద, స్వామిరామతీర్థ, మహర్షిసద్గురు శ్రీ మలయాళస్వామి, శ్రీరమణమహర్షి, స్వామి శివానంద, ఆర్యసమాజస్థాపకులు దయానందసరస్వతి, తపోవన్ మహారాజ్ మొదలైన మహానుభావులెందరో అనాదికాలమునుండి జీవునిలోని అజ్ఞానమును తొలగించుటకు తమ జీవితమంతయు త్యాగముచేసి ఆ దైవజ్ఞానమును సులభముగా అర్థమగుటకు విధివిధానములతో కర్మ, భక్తి, జ్ఞాన యోగములను మనందరకు బోధించిన ఆదర్శ త్యాగమూర్తులు.

వారిఋణము జన్మజన్మలకు తీర్చరానిది. అట్టివారు లభించుట దుర్లభము. ఆ కోవకు చెందిన వారే ధీరగంభీర ఉపన్యాసకులు, ఆదర్శ జ్ఞాని, గీతోద్ధారకులు సద్గురు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు. వారిపేరు లోనే కలదు విద్య అంటేనే ప్రకాశం. అట్టి ప్రకాశమునకే ప్రకాశం

బాల్య వయసులో వైరాగ్యముతో గృహమును తల్లిదండ్రులు అనుమతితో విడిచిపెట్టి, శ్రీవ్యాసాశ్రమ సంస్థాపకులు లోకోద్ధారకులు, తపోనిష్ఠా గరిష్ఠులు శ్రీమలయాళ సద్గురు దేవుల చరణము లాశ్రయించి 12 సంవత్సరములు అపక్వాహారముతో సాధనచేసి, సిద్ధత్వము పొంది గురుదేవుల అనుమతితో లోకశ్రేయస్సునాకాంక్షించి ఏకాంత ప్రదేశము, శివక్షేత్రము సమీపమున శ్రీశుక బ్రహ్మాశ్రమమును స్థాపించిరి. అనంతరం సన్న్యాసమును స్వీకరించి ఆధ్యాత్మిక జైత్రయాత్రను ప్రారంభించిన దివ్యమూర్తి. తనదైన శైలిలో గంగాప్రవాహము వలె, ఝంఝా మారుతంవలె వేదవేదాంత భక్తిజ్ఞాన బోధలు సర్వమానవాళికి సులభముగా పామరుని నుండి పండితుని వరకు అర్థమగురీతిలో బోధించిన మహనుభావుడు. పల్లెపల్లెల్లో పట్టణములలో ఎంతో ఓపికతో నిష్కామముగా వందల గీతాజ్ఞాన యజ్ఞములు నిర్వహించిన అఖండమూర్తి. లోకప్రసిద్ధమైన శ్రీగీతామకరందమును రచించి ప్రతిఒక్కరికి గీతలోగల మాధుర్యమును చూపించిన మధురమూర్తి. సర్వశాస్త్ర సారములను గ్రంథరూపములో వాక్రూపములో, అందించిన ఆదర్శమూర్తి.

"వేదాంతభేరి' మాసపత్రికను మరియు అనేక గ్రంథములను రచించి లోకోపకారముచేసిన మహనీయుమూర్తి. వారి మాటలో. చూపులో, నడవడికలో గీతలో చెప్పినవిధముగా స్థితప్రజ్ఞత్వము గోచరించును. వారి బోధ గాంభీర్యము, మృదుమధురము. వారివిషయం వ్రాయవలెనన్న అనంతము. అట్టి సద్గురు మూర్తి జన్మించి 2013 సం!! ఏప్రిల్ 28 తేదికి నూరుసంవత్సరములు పూర్తికానున్న శుభసందర్భములో శతజయంతి ఉత్సవాలను పరమహంస పరివ్రాజకాచార్యులు, నిరాడంబరులు, పూజ్యపాదులు శ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములువారు గురుభక్తితో, శ్రద్ధతో, ఓర్పుతో-దేశం నలుమూలలనుండి అనేకమంది మఠాధిపతులను, పీఠాధిపతులను, జగద్గురువులను, సాధుసంతులను ఆహ్వానించి భక్తులందరికీ ఈ శుభసమయమున వారి దివ్యప్రవచనములు అందించాలని విశాల హృదయంతో ఉత్సవములను ఏర్పరచిరి. వారి కృషి అమోఘమైనది. ఉత్తర పీఠాధిపతులు పూజ్యపాదులు శ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు శతజయంతి ఉత్సవమును పురస్కరించుకొని ప్రతిభక్తునకు తెలపవలెనన్న మహదాశయంతో గ్రామగ్రామములు వెళ్ళి ఎన్నోశ్రమలకు ఓర్చి కార్యక్రమము దిగ్విజయముగా చేయవలెనన్న వారి ప్రయత్నము ఎంతో మహదానందము.

ఈ శతజయంతి వేడుకలు భగవంతుని అనుగ్రహముచేతను, లోకోద్ధారకతత్పరులైన మహర్షుల కృపచేతను సకలదేవతల సంపూర్ణ అనుగ్రహంతో దివ్యముగా, భవ్యముగా, ఆనందముగా జరగగలవని కోరుతున్నాను.

శతజయంతి ఉత్సవమునకు వచ్చిన భక్తులందరికీ మరియు ఎన్నో శ్రమలకు ఓర్చి ఖర్చులు భరించి నేర్పుతో ఓర్పుతో, శ్రద్ధతో, ఉత్సాహముతో చేయుచున్న కమిటీ సభ్యులందరికీ అనంతశక్తిని ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుతూ ముగించుచున్నాము.

ఓం లోకాః సమస్తాః సుఖినో భవన్తు

ఓం శాంతిః శాంతిః శాంతిః



గీతా సందేశము

శ్రీ స్వస్వరూపానన్దగిరి స్వాములవారు
శ్రీవసిష్ఠాశ్రమ సంస్థాపకులు(శ్రీనివాస మంగాపురం)

శుకబ్రహ్మాశ్రమం శాంతం సుఖదం మోక్షదం పరమ్ ।
స్థాపకం సద్గురుం నౌమి విద్యయా రాజితం సదా ॥

పవిత్రాత్మ స్వరూపులగు భక్తమహాశయులారా! శ్రీ శుకబ్రహ్మాశ్రమసంస్థాపకులు, ఆంధ్రదేశంలో గీతా మకరందాన్ని అందరికీ అందించిన మహానుభావులు, తమ ప్రవచనాల ద్వారా లక్షలాది భక్తులను ఆధ్యాత్మిక మార్గంలో ఉత్తేజితులుగా చేసిన మహానుభావులు, శ్రీ సద్గురు మహర్షి మలయాళ స్వాముల వారి ప్రియశిష్యులు, తెలుగు జాతికి వేదాంత భేరిని అందించిన మహనీయులు, పూజ్యపాద సద్గురు శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వాముల వారి శతజయంతి మహోత్సవము శ్రీ శుకబ్రహ్మాశ్రమములో పూజ్యపాద శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానన్దగిరి స్వాములవారి సంకల్పంతో, వారి దిశానిర్దేశంలో పూజ్య శ్రీ సంపూర్ణానన్దగిరి స్వాములవారి ఆధ్వర్యములో జరుగుట చాలా ముదావహం.

ఆత్మీయ భక్తులారా! ఊరకరారు మహాత్ములు కారణజన్ములై ఉంటారు. అట్టి వారిలో శ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారు ఒకరు. ఎందుకంటారా? వారి జీవిత విశేషాలే వాటికి సమాధానం. పవిత్ర గంగానదిలో గీతాప్రాప్తి జీవితానికి మలుపు. ఆంధ్రదేశోద్ధారకులు, గీతా పితామహులైన శ్రీ మలయాళ సద్గురుదేవుల ఆశ్రయం, 12సం॥ గురు సన్నిధిలో అపక్వాహారులై కఠిన తపస్సు, ఆశ్రమ స్థాపన, బహుళ గ్రంథరచన, అనన్య సాధారణ తత్త్వ ప్రచారము. ఇవన్నీ కారణ జన్ములనడానికి చాలవా!

గీతా ప్రియులైన పూజ్య స్వామీజీ శతజయంతికి నేనూ ఒక గీతా వ్యాసాక్షర సుమమాలను సమర్పిస్తున్నాను.

భగవద్గీత విశ్వవిఖ్యాత గ్రంథ రాజము విశ్వమయుడగు శ్రీకృష్ణముఖారవిందము నుండి జాలువారిన అమృత ప్రవాహమది. మర్త్యులను అమరులనుగా మార్చగల మహాశక్తి స్వరూపిణి ఈ గీత. బ్రహ్మరాతను తుడిచి మన రాతను మలచగల అద్భుత గ్రంథమే గీత. గీత మన జీవిత గమ్యానికి మార్గదర్శియై దుఃఖమయ ప్రపంచ విషయాసక్తిని బాపి పరమ పదమైన ముక్తికి త్రోవను జూపే కరదీపిక ఈ గీత. గీతలో మన జీవితోద్ధరణకు సంబంధించిన ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్నింటిని మనం మననం చేసికొందాం.

గీత మనకు "త్యాగీభవ, యోగీ భవ" అని బోధిస్తుంది. ధృతరాష్ట్రునిలాగా లోభిగా బ్రతకొద్దు, స్వార్థిగా బ్రతకొద్దు. అర్జునునిలాగా త్యాగిగా బ్రతకండి, పరార్థిగా బ్రతకండి అని బోధిస్తుంది భగవద్గీత. లోభాగ్రేసరుడు, పరమస్వార్థి అయిన ధృతరాష్ట్రునికి స్వయంగా సంజయుదంతటి వాడు భగవద్గీతను బోధించినా ఫలితం శూన్యం. అదే పరమత్యాగి, పరజన, స్వజన హితార్థియైన అర్జునుడు భగవంతుని ద్వారా గీతాతత్త్వాన్ని విని కర్తవ్యనిష్ఠుడై

కర్తృత్వరహితుడై, శరణాగతుడై, భక్తుడై, జ్ఞానియై తరించాడు. దీనికి కారణం అర్జునుని శుద్ధబుద్ధే సుమా!

ఇక **'అశోచ్యా నన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే**
గతాసూ నగతాసూంశ్చ నాను శోచన్తి పండితాః'

...అంటూ

జీవితంలో మానవుడు ఉన్నదాన్ని గురించి, ఉన్నవాళ్లను గురించి, పోయినదాన్ని గూర్చి, పోయిన వాళ్ళ గూర్చి భగవంతుడు ఏడవకూడదంటున్నాడు. 'నవ్వుతూ బ్రతికేవాడు పండితుడు, ఏడుస్తూ బ్రతికేవాడు పామరుడు' అని గీతాసందేశం. సృష్టిలో జరిగేదేదో నీ కర్మకొద్ది భగవంతుని అనుగ్రహంతో జరుగుతుంది. వద్దంటే ఆగదు, కావాలంటే జరుగదు. ఈ వచ్చిపోయే ప్రపంచ పదార్థాలను గురించి గానీ, నీ తోటి ప్రాణుల గురించి గానీ అవగాహనా లోపంతో ఆత్మానాత్మ విజ్ఞాన రహితుడవై ఏడుస్తూ కూర్చోవద్దని గీతా సందేశం. వచ్చింది పోక మానదు. పుట్టింది చావక మానదు. ఈ సత్యం తెలియక ఏడుస్తూ కూర్చుంటే నీకు నష్టం, చనిపోయిన వారికి కష్టం తప్ప వచ్చేదేమో లేదని తెలుసుకో! నీ జీవితాన్ని మలుచుకో, శాంతిగా బ్రతుకు, శాంతిని పదిమందికి పంచు.

చనిపోయిన వాళ్ళను గూర్చి ఏడిస్తే జరిగే ఉపద్రవం ఏంటో స్కాందపురాణంలో ఈ విధంగా చెప్పబడింది.

"మృతానాం బాంధవే యేతు ముంచన్త్యశ్రూణి భూతలే ।
పిబన్త్య శ్రూణి తాన్యద్ధా మృతాః ప్రేతాః పరత్ర వై" ॥

చనిపోయిన వాళ్ళను గూర్చి ఏడ్చే బంధువుల కన్నీళ్ళు చనిపోయినవారు ఆ లోకాల్లో గ్రహించవలసి ఉంటుంది.

అట్లే పంచతంత్రంలో విష్ణుశర్మ ఇట్లా చెప్పాడు.

"శ్లేష్మాన్తు బాంధవైర్ముక్తం ప్రేతో భుంక్తే యతోఽవశః ।
తస్మాన్నరోదితవ్యం హి క్రియాః కార్యాశ్చ శక్తితః ॥"

చనిపోయిన వారిని గూర్చి ఏడ్చేటి బంధువుల ద్వారా విడువబడు చీమిడి, కన్నీళ్ళు – చనిపోయినవారు వివశంతో స్వీకరించ వలసి వస్తున్నది. అందువలన బంధువులు ఏడవకుండా శక్తి ననుసరించి గతించిన వారికి చేయవలసిన కర్తవ్యాలను చక్కగా నిర్వహించవలెను. ఈ శాస్త్ర విషయాలను దృష్టిలో పెట్టుకొని సర్వజ్ఞ పరమాత్మ ఏడవరాని వాళ్ళ గూర్చి ఏడుస్తున్నావు పామరునిలాగా –అని హెచ్చరించారు సుమా!

ఇక ఆత్మానాత్మ వివేక దృష్టితో ఆలోచిద్దాం. ఈ శరీరంలో రెండు అంశాలున్నాయి. ఒకటి శరీరం, రెండవది ఆత్మ. ఇందులో వివేకి దేహిని గూర్చి ఏడ్వడు. అవివేకి ఆత్మయందు అనాత్మబుద్ధిని, అనాత్మయందు ఆత్మబుద్ధిని ఆరోపించుకొని ఎప్పుడు దుఃఖిస్తూ ఉంటాడు. దేహం నశ్వరము. దేహి నిత్యం – ఈ రెండింటిని గూర్చి ఏడ్వవలసిన అవసరం లేదు.

"జాతస్య హి ధృవో మృత్యుః" పుట్టిన శరీరం చావక మానదు. "అథ చైనం నిత్య జాతం నిత్యం వా మన్యసే మృతం" ఎప్పుడూ పుడుతూ చచ్చేదిగానున్న దానిని గూర్చి కూడా వివేకి ఏడ్వరాదంటూ భగవంతుడన్నాడు. ఇక ఆత్మ విషయాని కొస్తే "నిత్య స్సర్వగత స్థాణురచలోయం సనాతనః" అని కీర్తింపబడింది. అట్టి త్రికాలాబాధ్యమై, సర్వగత సనాతనమైన ఆత్మను గూర్చి ఏడ్చేవాడు అజ్ఞాని గాని విజ్ఞాని అవుతాడా? ఆత్మీయులారా! ఏడుపు మనకు తగదు. నిరతిశయానంద స్వరూపులం మనం. అజ్ఞానంతో కొని తెచ్చుకున్నదే దుఃఖంతప్ప మన స్వరూపం కానేకాదు సుమా!

ఆనందం దేవుడిచ్చిందైతే, దుఃఖం జీవుడు కల్పించుకున్నది. ఈశ్వర సృష్టిలో దుఃఖం లేదు. దుఃఖమంతా జీవసృష్టే. అందువలన "నైనవం శోచితు మర్హసి" అన్నాడు భగవంతుడు.

గీతలో మన జీవిత పరమార్థాన్ని అందుకోవటానికి, శాంతిని సంపాదించుకోవడానికి ఎన్నో ఉపాయాలు గలవు.

"మాత్రా స్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణ సుఖ దుఃఖదాః ।
ఆగమాపాయినోఽ నిత్యా స్తాం తితిక్షస్వ భారత ॥"

ఈ ప్రపంచంలో ఇంద్రియాలకు శబ్దాది విషయ సంయోగం కలగగా సుఖదుఃఖాలు కలుగుతూ ఉంటాయి. కాని ఇవి వచ్చి పోయేవే తప్ప శాశ్వతంగా ఉండేవి కావు. వాటిని ఓర్చుకోవడం నేర్చుకోమని గీతాసందేశం. ఓర్పు, నేర్పు ఉంటే జీవితానికి తీర్పు బాగుంటుందని పెద్దలమాట. ఈ గీతా సందేశాన్ని తెలియక, తెలుసుకోలేక ఈనాడు స్వార్థపరలైన మానవులు క్షణికమైన సుఖాలకు, స్వార్థాలకు, లోభాలకు లోనై శాశ్వతమైన ఆస్తులను, అంతస్తులను విధ్వంసం చేస్తూ తన తలకు తానే కొరివి పెట్టుకుంటున్నాడు. ఈ ప్రక్రియ మనదేశం లోనే ఎక్కువగా ఉండటం శోచనీయం. దీనితో వ్యక్తి యొక్క, దేశం యొక్క పురోభివృద్ధి కుంటుబడి మిగిలేది మనకు దుఃఖమే సుమా!

సుఖ దుఃఖే సమే కృత్వా లాభా లాభౌ జయాజయౌ ।
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యసి ॥

సుఖ దుఃఖముల యందు సమత్వ బుద్ధిని సాధించుకోమంటుంది గీత. జీవితం సుఖలదుఃఖాలకలయిక. జీవనం ఒక ప్రవాహం లాంటిది. అందుకే జీవన స్రవంతి, జీవన ప్రవాహం అని వ్యవహరిస్తూ ఉంటాం. ఏ ప్రవాహానికైనా రెండు ఒడ్లు (తీరాలు) ఉండి తీరాలి. ఒకే ఒడ్డుతో ప్రవహించే ఏ నదైనా, పిల్లకాలువైనా చివరకి ఉండదు కదా! అయినప్పుడు ఈ జీవన ప్రవాహం గమ్యం చేరాలంటే రెండు ఒడ్లు ఉండవలసిందే గదా! కావున ఈ ప్రవాహానికి ఒక తీరం సుఖం, ఒక తీరం దుఃఖం. ఈ సుఖదుఃఖాలనే రెండు తీరాలను ఒరుసుకుంటూ ఈ జీవన ప్రవాహం సాగుతుంది. కాని మనిషి కోరేదేంటంటే, ఈ జీవన నది ఒక ఒడ్డుతో (సుఖమనే ఒడ్డుతో) ప్రవహించాలని. కాని ఆశ తీరునా, ఆశయం నెరవేరునా? గమ్యం చేరునా? అందువలన ఓ జీవుడా! ఈ జీవన ప్రవాహానికి రెండు ఒడ్డులను సమానంగా తలంచి అంగీకరించి, పరమార్థ మార్గం వైపు పయనించు పరమ శాంతిని పొందు.

అంతేకాదు, జీవితంలో దుఃఖాన్ని అంగీకరించిన వానికే సుఖం తప్ప, దుఃఖాన్ని ద్వేషించి సుఖాన్ని ఎవడూ పొందలేడని పెద్దల అనుభవం, శాస్త్ర నిర్ణయం కూడా. పాయసం త్రాగక త్రాగక త్రాగిన వాడికి కలిగే ఆనందం రోజూ త్రాగితే కలుగుతుందా! కలగదు కదా! అంతేకాదు నాలుగు గ్లాసులు వరుస పెట్టి త్రాగితే సుఖం లేదు కదా దుఃఖమే. ఆ సుఖం దుఃఖంగా పరిణమిస్తుంది. అందుకే విషయానుభవంలో సుఖదుఃఖాలు నీ మానసిక పరిణతులే తప్ప వాస్తవం కాదు. మనస్సుని విచారణ ద్వారా ఈ సుఖదుఃఖాలకు అతీతంగా మలచుకోగలిగితే పాపరహితుడవై పరమాత్మ ప్రాప్తి పొందగలవని భగవానువాచ. అందుకే సుఖదుఃఖాలను సమంగా చూస్తూ జీవిత పోరాటం చేస్తూ శాశ్వత సుఖరూప విజయాన్ని సాధించమంటాడు పరమాత్మ.

ఇట్లా విచారించుకుంటూ వెళితే మన జీవన దిశా నిర్దేశానికి గీతా సందేశాలు ఎన్నో. అన్నింటినీ తెలుసుకోవాలంటే గీతాధ్యయనం రోజూ చేయాలి. మహాత్ముల వ్యాఖ్యానాలు రోజూ చదవాలి. 'స్వాధ్యాయం'

మానవునికి మొదటి సాధనని శ్రీ శంకరులు సాధన పంచకంలో చెబుతారు. చెత్త సాహిత్యాలకు స్వస్తి చెప్పి, సత్సాహిత్యాన్ని చేతబట్టి మనిషి మనిషిగా బ్రతకాలి, మానవుడు మహనీయుడు కావాలి, మాధవుడు కావాలి.

భారతీయ ఆధ్యాత్మిక సాహిత్యంలో అపూర్వమైన, అసాధారణమైన, అద్భుతమైన అతి సరళమైన, మానవ ఇహ పరజీవితాలను చరితార్థం చేయగల గ్రంథం ఏదైనా ఉందా అనే ప్రశ్న వస్తే అది ఒక్క భగవద్గీతేనని చెప్పడం అతిశయోక్తి కాజాలదు. విశ్వ సాహిత్యంలోనే ఇట్టి గ్రంథం లేనేలేదు సుమా! అందుకే శ్రీ శంకర భగవత్పాదుల వారు గీతా భాష్యంలో "తదితం గీతాశాస్త్రం సమస్త వేదార్థ సార సంగ్రహ భూతం దుర్విజ్ఞేయార్థం" అని స్తుతించారు. అట్టి గీతయనే తేనెపట్టు నుండి మకరందాన్ని పిండి మనకందించారు సద్గురు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు. అట్టి మకరందాన్ని గ్రోలని ఆంధ్రులు ఉండరని నా భావన. అందిన వారికి మరలా అందించాలని, అందని వారికి ఇప్పుడైనా అందించాలని పూజ్యస్వామీజీ శతజయంత్యుత్సవాలను వైభవంగా జరపాలని తలపెట్టారు పూజ్యపాద శ్రీశ్రీశ్రీ విద్యా స్వరూపానంద స్వాములవారు. ఈ మహోత్సవాలలో అందరూ పాల్గొని గీతా మకరందాన్ని ఆస్వాదించి, అనుభవించి తరించాలని ఆశిస్తూ.......

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

జన్మసాఫల్యము

జనులారా! కర్షకుల వ్యవసాయసమయ మెటువంటిదో మీ యొక్క అభ్యాసకాలమున్ను అటువంటిదే లేక మీ యొక్క యౌవనారంభమున్నూ అట్టిదని గ్రహించుకొనవలయును. సంవత్సర జీవితసుఖమంతయు కృషి చేసెడు కాలమున యెట్లుండునో, ఆలాగున మీ యొక్క జీవిత సౌఖ్యమంతయు, జీవన్ముక్తియు అట్టి కాలముననే యుండునని మఱువకుడు. విత్తనము వేయుట, నారునాటుట, మొదలగు పనులు చేయు సమయమున యేలాగున వ్యవసాయదారులు నిద్రయు, భోజనమును గూడ లక్ష్యము చేయక సేద్యపు పనిలోనే కాలము గడుపుచుందురో, అపుడొక నిమిషమైనను సమయమును యెట్లు వ్యర్థపుచ్చరో, ఇతర కార్యములన్నిటిని యెట్లు నిలిపివేయుదురో, ఆలాగున మీరును అభ్యాసకాలమున నిద్రాహారాదులును గూడ లక్ష్యపెట్టక, ధ్యానములోను, విద్యాభ్యాసము నందును, గురుసేవయందును, వ్రతనిష్ఠలోను, పుణ్యకర్మానుష్ఠానములోను కాలము పూర్తిగ వినియోగపరచవలయును. వ్యవసాయ కాలమున వానకున్నూ, చలికిన్ని, యెండలకున్నూ భయపడి, భోజనమునకును, నిద్రకున్నూ, లోబడి అప్పటికాలమున పరిశ్రమచేయక గడిపినచో ఆ సంవత్సరము జీవితమంతయు యేలాగున దుఃఖముతోను, భోజనాదులు లేకయు గడుపవలసియుండునో, ఆలాగున యౌవనారంభమునగాని విద్యాభ్యాససమయమునగాని, అనుష్ఠకాలమునగాని, మీరు శీతోష్ణముల సహింపనిచో, నిద్రాహారాదులను జయింపనిచో, మీ జీవిత మంతయు దుఃఖభూయిష్ఠముగాను, క్లేశపూరితముగాను గడుపవలసియుండును. జీవితమంతయు మాత్రమే కాదు, పరలోకమున కూడ వ్యథలననుభవింపవలసియుండును. పరలోకము మాత్రముగాదు, భావిజన్మము సహా దుఃఖరూపముగానే యుండును తత్త్వము మఱువకుడు.

వర్తమానకాలమున్ను పరలోక జీవితమున్ను, భావిజన్మమున్నూ మన అరచేతిలో యుంటున్నవి. ఈ మూడింటిని మనము ఇపుడే పావన మొనర్చవలయును. లేక మానజన్మము గలుగనిస్థితి, మోక్షస్థితిని గుడ కలుగచేసికొనవచ్చును. ఇదే ముముక్షువులయొక్కయు జిజ్ఞాసువుల యొక్కయు ముఖ్యకర్తవ్యమని మఱువకూడదు. దొరికిన మాత్రమే గురుకులవాసము కావలయునని గ్రహించవలయును. శ్రేష్ఠులైన గురువులు దొరికిన మాత్రమే గురుకులవాసము చేసిన చాలును. లేనిచో స్వప్రయత్నపరులై యుండు టయేబాగు. పరిశ్రమపరులు కానిచో ఎవరున్ను పవిత్రులు గాజాలరను తత్త్వమెల్లప్పుడున్ను మనస్సులో యుంచి జీవించవలయును. లోకములో పావనులైనవారి చరిత్రమే దీనికి సాధ్యము, సోమరితనమున కన్న మించిన పెనుభూతము జగతిలో మఱియొకటి లేదని మఱువకుడు. ఈ సోమరి పెనుభూతము యొక్క సోదరుడే అభిమానము. వీరుభయులు చేరినచో, దయ్యముపట్టిన వారికిన్ని, మతిచెడినవారికిన్ని ఎట్టి గతి కలుగునో వారియొక్క జన్మమున్ను ఆలాగుననే యుండును.

- శ్రీ మలయాళస్వామి

సద్గురు సంస్మరణ-అనుభవము

- పుష్పలత (శ్రీకాళహస్తి)
శ్రీశుకబ్రహ్మ ఆశ్రమము

యన్య ప్రసాదాదహమేవ సర్వం మయ్యేవ సర్వం పరికల్పితం చ ఇత్థం విజానామి సదాత్మరూపం తస్యాంఘ్రిపద్మం ప్రణతోఽస్మి నిత్యమ్.

భా॥ ఎవరియొక్క అనుగ్రహముచే 'ఈ సమస్తము నేనే, నాయందే ఈ సమస్తము కల్పింపబడి యున్నది' అని ఈ ప్రకారముగ సద్రూప ఆత్మను ఎఱుగుచున్నానో, అట్టి గురుదేవుల పాదపద్మములకు సదా ప్రణమిల్లుచున్నాను.

గురుదేవా!! ఈ శతజయన్త్యుత్సవ సందర్భమున నాహృదిలో ప్రగాఢముగా నిలచిన వాక్సుమాంజలులు మీ చరణకమలములచెంత సమర్పించు సదవకాశమును కల్గించిన శతజయన్తి సంఘము వారికి అనంతకోటి ప్రణామములు.

సద్గురు విద్యాప్రకాశానందగిరి స్వాములవారి దివ్యప్రబోధములవలన, వారు రచించిన సుమారు 43 దివ్య సద్గ్రంథములవలన, వారి ప్రత్యక్ష వీడియో ప్రసంగముల వలన, తత్త్వసారము, మానసబోధ, యతిగీత, దివ్య భజనలు, Divine MESSAGE, హిందీలో దివ్యసందేశ్, అతి ముఖ్యమయిన (యోగవాసిష్ఠ రత్నాకరము) వసిష్ఠ గీతోపన్యాసముల వలన ముఖ్యప్రయోజనము ఏమనగా వేదాంతమంటే ఎంతో కష్టమని భయపడి వాటిని దూరంగా ఉంచేవారికి, ఓ! ఇంత సులభమా! అని వాటిని పదే పదే దగ్గరకు చేర్చుకునేలా చేస్తుంది. ఈ సందర్భమున జరిగిన ఒక సంఘటన .....ఏమనగా ఒకరోజు సైకిల్‌పై ఒక సామాన్య వ్యక్తి Door- Mats (గుమ్మం అనగా ద్వారం వద్ద కాళ్లు తుడుచుకునే పట్టాలు) సైకిల్ వెనుక పెట్టుకొని, సైకిల్ హేండిల్ బార్‌కి "గీతామకరందం గ్రంథాలు" రెండు కవర్లో తగిలించుకొని, ఆశ్రమము లోపలినుండి వెలుపలికి వస్తూండగా చూచి 'డోర్‌మేట్స్' రెండు తీసుకుని, ... అప్పుడు, అడిగాను ఆవ్యక్తిని ....."ఈ గీతామకరంద గ్రంథాలు ఎందుకు?" అని...

అమ్మా! నేను ఈ 'డోర్ మేట్స్' అమ్మటానికి ఆశ్రమానికి రాలేదు, కేవలం గ్రంథాలు కొనటానికే వచ్చాను. నేను ఈగ్రంథాన్ని మూడు సార్లు చదివి పూర్తిచేశాను. నాకసలు చదువురాదు. కానీ సద్గురు విద్యాప్రకాశానంద గిరి స్వాములవారు మా "కాకినాడ" లో గీతోపన్యాసములు చెప్పినవి విన్నాకనే, అప్పుడే గీతామకరంద గ్రంథమును కొని తీసుకుని వెళ్ళి..... దానితో పాటుగా పెద్దబాలశిక్షకూడా కొనుక్కుని అక్షరాలు నేర్చుకొని ఈ గీతామకరంద గ్రంథాన్ని 3 సార్లు చదివాను. నేర్చుకొని ఈ రెండు గ్రంథాలను మావూరు వారు తీసుకురమ్మంటే, కొనితీసుకుని వెళ్తున్నానమ్మ!-అని ఆ వ్యక్తి చెప్పిన తీరు, అతనిలో ఉన్న అత్యున్నత శ్రద్ధాభక్తి - గురు దేవులమహిమ, నా హృదయాన్ని స్పందింపజేసింది. నా కళ్ళు చెమర్చుటమే కాదు, ఆనంద

భాష్పాలు జలజలా వర్షించాయి. గురుదేవుల గురించి ఎవరితో ప్రసంగిస్తున్నా..... కన్నులు చెమర్చకుండా ఉండవు. ఎంత ప్రయత్నించినా నిలుపుచేయుట సాధ్యపడదు. అంతటిమహిమాన్వితులు నా గురుదేవులు. నాలానే గురుదేవుల ప్రసంగాలను టి.వి. లో చూచి, గీతామకరందం, తదితరగ్రంథాలు చదివి, వచ్చిన వారిలో ఎక్కువగా యువకులే ఉన్నారు. మంచి నిర్ణయాలు తెలియజేస్తుంటే అపుడు కలిగిన అమితాశ్చర్యానందములు వ్రాయుటకు వర్ణనాతీతములు.

పై వివరణ సంఘటన ఎందులకు జ్ఞప్తి వచ్చిన దనగా...చదువురాని వ్యక్తికి స్ఫూర్తినిచ్చినది. చదువుకునే వాళ్ళకు, చదువుకుని ఉద్యోగములు చేస్తున్న నేటి యువతకు ఉత్తేజ పరచి పారమార్థిక మార్గాన్ని ఎన్నుకునేలాగున చేసిన ఘనత సద్గురు దేవుల జ్ఞానామృత బోధలకే గలదు. అంతటి దివ్యశక్తి ఆ బోధలకు కలదు అని మరల మరల దృఢ పరచుటకొరకే.

అందులకే "సద్గురు విద్యాప్రకాశానందగిరి స్వాములవారి బోధలు పండిత పామర జనరంజితములని" మహనీయులు నుడివిరి. గురుదేవులు అతి సరళమైన పదాలు, ఉపమాన ఉపమేయముల ద్వారా విసుగురాని రీతిలో, పరమత దూషణకు తావీయక, సర్వమత సమన్వయముతో ప్రవచించుతీరు వర్ణనాతీతము. అనాయాసముగా అనర్గళముగా... సుమధుర కంఠీరవమునుండి జాలువారు గీతామృత ఝరిలో మునకలువేయు భక్తులచిత్తంబు చిత్తు చేసి, ఆత్మ సంస్థితులను గావించును అనుటలో సందేహములేదు.

గురుదేవుల ఆజ్ఞ ఏమిటి? నిత్యానిత్యవస్తు విచారణే. అనిత్యమగు దేహబుద్ధియను శత్రువును చంపి, సత్యమగు ఆత్మబుద్ధి యందు స్థితి కలిగి విజయమును పొందుట అనునది గురువాజ్ఞ! "కరిష్యే వచనం తవ! అనునది మన సమాధానం కావాలి.

స్వామీ! భవరోగమును బాపు దివ్యౌషధ విజ్ఞాన భాండాగారపు ద్వారములు తెరచి నీ దివ్య తపోశక్తిచే బయల్వెడలిన గీతామృతరస గుళికలు భూమిపై వెదజల్లి, నిరామయుడవై ముల్లోకంబులు దాటి, నిర్గుణ పరమాత్మ యందు ఐక్యమొంది అనంతుడవయినావు. మీ శతజయంతి ఉత్సవములు, శతశతజయంతులు జరిపించు పరమ భక్తులు విలసిల్లజేయు దివ్యశక్తి మీ వాగ్దేవికి కలదు. ఇది పరమ సత్యము!!

టి.వి. లో సద్గురు దేవుల గీతోపన్యాసములే నాకు స్ఫూర్తిని కల్గించినవి. ఈ జన్మనే గురుదేవుల పాద సన్నిధికి సమర్పించుకొను భాగ్యము నిచ్చినది. గురు ఋణము తీరునది కాదు. వారి జ్ఞానబోధలే ప్రాణవాయువు. గురువనగా కేవలము రూపముకాదు, వారి దివ్యసందేశాలే గురువు. యుక్తి యుక్తంగా నడిపించేది గురుబోధలే. వ్యవహారమందున కూడా సహజస్థితికి దూరంకాకుండా తత్త్వసారం, మానసబోధ స్మృతి పథమున నిలచి గురుబోధే కాపాడేది.

సద్గురు బోధను అనుష్ఠానము చేయుటకు ఆశ్రమ జీవితం అత్యావశ్యకము. ఆశ్రమము-నియమ నిష్ఠలతో నియమిత సమయమున జరుగు కార్యక్రమములందు పాల్గొనుచు, వినయవిధేయతలతో, ఆశ్రమ సేవలలో పాల్గొంటూ లౌకిక ప్రపంచము నుండి వైదొలగి, అంకిత భావంతో జీవించుటకు సరియైన పవిత్ర స్థలము. ఎంతో మంది మహనీయులు చరించిన పుణ్యభూమి. సాధకులకు అనుకూలమైన ప్రశాంత నిశ్శబ్ద వాతావరణము. ఆశ్రమ నివాసం అత్యున్నత మయినది.

మహనీయులు అందించు ప్రతిసేవ లోకోద్ధరణకే అని గ్రహించగలిగితే, అది మనకే మేలు. ఇది కూడా గురుమహిమే! సద్గురు విద్యాప్రకాశానందగిరి స్వాములవారు తెల్పిన అనేక వేలశ్లోకములలో ఈక్రిందిశ్లోకము శిష్ట గీతోపన్యాసములందు ఉపహరింపబడినది.

"వనేరణేశత్రుజలాగ్నిమధ్యే, భవార్ణవే పర్వత మస్తకేవా, సుప్తం ప్రమత్తం విషమస్థితం వా రక్షన్తి పుణ్యాని పురాకృతాని".

వనమునందుగానీ, యుద్ధమునందుకానీ, శత్రు, జల, అగ్నుల, మధ్యకానీ, సంసారసముద్రమునందుకానీ, పర్వతశిఖరమున గానీ, నిద్రయందుకానీ, జాగ్రత్‌నందుకానీ, విషమ పరిస్థితులందుకానీ నీవు గతమునందు చేసిన పుణ్యకర్మ ఫలమే నిన్ను రక్షిస్తుందని భావము. ఈశ్లోకం నాకు చాలా అనుభవ పూర్వక జ్ఞానాన్నిచ్చింది.

"మంచి పనులు వాయిదా వేయకూడదు" అను సూక్తి నా ఈ ఆశ్రమ ఆగమనానికి స్ఫూర్తినిచ్చినది. నిన్న లేదు రేపులేదు ఈక్షణం నీది - అను వాక్యాన్ని ధృఢ పరచిన శ్లోకం యోగవాసిష్ఠమున వైరాగ్య ప్రకరణమందు శ్రీరాములవారు శ్రీవిశ్వామిత్ర మునీంద్రులతో వచించినది.

ఆయుః పల్లవ కోణాగ్ర లమ్బామ్బుక్షణ భంగురమ్।
ఉన్మత్తమివ సంత్యజ్య యాత్యకాణ్డే శరీరకమ్ ॥

భా॥ ఆయువు, చెట్టుయొక్క చిగుళ్ళ చివర వ్రేలాడు జలబిందువు వలె క్షణ భంగురమైనది. అయ్యది పిచ్చివానివలె అకాలముననే ఈ శరీరమును విడిచి పోవుచున్నది. (చిగురాటాకు చివర నుంచి బిందువు చాలా శీఘ్రముగా రాలిపోగలదని చెప్పకనే తెలియుచున్నది.) ఈశ్లోకమే నా గురుదేవుల సన్నిధిని చేరుటకు తొందర పరచినది. ఎందులకనగా, దేహము నశించుటకు మునుపే మనోనాశము కావాలి.

ఎచట నయినా మంచి, చెడూరెండూ ఉంటాయి. మంచి చెడూ కూడా రెండూ భగవంతుని చిత్రీకరణే. ప్రారబ్ధానుసారము కర్మరంగములో ప్రతీ పాత్రధారిలో ఆయా పాత్రానుగుణంగా వర్తిస్తూ వాటిని దైవ ప్రసాదంగా స్వీకరిస్తూ పాత్రధారి పదవి ముగించినచో సూత్రధారియే మిగిలి యుండేది. గురుదేవులు చెప్పిన తత్త్వసారము ఇదే- "పాత్రధారివి కాక యిచట సూత్రధారి పదవినొంది వేషమంతయు వదలివైచి మరల నెన్నడు స్వీకరించకు" మరల ఈ జన్మ పరంపరలో చిక్కుకొనకుండ..."తీవ్రసాధన చేసి దాని అంతు తేల్చుము సత్వరంబున" అను తత్త్వములు ప్రతివారి యొక్క హృదయ ఫలకమున ముద్రితము కాక తప్పదు.

'భగవాన్ శ్రీరమణ మహర్షులవారి' దివ్యతేజో మయమయినట్టి నేత్రములు ఎల్లవేళలా తెరచియే యుండినను, బాహ్యదృష్టి ఉండదు. ఎల్లవేళలా అంతర్లీనమై యుండును. ఒక్కొక్క విశిష్ట రూపములతో మహనీయులు భూమిపై అవతరించి విజ్ఞాన కిరణములను వెదజల్లి ఇలపై శాశ్వతులై విరాజిల్లుచునే యుందురు. అటువంటి పరమపురుషులలో సద్గురు 'శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామీజీ" అపర శ్రీకృష్ణభగవానులై' గీతాగంగను వెల్లువగా ప్రవహింపచేసి భక్తుల హృదయ క్షేత్రములను సస్యశ్యామలము గావించిన లోకోద్ధారకులు.

*పరమార్థసాధన నిప్పుతోటి చెలగాటము వంటిది. బెబ్బులి తోటి యుద్ధమువంటిది. ఏ ఒకింత అజాగ్రత్త చూపినను పొంచియున్న మాయ అమాంతముగ మీద పడి జీవుని భవసాగరమున ముంచి వేయును. - **శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి***

గీతామకరంద - విషయసూచికా పరిచయం

(ఉపోద్ఘాత విశేషాలు)

ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

భారతదేశ స్వాతంత్ర్యోద్యమ కాలంలో మేధావులలో, మఠాధిపతులలో, మధ్య తరగతి ప్రజానీకంలో చాలా మార్పులు చోటుచేసుకొన్నాయి. ప్రత్యేకించి కవులు, ధర్మ ప్రబోధకులు, ఆధ్యాత్మిక జిజ్ఞాసాపరులు తమ వంతు కృషిగా ప్రధానమయిన స్వరాజ్య స్థాపనకు భంగం లేకుండా తమ తమ రంగాలలో కృషిచేశారు. ప్రత్యేకించి గాంధీగారి రామ రాజ్య స్ఫూర్తి భారతీయ భాషలలో అనేక రామాయణాల రచనలకు దోహదం చేసింది. తమిళంలో చక్రవర్తి తిరుమగన్, కన్నడంలో కువెంపు రామాయణం, తెలుగులో విశ్వనాథ వారి కల్పవృక్షం కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఆలాగే ఆధ్యాత్మికతను లౌకిక పరంగా అన్వయించుకొని కర్తవ్యనిష్ఠులుగా చేసే ప్రయత్నంలోనే భారతీయభాషలలో అసంఖ్యాక గీతానువాదాలు, గీతసంబంధ ఉపన్యాసాలు, గీతాధ్యయనం మొదలయినవి మర్రిచెట్టు ఊడల్లా విస్తరించాయి. ఈ విస్తృతికి వివేకానందులవారు, తిలక్, గాంధీలాంటి వారు పరోక్షంగా కారకులయ్యారు.

తెలుగువారికి 'గీత పట్ల ఆదరం అత్యధికం. తాళ్లపాక పెద్ద తిరుమలాచార్యులు 15వ శతాబ్దంలోనే గీతకు వ్యావహారిక అనువాదం చేయడం చిత్రం. తరువాత కాలంలో మఠాధిపతుల వ్యాఖ్యానాలు ఆయా మఠఅనుయాయులకు మార్గదర్శకం కావచ్చుగాని సమాజంలోని అన్ని వర్గాలను ఆకట్టుకొనేలా సులభశైలిలో 'గీత' వ్యాఖ్యానాలు వెలువడడం జరిగింది. ఈ బృహత్తర సంకల్పంతో కార్యరూపం దాల్చిన వాటిలో శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామివారి గీతా మకరందం ధృవతారగా నిలిచిపోయింది. ఈగ్రంథ ప్రశస్తికి కారణాలు సవాలక్షలున్నా అన్నటికంటే మిన్న ఆ గ్రంథంలోని 'పీఠికాభాగం'. ఇది 83 అంశాలతో సుమారు 204 పుటలతో విస్తరించిన విషయసూచిక.

ఈ విషయ సూచికలో రెండు భాగాలున్నాయి మొదటిది పరిచయ భాగం 1నుండి 115 పుటలు. రెండవ భాగం ఉపోద్ఘాతం. 119 పుటనుండి ఉపసంహారం దాకా సుమారు నూరు పుటల సారాంశం.

మొదటి భాగం పరిచయంలో గీతాప్రాశస్త్యం ప్రధానమయింది. ఈ ప్రాశస్త్యం అధికారికంగా చెప్పడం అవసరం, అపుడే సామాన్య పాఠకలోకం ఊకొడుతుంది. అందుకే శ్రీస్వాములవారు మహాభారతమునుండి గీతాప్రాశస్త్య శ్లోకాలు (తెలుగు తాత్పర్యంతో), గీతాప్రభావం స్కాందపురాణ శ్లోకాలు (తెలుగు తాత్పర్యాలతో), గీతామహిమను వైష్ణవీయతంత్రసారం శ్లోకలు 84కి తెలుగు తాత్పర్యాలతో విశదీకరించారు. ఈ కారణం వల్ల పాఠక లోకానికి చెప్పబడే అంశం గాలి కబురు కాదనే భావం ఏర్పడుతుంది.

తదనంతరం గీతకు సంబంధించి కొన్ని లౌకిక వాదాలకు సునిశిత దృష్టితో సమాధానాలు ఎదుటి వారు మనసా మెచ్చుకొనేలా చెప్పేప్రయత్నం. ఈ కోవలో చేరినవే గీతాశ్లోకసంఖ్య. పండితుల మధ్య రాజీకుదరని అంశాలలో ఇదొకటి. ఈ అంశాన్ని వివరిస్తూ స్వాములవారు భోజపత్రంలోని 755 శ్లోకాలను కాదనకుండా కాలగర్భంలో

44,45 అద్భుత శ్లోకాలు ఎచ్చోటనో విలీనమై పోయాయని చక్కని సమన్వయం చేశారు.

ఎప్పుడయితే 'గీత' తమదనే భావం కలుగుతుందో ఆ అనుభావం భక్తిని, రక్తిని, ఆదరణను పెంచుకొంటుంది -ఆలయంలోని విగ్రహం పట్ల భక్తుల ఆదరణలాగా. ఆనెపంలో గీత్యాధయనం వల్ల కలిగే లౌకిక ఫలితాలు, పారమార్థిక ఫలితాలు, పూజాదులు, జపాదులు, మంగళహారతి, పారాయణక్రమం, పారాయణ విధానం లాంటివి క్రమంగా పెరిగాయి. ఇవన్నీ గీతాప్రచారానికి అంతకు ముందే సమాజంలో ఉన్న దైవసంబంధ ఆరాధనా విధానాన్ని బలపరచేలా సాగడం చిత్రం. ఇతర ఆరాధనలతో అదనంగా మరో రక సంప్రదాయం గట్టిపడడం భారతీయ నాగరికతలో ఒక ప్రశంసావహమయిన అంశం. విగ్రహాల పూజాదులలాగా గ్రంథాల ఆరాధనకు ఈ అంశాలు తోడ్పడ్డాయి.

సామాన్య పాఠక లోకానికి ఆకర్షకమయిన శైలి అవసరం. ఆశైలికి అందచందాలు సమకూర్చేవి ఛందస్సు, అలంకారాలు. భారతదేశంలోని సాహిత్యమంతటా ఆలంకారిక సంప్రదాయముంది. ఈసంప్రదాయం మానవుల అనుభవాలను గౌరవిస్తుంది. పూజ్యతను పెంచుతుంది. కావ్యత్వాన్ని స్థిరపరచి రసికతను పెంచుతుంది. అందుకే స్వాములవారు సారస్వతప్రియులు ఆనందించేలా గీతాశ్లోకముల ఛందోవివరణ, గీతావినోదము, గీతయందలి ఉపమానములు, చిరస్మరణీయములగు గీతావాక్యములను ఆయా శీర్షకలలో పొందుపరచినారు. ఈ భాగం సారస్వతప్రియులకు అమృత ప్రాయం. నిత్యస్మరణీయ వాక్యాలు 40 ఉదాహరించారు స్వాములవారు. వీటిలో కొన్ని మనం నిత్య వ్యవహారంలో ఏగ్రంథంలోనిదో తెలియక పోయినా చెప్పుకొందాం.

శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్ 4.39
న సుఖం సంశయాత్మనః 4.40
ఉద్ధరేత్ ఆత్మనాత్మానం 6.5
న మే భక్తః ప్రణశ్యతి 9.31
మామేకం శరణం వ్రజ 18.66

అలాగే నూతనవస్త్రధారణ రీతి (2.22) విశాల అగాధ సరోవర దర్శనము (2.46) సంసారవృక్షము (15.2) పుష్పసుగంధ వ్యాపనము (15.8) లాంటివి వేదాంతార్థ విశదీకరణకు వాడబడిన ఉపమానాలు. పొగచేత నిప్పు, దుమ్ముచే అద్దము లాంటివి సామాన్యునికి కూడా అనుభవంలోని అంశాలు.

కవులలో శాస్త్రకవులున్నారు. వారికి శాస్త్రనిష్ఠపై ఉన్న మక్కువ ప్రశ్నించరానిది. ఈ దృష్టితో గీతలో ఉపనిషత్సారము, ఉపనిషత్ వాక్యాల ప్రకరణలు వ్రాశారు. కాలక్రమేణ కొన్ని గణితంతో ముడివడి ప్రజల్ని ఆకర్షిస్తాయి. అవధానాలలో పద్యాలు ఎలా చెప్పినా చెప్పకపోయినా గంటల సంఖ్యచెబితే కొందరు పరవశించినట్లు ఆ దృష్టితో 4 గకారాలు, అదృష్టసంఖ్య 18 లాంటివి వివరించారు.

ఇక కొందరికి అనవరత పఠనంవల్ల స్ఫురించు అంశాలు చెప్పాలనే ఆలోచన. ఈలాంటివి కూడా స్వాములవారు విన్నవి, తెలుసుకొన్నవి, ఆలోచించదగిన వాటిని ఎన్నో చెప్పారు.

గీతా - తలకిందులు చేసి చదివితే తాగీ (త్యాగం)
'ధ'తో మొదలయి 'మ'తో అంతం - ధర్మమే గీత
'అథ'తో మొదలై 'ఇతి' మంగళవాచకంతో పూర్తి.

ఇది ఆర్షసంప్రదాయం

మార్గశిర శుద్ధ ఏకాదశి గీతజన్మదినం - గీతాజయంతి.

ఒక అంశం పట్ల దైవత్వం స్థిరీకరణ అయితే అపుడు నానావిధాల కీర్తన కూడా మొదలు కావడం సహజం. అందుకే గీతకు సంబంధించిన అష్టోత్తరశతనామావళి లాంటివి. ఇవి శ్రౌతమార్గానుయాయులకు ఇష్టమైనవివని వేరే చెప్పపనిలేదు. గీతలోని కృష్ణార్జున నామములు ఈలాంటివే.

ఇక రెండవ భాగం 'ఉపోద్ఘాతం' వైదుష్యప్రతిపాదుక భాగం. భగవద్గీతకే ఎందుకు ప్రాధన్యమనడాన్ని నిలబెట్టవలసిన బాధ్యత ఉన్నది. అందుకే "వివిధగీతలు భగవద్గీత స్థానము" అని ఒక ఉపప్రకరణం స్వాములవారు వ్రాశారు. ఒకప్పుడు పశుహింసలతోడి యాగాలకు ఆదరణ. తరువాతి కాలంలో పిండితో తయారుచేసిన జంతు ఆకారముల నివేదన. ఇవన్నీ ఆడంబర సూచకాలు. అనేకానేక వ్యక్తుల సహాయ సంపత్తులతో వ్యయ ప్రయాసలతో చేయదగ్గవి. కాని 'గీతాయజ్ఞం' అలాంటివి కావు. అందుకే స్వాములవారు సంచారాలు చేసి ఈ యాగాలను పరిపుష్టి చేసి 'అందరిదీ యాగమని' నిరూపించారు. ఈనాడు ఆ స్ఫూర్తితోనే గీతాజయంతులు, గీతాయజ్ఞాలు జరుగుతున్నాయి.

'గీత' ముసలి వారికి కదా! వైరాగ్య భావన కలవారికి కదా? లౌకిక జీవితానికి ఈ గీత అధ్యయనానికి సంబంధం పొసగదని కొందరి భావం. కాని ఈ అంశంలో 'తిలక్' దృష్టి అసామాన్యమే. 'కర్తవ్యనిష్ఠ'ను బోధించినదీ గీత. స్వాతంత్ర్య సంగ్రామ యోధులకు ధైర్యజనకమయినదీ గీత. భగవద్గీతలో లౌకికాంశాలు ఎన్నో ఉన్నాయని నిరూపించడానికి చేసిన ప్రయత్నమే గీతయందు సర్వభూతదయ, గీతయందు సమత్వము, గీతలో కొత్త పోకడలు, త్యాగం, సన్న్యాసం, యోగం, తపస్సు లాంటి శీర్షికలు. అన్నిటికన్నా భారతీయులు సర్వేసర్వత్ర విశ్వశ్రేయః కాముకులు, శాంతిమంత్రాలు ఇందుకు సాక్ష్యాలు. గీత కూడా ఆ కోవలో చేరే ధర్మతరంగిణి.

అద్వేష్టా సర్వభూతానాం (12 అ)
సర్వభూత హితే రతాః (12 అ)
నిర్వైరస్సర్వభూతేషు (12 అ) -

ఈ వాక్యాలు విశ్వప్రేమ సూచకాలు. ఆలాగే సమత్వాంశం. అన్నమయ్య బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొకటే అని చెప్పడానికి -

విద్యావినయసంపన్నే, బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకే చ, పండితాః సమదర్శినః ॥

5.18 శ్లోకమే సాక్ష్యం,

ఓ జీవుడా! నీప్రేమను, దయను పుణ్యాత్ముల పైననే గాక పాపాత్ములపై గూడ వర్షింపుము. మానవునిపైననే గాక దానవులపైన గూడ వెదజల్లుము. ద్విపాదులపైననే గాక చతుష్పాదులపైన గూడ విస్తరింప జేయుము. ఇలాంటి బోధ ఇతర మత బోధనలో మనకు కనిపించవు.

ఆలాగే 'సమలోష్టాశ్మ కాంచనః', 'సమశ్శత్రౌ చ మిత్రేచ', లాంటివి సార్వకాలికములు, సద్బోధకములు, సర్వ జనానుసరణీయములు, శాంతి దాయకములు. ఇవి పురాణసంప్రదాయానికి చెందినవయినా విదేశీయుల్ని ఆకర్షించిన సత్యాలు.

స్వాములవారు 72 నుండి 75 దాక గీతయందు కర్మయోగము, గీతయందు భక్తి యోగము, గీతయందు రాజయోగము, గీతయందు జ్ఞానయోగము అనే అంశాలను

సంగ్రహంగా చెప్పారు. ఈ అంశాలే వ్యాఖ్యానంలో విస్తృతింపబడ్డాయి. గీతాతత్త్వం సంగ్రహంగా చెప్పడమే ఈ శీర్షికల అంతరార్థం. సాధనక్రమం చెప్పడం ఈ ఉపప్రకరణాల ప్రయోజనం. ఈసాధనలో దుర్బలత్వం పారద్రోలుట, మధ్య మార్గం అనుసరించుట, వైరాగ్యం చేబట్టడం, శ్రద్ధా విశ్వాస పాలనావశ్యకతలు చెప్పబడ్డాయి.

నేటి మానవ జీవితం సంశయాత్మకం. భౌతిక వాదజనిత ఆవేశ అనుగ్రహ తిరస్కారాదులు ఎక్కువ. అందుకే గీతలో నిషేధింపబడిన ఆచారవిచారములగూర్చి స్వాములవారు చర్చచేశారు. కామ్యబుద్ధితో ఆచరణ, అకర్మణ్యత్వం, చార్వాకమతం, భౌతికవాదం, డాంభిక తపము, మిథ్యాచారముల పట్ల జాగరూకత కలిగివుండాలని సన్న్యాసిగా, అనుష్ఠాన వేదాంతిగా, త్రికరణ శుద్ధిగల ప్రచారకునిగా సందేశమిచ్చారు.

చివరగా లౌకికవాదుల అల్పసంశయాలను తీర్చేవిధంగా కురుక్షేత్రంలో స్వల్పసమయంలో గీతచెప్పబడిన గీతాప్రబోధిత యజ్ఞమునకు గల రహస్యార్థాలను యుక్తి యుక్తంగా వివరించారు. దైనందిన జీవిత సమస్యలకు గీత సహాయకారి అనడాన్ని విస్పష్టం చేశారు. అరిషడ్వర్గాల ప్రకోపానికి అరుదయిన మందులను సూచించారు. విషయసూచికకు ముందు భాగంలో మలయాళ తీంద్రుల, వివేకానందుల, మహాత్మాగాంధి మొదలయిన వారికి గీతపట్ల గల గౌరవాన్ని వారివాక్యాలతోటి స్పష్టం చేశారు. గీతావ్యాఖ్యానాలలో 'గీతామకరందం' అతులం, అమోఘం, అపూర్వం, అనేకార్థబోధం. సర్వజనాంగీకృత జీవిత సంతాపములకు గీత రామబాణ దివ్యౌషధము.

With Best Compliments From :

P.R.B. BRICKS INDUSTRY

Aalaya Residency A/c ఆలయ రెసిడెన్సీ A/c

A/c & Non-A/c Rooms
Available

Pro. P. Prasada Rao
D.No. 16/267,
Panagal Road,
SRIKALAHASTHI
Chittoor-Dist. A.P.
Cell : 9440076236, 9000625659

శ్రీశుకబ్రహ్మాశ్రమ ప్రశస్తి

- డా॥ మల్లెల గురవయ్య
(మదనపల్లి)

ఆంధ్రప్రదేశ్‌లోని ఆశ్రమాలు అన్నింటిలో అగ్రగణ్యమైంది శ్రీవ్యాసాశ్రమం. అది మహర్షి శ్రీమలయాళ సద్గురు వర్యులచే ఆయన తపస్సిద్ధిపొందిన అనంతరం నంది కొండల మూలమైన కాశీబుగ్గలో 1926వ సంవత్సరం ఏర్పేడు ప్రాంతములో ఏర్పడిన సుప్రసిద్ధ దివ్యాశ్రమం. అష్టాదశపురాణాలు ఉపపురాణాలు రచించి, సాత్యవ తేయుడుగా సారస్వత సామ్రాజ్యాన్ని అధిష్ఠించుటయే కాకుండా వ్యాసుడుగా పేరు కెక్కిన ఏ మహనీయుడు సర్వలోకారాధ్యుడో ఆయన పేరుతో వ్యాసాశ్రమాన్ని స్థాపించిన శ్రీ మలయాళస్వామి భవిష్యద్దృష్టి లోకోపకారకమై, శుష్కవేదాంతతమోభాస్కరమై ప్రకాశించింది.

వ్యాసాశ్రమం వెలసిన తర్వాతనే ఎన్నో ఆశ్రమాలు దానికి అనుబంధ సంస్థలుగా యావదాంధ్ర ప్రదేశంలో నెలకొన్నాయి. అనంతరం సమగ్ర ఫలసంపత్తితో, సర్వ స్వతంత్రప్రతిపత్తితో వెలసిన ఆశ్రమాలు కూడా కొన్ని ఏర్పడ్డాయి. కానీ వాటిపైన కూడా వ్యాసాశ్రమప్రభావం పరిపూర్ణంగా ఉందని నాప్రగాఢ విశ్వాసం. అట్టి వానిలో ముఖ్యంగా ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకొన్న ఆశ్రమం శ్రీకాళహస్తి స్వర్ణముఖీ తీరంలో, శ్రీవిద్యా ప్రకాశానందగిరి స్వాములవారు 20-1-1950 విరోధి నామ సంవత్సరం మాఘ శుద్ధవిదియ శుక్రవారం స్థాపించిన శుకబ్రహ్మాశ్రమం. ఈ ఆశ్రమ నామధేయంలోనే, ఎంతోవైశిష్ట్యం, భవిష్యత్సర్వతో ముఖవికాసధ్యేయం పరిపూర్ణంగా ప్రతిఫలించాయి. బ్రహ్మవిద్యాప్రచారాన్ని ఆనందోత్సాహాలతో ప్రకాశమానం చేయగలిగేస్ఫూర్తి, దీప్తి 'శుకబ్రహ్మ' అనే పేరులో ఎంతో ఔచిత్యాన్ని, సత్యాన్ని ప్రతిష్ఠించాయి. శ్రీమలయాళస్వామికి పుత్రుని వంటి వాడైన శ్రీవిద్యాప్రకాశానందగిరి, వ్యాసుని పుత్రుడైన శుకునిపేరుతో ఆశ్రమం స్థాపించి, పరంపరా గతమైన ఒక గొప్పసనాతన సంప్రదాయాన్ని నిలబెట్టినట్లైంది. కేవలం 'శుకాశ్రమం' అనకుండా బ్రహ్మవిద్యలో తానే బ్రహ్మ పదాన్ని అనుసంధించి, పెట్టిన ఈ పేరు అన్నివిధాలా అర్థవంతమై, 'విపులా చ పృథ్వీ' అన్నట్లు విస్తరించి, ఘనతరమైన ప్రశస్తిని చాటింది.

వ్యాసాశ్రమం ఏ మహాలక్ష్యానికి సాక్ష్యంగా నిలిచి, మలయాళ స్వామి ఆశయ సిద్ధికి కేంద్రంగా అన్ని కోణాలలో అభివృద్ధిని సాధించి ఆధ్యాత్మిక విప్లవానికి ఆధారపీఠమైందో, అదే లక్ష్యంతో శుకబ్రహ్మాశ్రమం కూడా అనితర సాధ్యమైన ఆధ్యాత్మిక ప్రగతిని సాధించి, ఆంధ్రావనిలో అంతటా తన పేరును చిరస్థిర ప్రశస్తితో నిలుపుకొనింది. అవధూతలలో ఆద్యుడు, కేవలం పరబ్రహ్మ భావన తప్ప లేశమైనా లౌకికవాసనలు లేని మౌని పుంగవుడు, శుకమహర్షి బ్రహ్మమునకు అభిన్నుడు. కావుననే శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు తన ఆశ్రమమునకు 'శుకబ్రహ్మాశ్రమము' అని పేరు పెట్టి అన్ని విధముల దాని సార్థకతను చాటినారు. ఆశ్రమ నిర్మాణము కేవలము పరార్థానికే గాని అందులో స్వార్థము లేశమున్నప్పటికీ అది క్లేశమునకు చివరలో స్వీయ వినాశమునకు దారి తీయును. లోకోపకార కారకమైనప్పుడే ఆశ్రమము ప్రశస్తికెక్కును. సన్న్యాసము స్వీకరించిన అనంతరమే తనదారి తనది అన్నట్లుగా స్వార్థముతో ఆశ్రమ స్థాపన చేసినచో అది అనతి కాలములోనే పతనావస్థకు

పొల్పడును. స్వస్తిశ్రీసర్వజిన్నామ సంవత్సరము ఆషాఢశు ద్ధైకాదశి ఆదివారము అనగా 29-6-1947నుండి 3-7-1947 వరకు చాతుర్మాస్య వ్రతారంభ సందర్భములో ఆనందమోహనుడు బ్రహ్మచర్యము నుండి సన్న్యాస దీక్షాప్రదానుడైనాడు. సన్న్యాస దీక్షఇచ్చుటకు వలసిన అన్నివిధములైన అర్హతలను శ్రీమలయాళ స్వామి ఆనంద మోహనునిలో పరిశీలించినాడు.

కొన్నింటిలో పరిపక్వతను సాధించుటకై 1942వ సంవత్సర మంతయు మౌనదీక్ష పాటించునట్లుచేసినాడు. అంతేకాదు సాధనకు అనుకూలముగా గుహాశ్రమములో ఉండుటకు నియమించినాడు. అన్నింటిలో గురువు అడుగుజాడలలో మెలగుతూ 'ఆనందమోహనుడు' అందరిచేత 'చిన్నస్వామి' అని పేరు తెచ్చుకొన్నాడు. దేశానికి 'స్వరాజ్యము' సిద్ధించుటకుముందే తాను ఆశించిన స్వారాజ్యము ఎట్లుండవలెనో మలయాళస్వామి తన ఆదర్శప్రాయజీవన రీతిలో నిరూపించి, దత్తపుత్రుడు, అనుంగు శిష్యుడైన బ్రహ్మచారి ఆనందమోహనునిలో ఇకపై బ్రహ్మవిద్యా సంబంధమైన ఆనందమే స్థిరమై ప్రకాశింపవలెనని ఆశించియే సన్న్యాస దీక్షా సందర్భములో శ్రీవిద్యా ప్రకాశానంద గిరి అనుపేరు పెట్టినాడు. మాతృమూర్తి సుశీలాదేవి సమ్మతిని కూడా పొందిన అనంతరమే సన్న్యాస దీక్షా ప్రదానము జరిగినది. 1936నుండి గురుకులాశ్రమంలో ఏలాగున మెలగవలెనో ఆనందమోహనుడు పరిపూర్ణంగా గ్రహించి చక్కని అనుభవాన్ని పొందినాడు. ఆ సందర్భంలోనే ఆశ్రమం యొక్క ప్రాధాన్యవేమిటో గుర్తించినాడు. భవిష్యత్తులో తాను సాధించవలసిన కార్యక్రమము లేవేమి ఉన్నవో అన్నింటిని ఆచరణలో నిరూపించుటకు తప్పక ఆశ్రమము యొక్క ఆవశ్యకత ఎంతో ఉన్నదని గ్రహించి, అనుభవాన్ని సంపాదించిన అనంతరమే ఆశ్రమ స్థాపనకు శ్రీవిద్యాప్రకాశానందగిరి పూనుకొన్నారు. తాను సంపాదించిన విజ్ఞానాన్ని అనేక గ్రంథాల రూపంలో ప్రచురించారు. భారతరత్నాకరము, యోగవాసిష్ఠ రత్నాకరము, ఉపనిషద్రత్నాకరము, బ్రహ్మచర్య విజయము, బ్రహ్మానంద వైభవము, పరమార్థ కథలు, తత్త్వసారము, అధ్యాత్మ జడ్జిమెంటు, ఓమనస్సా ! వినుమా! - వంటి అనుభవ పూర్ణములైన రచనలు ఎన్నో చేశారు. ఈశ్వర ప్రేరిత మహావక్త శ్రీవివేకానందస్వామి రచనలు చదివి, తన అనర్గళ వక్తృత్వ ప్రభావంతో గీతా జ్ఞానయజ్ఞాలు నిర్వహించారు. తన తపోబలంతో గీతామకరందం గ్రంథాన్ని ప్రచురించి, ప్రచారం చేసి ప్రజల్లో ఆత్మానందాన్ని పరిపూర్ణంగా నింపారు. ఆయన అనర్గళవాగ్వైభవం సాటిలేనిది.

ఆయన ఉపన్యాసం నిజంగా గంగాఝరి. ఇసుక వేసిన రాలనంతజనం అనేది అతిశయోక్తిగా నేను అనుకొనే వాణ్ణి. ఒక సందర్భంలో ఏదో కాకినాడకు పోయినప్పుడు ఆయన ఉపన్యాసం విని ఇళ్లకు వెళ్లే జనాన్ని చూచినప్పుడు అది సహజోక్తి అనియే అనిపించింది. బ్రహ్మ విద్యా ప్రచారోద్యమం లోకోపకార సేవాకార్యక్రమాలకు ఆశ్రమం అనివార్యం అని గ్రహించియే శ్రీవిద్యాప్రకాశానంద గిరి స్వాములవారు ఎంతో ప్రశాంతమైన వాతావరణంలో, శ్రీకాళహస్తీశ్వరునికి అతి సన్నిహిత సమీపస్థలంలో ఆశ్రమ నిర్మాణం తలపెట్టినారు. ఈ ఆశ్రమములోనే కన్నప్ప కంటి ఆసుపత్రిని నెలకొల్పారు. విద్యాసంస్థలకు వలసిన వితరణము ఒసగినారు. మానవ సేవయే మాధవసేవగా భావించి దానిని ఆచరణలో అనుష్ఠించి చూపుటకు ఆశ్రమమే శరణ్యం. జ్ఞాన ప్రసూనాలతో ఆశ్రితజనమిళిందాలను ఆకర్షించి ఆనందా స్వాదన కలిగించుటకు ఆశ్రమమే అన్ని విధాల అనుకూలమైన ఆశ్రయం.

శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి

జీవితచరిత్రను వ్రాయుసందర్భంలో శ్రీశుకబ్రహ్మాశ్రమంలో శ్రీసముద్రాల లక్ష్మణయ్యగారితో పాటు నేనుకూడ ఉండి ఆయనపనిలో సహకరించే పరిస్థితి 1990లో ఏర్పడింది. అప్పుడు ఆ ఆశ్రమ వాతావరణంలో పొందిన అనుభూతి ఎన్నటికీ మరువరానిది. శుకబ్రహ్మాశ్రమ ప్రసిద్ధి ఏమిటో అనుభవ పూర్వకంగానే గ్రహించుట నాఅదృష్టము.

శ్రీశుకబ్రహ్మాశ్రమ ప్రారంభదశలో నాటి శ్రీబ్రహ్మచారి గోపాల్ నేటి పీఠాధిపతి శ్రీవిద్యా స్వరూపానందగిరి స్వాములవారు, ఆ తరువాత శ్రీ ఈశ్వర్ గారు చేసిన కృషిని కన్నులారా చూడకపోయినప్పటికి విని ఎంతో సంతోషించాను. ఎంతో నిస్స్వార్థంగా ఆశ్రమస్థాపనలో సహకరించిన మహాశయులున్నందు వలననే దాని ప్రశస్తి ఈనాటికీ కొనియాడబడుతూ ఉంది. శ్రీవిద్యా ప్రకాశానందగిరి స్వాములవారి శతజయంతి సందర్భములో వారు స్థాపించిన శ్రీశుకబ్రహ్మాశ్రమ ప్రశస్తిని గురించి ఈ నాలుగు మాటలు పాఠకుల ముందుంచుటకు అనుమతించిన ఆ ఆశ్రమపీఠాధిపతులకు తన్నిర్వాహకులకు నాహృదయ పూర్వక నమస్సుమాంజలులు ఘటిస్తూ ఉన్నాను.

శుకబ్రహ్మాశ్రమాన్ని గురించి ఎంతైనా వివరించే అవకాశం ఉన్నది. ఆ ఆశ్రమ ప్రాంగణంలో అడుగిడగనే కలిగే అనుభవం, ఆ వాతావరణంలో ఉండే మధురము, ఆశ్రమ స్థాపకుడైన శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి అద్భుత ప్రతిభా విశేషాలు, అన్నీ వివరించి ఆ విరించి కూడా వర్ణించలేనంత ''ఆనందపారవశ్యత తప్పక ప్రతి సందర్శకునిలో కూడ కలిగి తీరుతుంది. ఇది ఏదో పొగడ్తకాదు. ఆ దివ్యవాతావరణం అటువంటిది. అచ్చట గల పవిత్రత అనిర్వచనీయం. 'శుకబ్రహ్మ' ఎంతటి మహనీయుడో, ఆయన పేరుకు తగినట్లు ఏదో తెలియని ఆనందము, ఒక అమాయికమైన నిసర్గ రామణీయక ప్రకృతి మనలను పరవశులను గావించి తీరును. ఒక మహాత్ముని పేర ప్రసిద్ధి చెందు ప్రదేశములో ప్రకృతి సిద్ధముగనే ఆ మహనీయుని భావనకు సంబంధించిన వాతావరణము అప్రయత్నంగానే నెలకొనడం ప్రకృతి సహజం. సహజమైన అట్టి విశుద్ధ వినిర్మల చిత్తవృత్తి మన మనోమాలిన్యాన్ని ప్రక్షాళన చేసి శాశ్వత సత్ పథంలో మనకు విశ్రాంతిని కలిగిస్తుంది. తేజోలోకంలో విరాజమానులై ఉండే ఆ విశుద్ధాత్మల నుండి వారంతకు ముందు మెలగిన ఆ ప్రాంతమును మహిమాన్వితం చేస్తుంది. ఆదే మనస్వాంతమునకు అ విశ్రాంతమైన మనశ్శాంతిని ప్రసాదిస్తుంది. శుకబ్రహ్మాశ్రమము అను పేరు ఆనాడేదో యాదృచ్ఛికముగా స్వాములవారు పెట్టి ఉండవచ్చునని పలువురు భావించవచ్చు. కాని దాని అంతర్గూఢ పరమ రహస్యము నిత్య ప్రసార మనోజ్ఞమై, తర్వాతి తరములవారి ఆత్మవికాసమునకు సర్వదా దోహదము కలిగించుచునే యుండుననుట యథార్థము, ఇది ముమ్మాటికి సత్యము. ఒక మహాసంకల్పముతో ఆవిష్కరింపబడిన మహాత్ముల దివ్యాత్మ తలచినపుడెల్ల తన ఆమోదముద్రను ఆశీస్సుల రూపములో అందజేస్తూనే ఉంటుంది.

మహోన్నతలక్ష్యంతో నిర్మింపబడిన సంస్థ దాని స్థాపకులు కాలగర్భంలో కలిసిపోయినను, వారి దివ్య సంకల్ప ప్రభావం వల్ల అది సదా ప్రకాశమానమై, అచలమైన గిరివలె అత్యున్నత స్థితిని పొంది, శతాధికవర్ష ప్రహర్ష స్ఫూర్తితో ఆనంద మోహనమై తన సహజసౌశీల్యమును చాటుచునే ఉండుననుట నిక్కము. శుకబ్రహ్మాశ్రమ ప్రసిద్ధి ఇంకను సంపూర్ణానంద సిద్ధిప్రదమై విజయ దుందుభులు మ్రోగించి విశ్వ శ్రేయస్సును కలిగించుగాక.

శ్రీకాళహస్తి, విద్యాప్రాకాశ్యము, తత్స్వరూప రమణీయత శుద్ధాకాంక్ష నిర్మితాశ్రమమేకాలము స్మృతినిలుచుసుమి! శుకబ్రహ్మా!

ఉత్తమ గురువు - ఉత్తమ శిష్యుడు

- ఆచార్య పి.వి.అరుణాచలం
(తిరుపతి) (విశ్రాన్త ఉపకులపతి)

శ్రీకాళహస్తీశ్వరుని దివ్యక్షేత్రం దక్షిణకాశిగా ప్రసిద్ధికెక్కింది శ్రీకాళహస్తి. ఈ దివ్యక్షేత్రానికి మరోసరికొత్త ఆధ్యాత్మిక పార్శ్వాన్ని ప్రసాదించారు- స్వర్ణముఖీ నదీ తీరంలో శ్రీ శుకబ్రహ్మాశ్రమాన్ని స్థాపించి, అనేక ఆధ్యాత్మిక, తదితర సేవాకార్యక్రమాలను కొనసాగించడానికి శ్రీకారం చుట్టిన అవతారమూర్తి పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు.

వీరు స్వస్తి శ్రీ ఆనందనామ సంవత్సరం చైత్ర బహుళతదియ సోమవారంనాడు, అంటే 1914, ఏప్రిల్ 13వ తేది, కృష్ణాజిల్లా, మచిలీపట్నంలో జన్మించారు. వీరి తండ్రి ప్రఖ్యాత న్యాయవాదులు శ్రీతూనుగుంట్ల రామస్వామి గుప్తగారు, తల్లి శ్రీమతి సుశీలాదేవిగారు. వీరు పుణ్య దంపతులు, పుణ్యజీవులు.

శ్రీ గురుదేవుల పూర్వాశ్రమనామం ఆనంద మోహన్- తల్లిదండ్రులు పెట్టినపేరు. ఆనందమోహన్‌లో చిన్నప్పుడు నుంచి కుశాగ్రబుద్ధి, ఆధ్యాత్మిక సాహిత్యప్రియత్వం, దేశభక్తి కొట్టవచ్చినట్లు కనబడేది. తండ్రిగారే వీరికి తొలి ఆధ్యాత్మిక విద్యాగురువు. బాల్యంలోనే వీరు ఆధ్యాత్మిక గ్రంథాలను, వేదమంత్రాలను, ఉపనిషత్తులను, పాఠశాల పాఠ్యగ్రంథాలతో బాటు శ్రద్ధగా చదువుకొన్నారు. అనేక శాస్త్ర పాండిత్యంతోబాటు, మానవజీవితానికి, ప్రకాశంతోబాటు పరిమళాన్ని సమకూర్చే- పరోపకారం, దయ, కరుణ మొదలైన సద్గుణ సంపద వీరి అండజేరింది-

వీరు తను పదుమూడో ఏట స్కూల్‌ఫైనల్ ముగించి, బందరు నోబుల్ కళాశాలలో చదివి, బి.ఏ. పట్టా పుచ్చుకొన్నారు. వీరు 1930 నుంచి అపక్వాహారమే స్వీకరిస్తూ, ఆధ్యాత్మిక జీవనాన్ని కొనసాగించారు.

వీరి విద్యాభ్యాస కాలంలో సద్గురుదేవులు, ఏర్పేడు వ్యాసాశ్రమ వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ మలయాళస్వామివారు, ఆధ్యాత్మిక విజయ యాత్రలు చేసుకొంటూ ఒక పర్యాయం శ్రీ ఆనందమోహన్ ఇంటిని పావనం చేశారు. అది ఒక అద్భుత సన్నివేశం. శ్రీరామస్వామిగుప్తగారు ఆనంద మోహన్‌ని, తన ఐదుగురు పుత్రులలో మూడోవారిని, నివృత్తిధర్మశిక్షణ కోసమని, శ్రీమలయాళస్వాములవారికి అప్పగించిన చారిత్రక సంఘటన అది.

శ్రీకాళహస్తి శ్రీ శుకబ్రహ్మాశ్రమ ప్రస్తుతపీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములు సెలవిచ్చినట్లు, "ఆ సమర్పణ ఘట్టము, భారతచరిత్రలో సువర్ణాక్షరములతో లిఖింపదగినది".

శ్రీ మలయాళస్వాములవారు 1932లో ఆనందమోహనుల వారికి మంత్రోపదేశం చేశారు. ఆనందమోహనులవారు ఒక వైపు బ్రహ్మవిద్య, మరోవైపు

సంస్కృత, ఆంగ్ల విద్యలతోబాటు హిందీని కూడా అభ్యసించి రాష్ట్ర భాషా విశారదులైరి. మహాత్మాగాంధీగారి నాయకత్వంలో స్వాతంత్ర్యోద్యమం వేగాన్ని పుంజుకొంటున్న రోజుల్లో హిందీని అభ్యసించడం వారి దేశభక్తికి నిదర్శనం.

ఉన్నతస్థాయిలో హిందీ అభ్యాసానికి ఆనంద మోహనులు 1935లో కాశీకి వెళ్ళారు. కాశీవిద్యాపీఠంలో చదివి హిందీభాషాకోవిదులైనారు. విద్యాపీఠంలో గిరీశ్ చంద్రపంత్ అనే ఒక ప్రజ్ఞావంతుని సాహచర్యంతో ఆధ్యాత్మిక విద్యలో గొప్ప ప్రగతిని సాధించారు ఆనందమోహన్.

కాశీలో చదివేకాలంలో ఒక రోజు పంత్‌తో కలిసి ఆనందమోహనులు గంగానది కావల ఆశ్రమవాసులైన ఒక అవధూతను దర్శనం చేసుకొన్న తరుణంలో ఆ అవధూత మన స్వామినుద్దేశించి "దక్షిణదేశంలో ఆధ్యాత్మికకాంతిని గలిగిస్తావు" అని దీవించారు.

కాశీలో ఉన్నప్పుడు అనేక ఆధ్యాత్మిక, తాత్త్వికగ్రంథాలను ఆపోశనం పట్టారు ఆనందమోహనుల వారు. ఒకసారి కాశీవిద్యాపీఠం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, (AICC) సమావేశాలకు వేదిక అయ్యింది. గాంధీజీ రాజేంద్రప్రసాద్, వల్లభాయ్ పటేల్ లాంటి మహానాయకులు విచ్చేశారు. ఆనందమోహనులు, దేశభక్తి ప్రేరకులై, స్వచ్ఛంద సేవకునిగా సమావేశాల విజయానికి శ్రమించి, మహాత్మాగాంధీగారి దినచర్యను ప్రత్యక్షంగా చూచి సమ్మోహితులైనారు. భవిష్యత్తులో దానిని ఆదర్శంగా తీసుకొని తన జీవితాన్ని పావనం చేసుకొన్నారు మన ఆనంద మోహనులవారు.

కాశీ విద్యాభ్యాసం ముగియవచ్చిన సమయంలో ఒకసారి వీరు సోదరితో, బావగారితో హరిద్వారంవెళ్ళారు. అక్కడ వీరు పడవ ప్రయాణం చేసేటప్పుడు గంగానదిలో, గడ్డికుప్ప ఒకటి కొట్టుకొని వీరు పయనిస్తూ ఉన్న పడవను సమీపించింది. ఆనందమోపన్ ఆ కుప్పను పడవలోనుంచి చేతికి తీసుకొని పరిశీలించారు. అందులో ఉన్నది కుంకుమ, పుష్పాదులతో పూజింపబడి నాగరలిపిలో ఉన్న భగవద్గీత. అది ఒక అద్భుత సంఘటన. చదువు ముగించి ఏం చేయాలని సందిగ్ధావస్థలో ఉన్న ఆనందమోహన్‌ని పులకింప జేసిన అద్భుతమిది. పులకాంకితుడైన ఆనందమోహన్ గంతులేసి సోదరికి బావగారికి, గీతనుచూపించారు. ఇంకా పై చదువులకే పోవడమా, లేక మానుకొని ఆశ్రమవాసం చేయాడమా - అనే సందేహంలో ఏ నిర్ణయం తీసుకోలేక తటపటాయిస్తూ ఉండిన ఆనందమోహన్‌కు ఈ సంఘటనతో సందేహనివారణ అయ్యింది. "నన్ను ఇక నుంచి గీతాసేవ చేయుమ"న్నది భగవత్సదేశమని ఆనందంతో ఉప్పొంగి పోయాడు ఆనందమోహన్.

వారు 1936 మే 17న, పవిత్రదినం ఏకాదశినాడు ఏర్పేడు వద్ద శ్రీమలయాళస్వామి స్థాపించిన వ్యాసాశ్రమంలో ప్రవేశించారు. శ్రీ అసంగానందగిరిస్వామివారనబడే శ్రీమలయాళ యతీంద్రులవారు, వీరికి నివాసవసతు లేర్పరచినారు, మహావాక్యాలను ఉపదేశించారు.

ఆశ్రమానికి చివరిగా ఉన్న కుటీరం ఆనంద మోహనులది. అపక్వాహారం, మహావాక్యమననం, నిదిధ్యాసనలు, ధారణాధ్యానాలు, గీతాపారాయణం, యోగవాసిష్ఠ ప్రవచనం - ఇవి వారిదైనందిన కార్యక్రమాలు.

వ్యాసాశ్రమంలో శ్రీ సద్గురు మలయాళస్వామిని పెద్దస్వామి అని, ఆనందమోహనులను చిన్నస్వామి అని భక్తులు ముచ్చటించుకునేవారు.

ఈ విధంగా తపోదీక్షతో గురు సన్నిధిలో పన్నెండేడ్లు ధ్యాననిష్ఠతో గడిపారు శ్రీ ఆనందమోహన్‌లవారు. శిష్యరత్నం యొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనములు, సమాధ్యను భవాదులకు సంతృప్తి చెంది గురుదేవులవారు - వీరికి సన్న్యాసమిచ్చారు. గురుదేవులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం సర్వజిన్నామ సంవత్సరం, ఆషాఢ శుద్ధ ఏకాదశి ఆదివారం నుండి పౌర్ణమి గురువారం వరకు అనగా 29-6-1947 నుండి 3-7-1947 వరకు శాస్త్ర విధానం ప్రకారం శ్రీ ఆనందమోహనులవారు తురీయాశ్రమాన్ని స్వీకరించారు, శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములయ్యారు.

సంన్యాసం స్వీకరించిన పిదప కొంతకాలం శ్రీవ్యాసాశ్రమంలోనే గడిపారు. తరువాత ప్రత్యేకంగా ఒక ఆశ్రమాన్ని నెలకొల్పాలని సంకల్పించారు.

శ్రీవ్యాసాశ్రమానికి సుమారు 15 కిలో మీటర్ల దూరంలో శ్రీకాళహస్తి పావన సువర్ణముఖీ తీరంలో శ్రీశుకబ్రహ్మాశ్రమం - విరోధినామసంవత్సరం, మాఘశుద్ధ విదియనాడు, అనగా 1950, జనవరి 20న, శ్రీ సద్గురు మలయాళ స్వాముల వారి అమృతహస్తాల మీదుగా ప్రారంభింపబడినది.

ఆశ్రమంలో గీతా పారాయణ ప్రవచనాల కవసరమైన ఒక ప్రార్థనామందిరం కావలసిన వచ్చింది. ఒక భక్తుని సహకారంతో ఆశించినట్లుగా మందిర నిర్మాణం జరిగింది. ఆ మందిరంలో వికృతినామ సంవత్సరం మాఘ శుద్ధవిదియ, గురువారంనాడు, ఫిబ్రవరి 8,1951 నాడు సూర్యోదయాత్పూర్వం ధనుర్లగ్నంలో శివలింగ ప్రతిష్ఠ చేశారు శ్రీమలయాళ మహర్షి పుంగవులు.

ఆశ్రమ స్థాపన జరిగిన నాలుగేళ్ళకు, 1954లో శ్రీమలయాళస్వామివారు ఏర్పాటు చేసిన సనాతనవేదాంత జ్ఞానసభ యొక్క 28వ మహాసభను శ్రీశుకబ్రహ్మాశ్రమంలో జరుపవలెనని నిర్ణయించినారు. మార్చి 19,20,21 - 1954, తేదీలలో జరిగిన ఈ మహాసభలకు నలుమూలల నుండి భక్తులు విచ్చేశారు.

కర్ణాటకలోని కోలారు జిల్లా - అగరం గ్రామంలో 1955 మార్చిలో 29వ సనాతన వేదాంతజ్ఞాన సభ జరిగింది. ఈ సభలకు శ్రీమలయాళస్వాములవారు శ్రీవిద్యా ప్రకాశానందగిరి స్వామిని అధ్యక్షులుగా నియమించారు. అధ్యక్షులుగా స్వామివారు ఈ సభలను దిగ్విజయంగా, దేదీప్యమానంగా జరిపించారు.

ఆ తరువాత శ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారు విజయయాత్రలుచేస్తూ, ఆధ్యాత్మిక సందేశాలనిస్తూ, గీతాజ్ఞాన యజ్ఞాలను నిర్వహిస్తూ, దేశంలో "భగవద్గీతా జ్ఞాన విప్లవోద్యమా"న్ని నడిపించారు-నిర్విరామంగా, ఆశ్రమస్థాపన అయిన 48ఏళ్ళు, 4నెలలూ తొమ్మిది రోజులకాలంలో.

మహాత్ములు అవతారలక్ష్యం నెరవేరినదనిపించిన తత్క్షణం అవతారాన్ని చాలిస్తారు. అట్లే పూజ్యస్వాములు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు తన 84 సంవత్సరాల వయస్సులో ఏప్రిల్ 10, 1998 నాడు శివసాయుజ్యాన్ని పొందినారు. తరువాత శ్రీవారి సమాధి నిర్మాణం జరిగింది. సమాధి మీద ధ్యానమందిరం నిర్మింపబడింది.

తన జీవితాన్ని భగవంతుని కర్పించి, గురుకృపాలబ్ధి పొంది, తపస్సిద్ధి పొందిన శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వాములవారి జీవితం పరమ పావనమైనది. "స్వయం తీర్ణః, పరాం స్తారయతి" అన్న ఆర్యోక్తికి నిలువెత్తు నిదర్శనం

శ్రీవారు. తాము సాధించిన ఆత్మానుభూతిని, ఇతరులకు కూడా పంచిపెట్టిన మానవోత్తమ ప్రవృత్తి శ్రీవిద్యాప్రకాశానంద స్వాములవారిది.

వారి రచనలు అమూల్యములు, వాసిలోనూ, రాశిలోను గొప్పవి. వారు చాల విస్తృతంగా ఆధ్యాత్మికతత్త్వం మీద అద్భుతమైన రచనలు చేశారు. వారి దివ్యలేఖిని నుండి వెలువడిన గ్రంథము లెన్నో.

1. శ్రీ వ్యాసాశ్రమ తాపసజీవిత కాలంలో ధర్మపథమను బుద్ధగీతను తెనిగించారు.
2. ఆ రోజుల్లోనే యోగవాసిష్ఠ మహాగ్రంథాన్ని సంస్కృతం నుండి తెనుగున కనువదించారు.
3. నూట ఎనిమిది గీతా జ్ఞానయజ్ఞాలు నిర్వహించారు.
4. గీతాసదస్సులు 58 నడిపించారు.
5. యోగవాసిష్ఠాన్ని సంక్షిప్తీకరించి వసిష్ఠగీతను వెలువరించారు.
6. భారతరత్నాకరము, భాగవతరత్నాకరము, రామాయణ రత్నాకరము, ఉపనిషద్రత్నాకరములను వ్రాశారు.
7. మోక్షసాధన రహస్యమనే అమూల్య గ్రంథాన్ని లిఖించారు.
8. తత్త్వసారాన్ని వ్రాశారు.
9. వేదాంతభేరి అనే ఆధ్యాత్మిక మాసపత్రికను 1963లో ప్రారంభించారు. అది విజయవంతంగా వెలువడుతూ ఉన్నది.
10. గుర్వష్టకమని సంస్కృతంలో వ్రాసి శ్రీ మలయాళ గురుదేవులకు సరుర్పించారు.
12. అద్భుతమైన గీతోపన్యాసములు చేశారు.
13. పరమార్థకథలు కూర్చారు.
14. బ్రహ్మచర్యవిజయం వ్రాశారు.
15. బ్రహ్మానంద వైభవాన్ని వ్రాశారు.
16. శ్రీ మలయాళ మహర్షి అను పుస్తకం వ్రాశారు.
17. అమృతబిందువులన్న కృతిని కూర్చారు.
18. మానస బోధను రచించారు.
19. మోక్ష ప్రాప్తికై ఉపదేశచతుష్టయం (మోక్షద్వార పాలకులు అనే గ్రంథాన్ని) దయచేశారు.
20. ఆధ్యాత్మ జడ్జిమెంటు వ్రాశారు.

శ్రీవారు చేసిన కొన్ని ఘనకార్యాలు :

1. భూరి విరాళమిచ్చి స్వామివిద్యా ప్రకాశానంద గవర్నమెంటు ఆర్ట్స్ అండ్ సైన్సు డిగ్రీ కళాశాలను శ్రీ కాళహస్తిలో ఏర్పాటుచేశారు.
2. అవసరమైనంత విరాళమిచ్చి శ్రీవిద్యాప్రకాశానంద స్వామి ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలను ప్రారంభింపచేశారు.
3. భక్తకన్నప్పపేరుతో త్రినేత్ర వైద్యాలయాన్ని స్థాపించి (1994లో) నిరుపేదలకు, శ్రామికులకు, కంటి చూపును మెరుగు పరుస్తున్నారు. వేలకొలది ప్రజలు కంటి ఆపరేషన్లు చేసుకొని ఆనందంతో వెళ్తున్నారు.
4. తిరుమల, తిరుపతి దేవస్థానంవారు చివరి 10గీతా యజ్ఞాలను (99 నుండి 108వరకు) టి.టి.డి. వారి ఖర్చుతో నిర్వహించారు.
5. శ్రీవారు 1981లో చేసిన గీతోపన్యాసాలను రికార్డు చేసి తిరుమల తిరుపతి దేవస్థానం వారు హైదరాబాదులో విడుదల చేశారు.
6. శ్రీ స్వాములవారు స్వయంగా గానంచేసిన తత్త్వగీత,

యతిగీత క్యాసెట్లు విడుదలయ్యాయి.

ప్రతి రచయిత యొక్క కృతులలో ఏదో ఒక రచన చిరస్మరణీయ కృతిగా ఆకృతి పొంది, రచయితకు పర్యాయ పదంగా నిలుస్తుంది. శ్రీవారి లేఖని నుండి వెలువడిన రచనల హారంలో **గీతామకరందం** ఒక మణిపూస. ఈ మహోత్కృష్ట గ్రంథం లక్షలకొలది ముద్రింపబడినవి. వెలువడి ఇప్పటికీ పునర్ముద్రణభాగ్యమందుకొంటున్న ఇట్టి పుస్తకం ఇటీవల కాలంలో మరొక్కటి లేదంటే అతిశయోక్తి కాదు.

శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములు స్థాపించిన శ్రీశుకబ్రహ్మాశ్రమం దినదినాభివృద్ధి చెందుతుడన్నది- ఆశ్రమనిర్వహణ, ఆధ్యాత్మికకార్యక్రమాలు, శ్రీవారి వారసత్వం కొనసాగింపు వగైరాలన్నీ ప్రస్తుత పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారి (పూర్వాశ్రమంలో శ్రీ బ్రహ్మచారి గోపాల్‌గారుగా శ్రీవారికి సన్నిహితులై వ్యాసాశ్రమంలో ప్రసిద్ధులు) నేతృత్వంలో జరుగుతున్నది. వీరికి చేదోడు వాడోదుగానున్న వారు ఉత్తర పీఠాధిపతులు పూజ్య శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు.

భద్రవాక్యములు

బ్రహ్మముహూర్తమందును, సంధ్యాకాలమందును అనేక మంది మహాత్ములు ధ్యాననిష్ఠులై యుందురుగాన, ఆ సమయమున ధ్యానము చేయువారికి, ఆ మహాత్ముల తపశ్శక్తియు, కరుణయు కొంత పొందవచ్చును. ఐతే సాధకుల హృదయములు పరిశుద్ధములై, ఆ మహనీయుల దివ్యశక్తిని గ్రహించుటకు, నిండుప్రేమతో వారి హృదయములను తెరచియుంచవలయును. అటులగానిచో, దానిని పొందలేము. దూరప్రదేశముల నున్నవారు రేడియోలో చెప్పుదానిని మనము వినుటకు, దానిని గ్రహించు యంత్రము మనగృహము నందుండవలెను. లేనిచో, మనమాశబ్దమును వినలేము. ఆ శబ్దతరంగములు మనముందు ప్రవహించుచున్నను మనము వాటిని వినలేము. అటులనే, లోకోద్ధారకులైన శ్రీ వ్యాస, బుద్ధాది మహాత్ముల తపశ్శక్తి కరుణ అనుగ్రహము విజ్ఞానభావనా తరంగ రూపమున శాశ్వతముగ విశ్వమంతట మనముందు, వెనుక సర్వత్ర వ్యాపించియే వెళ్ళుచుండినను, మనహృదయముల మలినముగనే ఉంచి, మూసి ఉంచుటచే ఆ శక్తిని మనము గ్రహించ జాలకున్నారము. త్రుప్పుపట్టిన సూదులనుగాక శుద్ధముగనున్న వాటినేకదా సూదంటురాయి తనవైపునకు ఆకర్శించుకొని తనలో నైక్యపరచుకొనును. అటులనే విశుద్ధ హృదయులైన సాధకులనే త్వరలో తమ వైపునకు ఆకర్షించుకొని మహాత్ములు తమ తపశ్శక్తిని వారికి ప్రవహింపజేసి వారిని కూడ, మహాత్ములుగ జేయుచున్నారు. ఈశ్వరుడైనను అంతియే. త్రుప్పుపట్టిన సూదిగతి యేమగునని అడిగిన రాతిపై రుద్ది త్రుప్పును పోగొట్టిన అదిన్ని సూదంటురాయితో నైక్యమగును. శ్రీ రామకృష్ణపరమహంసలవారు అనేకపర్యాయములు తమ తపశ్శక్తిని విదుచ్ఛక్తివలె శ్రీ వివేకానందునిలోనికి ప్రవహింపజేసి, తమ శిష్యవర్యుని లోకోద్ధారకునిగ జేసి వైచెను. శ్రీరామకృష్ణులు తమ మహాసమాధికాల మాసన్నమైనపుడు విశుద్ధ హృదయుడును, తమ ప్రియ శిష్యుడును నగు శ్రీ వివేకానందులను తన దగ్గరకు రావించి నిండు వినిర్మల ప్రేమ భావముతో ఆయనలోనికి తాను సంపాదించిన తపశ్శక్తినంతయును ప్రవహింపజేసి 'నాయనా! నేడు నా ఆత్మ ధనమంతయు నీకిచ్చి నేను ఫకీరునైతిని. నేనిచ్చిన యీ శక్తితో నీవు లోకము నుద్ధరింపగలవు. తండ్రీ!" అని పరమానందముతో పలికెను. వివేకానందులును పూజ్యగురుదేవుడు తనలోనికి పంపుచున్న దివ్యశక్తిని ప్రత్యక్షముగ ననుభవించు దివ్యభావపరవశు డయ్యెను. ఆహా! పూజ్యగురుశిష్యుల సంయోగ మిట్టిదేకదా! **- మహర్షి సద్గురు శ్రీ మలయాళస్వాములవారు**



సద్గురు చరితమ్
శ్రీసద్గురు విద్యాప్రకాశానందగిరిస్వాములవారి జీవిత సంగ్రహము

-శ్రీవిద్యాస్వరూపానందగిరిస్వాములవారు

రత్నగర్భయని పేరుగన్నది భారతదేశము. జ్ఞాన తేజోవిలసితులగు 'ఆధ్యాత్మికరత్నము' లను కన్నకడుపు గాన భారతమాతకా పేరెంతేని తగియున్నది. అవ్యయమై, అనంతమై, సచ్చిదానంద స్వరూపమైనట్టి బ్రహ్మముయొక్క అనుభూతిని, దైవానుభూతిని పొంది ఆధ్యాత్మిక రాజ్యమున నిరంకుశముగ ప్రవర్తించిన మృత్యుంజయుల కిది పుట్టినిల్లు. కనుకనే మాక్సుముల్లరు వంటివారు భారతదేశమున జన్మించుటే మహాభాగ్యమని యెంచి దానికై తపించిరి. "కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్షత్, ఆవృత్తచక్షుః అమృతత్వ మిచ్ఛన్" అన్న శ్రుతిరీతి అమరులగు ధీరులు, మహాత్ము లుండుట చేతనే నేటికిని ఈ భారతదేశము సర్వ ప్రపంచమునకు మాన్యమై యొప్పుచున్నది. సచ్చిదానంద దైవధ్యానముచే దైవరూపులైన మహాత్ములు 'స్వయంతీర్ణః పరాంస్తారయంతి' అన్నట్లు ఆశ్రితజనులను గూడ తరింపజేయుచున్నారు. ఇట్టికోవకు జెందిన వారు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు.

వీరు భారతమునకు ధాన్యాగార మనబరగు ఆంధ్రదేశమున పవిత్ర కృష్ణవేణీనదీమతల్లిచే పునీతమైన ప్రదేశమగు కృష్ణాజిల్లా మచిలీపట్టణమునందు తమ తల్లిగారి జన్మగృహంలో పవిత్ర వైదికజీవులును, ఆదర్శగృహస్థులును, ఆర్షధర్మమూర్తులును అగు శ్రీ తూనుగుంట్ల రామస్వామి సుశీలాదేవి పుణ్యదంపతులకు లోకమునకు దుఃఖ రాహిత్యము. ఆనందప్రాప్తి చేకూర్చుటకు ఆనందనామ సంవత్సర చైత్ర బహుళ తదియ సోమవారమునకు సరియగు 1914వ సం॥ ఏప్రిల్ 13వ తేది అనూరాధా నక్షత్రం ప్రథమపాదమున ఉదయం 8 గంటలకు జన్మించారు. ఆ దినము కాకతాళీయముగా సౌరసంవత్సరాది (అరవ సంవత్సరాది) యగుటచే జనులు ఆనందముగ వేడుకలు చేసికొనిరి.

వీరి జననీజనకులు చాల దైవభక్తిపరులు. తండ్రిగారు గొప్ప ప్రజ్ఞాశాలి. వారు బి.ఎ.బి.ఎల్. చదివి. తెనాలి, బాపట్లలో ప్రఖ్యాత న్యాయవాదిగా వృత్తిని చేశారు. వీరు పండితులు. అంతేగాక లోకమున వేదప్రతిపాదిత ధార్మిక జీవితమును, గార్హస్థ్య జీవితమును ఆదర్శముగా గడిపి తద్ద్వారా పరమపురుషార్థము నొందుటే లక్ష్యముగా గల్గినవారు. కావుననే తమ సత్యజీవితమునకు ఆధ్యాత్మిక ప్రవృత్తికి లాయరువృత్తి అడ్డు అని భావించి దానిని అవలీలగా వదలిపెట్టిరి. అంతేగాక వీరు వేదప్రతిపాదిత ధర్మమున కనుకూలముగా సంఘమును సంస్కరించుటలో చాల గణనీయమైన కృషి చేసిరి. వీరు తమ ఇంటిని విజయవాడలో ఇంద్రకీలాద్రివద్ద నిర్మించి ఒక పవిత్ర ఆశ్రమంగా, తపోవనముగా నుంచుకొనిరి. వీరు ప్రస్థానత్రయమును భాష్యసహితముగా ప.వ. పూజ్యశ్రీ కళ్యాణానంద



బాల్యంలో శ్రీ స్వాములవారు (ఆనందమోహన్)

విదేశీయ వస్త్రబహిష్కరణ ప్రచారకుడుగా
శ్రీ స్వాములవారు (ఆనంద మోహన్)



శ్రీ స్వాములవారికి గంగానదిలో దొరికిన భగవద్గీత



శ్రీ వ్యాసాశ్రమంలో బ్రహ్మచారిగా శ్రీస్వాములవారు

భారతీస్వామివారి వద్ద అధ్యయనము చేసిరి. ఇట్టి పవిత్రజీవులకు పుత్రులుగా పుట్టిన మన స్వాములవారు పుట్టుకలోనే పవిత్రులగుట సహజమే కదా!

ఆనందనామ సంవత్సరమున పుట్టుటచేత వీరికి తల్లిదండ్రులు "ఆనందమోహన్" అని పేరు పెట్టిరి. పూవు పుట్టగనే తన పరిమళమును వెదజల్లునట్లు వీరు బాల్యము నుండియు చక్కని కుశాగ్రబుద్ధి కలవారై, ఆధ్యాత్మిక ప్రియులై యుండిరి. వీరు చిన్ననాటినుండి విజయవాడయందలి ఓంకార నిలయమను తమ గృహరూప ఆధ్యాత్మిక పాఠశాలయందు గణనీయమయిన చక్కటి ఆధ్యాత్మిక వాతావరణములో పెరిగి పరాపరవిద్యలందు తమ ప్రతిభను సమముగ ప్రదర్శించుచు వచ్చిరి.

తండ్రి గారి ప్రోత్సాహముతో వీరు నిత్యము నిద్రలేచినదే తడవుగ ప్రార్థన సమిష్టిగా చేసి 4 గంటలకు కృష్ణానదిలో స్నానం చేసి ఆపైన గీతాపారాయణ చేయువారు. ప్రతి ఆదివారము ఇంటిలో తండ్రిగారు చెప్పుచుండిన పంచదశి, జీవన్ముక్తి ప్రకాశికాది గ్రంథముల పాఠమందు పాల్గొనువారు. ఇట్లు ఈ ఆనందమోహనులు చిన్ననాటనే ఆధ్యాత్మిక సాహితీప్రవేశమును పొందిరి. వీరు పిన్న వయస్సుననే తండ్రిగారిచే నేర్పబడిన భర్తృహరి సుభాషితములు, శ్రీ శంకరుల ప్రశ్నోత్తరి, ఆత్మబోధ, ఉత్తరరామ చరితము, గాయత్రీ రామాయణము మొదలగునవి చెప్పుచుండ జనులు ఆనందముతో తన్మయులగువారు. గొప్ప సమావేశములందు వీరు మహాసంకల్పము, చూర్ణిక, ఆశీర్వాదములు మొగలగు వేదమంత్రములను సస్వరముగా చెప్పి వాని అర్థమును విశదీకరించుచుండ సభ్యులు విని ఆశ్చర్యముతో హర్షధ్వానములు చేసి మఱల మఱల చెప్పమనెడివారు.

విజయవాడ ఉన్నతపాఠశాలయందు ప్రతి తరగతిలోను ప్రతి విషయమునందును ప్రథమబహుమతి వీరిదే. వీరి గృహములో తండ్రిగారేర్పరచిన నియామానుసారము ప్రతిరోజు 500 గజములు నూలువడకి వారివారి (ఖద్దరు) వస్త్రములకు తగు నూలును వారే సమకూర్చుకొనెడివారు. అటుపిదప ఖద్దరు గుడ్డలు, గాంధీటోపీ ధరించి ఆదివారములందు తన సహోదరీ సహోదరులతో కలసి జెండా చేతబట్టి విదేశవస్త్ర బహిష్కరణాదులందు పికెటింగ్ చేయుచు (చిన్నమూర్తి) ఖాదీని గూర్చి ఉపన్యసించుచుండ బజారులోని శ్రోతృ ప్రజలు భళీ! యని మెచ్చెడివారు. ఇట్లు వారు ఆ చిన్నవయస్సున ఆధ్యాత్మిక సాహిత్యము నొకప్రక్క, వేదమంత్రములను ఉపనిషత్తులను ఒకప్రక్క, తన పాఠశాలా గ్రంథముల నొకప్రక్క చదువుచు అందు ప్రథమమున నెగ్గుచు మరియొకవైపు దేశసేవ యందును తమ కర్తవ్యమును ఆనందముగ నెరవేర్చుచుండుట చూచి అందరును ఇతడు సామాన్యుడు గాడని అపుడే చెప్పెడివారు. వీరికి పరోపకారము, దయ, కరుణ ఉగ్గుపాలతో అబ్బినవి. చిన్న నాటినుండియు ఒక చీమయైనను నీటబడియున్నచో చూచి సహించలేరు. వెంటనే అన్ని పనులు వదలి దానిని బయట పడవేయుచుండిరి. వీరి గృహమున దీపావళికి 108 జ్యోతులతో ఓంకారమును నిర్మించి దానికి ప్రణావాష్టోత్తర శతనామములతో అర్చన చేయుదురు. వీరి కదియే ఆనందము. కాన వారి తండ్రిగారి "టపాసులు వగైరాలు (బాణాసంచా) కాల్చరా" దను నియమమును ఎప్పుడు (ఒకమారు తప్ప) గూడ ఉల్లంఘించి ఎరుగరు. ఆ దీపావళికి వీరి గృహ మొక వైకుంఠముగనే యుండును. వీరి గృహమునందు ఆదివారమునాడు అపక్వాహారము అనగా పండ్లు, పచ్చికూరలు వగైరాలే తినవలెను అను నియమము

గలదు. దానిని అతి ఇష్టముతో వీరు అమలుపరచు చుండెడివారు.

మానవునకు ద్విజత్వమును కల్గించు సంస్కారమే ఉపనయనము. ఇది వేదాధ్యయనమునకు యోగ్యతను కల్గించును. ఈ వేదములు సర్వశాస్త్రములకు, ధర్మములకు మూలములు. ఈ వేదముల నుండియే మానవుని కిహపర శాంతిసుఖములనిచ్చు సర్వసాధనములు బయలు వెడలుచున్నవి. మానవుని మాధవునిగా జేయు విద్య ఇందే గలదు. మానవోన్నతికి వలయు సాధన ప్రక్రియలో ఉపనయనము మొదటిమెట్టు. 'జన్మనా జాయతే శూద్రః కర్మణా జాయతే ద్విజః' అన్నట్లు ఆ ఉపనయనకర్మ చేతనే మానవునకు ద్విజత్వము గలుగుచున్నది. అనగా ఈ ఉపనయనముచే గాయత్రీ మంత్రోపదేశము నొంది తజ్జపముచే విగతపాపుడై, అగ్న్యుపాసనచే దివ్యతేజోపలబ్ధిని బడసి, బ్రహ్మచర్యనియమములచే జితేంద్రియుడై మనుజుడు శుద్ధసత్త్వమునొందును. అపుడు ప్రాకృత జీవనము పోయి దివ్య జీవనమబ్బును, అట్టి ఉపనయనము ఆనందమోహనులకు 10సం॥ వయస్సులో చతురాహ్నికముగ వేదశాస్త్ర విధి ననుసరించి నిరాడంబరముగ జరిగినది. నాడు శాస్త్రోక్తమగు బ్రహ్మచారి రూపములో ఆనందమోహనుడు పాలాశ దండం, కృష్ణాజినం, కమండలం ధరించి రూపములో ముచ్చటగా ఆనందమోహనుడయ్యే యుండెను. ఆహా, ఏమి ఆ తల్లిదండ్రుల శిక్షణ! ఏమి ఈ వటుని ఆదర్శ ప్రియత, వైదిక నిష్ఠ. కావుననే నేడు ఆచార్యత్వము సిద్ధించినది. ఈ బ్రహ్మచారిగారు ఒకనాడు దండకమండలముతో కుశహస్తుడై పలాశదండాజినధారుడై వేద ప్రతిపాదిత బ్రహ్మచర్య ధర్మములనుగూర్చి వేటపాలెం సారసత్వ నికేతన సభయందు ఉపన్యసించుచుండ నాటి ఆసభకు అగ్రాసనాధిపతి యగు శ్రీ కాశీకృష్ణమాచార్యులవారు (ఆంధ్ర ఆస్థానకవి) ఈ బాలుడు సామాన్యుడు గాడు, గొప్ప మహాత్ముడు కానున్నాడని తమ భావావేశమును ఆ సభలో ప్రకటించియున్నారు.

అనందమోహను ఇట్లు లౌకిక పారమార్థిక విద్యలయందు సర్వాగ్రగణ్యుడై ముందు కురుకుచు అభివృద్ధినొందుచు తమ 13-వ ఏట ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్షయందు (ఉత్తమశ్రేణియందు) ఉత్తీర్ణుడైనాడు. ఆ తరువాత మచిలీపట్టణమందలి నోబుల్ కాలేజీలో చదువునపుడు ఆఖరు సంవత్సరమున తమ 17-వ ఏట తన తండ్రిగారి ప్రోత్సాహంతో అపక్వాహారమును ప్రారంభించి ఆధ్యాత్మిక సాధనలకుపక్రమించిరి. సమీపస్థ అన్నపూర్ణస్వామివారి మఠమునకు వెళ్ళి రోజూ సాయంస్నానముచేసి జపధ్యానములు చేయుట వీరికి పరిపాటియైనది.

ఇట్లు వీరు తమ కళాశాల విద్యాభ్యాసమును సాగించి పూర్తి చేసిరి. వీరు భగవద్గీత నిదివరలోనే చదివియుండుటచే బైబిలును తీసుకొని పూర్ణముగా చదివిరి. ఈ కళాశాల జీవితములోనే వీరు ఆంధ్రదేశ భగవద్గీత పోటీలందు ద్వితీయ బహుమతిని, నోబుల్ కాలేజీవారి "భగవద్గీత బైబిల తులనాత్మక అధ్యయనము" అను వ్యాసరచనయందు ప్రథమ బహుమతిని, ఏలూరు కాంగ్రెసు జ్యూబిలీ పోటీలలో నూలువడకుటయందు ప్రథమ బహుమతిని, విజయవాడలో కాంగ్రెసు స్వర్ణోత్సవ మందు చరఖా, తకిలీ పోటీ (నూలువడుకుట) లందు, ఉపన్యాసపోటీలయందు ప్రథమ బహుమతులను (సువర్ణ పతకములను) పొందియున్నారు.

గురుసన్నివేశము - సమర్పణము

ఇట్లు విద్యాభ్యాసము చేయుచున్న సమయమున ఆంధ్రదేశమునకు ఆధ్యాత్మిక భిక్షాదాతలును, జ్ఞాన



భాస్కరులును, తపోమూర్తియునగు శ్రీమహర్షి మలయాళ స్వాములవారు తమ ఆధ్యాత్మిక ప్రచారసందర్భమున శ్రీఆనందమోహనుగారి గృహమునకు వారి తండ్రిగారి ఆహ్వానము ననుసరించి వచ్చిరి. సాధుమహాత్ముల సత్కారానంతరము సాయంకాలమున శ్రీవారి ప్రసంగము ఏర్పాటుచేయబడెను. అపుడు శ్రీ మలయాళ స్వాములవారు ఆ గృహమును జూచి "నివృత్తరాగస్య గృహం తపోవనమ్" అను సూక్తిరీతి నిజముగా "ఇది తపోవనముగనే యున్నదని" నుడివి వారి కుటుంబ ధార్మిక, ఆదర్శ, ఆధ్యాత్మిక జీవితమున కచ్చెరు వందిరి. ఆసందర్భమున శ్రీ రామస్వామిగారికి తమ పిల్లలలో ఒకరిని ఆధ్యాత్మిక క్షేత్రమున నివృత్తిపరునిగా జేయవలెనను సత్సంకల్పం గలిగెను. అంతట నాడు దేశమున గణనీయ మహాత్ములలో శ్రీమలయాళస్వాముల వారగ్రగణ్యులుగా నుండుటచే వారికే తమ పుత్రులలో నొకరిని నివృత్తి ధర్మావలంబనకై సమర్పించ నిశ్చయించి అందుకు తగినవారు (పంచపాండవులవలె) తన పుత్రులైన ఐదుగురిలో ఎవరా యని పరికించ అందుకు తగు సంస్కారము గలిగి అందరికన్న మిన్నయై (పాండవ మధ్యమునివలె) శోభించు తమ మూడవ పుత్రరత్నమగు ఈ ఆనందమోహనులే తగుదురని తలంచి ఆనందునకు తన కోర్కె నెఱిగించిరి. వెంటనే మన చరిత్ర నాయకుడందుకు కడు మోదముతో తమ ఆమోదమును తెలుప తత్క్షణమే ఆ బహిరంగ సమావేశమున శ్రీ రామస్వామిగారు తమ తృతీయ పుత్రుడగు శ్రీ ఆనందమోహనులను భావికాలమున లోకమును ఆనందముతో మోహింప జేయుటకై శ్రీ మహర్షి మలయాళ స్వాములవారికడ (నివృత్తి ధర్మ శిక్షణ నిమిత్తమై) సంపూర్ణముగా సమర్పించి వైచిరి. ఆహా! ఆ పుణ్యసందర్భ మెంత కనులకింపుగా నుండెనో గదా! ఆ సందర్భమున జగద్గురువులగు శ్రీమలయాళ సద్గురువుల మనంబు 'సచ్ఛిష్యుడు చిక్కెనుగదా!' యని ఆనందడోలికల నూగులాడ, కన్నులందు ఆనందాశ్రువులు జలజల రాలుచుండ తమ హర్షాతిశయమును నా సభాసమ్ముఖమున ప్రకటించి యున్నారు. నిజముగ ఆ సన్నివేశము, ఆ సమర్పణ ఘట్టము చరిత్రలో సువర్ణాక్షరములతో లిఖింపదగినది.

సద్గురువు -మంత్రోపదేశము

ఈ సందర్భమున శ్రీ సద్గురు మలయాళ స్వాములవారిని గూర్చి కొంత తెలిసికొందము. శ్రీ మహర్షి మలయాళ స్వాముల వారు నిజముగ సద్గురువులే. ఆంధ్రుల సమష్టి పుణ్య ప్రాభవముచే ఆంధ్రుల నుద్ధరింప దివినుండి భువికేతెంచిన వ్యాసమహర్షియే వీరు. ఆ ధీరగంభీర మూర్తిమత్వము, తపోగ్నిచే పవిత్రమైన శరీరము, జ్ఞానతేజోవిలసితత్వము చూపరుల కట్లే భక్తిభావము కలిగింపజేయును. వీరిని గూర్చి మనస్వాములవారు పలికిన మాటలనే మనము పేర్కొందము. "గురువులు దొరకవచ్చును గాని సద్గురువులు దొరకుట చాల దుర్లభము. శిష్యులను సద్వస్తువగు ఆత్మయొద్దకు చేర్చు వాడే సద్గురువు. సచ్ఛీలమును వాక్కునందే గాక అనుష్ఠానము నందును దిగ్దర్శన మొనర్చువాడే సద్గురువు. భగవాను డెన్నుకొనిన ఏ కొలదిమంది మహనీయులో అట్టి సద్గురుపీఠ మలంకరించి లోకములో విరాజిల్లుచుందురు. అట్టి వారిలో నొకరు శ్రీసద్గురు మహర్షి మలయాళ స్వాములవారు. ఆధ్యాత్మిక విషయములయందు పండిన యనుభవముగల మహనీయుడగుట వలనను, పారమార్థిక సూత్రము లన్నియు వారికి కాచి వడపోసినవే అయి యుండుట వలనను, భక్తులకు వారి సాన్నిధ్యమందు నిగూఢ దైవతత్త్వావగాహనము సులభతర మనిపించుచుండెడిది". ఇయ్యది తన గురుదేవుల

గూర్చిన శ్రీవారి సరియైన చిత్రణ. ఇట్టి పావన మూర్తియైన సద్గురు శ్రీమహర్షి మలయాళ స్వాములవారు తనకు తగిన పవిత్ర శిష్యుడు చిక్కినంతనే పుత్రోత్సాహము నందిన తల్లివలె అమితానంద భాజనులైరి. ఆ సమర్పణ ఘట్టమును, ఆగృహము లోని తపోజీవనమును, తన నూతన శిష్యుని బుద్ధికుశలతను, ప్రజ్ఞాపాటవములను అంతకుమించి ఆధ్యాత్మిక జీవనమును తలంచి వారు ఆనందముతో నుప్పొంగి పోయెడివారు.

తదువరి ఆనందమోహనులవారికి శ్రీ సద్గురువులవారు 1932వ సంవత్సరమున బందరు అన్నపూర్ణ మఠంలో శుభముహూర్తమందు పంచాక్షరీ మంత్రోపదేశము చేశారు. ఇంతకు ముందే సంస్కృత జ్ఞానము గల్గి ఉపనయన సంస్కారము నొంది, గాయత్రీ జపముచే నిర్ధూత కల్మషుడై ద్విగుణీకృత తేజము నొందియుండిన ఆనందమోహన్ ఇపుడు గురూపదిష్ట పంచాక్షరీ మంత్రముచే పరిపూర్ణ శుద్ధాంతఃకరణుడై భాస్కరునివలె బ్రహ్మ తేజముతో వెల్గొంద దొడంగిరి. 1930 సంవత్సరము కళాశాల నుండి అపక్వాహారముతో మాలిన్యరహితులైరి. ఇపుడు గురూపదిష్ట మంత్రమందు లక్ష్యముంచి జపధ్యానాదులు తీవ్రముగా జేయదొడంగిరి. ఇట్లు శ్రీవారి పిన్నవయస్సుననే సద్గురు లాభము నొంది ఆధ్యాత్మిక సాధనలు చేసికొనుచు లౌకిక విద్యలందు కళాశాలలో మిన్నయై యొప్పుచు ఆంధ్ర విశ్వవిద్యాలయమున 1933వ సంవత్సరమున బి.ఎ పట్టభద్రులైరి. తదనంతరము ఇపుడున్న సంస్కృత ఆంగ్లవిద్యలేగాక భావిభారత రాజభాషయైన హిందీయందును పాండిత్యము సంపాదించ నుద్యుక్తులై దక్షిణ భారత హిందీ ప్రచారసభవారి రాష్ట్రభాష, విశారదాది పరీక్షలందుత్తీర్ణులైరి.

కాశీ నివాసము

అనాదికాలంనుండి కాశీక్షేత్రం పవిత్రమైన సప్తపురులలో ఒకటిగా ప్రసిద్ధి చెందినది. పవిత్ర గంగానదీ స్నానము, విశ్వేశ్వరుని దర్శనము, ప్రసిద్ధపండితుల కాలవాలమైన కాశీ వాసం చాలాపుణ్యప్రదమని శాస్త్రవాక్యం.

ఆనందమోహన్ హిందీలో ఆంధ్రదేశములోని పరీక్షలందుత్తీర్ణులై ఉన్నత హిందీవిద్యాభ్యాసానికిగాను 1935వ సంవత్సరంలో కాశీ పట్టణానికి వెళ్లెను. భారతీయునకు కాశీవాసము పవిత్రకార్యం కదా! కాబట్టి వీరికిన్నీ చిన్నతనమున కాశీవాసయోగ మబ్బినది. అంతట వీరు పట్టభద్రులగు మరికొంతమంది దాక్షిణాత్యులతో కలిసి కాశీ వెళ్ళి అచట జాతీయముగా నడచుచున్న కాశీవిద్యాపీఠమందు 'హిందీకోవిద' తరగతిలో ప్రవేశించిరి. ఈ కాశీ ప్రయాణమునకు వీరి గురువుగారు సద్గురు మహర్షి మలయాళ స్వాములవారి ప్రోత్సాహము ముఖ్యకారణ మయినది. ఆ కాశీవిద్యా పీఠమునకు నాడు ఆచార్య నరేంద్రదేవ్‌గారు ప్రిన్సిపాల్ (ప్రధానాచార్యులు)గ నుండిరి. శ్రీ ప్రకాశ్‌గారు, సంపూర్ణానంద్ గారు, బలబీర్ గారు మొదలగు ఉద్దండులు దేశసేవా పరాయణులు అధ్యాపకులుగా నుండిరి. అట్టి ఉదాత్త దేశానాయకుల సంచాలకత్వ అధ్యాపకత్వములతో నడచు విద్యాపీఠమందు ఒక సంవత్సరము వీరు విద్య సభ్యసించి "హిందీకోవిద" యను పట్టమునందిరి. కాశీ జీవితము వీరికిచాల విశిష్టముగా గడిచినది.

వీరి వసతిగదియందు వీరితో పాటు ఉత్తరప్రదేశ్ ప్రాంతీయుడైన గిరీశచంద్రపంత్ అను నతడు తోడి విద్యార్థియై స్నేహితుడాయెను. అతడు చాల గొప్ప ప్రజ్ఞావంతుడనియు, ఆధ్యాత్మికముగా చాలా పరిచయము గలవాడనియు శ్రీవారపుడపుడు నాతో చెప్పుచుండిరి. అట్టివాని సాంగత్యము తోడుకాగా నిప్పునకు గాలితోడైనట్లు వీరి ఆధ్యాత్మిక సాధనలు మరింత వృద్ధినొందినవి. సెలవు దినములలో గంగానదిలో పడవపై విహారమేగి తన్నదీతీరస్థ మహాత్ముల నన్వేషించి దర్శించి వచ్చుట వీరికొక సహజ క్రీడయైనది.

ఈ సందర్భములో ఒక ఘట్టమును వివరించుట సమంజసము. వీరిరువురు (పంతు, ఆనందమోహన్) ఒకనాడు పడవ మీదపోయి గంగానదిని దాటి ఆవలి ఒడ్డున ఉన్న ఒక గ్రామమును చేరిరి. ఆ గ్రామమునందొక ప్రసిద్ధమహాత్ముడు బాబా అవధూతవృత్తియందుండెను. ఆ మహాత్ముని దర్శనమే వీరియుద్దేశ్యము. ఆ సత్పురుషుని యనుగ్రహము లభించుట జనులకు బహుదుర్లభమై యుండెను. మన ఆనందమోహనులు పంతుతో కలసి వారిదగ్గరకుపోయిరి. కాశీ నుండి ఇద్దరు విద్యార్థులు వచ్చినట్లు దగ్గర నున్నవారు చెప్పగా ఆ మహాత్ముడు మామూలు ధోరణిలో తిట్టూ వెళ్లిపొమ్మని కేకలు వేసిరి. కానీ వీరు కదలలేదు. పదరలేదు. చేతులు కట్టుకొని నిలబడిరి. ఆపైన దోమతెర పైకి తీసివేసి వీరిని చూచి దగ్గరకు రమ్మని చెప్పిరి. అప్పటికి సాయంసమయ మగుటచేత భక్తుడగు ఒకానొక జమీందారును పిలిపించి "వీరికి రాత్రికి వసతి, భోజనాదులను ఏర్పాటుచేయు" మనిరి. మఱియు ఆ యిరువురిలోను మన ఆనందమోహనులను చూచి "యే దక్కన్ మే ఆధ్యాత్మిక ధూమ్ మచాయేగా" దక్షిణభారతమున ఆధ్యాత్మిక క్రాంతిని గల్గింతువు అని వారిని ఆశీర్వదించిరి. మహాత్ములు త్రికాలజ్ఞులు. వారి వాక్యములు ఆశీర్వాదములు వ్యర్థములు కావు గదా! చూడుడు! ఆ మహాత్ముడు నుడివినట్లు నాటి ఆనందమోహనులే నేటి విద్యాప్రకాశానందులై దక్షిణభారతదేశమున అపర వివేకానందులవలె తమ ప్రవచనలతో ఆధ్యాత్మిక క్రాంతిని, ఉత్తేజమును గల్గించి యుండుట నేడు మనము గాంచు చున్నాము గదా! కాశీలోని విద్యా పీఠమందు వీరి సంపాద కత్వమున "తపోభూమి" యను హిందీ మాసపత్రిక వ్రాతప్రతులుగా ప్రారంభింప బడినది. దానిలోని వ్యాసములు ఉజ్జ్వలములు, హిందీభాష యందు చక్కని సాహిత్యముగ అవి ప్రకాశించు చున్నవి. కాశీయందు వీరు ప్రాణాయామయోగాసనాదులను బాగుగా సాధనచేసిరి. అచటనే వీరికి రాహులసాంకృత్యా యనుల పరిచయము, వారి బౌద్ధ గ్రంథముల పరిచయము ఏర్పడినది.

ఇట్లు వీరు ఆధ్యాత్మిక విచారణలతో, ఉత్తమ హిందీ సాహిత్యముతో కాలము గడుపుచుండ ఒకపుడు ఆ విద్యాపీఠమందు కాంగ్రెస్‌కమిటీ సమావేశము జరిగినది. అత్తఱి గాంధీజీ, పటేల్, రాజేంద్రప్రసాద్ మున్నగు నాయకులచటికి విచ్చేసిరి. అపుడు గాంధీమహాత్ముని బసయొద్ద వాలంటీరుగా ఈ ఆనందమోహనులను అధికారులు ఏర్పరచిరి. ఆ సమయమున వీరు స్వయముగ గాంచిన మహాత్ముని దినచర్య వీరి నెంతయో ఆకర్షించినది. మఱియు భవిష్యత్తులో వీరికి ఆదర్శవంతమైనది.

గంగాయాం గీతా

కాశీనివాసము ఒక సంవత్సరము పూర్తిగా, విద్యాభ్యాసము ముగిసినందున ఆనందమోహనులు, హిందీ విద్యార్థినిగా అలహాబాదు వచ్చియుండిన వారి సోదరి, కాశీవిశ్వవిద్యాలయలో ఎమ్.ఎ.ఎల్.ఎల్‌బి. చదువుచున్న ఆమె భర్తగారు (ఇలింద్ర రంగనాయకులుగారు) ఒక చోట కలసికొని అటనుండి హృషీకేశాది ఉత్తరభారత యాత్రను పూర్తిచేసికొని ఇంటికి తిరిగి వెళ్ళవలయునని నిశ్చయించు కొనిరి. ఈ సందర్భములో ఆనందునకొక సమస్య

ఎదురారయెను. తన విద్యాభ్యాసమింతటితో పూర్తియగును. స్నేహితులు, కొందరు బంధువులు ఇంకను ఆంగ్లమున ఉన్నతవిద్య నభ్యసించులాగున వీరిని ప్రోత్సాహించసాగిరి. ఇక విద్యను చాలించి ఆశ్రమజీవితమును గడుపుమని తల్లిదండ్రులనుచున్నారు. గురువుగారగు శ్రీ సద్గురు మలయాళ స్వాములవారున్ను అట్లే ఆదేశించుచున్నారు. తనకున్ను ఆశ్రమజీవితమందే ఇచ్ఛయున్నది. కాని దానికంత ప్రబలత చేకూరక అపుడపుడు ఉన్నతవిద్యవైపునకున్ను మనస్సు మొగ్గుచూపుచున్నది. 'ఇపుడు భావిజీవిత కర్తవ్యమేమి?' అని డోలాయమానను లగుచుండిరి. ఇట్లుండగా కాశీ వదలవలసిన సమయమాసన్నమాయెను. సోదరి అలహాబాదునుండి వచ్చి కాశీ చేరెను. సోదరి భర్తకు కాశీహిందూ విశ్వవిద్యాలయంలో ఎమ్.ఎ.ఎల్.ఎల్.బి. పూర్తియైనది కావున అందరును కలసి హరిద్వారము చేరిరి. హరిద్వారంలో ఆనాడు వీరు ముప్వురూ కలసి గంగాస్నానమునకు వెళ్ళిరి. అనందమోహనుగారు తన స్నానానంతరము నదిలో కట్టబడియున్న ఒక 'బోటు' లోనికి పోయి అందుకూర్చొని నదిని తిలకించుచుండిరి. ఇంతలో ఆ సమీపమున నదియందొాక గడ్డికుప్ప కొట్టుకొని వచ్చుచుండుట వీరి కంటపడెను. వీరు వంగి వెంటనే దానిని చేతితో తీసి పడవలో వేయగా అందు ఒక నాగరలిపి భగవద్గీత కుంకుమ పుష్పపూజితమై కన్పించెను. వెంటనే ఆనందుడు ఆనందాతిరేకముతో ఒక గంతువేసి తమ సోదరిని, బావగారిని పిలిచి వారికద్దానిని చూపి ఇక తన భావిజీవితమును ఆశ్రమమునందే గడిపి "లోకమున కీ గీతాసేవచేయు' మని భగవదాదేశమైయున్నది. కావున యాత్ర అయినదే ఇంటికేగి అటనుండి ఆశ్రమము వెళ్లెదనని తీర్మానించి తమ కెదురైన సమస్యను పరిష్కరించిరి.

మహాత్ములకు దైవ మెట్లు తోడగునో చూడుడు! అటు పిమ్మట వారు హృషీకేశము, లక్నో, ఆగ్రా మొదలుగాగల ప్రదేశములను, క్షేత్రములను దర్శించి తిరిగివచ్చి ఇల్లు చేరిరి.

గురుకుల వాసము -తపస్సు

ఆనందుడు గురుదేవులు పూజ్యశ్రీశ్రీశ్రీ అసంగానందగిరి స్వాములవారు అనే శ్రీశ్రీశ్రీ సద్గురు మలయాళ స్వాములవారివద్ద 1936వ సంవత్సరం మేనెల 17వ తేది ఏకాదశి పవిత్రదినంలో గురకులవాసం చేయడానికి శ్రీవ్యాసాశ్రమంలో (చిత్తూరు జిల్లా తిరుపతి శ్రీకాళహస్తి క్షేత్రముల మధ్య గలదు) ప్రవేశించారు.

ఇంతవరకు ఆనందమోహన్ గాయత్రి జపము, గురూపదిష్ట శివపంచాక్షరీ లక్షల కొలది జపము చేసి తనకు గల మలదోషం నివృత్తం కాగా, ధ్యానసాధనలతో విక్షేపదోషం తొలగిపోగా, మిగిలిన ఆవరణదోష నివృత్తికై వీరికి శ్రీ సద్గురు స్వాములవారు మహావాక్యోపదేశాన్ని చేయ నిశ్చయించారు. శ్రీ ఆనందమోహన్ ఏకాంతప్రియుడు, సాధనాప్రియుడు. కాబట్టి శ్రీ సద్గురు స్వాములవారు వీరికి ఆశ్రమంలో దక్షిణవైపు చివర చిట్టడివి ప్రక్కన గల గుహాశ్రమాన్ని నివాసానికి ఏర్పాటు చేశారు. 18-5-1936 ద్వాదశినాడు (శ్రీవ్యాసాశ్రమంలో ప్రవేశించిన మరునాడు) శ్రీ సద్గురు స్వాములవారు ఆనందమోహన్‌కు స్వయంగా పిలిచి "ప్రజ్ఞానం బ్రహ్మ" "అహం బ్రహ్మాస్మి" "తత్త్వమసి" "అయమాత్మా బ్రహ్మ" అను మహావాక్యాలను ఉపదేశించారు. ఆ మహావాక్యోపదేశ మనన నిదిధ్యాసనలచే ఈ శిష్యరత్నం యొక్క ఆవరణ దోషం పటాపంచలైంది.

శ్రీ వ్యాసాశ్రమంలో సాధనకై వీరికి సద్గురు స్వాములవారు ఆశ్రమానికి దక్షిణంలో చివరగా ఏకాంతంగా

వున్న కుటీరాన్ని ఏర్పాటుచేశారని చెప్పకొని. యున్నాం గదా! శ్రీవ్యాసాశ్రమం నందిపర్వతం చరియలో వుంది. చుట్టూ చిట్టడివి. ఆనందమోహన్ గారికిచ్చిన కుటీరం చుట్టూ దట్టమైన పొదలుగల అడవి. వేసవి రాత్రులందు కొండలలోని ఎగుగుబంట్లు ఆశ్రమంవద్దగల కొలనులో నీళ్లు త్రాగుడానికి వస్తూ పోతూండేవి. ఒకటి ఏకాంతంగా జన సంచారం లేక చివరలో వుండడం, చుట్టూ ముళ్లచెట్ల పొదలు కలిగివుండడం చేత ఆ కుటీరంలో మంచి వైరాగ్యంగల, భయంలేని సాధువులే యుండిరి. ఇపుడు ఆనందమోహన్ నివాసం ఆ గుహాశ్రమమే.

శ్రీ ఆనందమోహన్ కాలేజి చదువునుండే అపక్వాహారం తీసుకుంటున్నాడు. కాబట్టి ఇప్పుడు కూడ కొబ్బరిచిప్ప, నానవేసిన గుప్పెడు గోధుమలు, శనగలు గాని, పెసలు గాని, రెండరటిపండ్లు, ఒక లోటా పాలు రోజులకు ఆహారంగా తీసుకొంటూ గురువుగారు ఉపదేశించిన మహావాక్యాలను మనన నిదిధ్యాసనలు చేస్తూ ధారణా ధ్యానాలను తీవ్రంగా చేయసాగిరి. ప్రాతఃకాలం గురుసన్నిధిలో ఆశ్రమ సమిష్టి గీతాపారాయణలో ప్రతిరోజు భగవద్గీతను మొదట పారాయణ చేయడం, సాయంకాలం ప్రతిరోజు యోగవాసిష్ఠరామాయణాన్ని చదివి అందరికి తెలుగులో అనువదించి చెప్పడం, తక్కిన సమయాలలో తన సాధన- ఇది ఆనందమోహన్ నిత్య కార్యక్రమము.

ఆనందమోహన్ పైన తెల్పిన ప్రకారం స్వామివారి సేవలో కొంతకాలం ప్రతిరోజు గడుపుతూ అపక్వాహారంతో సాధన చేస్తూ శ్రీసనాతన సభలు వగైరా శ్రీ సద్గురు స్వాములవారి ప్రచార కార్యక్రమాలల్లో ఉదయం సమిష్టి గీతాపారాయణలో తాను గీత చెప్తూ ఇతరుల చేత దానిని పలికిస్తూ ఇలా రెండు మూడు సంవత్సరాలు గడిచాక ఇంకనూ తీవ్ర సాధనలు చేయదలచి శ్రీసద్గురు స్వాములవారి అనుమతి తీసుకొని ఒక సంవత్సరం పూర్తి కాష్ఠమౌనాన్ని పాటించారు. అప్పుడు సమిష్టిపారాయణ, సద్గురు ప్రచారకార్యక్రమాలు కూడ రద్దయ్యాయి. మౌనంతో పూర్తికాలాన్ని మనన నిదిధ్యాసనలు చేస్తూ, యోగవాసిష్ఠ రామాయణానువాదాన్ని చేస్తూ పూర్తి ఏకాంతవాసం చేయసాగారు. వారిసాధనా సమయంలోని ఒక ఘట్టం మనం ఇచట చర్చించుకోవడం సమజసంగా వుంటుంది.

ఆశ్రమంలో కొంతమంది భక్తులు, సంవత్సరంలో నిర్ణీతమైన ఒక్కొక్కరోజు ఒకరొకరు శ్రీసద్గురు స్వాముల వారికి పాదపూజ, ఆశ్రమస్థులందరికి భిక్ష (మృష్టాన్నభోజనం) చేయడం పరిపాటి. అలా ప్రతి సంవత్సరం భిక్ష చేసేవార్లలో ఏకొల్లు (నెల్లూరు జిల్లా, నాయుడు పేట సమీపం) గ్రామస్థులు రెడ్డిగారు ఒకరు (వీరికి శ్రీ సద్గురు స్వాములవారి యందెంత భక్తో, శ్రీ ఆనందమోహన్ స్వామి యందును అంత భక్తి శ్రద్ధలు) ప్రతి సంవత్సరం వారి భిక్షరోజున పాయసం, వడలను తీసుకువచ్చి ఆనందస్వాములకిచ్చి 'మాకోసరం ఈ ఒక్కరోజు దీన్ని తప్పక తినండి స్వామి' అని వినయంతో ప్రార్థించి పెట్టిపోయేవాడు. దాన్నిస్వామివారు ప్రతి సాయంకాలం తమ వద్దకు పోయే మావంటి విద్యార్థులకో, లేక ప్రక్కన అడవిలో పశువులను మేకలను మేపుకొని పోవువారికో పెట్టేసేవారు.

కాని ఒకరోజు ఆనందస్వామిని మాయ ఒక వూపు వూపి చూసింది. ఆ రోజు భక్తుడు చెప్పినట్లు ఆ భక్ష్యాలు ఒకరోజు తినిన దానివలన ఏం నష్టం జరుగుతుంది? తినేద్దాములే అని చేతికి తీసుకొని తినబోయారు. అంతలోనే బుద్ధి 'ఏమయ్యా! ఇంతకాలం అపక్వాహార నియమాన్ని పాటించి ఆఖరుకు ఈ ఒక్క క్షణంలో అంతా బూడిదలో పోసిన పన్నీరు చేస్తావా? నియమభంగం చేస్తావా?

రసనేంద్రియానికి నీవు దాసుడవవుతావా?' అని హెచ్చరించింది. వెంటనే స్వామి తేరుకొని నిజమేగదా నే నీపని చేస్తే రసనేంద్రియానికి, జిహ్వాకు లోబడినట్లే గదా! అని ఆ ఫలహారాన్ని అక్కడే ఉంచేసి తన వ్రాతలో సాధనలో తాను మునిగిపోయారు. ఆ ఫలహార విషయమే మఱచి పోయారు. నాల్గురోజులకు రూములో దుర్వాసన ప్రారంభమైంది. ఏమిటా అని పరిశీలిస్తే ఈ క్షీరాన్నం పాచిపోయి వాసన రాసాగింది. అరే ! దీని నిజస్వరూపం ఇదా! దీనికోసరమా నియమోల్లంఘన చేయబోయాను' అని ఆ పదార్థాన్ని దాని స్వరూపాన్ని, అనిత్యతను, ఆపాత రమణీయత్వాన్ని మాటిమాటికి చింతన చేశారు. మరల ఎన్నడూ అట్టి ఆలోచనలు రానేరాలేదు.

ఆశ్రమములో శ్రీ సద్గురు మలయాళస్వాములవారిని పెద్దస్వాములనియు, వీరిని చిన్నస్వామి యనియు, ఆనందస్వామి యనియు అందరు అనుచుండిరి. ఆశ్రమ దర్శనమున కేతెంచిన ప్రతిభక్తుడు శ్రీ సద్గురుస్వాముల దర్శనానంతరం ఈ చిన్నస్వామిని దర్శించుట అలవాటై పోయినది. దర్శనార్థులను వీరు ప్రసన్న వదనముతో వీక్షించి, చిరునగవుతో వారితో ఏ ఒకటి రెండు మాటలాడి వెంటనే ప్రసాదమిచ్చి పంపివైతురు. సమయమును ఏమాత్రము వ్యర్థపుచ్చరు. వారి నివాసమందు "ఆయుషః క్షణఏకోపి సర్వరత్నైర్న లభ్యతే, నీయతే తద్వృథా యేన ప్రమాదః సుమహానహొ" అని పెద్దబోర్డు నల్లటి అక్షరములతో వ్రాసిపెట్టుకొనియుండిరి. అనగా ఆయుస్సును వ్యర్థము చేయరాదని భావము. వీరు చూచుట కెంత గంభీరముగ గోచరింతురో అంత సరళ హృదయులు. కావుననే నీటబడిన చిన్నపురుగును గూడ చూచి సహించి యుండలేరు. బాధతోనున్న వానిని చూచినను సహించలేరు. తాము అపక్వాహారులు గాన తమకు భక్తులు దర్శనమునకు వచ్చునపుడు తెచ్చియిచ్చు మంచి మంచి ఫలహారములను ప్రక్కన అడవికిపోవు పశువుల కాపరులను పిలిచి ఇచ్చివేయుచుండిరి. కావున ఆ పరిసర పశువుల కాపరులకు ఆనందస్వామి యనిన చాల అభిమానము. పరిసరములందు పాములత్యధికము. పెద్ద చిన్నపాము లధికముగా చుట్టూ తిరుగుచుండును. అపుడపుడు గదిలోనికి కూడ అవి వచ్చుచుండును.

ఈ సందర్భములో ఒక సంఘటన జ్ఞాపకమునకు వచ్చినది. దాని నిచ్చటనుటంకింతును. రోజూ స్వామీజీ రూముముందు సన్నని ఇనుప తీగలు అల్లిదానిపై పూవుల తీగలు అల్లుకొనిన పందిరి క్రింది అరుగుపై శయనింతురు. అట్లే రాత్రి శయనించియుండ నొక రోజు స్వామీజీకి నిద్రయందు "తమ శిరస్సునకు నేరుగా పైన పందిరిపై ఒక సర్పము ఉన్నట్లు" ఒక దృశ్యము గోచరించినది. వెంటనే శ్రీవారికి మెలకువ వచ్చి పైకి లేచి ప్రక్కనున్న బ్యాటరీ తీసి పైన పందిరిపై లైటు వేయుదమనుకొన్నంతలో ఆ పాము పైనుండి సరిగా శ్రీవారుపండుకొని యున్నప్పుడు శిరస్సుండిన చోటనే దభాలుమని పడినది. ఏమిటి శబ్దమని శ్రీవారు బ్యాటరీ వేయగా పాము. ఆ పైన అటనుండి అది చరచరా కదలి పారిపోయినది. చూచితిరా దైవలీల ! "యోగ క్షేమం వహామ్యహం" అన్న భగవత్ప్రతిజ్ఞ కిది యొక నిదర్శనము గదా! శ్రీవారికి నిద్రలో ఏ దృశ్యము గోచరించినదో అది నిజమేయైనది. అత్తఱివారు నిద్రనుండి లేవకుండిన, పాము శ్రీవారి శిరముపై పడియుండెడిది. గదా! కాన దైవము ఆ ఘట్టమున ఎట్లు రక్షించెనో చూడుడు. దైవముపై భారము వేసిన మనభారము నా దేవదేవుడే వహించును. "న మే భక్తః ప్రణశ్యతి" అని భగవానుని అభయవాణి గదా!

పాములు కీడు చేయునవైనను వానిని చంపుటకు స్వాములవారిష్టపడరు. కావున ఆ పాముకై ఒకరకమైన బోనును వీరు తయారు చేయించిరి. రూములోని కేతెంచు పాములు యథేచ్ఛగా పోయిన సరి. లేకున్న వానిని పెద్ద పొడుగాటి పట్టుకారుతో పట్టి బోనులో వదిలి వానిని కొండలో దూరముగా వెళ్లి వదలిపెట్టి రావలెను. ఇది వీరి నియమము. చూచితిరా ఎంత కరుణార్ద్ర హృదయమో వీరిది. కరుణలో వీరికి బుద్ధుడు ఆదర్శమూర్తి. బౌద్ధమతమనిన వీరికి గొప్ప ఆదరము, గౌరవమున్ను గలదు. కావుననే వీరు వ్యాసాశ్రమ తాపస జీవిత సమయమున "ధర్మపథము" అను బుద్ధగీతను తెనిగించిరి. అట్లే కఠోపనిషత్తు, యోగవాసిష్ఠము, వివేకచూడామణియు వీరికి అతిఇష్టములు. యోగవాసిష్ఠ మహాగ్రంథమును ఆ సమయమున సంస్కృతభాష నుండి వీరు తెనిగించిరి. వీరు అనువదించిన యోగవాసిష్ఠ ధర్మపథములను గ్రంథములను శ్రీ వ్యాసాశ్రమమువారు ప్రచురించిరి. ఈ ఆనందస్వామిని బాల్యమునందే హృదయము నాకర్షించిన లక్ష్యమూర్తి శ్రీ వివేకానందస్వామి. కనుక వీరి హృదయ మెల్లప్పుడు ఉత్సాహముతో ధీరత్వముతో నిండియుండను. వివేకానందుని "బీ ఫియర్‌లెస్" "నిర్భయముగా నుండుము" అను వాక్యము వీరికి ఇష్టమంత్రము. కాన వీరి గుహాశ్రమ కుడ్యములందు (గోడలపై) ఈ మంత్రమే దేదీప్యమానముగ గోచరించెడిది. వీరి తాపసిక జీవితమందు ఒక సంవత్సరము పూర్ణ మౌనముతో, తీవ్రసాధనలతో గడచినది. ఆ సందర్భములో సమాధిమగ్నులైన వీరు ఆకలిదప్పులు లేనివారై రోజులో ఎప్పుడో ఒక మారు కొద్ది అపక్వాహారమును మాత్రము స్వీకరించిన సందర్భములు గలవు. తీవ్రసాధనలచేతను, అతి స్వల్ప ఆహారము చేతను వీరి శరీరము చాల కృశించి పోసాగినది. అపుడు వీరు పెద్దల సలహా మేరకు చాల ప్రోద్బలముపై రోజుకు రెండు గ్లాసుల పాలను తీసికొనుట కంగీకరించిరి. వీరి సాధనలలోని ఘట్టములను వ్రాయవలె నన్న అదోక బృహద్గ్రంథ మగును. వారి 'సాధనడైరీ' ని చూచినచో మనోజయమునకు, ఇన్ద్రియ దమనమమునకు వారు చేసిన సాధనలు, వాని ఫలితములు అద్భుతములుగా, నుండగలవు. 1942 సం॥ నుండి వీరు తమ ఏకాంత కుటీరమును వీడి బయటకు రాక (సకృత్తుగా శ్రీ సద్గురు సన్నిధికి మినహా) చాల తీవ్రముగా సాధనచేయుచు తమ దర్శనార్థులతో ముక్తసరిగా మూడు మాటలాడి పంపుచు తమ సాధనను తీవ్రముగా చేసిరి. వీరు చాల వైరాగ్య పురుషులు. ఆంగ్ల పట్టభద్రులయ్యు ప్రాచీనపద్ధతిని కట్టుబాట్లు గల్గి చాల వైరాగ్యజీవితమును గడపుచుండిరి. "యోగస్య ప్రథమం ద్వారం వాఙ్నిరోధోఽ పరిగ్రహః" అనునట్లును, "జిహ్వోపస్థ పరిత్యాగే కో నముచ్యేత బంధనాత్" అనునట్లును వీరు స్వల్ప అపక్వాహారమును గ్రహించుచు మౌనముతోను, లేక మితభాషణముతోను గూడి జనసంగము లేక ఏకాంతముగా వసించుచు జితేంద్రియులై "వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కా యమానసః ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః" అను గీతావాక్యరీతి శ్రీవ్యాసాశ్రమమున గురుసన్నిధి యందు ద్వాదశవర్షములు (పండ్రెండేండ్లు) ధ్యాననిష్ఠయందుండి శ్రవణమనన నిదిధ్యాసానుభవముచే బ్రహ్మాకార వృత్తినంది ఆపైన వృత్తిరహితులై సమాధ్యనుభవముచే ఆనందముగ నుండిరి. అపుడు వీరి గురుదేవుడు ఈ ఉత్తమ ఆదర్శ శిష్యునకు తమ చేతులార ప్రథమంగా సన్న్యాస మివ్వ దలంచిరి. అనందమోహనులున్ను ఎప్పుడెపుడు గురుదేవుడు సన్న్యాస మిచ్చునాయని కాచుకొని యుండుటచే అమితానందముతో ఉప్పొంగి పోయెను. అయితే

సన్న్యాసగ్రహీత కఠోపనిషత్తు, పతంజలి యోగశాస్త్రము, భగవద్గీత అను ఈ మూడింటిని కంఠస్థము చేసియుండ వలెను. అది శ్రీ వ్యాసాశ్రమ నియమము. కాని శ్రీ సద్గురు మలయాళ స్వాములవారి యా నియమము వీరి పట్ల చర్చకే రాలేదు. ఏలయనిన వీరి కవి చిన్ననాటనే కంఠస్థములై యుండెను.

సన్న్యాస (తురీయాశ్రమ) స్వీకారము

అంతట నిశ్చయింపబడిన ముహూర్త ప్రకారము 29-6-1947 నుండి 3-7-1947 వరకు (సర్వజిన్నామ సంవత్సర ఆషాఢ శుద్ధ ఏకాదశి ఆదివారం నుండి పౌర్ణమి గురువారం పర్యంతము) పంచాహ్నిక విధానమున శ్రీవారి సన్న్యాసస్వీకారము జరిగెను. ఈ ఉత్సవమునకు దేశము నలుమూలలనుండి రెండు వేలమంది ప్రేక్షకులు, భక్తులు వచ్చియుండిరి. ఆ యుత్సవము కన్నులపండువుగా బ్రహ్మానందముగా నుండెను. సన్న్యాస స్వీకరణోత్సవ మింత శాస్త్రీయముగా, ఇంత ఆనందముగా గొప్పగా ఎప్పుడును జరిగియుండ లేదని భక్తులనుకొనిరి. శ్రీ సద్గురు మలయాళస్వాములవారు తాను మొట్టమొదట ఇచ్చిన సన్న్యాసమిది. తాను పొందిన జ్ఞానాన్ని, బ్రహ్మవిద్యను అందరికీ బోధించగలరనే ఉద్దేశించి శ్రీ సద్గురు స్వాములవారు వీరికి శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి అని నామకరణం చేశారు.

ఇచట ఒక విషయము మనము మరువరానిది. గత చరిత్రను మనము పరికించినచో గురుసంప్రదాయమును, ముఖ్య పరంపరను గుర్తించుటకై కొన్ని సంఘటనలు జరిగియున్నట్లు తెలియుచున్నది. అటులనే మన స్వామీజీ గురుదేవులగు శ్రీ అసంగానందగిరి స్వాములవారికి (శ్రీమలయాళ స్వాములవారికి) వారి సన్న్యాస సందర్భమున వారికి సన్న్యాసము నొసంగిన శ్రీ శంకరానందగిరి స్వాములవారు తమ హస్తములతో తయారుచేసిన కమండలవు నొసంగిరి. దానిని శ్రీ మహర్షి మలయాళ స్వాములవారు తమ ఈ శిష్యునకు సన్న్యాస మొసంగిన సందర్భములో ఆ కమండలువు చరిత్రను చెప్పి 'మా గురువుగారిచ్చిన దీనిని మీకు ఇచ్చుచున్నా' మని చెప్పి ఇచ్చిరి. తమ ప్రియతర సన్న్యాస శిష్యున కిది తగిన గౌరవమే కదా! ఇయ్యది సత్పాత్రదానమే. (ఇది పరంపరకు ముఖ్య చిహ్నముగ నేటికిని జాగ్రత్తపరచబడి యున్నది.)

శ్రీ శుకబ్రహ్మాశ్రమ స్థాపన

శ్రీస్వాములవారు (శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు) కొంతకాలం శ్రీ వ్యాసాశ్రమంలోనే వుండి ఆ తరువాత తాము వేరుగా ఒక ఆశ్రమాన్ని స్థాపించాలనుకొన్నారు. దానికి తగు స్థలం కోసరం వేచియున్నారు. ఇంతలో శ్రీ స్వాములవారి తొడపై ఒక కురువు లేచినది. దానికి ఆకులు అలుమలు కట్టారు. అది పెద్దదై వ్రణమై ఆఖరుకు శ్రీకాళహస్తికి ఆస్పత్రికి పోవలసి వచ్చినది. అలా చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తికి వచ్చిన శ్రీస్వాములవారు శ్రీ పి.వి. రామచంద్ర రావుగారి తోటలోని ఆశ్రమంలో విడిదిచేసిరి. ప్రతిరోజు గవర్నమెంటు అస్పత్రి డాక్టరుగారువచ్చి కట్టుకట్టి డ్రస్సింగ్ చేసిపోతూండిరి. అలా వుండగా ఒకరోజు రాత్రిచాలా పెద్ద వర్షం వచ్చినది. ఉదయం శ్రీ స్వాములవారు తోటలోనికి బహిర్భూమికి పోగా ఎచటనూ కాలికి చెమ్మ,బురద అంట లేదు. ఇసుకనేల గదా! గుంటూరు ఆశ్రమంలో వర్షంపడితే అడుగుపెట్టితే బురద, ఇచటకు అచ్చటకు తేడా కనిపించింది. వెంటనే శ్రీస్వామిగారి మనస్సులో ఈ కాళహస్తిలో ఆశ్రమాన్ని నిర్మించాలనే బలమైన సంకల్పం కలింగింది. శ్రీస్వాములవారు తమ అంతరంగ శిష్యులు ఆ ప్రాంతీయులగు మాంబాకం సదాశివ మొదలితో చెప్పి ఇచట ఏదైనా నేల అమ్మకమునకున్నదేమో విచారించమనిరి. వారు విచారణ చేయగా ఇపుడు ఆశ్రమం నిర్మించిన స్థలము పది ఎకరాలతోట గోదావరి జిల్లా రాజులు అమ్మదలచినట్లు తెలిసి వారివద్ద తోటకొని రిజిష్టర్ చేశారు. దక్షిణకాశియగు శ్రీకాళహస్తిలో శివాలయానికి దక్షిణంగా పావన సువర్ణముఖీనదీ తూర్పుతీరంలో ఈ తోటలు శ్రీశుకబ్రహ్మాశ్రమానికి పూజ్యశ్రీ స్వాములవారు శంకుస్థాపన చేశారు. ఆశ్రమప్రారంభోత్సవం 1950 సంవత్సరం జనవరినెల 20 తేది విరోధి నామ సంవత్సర మాఘ శుద్ధ విదియనాడు ఉదయం 4.30 గంటలకు శ్రీ స్వాములవారి గురుదేవులు శ్రీశ్రీశ్రీ సద్గురు మహర్షి శ్రీమలయాళస్వాముల వారిచే చేయబడింది. "శ్రీశుకబ్రహ్మాశ్రమము" అని నామకరణం చేయబడింది. పూజామందిరం (శివాలయం), భోజనశాల, అతిథిమందిరం వగైరా క్రమశః నిర్మాణం జరిగి దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. బొంబాయి, షోలాపూర్, బెంగుళూరు, మైసూరు, కోలారు, కొళ్ళేగాల్, ఖర్గపూర్, మద్రాసు, బళ్ళారి, చిత్తూరు, నరసారావుపేట, బందరు, ఏలూరు, కాకినాడ, విజయనగరం, విశాఖపట్టణం, హైదరాబాదు మొదలగు అనేక నగరాలలో, పట్టణాలలో శ్రీస్వాములవారు గీతాజ్ఞానయజ్ఞాలను నిర్వహించారు. వీరు తెనాలిలో ఇచ్చిన ఉపన్యాసములను గూర్చి ఆంధ్రప్రభ ఇలా ప్రకటించినది. "శ్రీవిద్యా ప్రకాశానందగిరి స్వాములవారు తమ సరళమైన భాషలో బహుజనాకర్షణీయంగా గీతోపన్యాసములు చేస్తున్నారు. ప్రతిదినం అశేష ప్రజానీకం హాజరవుతున్నారు."

1979 ఏప్రిల్ నెలలో నెల్లూరులో జరిగిన శ్రీస్వాములవారి గీతా ప్రవచనాల గురించి సుప్రసిద్ధ స్థానిక వారపత్రిక "జమీన్‌రైతు" ఇలా వ్రాసింది.

"రాత్రి 8-30 గంటలకు జనం తండోపతండాలుగా వస్తున్నారు. వి.ఆర్ కాలేజి సమీప చర్చిమైదానం జనాన్ని ఈనిండా ఉన్నట్లుందా జనప్రవాహం. ఒకరోజుకాదు, రెండురోజులుకాదు, దాదాపు నెలరోజులు ప్రతిరోజు జనప్రవాహమే, వేలమందితో చర్చి మైదానం నిండిపోయింది. నిజంగా అది యజ్ఞమేననిపించింది. ఎవరోముసలిముతక ఐతే సహజమే. కానీ ఈ వేదాన్త సభలకు అన్ని రకాలవారు, అన్ని వయస్సులవారు ప్రతిరోజు విడువకుండ హాజరయ్యారంటే అది ఆయన ఉపన్యాస మహిమ అనాలి". "స్వామీజీ గొప్ప తత్త్వవేత్త. ఎంత జటిల విషయాన్నయినా పిట్టకథలతో చతురోక్తులతో చక్కగా సుగ్రహ్యంచేసే వాక్చాతుర్యం ఆయన సోత్తు. ఒకరోజు ఆయన ఉపన్యాసం విన్నవారు ఇక విడువలేరని అందరూ అనుకొన్నారు."

సికింద్రాబాద్‌లో జరిగిన శ్రీ స్వాములవారి గీతాజ్ఞాన యజ్ఞాన్ని గురించి దక్కన్ క్రానికల్ ఇలా వ్రాసింది. "శ్రీశుక బ్రహ్మాశ్రమ స్థాపకులు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామిజీ గత19రోజులుగ మహబూబ్ కళాశాల ఆవరణులో భగవద్గీతపై ఉపన్యసిస్తున్నారు. భగవద్గీతకు మహా ప్రచారకులైన సామీజీ కథలను, వివిధ శాస్త్రవాక్యాలను ఉదాహరిస్తూ సులభ శైలిలో ఉపన్యసించి జంట నగరాలనుండి వేలకొలది ప్రజల నాకర్షిస్తున్నారు"

రాజమండ్రిలో జరిగిన గీతాప్రవచనాల గురించి స్థానిక సమాచార పత్రిక - "శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి ప్రసంగాలు ఆధ్యాత్మిక రంగంలో విప్లవం తెచ్చినవా? అన్నట్లు మున్నెన్నడూ కనివినియెరుగని విధంగా జనులను వేలాదిగా ఆకర్షించినవి. ఆధ్యాత్మిక ప్రసంగాలంటే విముఖత చూపే వ్యక్తులెందరో క్రమం తప్పక ఈ గీతాయజ్ఞంలో (ప్రవచనాలలో) పాల్గొన్నారంటే శ్రీస్వాములరు

వీటిలో ప్రవేశపెట్టిన విప్లవకర పంథాయే కారణం" అని వ్రాసింది. ఇట్లు శ్రీవారు 108గీతాయజ్ఞములు 58 గీతా సదస్సుల ద్వారా తమ ప్రవచనములచే దేశములోని ప్రజలకు ఆధ్యాత్మిక విజ్ఞానము నొసంగియున్నారు. వీరు వాసిష్ఠ రామాయణమును అనగా యోగవాసిష్ఠమును సంక్షేపించి "వసిష్ఠ గీత" యని వ్రాసి ప్రచురించిరి. వీరి గీతోపన్యాసములు గ్రంథ రూపమున వెలువడినవి, మరియు వీరు "గీతామకరందము" అను పేరుతో గీతకు 1110 పేజీలుగల గొప్ప వ్యాఖ్యను వ్రాసిరి. అదియు నిపుడు ప్రచురితమై జనులలో విరివిగ ప్రచారమగుచున్నది. గీతామకరందము ఒక విశిష్ట వ్యాఖ్య. అంచేత ఆంగ్లం, తమిళం, కన్నడం, హిందీ భాషలలో అనువదింపబడినది. ఇంకను మోక్షసాధన రహస్యము, భారత రత్నాకరం. భాగవత రత్నాకరం, రామాయణ రత్నాకరం, ఉపనిషద్రత్నాకరం అను పంచరత్నాకరాలను, తత్త్వసారము మొదలైన గ్రంథములను సులభమైన భాషలో వ్రాసి ప్రకటించిరి.

అంతేగాక భక్తుల కోర్కెపై "వేదాంతభేరి" అను ఆధ్యాత్మిక మాసపత్రికను 1963 సంవత్సరం నుండి ప్రారంభించి విజయ వంతముగ నడుపుచున్నారు. శ్రీకాళహస్తిలో శ్రీవారు భూరివిరాళములిచ్చి ఒక కళాశాలను స్థాపింపచేసిరి. అదే "స్వామి శ్రీవిద్యాప్రకాశానంద గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజి" అను పేరుతో శ్రీకాళహస్తిలో చక్కగా నడుచుచున్నది. మరియు మరికొంత విరాళమిచ్చి "శ్రీవిద్యాప్రకాశానంద స్వామి జూనియర్ మహిళా కళాశాల'ను కూడ శ్రీకాళహస్తిలో ప్రారంభింప చేసిరి. అదియు మిక్కిలి చక్కగా నడుస్తూంది.

త్రినేత్ర వైద్యాలయము

శ్రీ స్వాములవారు కన్నుయొక్క ఉపయోగం ఎంత విలువైనదో గుర్తించారు. "సర్వేంద్రియాణాం నయనం ప్రధానమ్" అన్నట్లు కన్ను వుంటే అన్నీ వున్నట్లే. లోకంలో కంటిపొరలతో కండ్లు వుండీ లేనివారై వృద్ధులెందరో బాధపడుతూండడం శ్రీ స్వాములవారిని కలచివేసింది. కాబట్టి నిరుపేదలకు, శ్రామికులకు నేత్రదానం చేయాలని సంకల్పించారు. ఆ సంకల్పరూపమే శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో స్థాపించిన "భక్త కన్నప్ప త్రినేత్ర వైద్యాలయము" 1991 మే 5 తేది త్రినేత్ర వైద్యాలయానికి భూమి పూజ జరిగింది. అనతికాంలోనే ఆస్పత్రికి 16 పడకలు, మంచి అపరేషన్ థియేటరు గల మంచి భవనం శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవాలయ సహాయంతో ఏర్పడింది. ఒక శుభముహూర్తంలో ఆశ్రమంలో ఈ కంటి ఆస్పత్రి ప్రారంభింపబడి ఇప్పటికి కొన్ని వేలమందికి కంటి ఆపరేషన్లు చేయుబడిచూపు తెప్పించబడింది. ఆస్పత్రికి అనేక ప్రాంతాల నుండి రోగులువచ్చి ఉచిత చికిత్స చేసుకుపోతున్నారు. ఇది చాలనందుచే 2009సం॥ కంచికామకోటి పీఠాధిపతులు జగద్గురు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ జయేన్ద్ర సరస్వతి స్వాముల వారిచే కంటి ఆస్పత్రి నూతన భవనం శంకుస్థాపన చేయబడి కోటిరూపాయలతో నిర్మింపబడి ఇప్పుడు నడుస్తూవుంది.

భగవద్గీత ఆడియో, వీడియో కేసెట్లు

శ్రీ స్వాములవారి గీతోపన్యాసాలకు వేలకు వేల జనం రావడం చూచి తిరుమల - తిరుపతి దేవస్థానంవారు 99వ గీతాయజ్ఞం నుండి 108వ గీతాజ్ఞాన యజ్ఞం వరకు అన్ని జ్ఞానయజ్ఞాలను దేవస్థానంవారే ఖర్చుపెట్టి నిర్వహించడమే గాక 1981 సంవత్సరంలో శ్రీ స్వాములవారి గీతోపన్యాసాలను రికార్డుచేసి ఆడియో కేసెట్లను విడుదల చేశారు. టి.టి.డి. వారి ఈ సేవవలన వేలకు వేలు ఆడియో కేసెట్లను ప్రజలు కొని ఆనందించారు. అట్లే టి.టి.డి. దేవస్థానం వారు శ్రీస్వాములవారి ప్రవచనాలను హైద్రాబాద్

పూజ్యశ్రీ స్వాములవారు స్థాపించిన
శ్రీశుకబ్రహ్మాశ్రమ ముఖద్వారము

పూజ్యశ్రీ ఆత్మానందస్వాములవారు (కంచి), పూజ్యశ్రీ కమలి బాబావారు, పూజ్యశ్రీ స్వాములవారు,
పూజ్యశ్రీ చిన్మయానందస్వాములవారు (చిన్మయ మిషన్ స్థాపకులు)



ధ్యానముద్రలో శ్రీస్వాములవారు (1960 సం॥)



1962 లో పూజ్యశ్రీ శివానందస్వాములవారితో శ్రీస్వాములవారు (ఋషీకేశ్)



నిజాం కాలేజిలో ఏర్పాటు చేసి వీడియో కేసెట్లను కూడ రికార్డు చేసి సి.డి.లను విడుదల చేశారు. ఇవి కూడ బహుజనాదరణను పొందాయి. ఆంధ్రదేశం నలుమూలలేగాక విదేశాలలో కూడ వీని ద్వారా శ్రీ స్వాములవారి సందేశం వ్యాపించింది. ఇట్లు శ్రీవారు లోకోత్తర పురుషులై తాము తరించుటే గాక ఇతరులను కూడ తరింపజేసి యున్నారు

మహాసమాధి

మహాత్ములు ఎందుకోసరం అవతరించారో ఆ పని అయిపోయిన వెంటనే తమ అవతారాన్ని చాలిస్తారు. అట్లే పూజ్యశ్రీ శ్రీశ్రీ స్వాములవారు ఆంధ్రదేశంలో పండితులు మొదలు పామరుల వరకు గీతాజ్ఞానాన్ని పంచిపెట్టే కోసరం అవతరించారు. ఆ విధంగానే అందరికి గీతాజ్ఞానాన్ని అందించారు. ఇకవారు వచ్చిన పని అయిపోయింది. కాబట్టి 84 సంవత్సరాల వయస్సులో 1998 ఏప్రిల్ 10వ తేది చైత్ర శుద్ధ చతుర్దశినాడు ఈ పార్థివ శరీరాన్ని వదలి మహాసమాధిని పొందారు. శ్రీవారి సమాధి విషయం రేడియో, టి.వి., దినపత్రికల ద్వారా దేశమంతా ప్రాకింది. దేశపు అన్ని ప్రాంతాలనుండి వేలకువేలు జనం వచ్చి శ్రీవారి భౌతిక శరీరాన్ని కడసారి దర్శించి తమ తమ శ్రద్ధాంజలులు ఘంటించారు. ఏప్రిల్ 12 తేది శ్రీ స్వాములవారి భౌతికకాయం ఆశ్రమంలో సమాధి చేయబడింది. శ్రీవారి ఈ సమాధిపై దాదాపు ముప్పయి లక్షలరూపాయలు వెచ్చింది ధ్యాన మందిరం నిర్మింపబడింది. ఇట్టి ఆదర్శ పవిత్ర మహాత్ములను మనము ముందుంచుకొని వారి బోధలను ఆచరణలో బెట్టి మనమున్నూ శాంతి నొందెదము గాక!

మంగళం వేదవేద్యాయ మహనీయగుణాత్మనే
విద్యాప్రకాశానందాయ గురుదేవాయ మంగళమ్..

ఓమ్ తత్ సత్

హృదయంలో రాముణ్ణి ప్రతిష్ఠించుకోండి

ఒకనాడు ఒక వ్యక్తి నావద్దకు వచ్చి అడిగినాడు– "స్వామీ! లోకంలో దైవచింతన లేక అన్యాయ అక్రమములు తాండవమాడుచున్నవే! దుర్గుణములు, దురాచారములు పెరిగి అశాంతి ఆవరించుచున్నదే! వీనికి ఏదైన పరిహార మార్గమును సూచించిన నావంతు సేవ నేను చేస్తాను. సెలవియ్యండి," అంటూ. "రామనామమును కాగితములపై అచ్చు వేయించి వాటిని రోడ్డు ప్రక్కన గోడలపై అతికించిన యెడల అందరి చూపులు వాటిపై పడి వారిలో పవిత్ర భావములు బయలుదేరును", అన్నాడు.

అప్పుడు నేను చెప్పాను – "గోడలపైనెందుకయ్యా? నీ హృదయంపై అతికించుకో. అక్కడ ఆ నామమును ప్రింటు కొట్టినట్లు విడదీయుటకు వీలులేకుండా అతికించుకో. నీ హృదయంలో రాముణ్ణి ప్రతిష్ఠించు కున్నప్పుడు నీ గుణశీలములను గమనించి నిన్ను అనుసరించి ఇతరులు బాగుపడుదురు. అంతేగాని, గోడలపై వ్రాసితే ఏమి లాభము?"

– సత్య సాయిబాబా



చరాచర సుఖాభిలాషి-శ్రీమలయాళ స్వామి



డా॥ శ్రీసముద్రాల లక్షణయ్య, శిరోమణి, యం.ఎ

పుట్టిన ప్రతిప్రాణీ గిట్టక తప్పదు. ఎవరి పుట్టుక లోకకల్యాణానికి హేతువవుతుందో వారిని కారణజన్ము లంటాము. ఏ ప్రయోజనమూ లేకుండా పుట్టలోని చెదలులాగా పుట్టి గిట్టేవారి జన్మ వ్యర్థం.

భారతదేశం అతిప్రాచీన కాలంనుండీ తత్త్వవేత్తలయిన ఋషిపుంగవులకు నిలయంగా ప్రశస్తి పొందింది. ఆధునిక యుగంలో కూడా శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, శివానంద మొదలైన మహామహులు భారతభూమిలో జన్మించారు. తమ పుట్టుకతో భారతదేశాన్నే కాక యావత్ప్రపంచాన్నీ పావనం చేసిన మహనీయ చరిత్రులు వీరు.

జననం -బాల్యం

అలాంటి మహాత్ముల కోవకు చెందిన వారే మహర్షి సద్గురు శ్రీ మలయాళస్వాములవారు. వీరే శ్రీవిద్యా ప్రకాశానందగిరిస్వామికి గురువుగారు. శ్రీ శంకర భగవత్పాదులు, శ్రీ నారాయణ గురుదేవులు మొదలైన మహాత్ముల దివ్యావతారంతో పవిత్రమైన కేరళదేశంలోనే క్రీ.శ. 1885లో చైత్రశుద్ధ ఏకాదశినాడు సుప్రసిద్ధమైన గురువాయూరు క్షేత్రానికి సమీపాన ఎన్గండ్యూరు అనే గ్రామంలో శ్రీ మలయాళ స్వాములవారు జన్మించారు. వీరి చిన్ననాటి పేరు వేలప్ప. పూవు పుట్టగానే తావి వ్యాపిస్తుంది కదా! అదే రీతిగా శ్రీ మలయాళ స్వామిలో బాల్యంలోనే భూతదయ, ధ్యాననిష్ఠ, సత్యపరిపాలన మొదలైన గుణాలు పుష్కలంగా ఉండేవి.

ఆ దినాలలో బ్రహ్మనిష్ఠా గరిష్ఠుడూ, మహాతపస్వీ, గొప్ప సంఘసంస్కర్త అయిన శ్రీ నారాయణ గురువు కేరళదేశంలో అద్వైత వేదాంతాన్ని అనుష్ఠానంలోకి తేవటానికి పెద్ద ఉద్యమం నిర్వహించారు. ప్రజల్లోని మూఢ విశ్వాసాలను తొలగించటానికై ఎంతో కృషి చేశారు.

నానాకులాలతో, వివిధ మతాలతో, అనేకమైన ఆరాధనా విధానాలతో, అస్పృశ్యత మొదలైన దురాచారాలతో ఛిన్నా భిన్నమై, వుండిన జాతికి ఆయన 'ఒకే కులం, ఒకే దేవుడు, ఒకే మతం' అన్న నినాదాన్ని ఒక మహామంత్రంగా ఉపదేశించారు. పతనావస్థలో వుండిన సనాతనధర్మాన్ని పునరుద్ధరించడానికి ఆ మహాపురుషుడు చేసిన పరిశ్రమ చాలావరకూ విజయవంత మయింది.

గురుకులవాసం

శ్రీ నారాయణగురువు ప్రభావంవల్ల ఆ కాలంలో ఆధ్యాత్మిక పురోగతి సాధించిన వారిలో ప్రముఖులు శ్రీసిద్ధశివలింగ గురువులు. వీరు "పెరింగోట్కర" అనే గ్రామంలో ఒక ఆశ్రమం స్థాపించి తమ చెంత చేరిన శిష్యులకు ఆధ్యాత్మిక శిక్షణ యిచ్చేవారు.



సన్న్యాస స్వీకరణానంతరం శ్రీస్వాములవారు (1947 సం॥)



గురుదేవులు పూజ్యశ్రీ సద్గురు మహర్షి మలయాళస్వాములవారితో
పూజ్యశ్రీ స్వాములవారు
శ్రీశుకబ్రహ్మాశ్రమ ప్రారంభోత్సవంలో (1950)

శ్రీ శివలింగ గురువులు స్థాపించిన శ్రీ నారాయణాశ్రమంలో ఒక విద్యార్థిగా చేరి శిక్షణ పొందిన 'వేలప్ప' అనే బాలుడే తరువాత ఆంధ్రదేశంలో మలయాళస్వామిగా రూపొంది నేడు లక్షలకొలది ప్రజలకు సద్గురువుగా, ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్నాడు.

వేలప్ప చిన్నతనంనుండి చక్కని శీలసంపద కల్గివుండే వాడు. భగవద్భజనలు చేసే సత్సంగాలలో తఱచు పాల్గొనే వాడు. కపటనాటకమాడే శుష్కవేదాంతులను, వంచకులను ఒక కంట కనిపెట్టి వుండేవాడు. తన అనుష్ఠానంలో ఏ మాత్రం ఏమరుపాటు లేకుండా ప్రవర్తించేవాడు.

బాల్యంలోనే అతని ప్రవర్తనను చూచిన పెద్దలు అతడు భావికాలంలో మహాపురుషుడు కాగలడని ఊహించారు. జాతకం చూచిన జ్యోతిష్కులు అతనిది గుమ్మడితీగ జాతకమనీ, ఆ తీగ పుట్టినచోటునుండి సుదూరం ప్రాకిపోయి అక్కడ ఫలించినట్లే – వేలప్ప జన్మభూమి వదలి దేశాంతరం పోయి అక్కడ మహాకార్యాలు నిర్వహిస్తాడనీ చెప్పారు.

గురుకులవాస కాలంలో వేలప్ప ఆశ్రమానికి వచ్చే అతిథులకు మిక్కిలి ఆదరంతో, భక్తితో సేవచేసేవాడు. పూజా మందిరంలో క్రమం తప్పక పూజాదికార్యాలు నిర్వర్తించేవాడు. విద్యాభ్యాస విషయంలో మిక్కిలి పట్టుదల పూని సంస్కృతం లోని గీత, ఉపనిషత్తులు మొదలైన ఉద్గ్రంథాలను ఆకళింపు చేసుకొన్నాడు.

పాదచారంతో తీర్థయాత్ర

పదునైదేండ్ల ప్రాయంలో భారతదేశమంతా పాదయాత్రతో పర్యటించాలన్న భావన, ఆయనకు కల్గింది. వెంటనే తన సంకల్పాన్ని ఆచరణలో పెట్టాడు. ఒకనాటి అర్ధరాత్రి ఎవరికీ చెప్పకుండా తన పయనం కొనసాగించాడు.

"నేను దైవకార్యం కొరకై పోతున్నాను. నాకోసం వెతకువద్దు. వెదికినా మీకు దొరకను. ఇంటికి వచ్చిన అతిథులను మీరు అన్నపానాదులతో ఆదరించినంతకాలం నేను ఎక్కడ ఉన్నా క్షేమంగా వుంటాను." అని వ్రాసిన చీటి పడకమీద వుంచి తన యాత్ర సాగించాడు.

ఈ బాలబ్రహ్మచారి మహావైరాగ్యంతో కాలినడకతోనే ఆసేతుహిమాచలం పర్యటించాడు. అనేక పుణ్యక్షేత్రాలను సందర్శించాడు. చాలామంది మతగురువులను కలుసు కున్నాడు. నాటి భారతదేశ పరిస్థితులను సమగ్రంగా అవగాహన చేసుకొన్నాడు. పుణ్యతీర్థాలలో స్నానం చేసేటప్పుడు 'లోకాస్సమస్తాస్సుఖినో భవంతు' అని సంకల్పం చెబుతూ స్నానం చేసేవాడు.

ఈ యాత్రా సమయంలో ఆయన ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడు. అయినా పట్టు వీడక యాత్రపూర్తి చేశాడు. కాశి నుండి గంగా తీర్థాన్ని కావడితో మోసుకొని తెచ్చి రామేశ్వరంలో శ్రీ రామలింగేశ్వర స్వామికి అభిషేకం చేశాడు.

తపోనిష్ఠ

యాత్ర పూర్తిచేసిన తరువాత ఎక్కడైన ఒక్క పవిత్ర ప్రదేశంలో వుండి తపోనిష్ఠ కొనసాగించాలని ఆయన సంకల్పించాడు. తన సాధనకు తిరుమలలోని గోగర్భక్షేత్రం తగిన స్థలమనుకొన్నాడు. తిరుపతి యాత్ర చేసినప్పుడు అక్కడి ప్రశాంతవాతావరణం తనకు నచ్చడం వల్ల అలా నిర్ణయం చేసుకున్నాడు.

ఈ నిర్ణయానుసారం పాదచారిగానే తిరిగి కేరళదేశం నుండి పయనించి కొన్నాళ్లకు తిరుమల చేరుకొన్నాడు. ఈ సంఘటన 1913లో జరిగింది.

గోగర్భగుహలో తపోనిష్ఠకు కూర్చోగానే ఆయన హృదయంలో ఈ క్రిందిశ్లోకం దైవప్రార్థనగా స్ఫురించింది.

అతీతవైరాగ్య మఖండబోధః కదా ను మే సిద్ధ్యతు హే దయాళో।
సమాధియోగస్య పరస్య నిష్ఠా సర్వేషు భూతేషు సమత్వబుద్ధిః॥

"దయామయుడవైన ఓ దేవా! అతీతమైన వైరాగ్యం, అఖండమైన బోధ, నిర్వికల్పమైన సమాధి యోగంలో నిలకడ, సర్వప్రాణుల పట్ల సమత్వబుద్ధి నాకు ఎప్పుడు ప్రసాదిస్తావో!" అని ఈ ప్రార్థనలోని తాత్పర్యం.

గోగర్భ గుహలో తపస్సు చేస్తున్న ఈ మహాతపస్విని చూచి ఆయన ఊరూ, పేరూ తెలియనివారు మలయాళదేశీయుడు కాబట్టి 'మలయాళస్వామి' అని వ్యవహరించడం ప్రారంభించారు. చివరికి ఆ పేరే శ్రీస్వాములవారికి స్థిరపడి పోయింది.

1913వ సంవత్సరంలో ప్రారంభమైన తపస్సు పంద్రెండు సంవత్సరాలకు పైగా కొనసాగింది. ఆ కాలంలో శ్రీ స్వామివారు ఎన్నో కష్టాలకు గురి అయ్యారు. ఎన్నో అగ్ని పరీక్షలను ఎదుర్కొన్నారు. లక్ష్యం సిద్ధించలేదన్న కారణంగా ఒక్కొక్కసారి తీవ్రవేదన పొందేవారు. ఆత్మహత్యకు ప్రయత్నించిన సందర్భాలు కూడా లేకపోలేదు. అయినా అఖండమైన పట్టుదలతో ఏమాత్రం వెనుదీయక దీక్ష కొనసాగించి చివరికి భగవదనుగ్రహానికి పాత్రులయ్యారు. ఆత్మసాక్షాత్కారం పొందారు. నిశ్శేషశోక శాంతిని, నిరతిశయానంద ప్రాప్తినీ కైవసం చేసుకున్నారు.

శుష్క వేదాంతతమో భాస్కరం

గోగర్భంలో ఉన్నప్పుడే శ్రీ స్వాములవారు క్రమంగా తెలుగుభాష నేర్చుకున్నారు. ఆ భాషలో ఒక ఉద్గ్రంథం వ్రాశారు. ఆ గ్రంథమే ఈనాడు సుప్రసిద్ధమై సాధకులకందరికీ అనుదిన పఠనీయమైన "శుష్కవేదాంతతమో భాస్కరం".

ఆ రోజుల్లో ఆధ్యాత్మిక విజ్ఞానం సంపాదించి ఆత్మోన్నతి పొందడానికి అందరికీ సమానమైన అవకాశాలు వుండేవి కావు. వర్ణవ్యవస్థ కారణంగా బ్రాహ్మణేతరులు, అలాగే స్త్రీలు ఆధ్యాత్మిక విద్యకు అనర్హులనే మూఢవిశ్వాసం ప్రజల్లో వ్యాపించి వుండేది. కడకు సంస్కృతభాష నేర్చుకోవడానికి కూడా కొన్ని జాతులకు అర్హత లేదనే గ్రుడ్డి నమ్మకం ఉండేది.

వేదకాలంలో, ఉపనిషత్తులలో ఈ మూఢ విశ్వాసాలు ఉండేవి కావు. స్మృతుల కాలంలోనూ, పురాణ యుగంలోనూ ఇలాంటి దురభిప్రాయాలు వ్యాపించాయి. గార్గి, చూడాల, మదాలస, సులభమొదలైన నారీమణులు అతిప్రాచీన కాలంలో బ్రహ్మవిద్యలోనూ, యోగవిద్యలోనూ నేర్పరులైనట్లు ఆనాటి సంస్కృత సారస్వతం నుండి తెలియవస్తున్నది. ఆనాటి మధ్యకాలంలో భారతదేశానికి హీనత్వాన్ని ఆపాదించే మూఢాచారాలు, మూఢ విశ్వాసాలూ బలపడిపోయాయి.

అంతేకాక అచలవేదాంతులనబడే కొంతమంది కపట వేషధారులు దురాచారపరులై 'ఏమి చేసినా ఆత్మకు అంటదు' అని చెబుతూ ప్రజలను వంచిస్తూ వుండేవారు. మరొకవంక సనాతన పండితులు-ద్విజేతరులూ, స్త్రీలూ గీతాది గ్రంథాలను పఠించరాదనీ, ప్రణవాన్ని ఉచ్చరించ రాదనీ చెప్పేవారు.

ఈ దుర్భర పరిస్థితులను చక్కదిద్దటానికీ గ్రుడ్డి

నమ్మకాలను రూపుమాపటానికీ, దురాచారాలను దూరం చేయటానికీ శ్రీ మలయాళ స్వామీజీ 'శుష్కవేదాంతతమో భాస్కరం' రచించారు.

ఈ గ్రంథరచన 1919 డిశంబరులో పూర్తి అయింది. వెంటనే భక్తుల సహకారంతో ముద్రింపబడింది. ఇది ఆనాడు తమిళంలో కూడ ముద్రించబడింది. ఈ గ్రంథం ఆంధ్రదేశంలో ఆధ్యాత్మికంగానే కాక, సాంఘికంగా కూడా ఒక గొప్ప విప్లవం రేకెత్తించింది. జాతి భేదాలను బట్టి మానవులలోని ఉచ్చనీచావస్థలు, స్త్రీలకు బ్రహ్మవిద్యాధికారం, అనుష్ఠానావశ్యకత మొదలైన విషయాలలో శ్రీ స్వామివారు వెలిబుచ్చిన అభ్యుదయ భావాలు వేలకొలది ప్రజలలో చైతన్యం రేకెత్తించాయి. తరతరాలుగా ప్రబలి వుండిన మూఢ విశ్వాసాలనూ, దురాచారాలనూ నిశితంగా ఖండించి అసలు సిసలైన ధర్మాన్ని ప్రబోధించే "శుష్కవేదాంతతమో భాస్కరం" పలుసార్లు ముద్రింపబడి తెలుగుదేశం నలుమూలలా ప్రాకింది. గ్రంథం చదివిన వారిందరికీ తిరుమలకు వెళ్ళి స్వామీజీని దర్శించాలన్న కుతూహలం కల్గేది.

తిరుమల యాత్రికులకు క్రమంగా శ్రీమలయాళ స్వామి సందర్శనం తప్పనిసరి అయింది. శ్రీస్వాములవారు భక్తులను, యాత్రికులను ప్రేమతో చేరదీసి వారి ప్రశ్నలకు తగిన సమాధానాలు చెప్పి సందేహాలు తీర్చేవారు. స్వామి సన్నిధానంలో భక్తులు అపూర్వమైన శాంతిని అనుభవించే వారు. క్రమక్రమంగా శ్రీ స్వామీజీ యశశ్చంద్రికలు తెలుగుదేశ మంతా విస్తరించాయి.

అయితే 'శుష్కవేదాంత తమోభాస్కరం' కొందరు సనాతనులకు, అభ్యుదయం భావాలంటే గిట్టని ఛాందసులకు స్వామీజీపై ద్వేషభావాలు కూడా కల్గించింది. ఒక మహాసంస్కరణ కార్యక్రమానికి పూనుకొన్నప్పుడు ఇలాంటి పరిస్థితులు తప్పవు కదా! స్వామీజీ భావాలు గిట్టనివారు వారిని తిరుమలనుండి తొలగించాలని సంకల్పించుకొన్నారు. క్రమంగా తమ సంకల్పాన్ని ఒక ఉద్యమంగా రూపొందించారు. నాటి దేవస్థానం పాలకులు మహంతు వారు సనాతనుల ఒత్తిడికి లొంగక తప్పలేదు.

అందుచేత మహంతువారినుండి శ్రీ స్వాములవారికి గోగర్భక్షేత్రంనుండి మకాం మార్చవలసిందిగా హెచ్చరిక అందింది. నాటి దేశ కాల పరిస్థితులనూ, ఔచిత్యానౌచిత్యాలనూ నిశ్చయించుకొన్నారు.

శ్రీ వ్యాసాశ్రమస్థాపన

1926వ సంవత్సరం జూన్ నెలలో శ్రీ స్వాములవారు కొంతమంది శిష్యులతోసహా కొండ దిగారు. తిరుపతి-శ్రీకాళహస్తి క్షేత్రాల మధ్య ఏర్పేడు గ్రామం వద్ద నందిపర్వతం క్రింది భాగంలో వ్యాసుని పేరుతో ఆశ్రమం స్థాపించారు. ఆ ఆశ్రమమే నేటి సుప్రసిద్ధమైన శ్రీవ్యాసాశ్రమం.

ఈ స్థలాన్ని ఆశ్రమ నిర్మాణానికి ఎన్నుకోవడానికి కారణం లేకపోలేదు. శివపురాణంలో ఈ ప్రదేశం పూర్వం మహర్షులు, జపాల మొదలైన నారీమణులు తపస్సు చేసి సిద్ధిపొందిన శివుడు ఏర్పాటు చేసినట్లు పురాణం పేర్కొంటున్న 'కాశీబుగ్గ' ఇచటనే వుంది. ఈ తీర్థం పరమపవిత్రంగా భావింపబడుతున్నది. ఈ ప్రాంత ప్రజలు పుణ్యక్షేత్రంగా భావించి సేవిస్తూ వుండేవారు.

లోకోద్ధారక కార్యక్రమాలు

శ్రీవ్యాసాశ్రమ స్థాపనతో శ్రీ స్వాములవారి లోకోద్ధారక కార్యక్రమాలు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. అక్కడ ఒక సంస్కృత విద్యాలయాన్ని స్వామివారు స్థాపించారు.

కులమత భేదం పాటించకుండా జిజ్ఞాస కలవారందరూ ఆ పాఠశాలలో సంస్కృతం నేర్చుకునే అవకాశం కల్పింపబడింది. క్రమంగా పలుప్రాంతాలనుండి విద్యార్థులు ఆశ్రమానికి వచ్చి సంస్కృతం అభ్యసించ బూనుకొన్నారు.

యథార్థభారతి

శ్రీ స్వాములవారు సమాజోన్నతికీ, సంఘ సంస్కరణకూ అవసరమైన కొన్ని ముఖ్యవిషయాల ప్రచురణకై ఆశ్రమం తరపుననే ఒక ఆధ్యాత్మిక మాసపత్రికను 1927లో ప్రారంభించారు. ఆ పత్రికకు 'యథార్థభారతి' అన్న నామకరణం చేశారు. కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞాన యోగాలను బోధించడానికీ, ఆర్షధర్మ ప్రచారానికీ పత్రిక ప్రారంభించినట్లు ప్రకటించారు. భక్తులు పత్రికను ప్రేమతో ఆదరించారు. అందులో ఆత్మోన్నతి కల్గించే అనేక విషయాలను విశదీకరిస్తూ శరపరంపరగా శ్రీ స్వామీజీ వ్యాసాలు వ్రాసేవారు.

సనాతన వేదాంత జ్ఞానసభ

1926 లోనే శ్రీ స్వాములవారు 'సనాతన ధర్మ పరిపాలన సేవాసమాజము' అన్న పేరుతో ఒక సాధు సంఘాన్ని ప్రారంభించారు. ఆ రోజుల్లో ఆంధ్రదేశంలో సాధు సంఘాలు చెప్పుకో దగినంతగా లేవు. ఆధ్యాత్మిక జ్ఞాన ప్రచారం ఈ ప్రాంతంలో చాలా కొరవడి వుండేది. ఈ కొరత తీర్చాలన్న దృఢసంకల్పంతో స్వామీజీ ఈ సమాజన్ని ప్రారంభించారు. ఆ సమాజమే తరువాత 'సనాతన వేదాంత జ్ఞానసభ'గా రూపొందింది.

సత్యాన్వేషణ, సత్యానుష్ఠానం. ధర్మాన్వేషణ, ధర్మానుష్ఠానం దుఃఖకారణాల అన్వేషణ, దుఃఖదూరీకరణం- అన్న లక్ష్యాలను సాధించడానికై ఈ సభ కృషి చేసింది. ప్రతి సంవత్సరం ఫాల్గుణ పూర్ణిమ నుండి మూడురోజులు ఈ సభలు నిర్వహించాలనే నిర్ణయం జరిగింది. శ్రీ మలయాళ సద్గురుదేవుల కాలంలో 1962 వరకు ఈ సభలు 36 జరిగాయి. ఇప్పటికీ శ్రీ వ్యాసాశ్రమ వ్యాస పీఠాధిపతుల ఆధ్వర్యంలో ప్రతిసంవత్సరం వివిధ ప్రాంతాలలో ఈ సభలు నిరాటంకంగా జరుగుతూ యున్నాయి.

సామూహిక ధ్యానం, గీత - ఉపనిషత్పారాయణలు, గీతా ప్రవచనాలు, ప్రముఖులచే ఆధ్యాత్మికోపన్యాసాలు, నామ సంకీర్తనలు, అన్నదానం, ఆధ్యాత్మికగ్రంథ ప్రచారం మొదలైన కార్యక్రమాలు ఈ సభలో విరివిగా జరుగుతాయి. ఆంధ్రదేశంలో ఆధ్యాత్మిక చైతన్యం కల్గించటానికీ, తద్వారా సాంఘిక జాగరణను ఉద్బోధించటానికి ఈ సభలు ఎంతో ఉపకరించాయి.

ఈ సభల తర్వాత వివిధ ప్రాంతాలలో భక్తుల ఆహ్వానాన్ని పురస్కరించుకొని శ్రీ మలయాళ స్వాములవారు ఉపసభలను నిర్వహించేవారు. ఇవి వివిధ జనపదాలలో జరిగేవి. సప్తాహాలు, ఓంకార సత్రయాగాలు, ముక్తి సోపాన యజ్ఞాలు, సాధుమండలులు, చాతుర్మాస్యవ్రతాలు మొదలైన అనేక కార్యక్రమాలను శ్రీవారు అనేకస్థలాలలో నిర్వహించి ఆత్మజ్ఞానామృతం పంచి పెట్టారు. స్త్రీలనూ, ద్విజేతరులనూ ఆధ్యాత్మిక విజ్ఞానంలో నిష్ణాతులనుగా తీర్చిదిద్దారు. బ్రహ్మచారులకూ, సాధువులకూ చక్కని క్రమశిక్షణ యిచ్చారు. బ్రహ్మవిద్యలో వారిని నిపుణులను చేశారు. గృహస్థులకు పవిత్ర జీవనవిధానాన్ని బోధించారు. కులమతాది విషమ భావాలను తొలగించి సమభావాన్ని అలవాటు జేశారు. ఈ రీతిగా స్వామి వివేకానంద. శ్రీ నారాయణగురువు ఏ సదాశయాలకోసమై పాటుపడ్డారో, ఆ సదాశయాలను ఆంధ్రావనిలో విరివిగా ప్రచారంచేసి ఆచరణలోకి తెచ్చారు. శ్రీవారి కృషి ఫలితంగా బ్రహ్మ విద్యకు ఎవరు అధికారులు?!

అన్న విషయంలో ప్రజల్లోని మూఢవిశ్వాసాలు పటాపంచ లయ్యాయి.

1931లో రాజమండ్రిలో సనాతన వేదాంతజ్ఞానసభ జరిగింది. సభకు ఎందరో పెద్దలు హాజరయ్యారు. శ్రీస్వాములవారి ప్రచార పద్ధతి వేదసంప్రదాయానికి విరుద్ధమని కొందరు ప్రచారం చేశారు. ఆ సంగతేమిటో తేల్చుకోవాలని కవిసార్వభౌమ శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి సభకు హాజరై స్వామివారి ఉపన్యాసాన్ని విని వారిని దర్శించి అమందానందం పొందారు. వెంటనే శ్రీ స్వామివారిని స్తుతిస్తూ సంస్కృతంలో శ్లోకాలు వ్రాశారు. అందులో స్వామిని అపరశంకరులుగా, ఆధునిక వ్యాసులుగా అభివర్ణించారు. ఆ శ్లోకాలను స్వామీజీకి వినయ పూర్వకంగా సమర్పించి ప్రణమిల్లారు.

శ్రీ స్వాములవారి పర్యటనలు ప్రబోధాలు నాటి బుద్ధ దేవుని ధర్మచక్రపరివర్తనాన్ని గుర్తుకు తెస్తున్నాయని ప్రసిద్ధ పండితులు శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణ గారు పేర్కొన్నారు.

ఇలా ఎందరో అనేకవిధాల శ్రీ స్వాములవారి ఉద్యమాన్నీ, లోకసేవలనూ ప్రశంసించి వున్నారు.

మహాత్మునితో కలయిక

స్వామీజీ ఒకసారి బందరు వెళ్లారు. అదే సమయంలో మహాత్మాగాంధీగారు స్వాతంత్ర్యోద్యమం నిర్వహిస్తూ అక్కడికి వచ్చారు. శ్రీ భోగరాజుపట్టాభి సీతారామయ్యగారి గృహంలో స్వామీజీ గాంధీగారితో సమావేశమయ్యారు. స్వరాజ్యోద్యమ ప్రాముఖ్యాన్ని గురించి గాంధీగారు ప్రస్తావించగా స్వామీజీ స్వారాజ్యోద్యమం అంటే ఆత్మరాజ్య సాధనలోని ప్రాధాన్యాన్ని వివరించారు. గాంధీగారు స్వామీజీ చేస్తున్న కృషిని ఎంతో అభినందించారు.

నిరాడంబరత -అనుష్ఠాననిష్ఠ

శ్రీ మలయాళస్వాములవారు నిరాడంబరతకు మారుపేరుగా వుండేవారు. వ్యాసాశ్రమం ప్రారంభమైన తొలిదశలో కాశీబుగ్గకు ఉత్తరాన శ్రీస్వామినివాసానికి అనుగుణంగా భక్తులు ఒక పూరిపాక నిర్మించారు. కాలక్రమంలో ఆశ్రమంలో పక్కా నిర్మాణాలు ఎన్నో ఏర్పడ్డాయి. అవన్నీ శిష్యులకొరకే, స్వామివారు తాము మాత్రం పూరిపాకలోనే నివసించేవారు. తరువాత నిష్ఠాశ్రమమనే పేరుతో ఏర్పడిన మరొక నివాసం కూడా పూరిపాకే. వాటిని తొలగించి భవన నిర్మాణం చేయడానికి స్వామీజీ సుతరామూ అంగీకరించలేదు. "పురోభివృద్ధి కోరువారు పూర్వవృత్తాంతం మరువరాదు" అనే నీతిసూత్రం ప్రకారం మొదటి స్థితికి జ్ఞాపకచిహ్నమైన పూరిపాకను తొలగించటానికి శ్రీ స్వామీజీ ఇష్టపడలేరు. ఇప్పటికీ వ్యాసాశ్రమంలో పూజామందిర మన్న పేరుతో ఉన్నది ఆ పూరిపాకే.

శ్రీ స్వామీజీ అనుష్ఠానానికి ఎంతో ప్రాధాన్య మిచ్చేవారు. అనుష్ఠానం లేనివారి చర్యలన్నీ కళాయిలేని రాగిపాత్రలో వండిన పులుసువలె వ్యర్థమని ప్రబోధించేవారు. అందుకే 'శ్రీ మలయాళయతీంద్రగీత' అనే తమ గ్రంథంలో-

నానుష్ఠానాత్పరం కార్యం త్రిషు లోకేషు విద్యతే !
సత్యం సత్యం పునస్సత్య మితి మామకభాషితమ్ !!

అని ప్రబోధించారు. అంటే "అనుష్ఠానాన్ని మించిన శ్రేష్ఠమైన కార్యం మరొకటి లేదు. ఇది ముమ్మాటికి నిజమని నేను చెబుతున్నాను" అని అర్థం. అనుష్ఠానం లేని వాచావేదాంతమే భారతదేశ హీనస్థితికి కారణమని వారు హెచ్చరించేవారు.

సర్వమత సమన్వయం

శ్రీ స్వాములవారు సర్వమతాల సమన్వయాన్ని సాధించిన తీరు లోకోత్తరమైనది. ఒకసారి భక్తుడొకడు "స్వామీ! మీ ఆశ్రమంలో అందరు దేవతలనూ, మతప్రవక్తల నందరినీ పూజిస్తున్నారే! ఇంతకూ మీ మత మేమిటి? అని ప్రశ్నించాడు.

ఇందుకు సమాధానంగా స్వామీజీ ఇలా అన్నారు "నాయనా! ఈ మతప్రవక్తలందరి మతులకు ఆవలవుండి ఏది వీరి మతులకు ఈ మతస్ఫూర్తినీ, చైతన్యాన్నీ ప్రసాదించిందో, అదే మా మతం. అది దేశకాలాల కతీతమైనది".

మరొకసారి కొంతమంది స్వామీజీ దర్శనానికై వచ్చారు. స్వాములవారు నిష్ఠాశ్రమంలో ధ్యాననిష్ఠలో ఉన్నారని తెలుసుకొని కొంతసేపు వేచి వుండినారు. శ్రీవారు రాగానే నమస్కరించి వారిలా ప్రశ్నించారు.

"స్వామీ! మీరు ముక్తాత్ములైన సిద్ధపురుషులు కదా! ఇంకా మీకు ధ్యాననిష్ఠ లెందుకు? ఈ నిష్ఠల్లో వుంటే మీరింకా సాధకావస్థలోనే ఉన్నారని అనుకోవలసివస్తుంది కదా!"

అందుకు స్వామీజీ "నాయనలారా! మీరు నిత్యాన్నదాన సత్రాలను చూచారా? అక్కడ వంటలు వండేవారు సదా వంటలు వండుతూనే వుంటారుకదా! అట్లని వారు ఇంకా భుజించలేదని అర్థమా? వారు భుజించే ఇతరులకొరకై వండుతూ వుంటారు" అని చెప్పారు.

ఇలా సాధకులు, భక్తులు, జిజ్ఞాసువులు అడిగే ప్రశ్నలకు శ్రీ స్వాములవారిచ్చే సమాధానాలు సంగ్రహం గానూ, అర్థవంతరగానూ, చమత్కారపూర్ణంగానూ వుండేవి.

తాపత్రయం తగ్గేది ఎలా?

ఒకసారి కొందరు భక్తులు స్వామీజీని సందర్శించి "గురుదేవా! మా తాపత్రయం తగ్గడానికి మాకు రెండు ముక్కలలో వేదాంతతత్త్వం బోధించండి!" అని సవినయంగా ప్రార్థించారు. అప్పుడు స్వామీజీ. 'ఓహో! మీకు రెండు ముక్కలలో మార్గం బోధించాలా? ఐతే వినండి! విషయ వృత్తులు తగ్గించుకోండి! ఆత్మను మరచి పోకండి!" అని బోధించారు.

1926 లో ప్రారంభమైన వ్యాసాశ్రమం ఒక ఆధ్యాత్మిక కేంద్రమై జిజ్ఞాసువులకు జ్ఞానామృతాన్ని ప్రసాదించింది. బ్రహ్మ విద్యాబీజాలను నలుమూలలా వెదజల్లింది.

1962 లో శ్రీ స్వామీజీ ఇలా అన్నారు "మా సంకల్పాలన్నీ నెరవేరాయి. ఇక చేయవలసిందేమీ లేదు. మాకింక లోకంలో ఉండవలెనని గానీ, పోవలెననిగానీ లేదు. పరమేశ్వరుడెలా సంకల్పించునో అలా జరుగుగాక! భగవంతుని పిలుపందిన తత్క్షణమే ప్రయాణానికి సిద్ధంగా వున్నాము".

మహానిర్వాణం

ఈమాటలు చెప్పిన తరువాత ఐదునెలలకు జూలై 12వ తేదీ 1962లో గురువారం శయనైకాదశీ పుణ్యదినాన శ్రీ మలయాళ సద్గురుదేవులు అస్తమించారు. ఆంధ్రదేశ ఆధ్యాత్మిక చరిత్రలో ఒక ఉజ్జ్వలఘట్టం ఆ రోజుతో సమాప్త మయింది.

దివ్యజీవన సంఘస్థాపకులు శ్రీ స్వామిశివానంద సరస్వతీ మహారాజ్ హృషీకేశంనుండి అప్పుడొక సందేశం పంపుతూ "శ్రీ మలయాళస్వామి జీవితం భగవద్గీతకు

ఆశ్రమ గీతాపాఠశాలలో శ్రీస్వాములవారితో బ్రహ్మచారులు, ఉపాధ్యాయులు, 1986

గీతాపాఠశాలలో 2010 సం॥లో విద్యార్థులు, ఆచార్యులు శ్రీ సి. హెచ్. మార్కొండయ్యగారు

1987లో పుట్టపర్తిలో ఉపన్యసించినప్పుడు శ్రీసాయిబాబావారితో శ్రీస్వాములవారు

షోలాపూర్, మహారాష్ట్ర గీతాజ్ఞానయజ్ఞంలో పూజ్యశ్రీ స్వాములవారు (1979 సంవత్సరం, జనవరి)

శ్రీసద్గురు మలయాళస్వాములవారి శతజయంతి(1985) సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు ఎడమనుండి కుడికి - శ్రీరామకృష్ణానందగిరి స్వాములవారు(గండిక్షేత్రం) శ్రీ స్వాములవారు, శ్రీ రంగనాథానందస్వాములవారు (శ్రీరామకృష్ణ మఠాల ఉపాధ్యక్షులు, హైదరాబాదు) శ్రీ ప్రకాశానందస్వాములవారు(మహామండలేశ్వర్లు, హరిద్వార్), శ్రీ విద్యానందగిరిస్వాములవారు (మహామండలేశ్వరులు, ఋషీకేశ్)



1985వ సం॥ శతజయంతి ఉత్సవ సభావేదికపై ఆశీనులైన పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు,

పూజ్య స్వాములవారితో పూజ్యశ్రీ శబరిమాతగారు(కామారెడ్డి)



స్వామి శ్రీ విద్యాప్రకాశానంద గవర్నమెంటు ఆర్ట్సు కళాశాల, శ్రీకాళహస్తి.

భాష్యం" అని తమ శ్రద్ధాంజలి ఘటించారు.

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు "స్వామి అనేకరీతుల మానవుల కండయై దండయై ఆనందము నందించెను. ఆయన నిస్వార్థసేవా నిరంతర నిర్మల ప్రబోధాలు ఆచంద్రార్కం అమరమై విలసిల్ల గలవు' అని వినుతించారు.

శ్రీ స్వాములవారి భౌతికకాయం నిష్కాశ్రమ ప్రదేశంలో సమాధి చేయబడింది. మండలాభిషేకంనాడు చాలామంది మహనీయులే కాక ముప్పదివేలమంది భక్తులు ఆశ్రమంలో సమావేశమై గురుదేవునికి శ్రద్ధాంజలి ఘటించారు.

శ్రీ స్వాములవారి తరువాత వ్యాసపీఠం అధిష్ఠించిన విమలానందస్వామీజీ గురుదేవుని అడుగుజాడల్లో నడుస్తూ ఆశ్రమ కార్యాలు నిర్వహించారు. శ్రీ గురుదేవుల సమాధి మందిరాన్ని శ్రీవారి భావౌన్నత్యానికి అను గుణంగా సమున్నతంగా నిర్మించారు.

శ్రీ విమలానందస్వామీజీ అస్తమించిన తరువాత శ్రీవిద్యానందస్వామీజీ 1973లో పీఠాధిపత్యం వహించారు. ఆశ్రమం సర్వతోముఖవికాశం పొందేటట్లు వీరు ఆశ్రమకార్యాలు నిర్వహించారు.

ఓమ్

With Best Compliments From :



॥ శ్రీ సద్గురుభ్యోనమః, ఓం శ్రీ పరమాత్మనే నమః !!

శ్రీస్వాములవారు ఈశ్వరుని అంశావతారము

- శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు,

శ్రీ మలయాళస్వామి సత్యనిష్ఠాశ్రమము, షోలాపూర్

శ్లో ॥ యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా।
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్॥

అను శ్రీభగవద్వచనానుసారము శ్రీశ్రీశ్రీ సద్గురు విద్యాప్రకాశానందగిరి స్వాములవారు ఈశ్వరుని యొక్క అంశావతారమని చెప్పుటకు లేశమాత్రము సంశయము లేదు. స్వాములవారు జీవభావమునవలంబించి శాస్త్రమునకు ప్రతిరూపముగా, లోకమునకాదర్శముగా, ముముక్షువులకు మార్గదర్శకుడిగా జీవించి యుండిరి.

శ్రీస్వాములవారు పరమపావనియగు భాగీరథిలో భవద్వేషణియగు శ్రీమద్భగవద్గీతా ప్రాప్తిచే "భగవంతుడు భావిజీవితకర్తవ్యము" ను గుర్తుచేసాడు అని గమనించి శ్రీమద్భగవద్గీతా ప్రచారనిమిత్తముచే లోకోద్ధరణరూప బృహత్కార్యమును చేపట్టినారు. "స్వయం తీర్ణః పరాంస్తార యతి" "ఆచార్యవాన్ పురుషో వేద" "తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం సమిత్పాణిః" "తద్విద్ధి ప్రణిపాతేన" ఇత్యాది శ్రుతిస్మృతులను స్మరించుకొని, శ్రీశ్రీశ్రీ సద్గురు మహర్షి మలయాళస్వామి దివ్యచరణ సాన్నిధ్యములలో "ఆచార్యదేవో భవ" "పరిప్రశ్నేన సేవయా" అను శాస్త్రోక్తులను సఫలమొనర్చి, "నా తపస్వినః యోగో సిద్ధ్యతి" యను వ్యాసవచనానుసారము "కాయేంద్రియ శోషణం తపః" "తప విచారణే" అను లక్షణ, వ్యుత్పత్తియుక్త "తపస్సు" మను నెపముతో మౌనవ్రతము, అపక్వాహార సేవనతో నతంద్రితుడై "ఈశ్వరప్రణిధానాద్వా" అని చెప్పబడిన ప్రకారము ఈశ్వరోపాసన చేశారు.

ఈశ్వరకరుణాకటాక్షవీక్షణానుగృహీతుడై, దైవీసంపత్తిని బడసి, సాధనసంపన్నుడై, చతుర్విధకృపలకు పాత్రుడై స్వరూపానుసంధాన తత్పరుడై, "తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే" "తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి" "వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః" "అను శాస్త్రోక్తులననుసరించి, భూయో సద్గ్రంథశోధకుడై, "ధర్మేణ పాపమపనుదతి" "తపసా కిల్బిషం హన్తి" "జ్ఞానముత్పద్యతే పుంసాం క్షయాత్పాపస్య కర్మణః" "తీవ్రసంవేగానామాసన్నః" అని చెప్పబడినట్లు "తత్త్వమస్యాది" మహావాక్యముల (వేద) సారమును శ్రవణ, మనన, నిధిధ్యాసన, తత్త్వం పదార్థశోధన, ఓతప్రోతభావమను విచారముచే జనిత చరమ వృత్త్యాత్మకమగు "అహం బ్రహ్మాస్మి, బ్రహ్మైవాహమస్మి" అని ప్రత్యగభిన్నపరమాత్మతత్త్వమును భూతమొనర్చుకొనినారు. "జ్ఞానాదేవ తు కైవల్యం" "తరతి శోకమాత్మవిత్" "దేవం జ్ఞాత్వా సర్వపాశాపహాని" ఇత్యాది శాస్త్రవచనములప్రకారముగా" "సర్వదుఃఖాత్యంత (నిత్యవృత్తస్య) నివృత్తి మరియు (నిత్యప్రాప్తస్య) పరమానంద ప్రాప్తి" యను మోక్షమును అనతికాలములోనే పొందినారు.

స్వయముత్తీర్ణుడై, "బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి" "యత్రత్వస్య సర్వమాత్మైవాభూత్తత్కేన కం పశ్యేత్" "బ్రహ్మైవేదం సర్వం" "సర్వ భూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని" ఇత్యాది శ్రుతి స్మృత్యుక్తప్రకారముగా "సకల మిదమహంచ వాసుదేవః పరమఃపుమాన్ పరమేశ్వరః స

ఏకః" అను బ్రహ్మాత్మైకత్వానుభూతిని బడసి, సర్వాత్మభావన గలిగి, తాను స్వయముగా జీవన్ముక్తుడై వెలసినారు. ఆ తరువాత "దుఃఖితేష్వనుకంపా" అనబడు "దయా భూతేష్వలోలుప్త్వం" అను శాస్త్రోక్తి ననుసరించి చరాచర ప్రాణికోట్లననుగ్రహించుటకై, అనుకంపహృదయుడై, భాగీరథిలోని భగవత్సంకల్పమును,తన భావిజీవిత కర్తవ్యమును గర్తుతెచ్చుకొని, పరతారణార్థము, జీవన్ముక్తవిలక్షణానందార్థము "అనాది మాయయా సుప్తః అని చెప్పబడినట్లు జీవులయనాది అజ్ఞానాంధకారమునకు ప్రచండభాస్కరుడై, సకలవేదసారము, సమస్తజీవులఘోర సంసారసాగర తరణోపాయము, దేవకీపుత్రగీతమునకు శ్రీమద్భవద్గీతా శాస్త్రమునకు మందారమకరంద మాధుర్యమును బోలు "శ్రీగీతామకరందము" అను విస్తృత వ్యాఖ్యానమ్ము వ్రాసినారు. మరియును అహోరాత్రులు పరిశ్రమించి పెక్కు సద్గ్రంథముల రచనద్వారా శ్రీసద్గురుదేవులు వారి జ్ఞాన కిరణములను ప్రసరింపజేసి, జీవుల యనాద్యవిద్యారూప తమస్సును అవిద్యమానము జేయుటకు బద్ధకంకణుడై "గురుముఖాదేవ అధ్యేతవ్యః" అని చెప్పబడినందున దయార్ద్రహృదయుడగు సద్గురుదేవులు "స గురుమేవాభిగచ్ఛేత్" అను శృతికి విపరీతముగా సద్గురు సాన్నిధ్యమును బొందలేని మందజిజ్ఞాసువులు, భక్తులు మొదలగువారికి గీతామృతమును, వాసిష్ఠామృతమును అందజేయనెంచి వారున్నచోటికే పల్లెలు, గ్రామములు, పట్టణములు మరియు నగరములకు తాను స్వయముగా ప్రస్థానము గావించి సప్తాహములు, అష్టాదశాహములు, గీతాజ్ఞాన యజ్ఞములను ఘనంగా నిర్వహించినారు. ప్రభాత సంధ్యాసమయములలో ఘంటానాదసదృశ కంఠస్వరముతో మంగళశ్లోకములతో, భక్తిగీతములతో ప్రవచనములను ప్రారంభించి, "అనాది మాయయా సుప్తః యదా జీవో ప్రబుధ్యతే! అజమనిద్రమస్వప్నమద్వైతం బుధ్యతే తదా" అని పరమ గురువులు చెప్పినట్లుగా "ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్యవరాన్నిబోధత" "క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ" "బి ఫియర్‌లెస్" అను శ్రుతి స్మృతి, మరియు అభియుక్తోక్త్యనుసారముగా లక్షలకొలది ముముక్షువుల హృదయములను జాగృతమొనర్చినారు. తత్త్వసారము, మానసబోధ ఇత్యాద సులువగు తత్త్వములను పాడుతూ, ఉపనిషత్తత్త్వమును పెక్కు లౌకికదృష్టాంతములచే స్పష్టము చేస్తూ, తాను నవ్వుతూ జనులను నవ్విస్తూ, చైతన్యవంతులను చేస్తూ, నూతనగా ఆధ్యాత్మికరంగములో ప్రవేశించిన చాతక పక్షులగు ముముక్షువులచేత గీతను పట్టించి, నేర్పించి, శ్రీగీతాపారాయణాది సత్కార్యములను నిర్విహించినారు. కేవలము ఆంధ్రదేశమునందేగాక మద్రాసు, మైసూరు, బెంగుళూరు మరియు మహారాష్ట్రదేశములో ముంబాయి, షోలాపూర్(మార్చి1968) ఇత్యాది నగరాల్లోగూడా సంచరించి, జాతి,కుల, మత భేదము లేకుండా స్వాములవారు వారి అమోఘమైన దివ్యసందేశాలను అందించి, జనుల అజ్ఞాన చీకట్లను పోగొట్టినారు. గీతాపారాయణపోటీలు నిర్వహించి, పాఠకుల ఔత్సుక్యవృద్ధినిగోరి శ్రీగీతామకరందాది సద్గ్రంథములను బహూకరించి, గీతాపాఠశాలలను నెలకొల్పుటకు భక్తులను ప్రోత్సహిస్తూ, శ్రీమద్భగవద్గీతా తత్త్వ ప్రచారమే జీవిత ప్రధానలక్ష్యంగా పెట్టుకున్నారు. శ్రీసద్గురుదేవులు వారి గీతాప్రచారరూప లోకోద్ధరణ బృహత్కార్యమును ఇంతటితో ఆపకుండ అత్యంత మందప్రజ్ఞులు,మందభాగ్యులగువారికి గీతాసందేశములు, మహాత్ముల దివ్యసందేశములు, ఆశీర్వాదములు జనుల యింటిచెంతనే ప్రాప్తమగు సద్భాగ్యమును కల్పించి "వేదాంతభేరి" యను మాసపత్రికను ప్రారంభించారు. మున్ముందుగూడ అధ్యాత్మికవిద్యాప్రచారము నిర్విఘ్నంగా, నిర్వరామంగా ప్రచయగమనార్థము, "దక్షిణ కాశి" యని ప్రసిద్ధినొందిన "శ్రీకాళహస్తి" లో సుప్రసిద్ధ శ్రీకాళహస్తీశ్వరుని దివ్యచరణ సన్నిధిలో శ్రీ శ్రీ శ్రీ సద్గురు మహర్షి మలయాళ స్వాములవారి శుభాశీస్సులతో "శ్రీశుకబ్రహ్మాశ్రమము" అను

పేరిట దివ్యమైన గొప్ప ఆశ్రమమును నెలకొల్పినారు. భగవత్యరూపులగు చరాచరప్రాణికోట్ల సుఖమునిచ్ఛగించి, చరాచరసుఖాభిలాషియై, సకలజీవుల శ్రేయస్సునుగోరి, విశాలదృక్పథముతో పైన పేర్కొనిన ప్రకారముగా గీతాప్రచారనిమిత్తముచే విస్తృత ఆధ్యాత్మికసేవలను అందించి, భక్తులకొఱకు అన్నక్షేత్రమును స్థాపించినారు. "మానవసేవయే మాధవసేవ" అన్నట్లు విద్యార్థుల లౌకిక విద్యాభ్యాసము కోసము కళాశాలను నిర్మించినారు. "సర్వేంద్రియాణం నయనం ప్రధానం" అను నీతిసూక్తి ప్రకారము "శ్రీ భక్తకన్నప్ప కంటి ఆసుపత్రిని" గూడ నిర్మించి లోకహితార్థము యథాశక్తి ఆధిభౌతిక సేవలను అందించి, విశ్వశాంతినిగోరి అనేక యజ్ఞయాగాదిరూప మరియు చాతుర్మాస్యాదిరూప ఆధిదైవికసేవలను గూడా అందించి, యేనకేన ప్రకారేణ జీవుల ఆధ్యాత్మిక, ఆధిభౌతిక మరియు ఆధిదైవికములగు త్రివిధదుఃఖముల అత్యంత నివృత్తికొఱకు తన అశేష జీవితమును ధారబోసి, ఆధ్యాత్మిక,విప్లవకారుడుగా చెన్నొందినారు. " ధన్యోఽ తాం ధన్యోఽ హం కర్తవ్యం మే న విద్యతే కించిత్! ధన్యోఽ హిం ధన్యోఽ హం తృప్తేర్మే కోఽ వమా భవేల్లోకే! ధన్యోఽ హం ధన్యోధన్యః పునఃపునర్ధన్యః" "న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషులోకేషు కించన" అని చెప్పబడినట్లు తనకంటూ ఇంకా కర్తవ్య శేషము లేనివాడై, జీవన్ముక్తుడై విలసిల్లి శ్రీ శ్రీ శ్రీ విద్యాప్రకాశానంద సద్గురుదేవులు ఇంక భావికాలములోగూడా ఆధ్యాత్మికవిద్యా, గీతాప్రచారము నిర్విఘ్నముగా, నిరవధికముగా కొనసాగుటకు భౌతిక దేహమునకు అంత్యకాలమాసన్నమగుచున్నదని గమనించి, నియమనిష్ఠలు, కార్యదక్షత, విద్యాపాండిత్యము మరియు బ్రహ్మనిష్ఠత్వము ఇత్యాది యోగ్యతలుగల ఆశ్రమ ఉత్తరాధికారి నియమించినారు. హైద్రాబాద్ నిజామ్‌కాలేజీలో నిర్వహింపబడుచున్న స్వాములవారి అంతిమప్రవచన కార్యక్రమాల్లో పాల్గొనుటకు వెళ్లిన మేము స్వాములవారి దివ్యచరణారవిందములను సందర్శించుటకై నివాసస్థలము (విడిది)నకు పోయిన మమ్ములను స్వాములవారు కుశలప్రశ్నలుచేసి, శ్రీభక్తతుకారం, శ్రీజ్ఞానేశ్వర్‌సంత్, శ్రీఏకనాథ్ మరియు శ్రీనామదేవుడు, గోరాకుంభార్ మొదలగు జ్ఞాని భక్తులు అవతరించి సంచరించిన పరమపవిత్రమైనది మహారాష్ట్ర, అందులో షోలాపుర నగరములో జనులలో ప్రేమ, భక్తి, మహాత్ముల విషయములలోగొప్ప ఆప్యాయత, ఆదరభావము గలదని చెప్పి, "Do good and Be good" అను చక్కటి ఉపదేశమును మాకు ప్రసాదించినారు. ఇక సాయంత్రం ఉపన్యాసమునకు స్వాముల వారు వెళ్ళుటకు సిద్ధముకాగా, సరిగ్గా అదే సమయమునకు విద్యుత్తు ఆపివేయబడినందున, (లిఫ్టు) పనిచేయకపోగా స్వాములవారిని కుర్చీలో కూర్చుండబెట్టి క్రిందివరకు మోసుకొని వచ్చే మహద్భాగ్యమును శ్రీ గురుదేవులు మాకు ప్రసాదించి, "పరమేశ్వరుడు మిమ్ములను సర్వదా పరిరక్షించుగాక" అను చల్లటి ఆశీర్వచనమును నిండు హృదయముతో మాకు అనుగ్రహించినారు. ప్రవచనమునకు వెళ్ళి, వారి దివ్య సందేశము(ప్రబోధము) ను కొంతసేపు మాత్రము ఇచ్చాడో లేదో, అంతలోనే పరమేశ్వరుడు సద్గురుదేవుల అమోఘమైన, ఘంటానాద సదృశ కంఠస్వరమునకు (ధారావాహిక దివ్యవాణికి) పూర్ణవిరామమును కల్పించగా, అనారోగ్యమునకు గురి అయిన భౌతికకాయముతో కొన్నాళ్ళు మాత్రమే జీవించి "బ్రహ్మవిదాప్నోతిపరమ్" "న తస్య ప్రాణా ఉత్క్రామన్తి" "స్థిత్వాస్యామంతకాలేఽ పి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి" అని చెప్పబడిన విధముగా, శాస్త్రమునకు ప్రతిరూపముగా, లోకమునకు ఆదర్శముగా, కృతకృత్యుడై, వారియెక్క అంశావతారమును ఉపసంహరించు కొన్నవాడై విదేహకైవల్యము నొందినారు. శ్రీస్వాములవారి శతజయన్తిలో పాల్గొని ఆనందింతుముగాక!



విద్యా తపోభ్యాం పూతాత్మా

- శ్రీ పరమాత్మానందగిరిస్వాములవారు

శ్రీమలయాళస్వామిమఠం, కాశి.

సద్గురు మహర్షి మలయాళస్వాములవారు పై వాక్యమును మిక్కిలి ముఖ్యమైనదిగా ఎంచి భక్తులకు బోధించుచు అచ్చటచ్చట బోర్డులపై వ్రాయించుచుండెడివారు. ఏ వ్యక్తి యీ వాక్యమును చక్కగా అర్థము చేసికొని అట్లు మెలగుగలుగునో ఆ వ్యక్తి తప్పక గొప్పవాడై తాను తరించి ఇతరులను తరింపజేయగలరని చెప్పేవారు. ఇట్టి మహత్తరమైన గురువాక్యాన్ని శిష్యులైన పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు విద్య, తపస్సులతో వారు తరించి మనలను తరింపజేసిన పుణ్యాత్ములు. అటువంటి పుణ్యాత్ముల శతజయన్తి మహోత్సవ కార్యక్రమము జరిపించు కోవటము మనలాంటి వాళ్ల పుణ్య విశేషముగా భావించుతున్నాను. మన సనాతన వైదిక సాంప్రదాయ శాస్త్రాలలో ఉత్సవాలు అనేక రకాలు.

1) ఒక సంవత్సరమునకు జరుపునట్లైతే వార్షికోత్సవమని, 12 సంవత్సరములకైతే మౌక్తికోత్సవము, 25 సంవత్సరములకైతే రజితోత్సవము, 50 సంవత్సరములకైతే స్వర్ణోత్సవము, 60 సంవత్సరములకైతే షష్టిపూర్తి మహోత్సవము, 75 సంవత్సరములకైతే వజ్రోత్సవమని, సుమారు 84 సంవత్సరములకైతే సహస్రచంద్ర దర్శనోత్సవమని, 100 సంవత్సరములకైతే శతజయంత్యుత్సవమని, 200 సంవత్సరములకైతే ద్వి శతాబ్ద్యుత్సవమని, 1000 సంవత్సరములకైతే దశ శతాబ్ద్యుత్సవమని , చెప్పబడను.

పూజ్య స్వామిజీ - లౌకిక విద్యను కూడా డిగ్రీ వరకు అధ్యయనము చేసినారు.

విద్ జ్ఞానే ధాతువు నుండి విద్య శబ్దము పుట్టినది. విద్య అంటే జ్ఞానమని అర్థము. అధ్యాత్మికమార్గములో విద్య రెండురకములు.

ద్వేవిద్యే వేదితవ్యే తు శబ్ద బ్రహ్మ పరం చ యత్ ।
అమృతబిందూపనిషత్

శబ్ద విద్య - సంస్కృతము, హిందీ, ఇంగ్లీషు, తెలుగు మొదలగు భాషలను అధ్యయనము చేసినారు. వేదాన్త శాస్త్రములను గురుముఖతః అధ్యయనము చేసినారు. కావుననే. గీతా మకరందము, యోగవాశిష్ఠం, భారత, రామాయణ రత్నాకరములు మొదలగు అనేక గ్రంథాలను రచించినారు. లోకానికి బోధించినారు.

వారి ప్రవచనప్రభావానికి టి.టి.డి. దేవస్థానం అధికారులే ముగ్ధులై వీరి ఉపన్యాసము పండిత పామరులకు మేలు కలిగించగలడని గ్రహించి శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహ ధనముతో సి.డి. డి.వి.డి లు తయారు చేసి ప్రచారముగావించుచున్నారు. ఒక వ్యక్తికి ఇంతటి ప్రచారం

దేవస్థానము వారు చేయుటయు బహుశా మన స్వాములవారికి మాత్రమే అని చెప్పవచ్చు.

తపస్సు - మలయాళస్వాములవారు శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఉంటూ తపస్సిద్ధి పొందినారు. శ్రీవిద్యాప్రకాశానందస్వాములవారు గురుసన్నిధి (మలయాళస్వామి) గురుస్థానములో (శ్రీ వ్యాసాశ్రమములో) ఉంటు అపక్వాహారముతో ఒక సంవత్సరము మౌననిష్ఠతో 12 సంవత్సరములు తపస్సు చేసినటువంటి పుణ్యాత్ములు.

శ్రీ స్వామి సంయమమూర్తి - శ్రీ వ్యాసాశ్రమములో బ్రహ్మవిద్యాపాఠశాలలో చదువుకున్న సమయములో స్వామి దర్శనానికి ముగ్గురు బ్రహ్మచారులము వెళ్ళినాము. దర్శనానికి వచ్చినాము అని చెప్పినాము. 1) బ్రహ్మచారులు బాగా చదువు, సేవ కలిగి ఉండాలి. 2) వైరాగ్యముతో కూడిన సాధనాపరులుగా ఉండాలి అని రెండు మాటలు సుమారు ఒకటి రెండు నిమిషాలలోనే చెప్పినారు. ప్రసాదము ఇచ్చి బ్రహ్మచారులకు భోజనము పెట్టి ఆశ్రమము చూపించి పంపించండి అని ఒక ఆయనతో చెప్పి పంపించారు. సమయము ఎంత అమూల్యమైనదో అని ఆచరణద్వారా మనకు తెలియజేసినారు. ఆ విధముగా వారు, తను, మన, ధన, సమయాలను లోకోపకారము కొరకు వినియోగించిన మహాత్ములు. స్వాములవారి పాదపద్మములకు ఈ చిన్న వాక్కు పుష్పాంజలి.

శ్రీ వ్యాసాశ్రమ పరంపరలో ఈ సమయములో విద్యావంతులు, మఠాధిపతులు, మఠ సంస్థాపకులైన వారు అందరూ పూజ్యశ్రీ విద్యానందగిరిస్వాములవారు వికసింపజేసిన బ్రహ్మవిద్యాపాఠశాలలో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు (బ్రహ్మచారి గోపాల్, శ్రీ వ్యాసాశ్రమ మేనేజరు) పర్యవేక్షణలో చదువుకున్నారు. బ్రహ్మవిద్యా పాఠశాలలో గురుబాయిగా సహ పాఠకులుగా చదువుకున్న పూజ్యపాదులు శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు ప్రస్తుత శ్రీ శుకబ్రహ్మాశ్రమ ఉత్తర పీఠాధిపతులు కావటము నాకు ఎంతో ఆనందదాయకము. అందరికి వందనములు.

త్రాటకము అత్యధిక లాభకారి

ఆరుమాసములు త్రాటకమును అభ్యసించిన తరువాత, భృకుటిపైన(రెండు కనుబొమలకు మధ్య) మానసిక విగ్రహముపై అరగంట నుండి రెండు గంటల వరకు మాత్రము ధ్యానము చేయుము. పిమ్మట జగత్తునందలి ప్రతి వస్తువునందును నీ యిష్టదైవము వున్నటుల చూడుము. అనుభవించుము. ఆ దైవము యొక్క సర్వజ్ఞత్వాది గుణములను గురించి తలంచుము. ఆ యిష్టదైవము నుండి సాత్త్విక గుణములు నీలోనికి ప్రవహించుచున్నటుల అనుభవించుము. నీకు సాత్త్వికభావన లభించునటుల అనుభవించుము. ఈ రీతిగా నీవు భక్తి శ్రద్ధలతో సాధన చేసినచో ఒకటి లేదా రెండు సంవత్సరములలో నీ యిష్టదైవమును దర్శింతువు. ఈ పద్ధతిని అవలంబించుము. ధారణకు కూడా యీ విధానము తోడ్పడును. ఆ విగ్రహము యొక్క వివిధ భాగములపైన నీ మనస్సును ప్రసరింపజేయుము. ఉదాహరణకు- చతుర్భుజుడగు విష్ణుభగవానుని పటమును గైకొని, ధ్యానము చేయుము. సగుణ ధ్యానములో త్రాటకము అత్యధిక లాభకారి.

- శ్రీ స్వామి శివానంద సరస్వతి



విజ్ఞానశాస్త్రము మరియు ఆధ్యాత్మికత గీతాజ్ఞానములతో జీవ మరియు జీవరసాయనికశాస్త్రముల సమన్వయము

పూజ్యశ్రీ ప్రజ్ఞారణ్య స్వాములవారు,
శ్రీరామయోగి తపోవనము, అన్నారెడ్డిపాళెం.

జగద్గురు ఆదిశంకరులు, శ్రీ మద్ రామానుజులు మరియు శ్రీమద్ మధ్వాచార్యుల వంటి అనేకమంది భాష్యకారులు శ్రీ మద్భగవద్గీతకు పలు విధములగు భాష్యములను ప్రసాదించిరి. భాష్యకారుల బౌద్ధిక స్థితిని బట్టి భిన్న భాష్యములు భిన్నమైన అభిప్రాయములు అనుగ్రహించబడినవి. ఆధ్యాత్మికతను పరిఢవిల్లజేయు భగవద్గీత, బైబిల్, ఖురాన్, ధర్మపథం, మరియు ఆయుర్వేద గ్రంథముల వంటి అనేక ఉత్తమ గ్రంథములు విస్తృతముగా ముద్రింపబడుచున్నవి.

ఆధునిక పాశ్చాత్యవిజ్ఞానశాస్త్రము సజీవ నిర్జీవ వ్యవస్థలకు సంబంధించిన అనేక దృగ్విషయములపై విస్తృతమైన అనేక పరిశోధనలు సల్పుచున్నది. ఆదునిక విజ్ఞాన శాస్త్రవేత్తలను ఆధునిక ఋషిపుంగవులుగను, యోగి పుంగవులుగను పరిగణింపవచ్చును. వీరు పలు పరిశోధనలను నిర్వహించి, సజీవ, అజీవ వ్యవస్థలకు సంబంధించిన నిర్మాణాత్మక మరియు క్రియాత్మక విషయములను ప్రభావితము చేయగల అనేక ఆశ్చర్యకరమైన, సూక్ష్మమైన సత్యములను దర్శించిరి. ఆధునిక విజ్ఞానశాస్త్రము "ఆధునిక భాగవతము" వంటిది. ఇది విశ్వమునకు నాథుడైన విశ్వనాథుని లీలలను, మహత్వమును విశదీకరిస్తుంది.

శ్రీ మద్భగవద్గీత యందలి కొన్ని శ్లోకములను ఆధునిక జీవశాస్త్రము, జీవ రసాయనికశాస్త్రము మరియు ఆధునిక భౌతిక శాస్త్రములలో అన్వయించి వ్యాఖ్యానింపవచ్చును.

భగవద్గీతలోని 15వ అధ్యాయమునందలి 14వ శ్లోకమందు భగవానులు మానవ జీర్ణవ్యవస్థ యందు ఆహారము జీర్ణమగు విధానమును వివరించి యున్నారు.

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్.

భగవానుడు సకల ప్రాణుల శరీరములలో వైశ్వానరుని రూపములో ఉండి ఆయా ప్రాణులు గ్రహించు నాల్గువిధములైన ఆహారపదార్థములను జీర్ణము మరియు శోషణము వంటి క్రియలను నిర్వహించుచున్నారు. ఈ విషయమును భిన్న కోణములలో వ్యాఖ్యానించవచ్చును. మొదటిది మానవుడు భుజించు ఆహార పదార్థములను 4 రకములుగ విభజింపవచ్చును. అవి భక్ష్య, భోజ్య, చోష్య మరియు లేహ్య పదార్థములు. ఈ దృష్టితో పరిశీలించిన భగవానుడు కేవలము మానవుని వంటి పరిణతిచెందిన జీవుల యందు మాత్రమే వసించుచున్నట్లుగ అపోహ కల్గుతుంది. కానీ శ్లోకమునందు భగవానుడు ప్రాణినాం అని

చెప్పియున్నారు. కనుక సృష్టిలో నివసించు అన్ని ప్రాణులల్లో భగవానుడు ఉన్నట్లుగ మనము అన్వయించుకొనవలెను.

జీవశాస్త్రము ప్రకారము ప్రోటీనులు, కార్బోహైడ్రేటులు, క్రొవ్వులు మరియు విటమినులు, ఖనిజలవణములు సమపాళ్ళలో కల్గియున్న ఆహారమును సమతులన ఆహారముగా పరిగణించెదరు. "పచామ్యన్నం చతుర్విధమ్" అను అంశమును పైన చెప్పబడిన జీవశాస్త్ర దృగ్విషయపరముగ పరిశీలించినట్లయిన మానవుని వంట పరిణతి చెందిన జీవులకు మాత్రమే కాక సూక్ష్మజీవులతో ప్రారంభించి, వృక్షములు, జంతువులు, పక్షులు, సరీసృపములు, కీటకముల వంటి సకల ప్రాణులకు వర్తించును. ఇచట మనము గమనింప వలసిన విషయమొకటికలదు. మానవునితో సహా అన్ని ప్రాణులలోను, పోషణ, శ్వాసక్రియ, ప్రత్యుత్పత్తి వంటి అన్ని జీవనక్రియలకు జీవకణములలోనూ జీవపదార్థములోనూ జరుగు జీవరసాయనిక క్రియలే కారణము.

మరియు ఇందు భగవానుడు "పచనమ్" అను పదము ద్వారా తాను జీవులలో జీర్ణక్రియ మరియు పోషణక్రియ నిర్వహించు విధానమును వివరించుచున్నారు. శ్లోకములోని తదుపరి భాగమైన "ప్రాణాపానసమాయుక్త" అను అంశమునకు సరియగు వ్యాఖ్యానము, వివరణ నేను ఇంతవరకు పఠించిన ఏ ప్రామాణిక భాష్యగ్రంథములలోను నాకులభించలేదు. సాధారణముగ మనముశ్వాసించునపుడు లోనికి గ్రహించు వాయువును ప్రాణవాయువు అని, పాయువుద్వారా విసర్జించు హైడ్రోజన్ సల్ఫైడ్ వంటి వాయువులతో కూడిన విసర్జక వాయువును అపానవాయువుగ పేర్కొందుము.

"సమాయుక్త" అను పదమును వాడుటద్వారా పరస్పరభిన్నమైన ఈ రెండు వాయువులను సమానమైనవిగా ఏవిధముగ గ్రహించగలము. ఒకవేళ శరీరమునుండి వెలుపలకు విసర్జించు వ్యర్థవాయువునే అపానవాయువుగా వర్ణించేటట్లయిన, వ్యర్థవిసర్జకవాయువులు శరీరంనుండి మూడు భిన్న మార్గములద్వారా విసర్జింపబడుచున్నవి. అవి ఏమన

1. అపానవాయు రూపంలో పాయువుద్వారా
2. కార్బన్‌డైయాక్సైడు రూపంలో ముక్కుద్వారా
3. నీటి ఆవిరి, ఖనిజలవణములతో కూడిన స్వేదము(చెమట) రూపంలో చర్మము ద్వారా మూడు రకములగా విసర్జింపబడుచున్నవి.

మరి భగవానుని భావమేమి? ఈ సందర్భంగా పంచమ అధ్యాయంలోని 27వ శ్లోకమును పరిశీలించి నట్లయిన

"ప్రాణాపానౌ సమౌకృత్వా నాసాభ్యన్తరచారిణౌ అని వచించియున్నారు. ఇచట భగవానులు ప్రాణవాయువును, నాసికద్వారా ఉచ్ఛ్వాసరూపమున లోనికి గ్రహించు ఆక్సిజన్‌గను, అపానవాయువును నిశ్వాసరూపములో వెలుపలకు పంపు కార్బన్‌డయాక్సైడ్‌గను స్పష్టముగ సూచించియున్నారు. అటులయిన ప్రాణ మరియు అపానవాయువులను సమన్వయ పరచుట ఎలా? జీర్ణక్రియ మరియు శోషణక్రియలు జీవరసాయనిక క్రియలు. జీర్ణక్రియలో వివిధ జీవులు గ్రహించిన అన్ని రకముల ధాన్యములలోనూ, పప్పులలోనూ ఉన్న పిండి పదార్థములను చక్కెరగా మార్చి చిట్టచివరగా గ్లూకోజు అణువులుగ విడగొట్టబడును. ఈ గ్లూకోజు అణువులు రక్తములోనికి

చేరుతాయి. అదే విధముగ ఆక్సిజన్ నాసికా రంధ్రములద్వారా ఊపిరితిత్తులను చేరి అచటనుండి రక్తకణములలోనికి ప్రవేశిస్తుంది. జీవుల శరీరములోని రక్త ప్రసరణ వ్యవస్థ అత్యంత అద్భుతమైన రవాణావ్యవస్థ. ఈ వ్యవస్థ శరీరంలో నెలకొని యున్న అసంఖ్యాకమైన జీవకణములకు, వాటి అవసరములకు సరిపడు గ్లూకోజ్‌వంటి పదార్థములను, ఆక్సిజన్ వంటి వాయు పదార్థములను రవాణా చేస్తుంది. ఈ విధంగా శరీరమందలి ప్రతి జీవకణమునకు ఆక్సిజన్ మరియు గ్లూకోజ్ చేరుతుంది. అచట గ్లూకోజ్ అణువులు ఆక్సిజన్‌తో సంయోగముచెంది రసాయనిక చర్యజరిగి కార్బన్‌డయాక్సైడు, నీరు మరియు శక్తిగా విడుదల అవుతుంది.

$C_6H_{12}O_6$(గ్లూకోజ్) $+60_2$ (ఆక్సిజన్ $\rightarrow$ $6\,CO_2$) (కార్బన్‌డైయాక్సైడ్ $+ 6H_2O$ (నీరు + శక్తి)

శ్వాసక్రియను వివరించు పై సమీకరణములు ఇరువైపులా ఉన్న కార్బన్, హైడ్రోజన్, మరియు ఆక్సిజన్ అణువులసంఖ్య సరిసమానము. అనగా సమీకరణమందు ఇరువైపుల 6 కార్బన్ పరమాణువులు, 12 హైడ్రోజన్ పరమాణువులు మరియు 18 ఆక్సిజన్ పరమాణువులు కలవు. రసాయనిక శాస్త్రవేత్తలు రసాయనిక చర్యలను ఈ ప్రకారముగ వివరించుటను, "సమీకరణమును సాధించుట" గా వ్యవహరించుదురు.

పై విధముగ మానవునితో సహా సకలప్రాణుల దేహాము లందలి అన్ని జీవకణములలో "ప్రాణాపానసమాయుక్తం" అను క్రియ నిరంతరముగా జరుగుచుండును. (మానవుడుసైతము హెూమోసెపియన్ అను జంతుజాతికి చెందినవాడు).

ఈ శ్లోకమును ఆధునిక జీవశాస్త్రము జీవరసాయనిక శాస్త్రములతో అన్వయించినట్లయిన శ్రీ కృష్ణ భగవానులు ఆత్మస్వరూపునిగ సకలజీవరాశుల హృదయకుహరములలో కొలువై యున్నట్లు గోచరమవుతుంది. వారు సకల ప్రాణులకు ప్రభువు, అంతియేకానీ ఏ యొక్క మతమునకు, వర్గమునకు మాత్రమే చెందినవారు కాదని అవగతమగును.

ప్రజాపిత బ్రహ్మకుమారీ ఆశ్రమ మందు "వరల్డ్ యునైటెడ్" సంస్థవారు నిర్వహించిన "World parliament of Spirituality సమావేశములో తేది 20-12-2012 న ప్రసంగించిన ఉపన్యాసము.

అనువాదము

ఏ. తారాలక్ష్మి M.A, M.Ed, M.Phil.

శ్రీకృష్ణుడు లోకమున కొసంగిన సందేశమేమి యని ఎవరైన ప్రశ్నించినచో ఆ మహనీయుని జీవితమే అతని సందేశము అని నిష్కర్షగ చెప్పవచ్చును. లోకాధీశుడైనప్పటికిని బండితోలు పనిని అతడు స్వీకరించెను. ఇక్కార్యమున అతని నిరహంభావము, నిరభిమానము, భక్త సేవాపరాయణత్వము కండ్లకుకట్టినట్లు కనబడు చున్నవి. శ్రీకృష్ణుని జీవితమున అతని నిస్స్వార్థగురుసేవ, ప్రగాఢ పరహితవాంఛ, భక్తజన పరిచర్యాభిలాష, నిష్కామసేవాపరాయణత ఎన్నియో చోట్ల చక్కగా వ్యక్తమగుచున్నవి. కావున శ్రీకృష్ణుడు లోకమున కొనర్చినది ఆదర్శసేవయే యని స్పష్టమగుచున్నది.

- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు

మహాత్ములకు శతజయంతి

శ్రీకృష్ణానంద మఠము,
దిల్‌సుఖ్‌నగరము, హైదరాబాద్ -500036

పుట్టిన తరువాత నూఱుసంవత్సరములు గడచిపోవుట, సామాన్యులకు సామాన్యదృష్టికి శతజయంతి. పుట్టుట 84 లక్షల యోనుల ప్రాణులకు పరిపాటియే. ఇందులో విశేషం లేదు. కర్మానుసారంగా అవశంగా పుట్టవలసినదే. నూఱుసంవత్సరములు గడిచిపోవుటకు మనిషిచేసే ప్రయత్నం ఏమీ లేదు. కాలప్రవాహంలో నూఱుసంవత్సరముల గమ్యం, కాలక్రమంలో కదలిపోయి చేరుతుంది. ప్రతిదానికి ప్రసిద్ధార్థములను పాకంచేసి, దైవానికీ దేవతా- మూర్తులకూ శాస్త్రానికి మహాత్ములకూ ఆరోపించి, పాండిత్యమంటే ఇంతేననుకొనుట అనాదిగా వస్తున్నది. ముక్తిసాధనకు పరికరంగా తెచ్చుకొన్న మనస్సును, ఈ విధంగ దుర్వినియోగం చేసికొని, మనుగడను సాగించుట మానవునికి ధార్మికమునందు మచ్చయే, ధర్మహాని కూడా.

అయితే, నిజార్థం ఏమి? ఈ ప్రశ్న పరిప్రశ్న అవుతుంది. అవగాహన చేసికొని ఆచరించి తరించే అర్థమును అర్థంచేసికొందాం.

శీయతే అనాత్మదృష్టిమితి శతమ్. శద్ల-శాతనే. **సాధనయా తం జయతీతి శత-జయన్తీ.** జి-జయే. అనాత్మదృష్టిని క్షీణింపజేసెడి స్థితిని, సాధనచేత జయించుట శత-జయంతి. శ్రోత్రియ-బ్రహ్మనిష్ఠుడైన గురువును చేరి, శ్రవణ- మనన-నిదిధ్యాసలచేత, సాధనచతుష్టయ సంపదను సాధనచేసి, గురుప్రసాదమైన ఆధ్యాత్మిక -పీఠమును దర్శించెడి సాధనక్రమంలో అనాత్మదృష్టిని క్షీణింపచేసెడి స్థితిని సిద్ధింపచేసికొంటారు. తాము పొందిన సిద్ధితేజమును పలువురకు పంచియిచ్చి మహాత్ములవుతారు. ఇట్టి వీరి స్థితిగతులే వీరి శతజయంతి, వీరు జయించిన శతస్థితి.

అనాత్మదృష్టి అంటే ఏమిటో అర్థంచేసికొందాం. సృష్టికి పూర్వం సత్- ఉనికిలక్షణం ఉన్నది. ఇదే, ఈ సత్= ఉనికిలక్షణం మాత్రమే, సృష్టిలో ఉన్నది. సత్-ఉనికిని చైతన్యవంతం చేసికొనుట అనెడి చైతన్యలక్షణం, ఉనికి- చైతన్యమును ప్రకాశింపచేసికొనుట -వ్యక్తంచేసికొనుట అనెడి ప్రకాశ లక్షణం, వ్యక్తమైన ఉనికి- చైతన్యమును ఎఱుకలో నిలువుకొనుట అనెడి జ్ఞానలక్షణం, జ్ఞానమును టునది-సమృద్ధో సమృద్ధిచేసికొనుట అనెడి ఆనందలక్షణం, ఈ చైతన్య- ప్రకాశ- జ్ఞాన -ఆనంద లక్షణములు, సత్ -ఉనికి లక్షణంలో ఇమిడి ఉన్నవి. ఇంతవఱకే సృష్టి, సృజ-విసర్గే విడువబడిన అవకాశం. ఈ అవకాశమును సద్వినియోగం చేసికొనుట సృష్టికి జీవం, సృష్టికి సాధన, సృష్టికి కర్మ.

ఈ అవకాశమును మాత్రమే గ్రహించేటట్లు, గ్రాహ్యసృష్టిగా జీవుడు రచింపబడినాడు. ఇందుకు, స్మరణలో వెలుగుగ ఆకాశం, వెలుగు వికల్పమై దోషమయ్యేడి అవకాశంగ వాయువు, దోషమును పదునుపెట్టి వెలుగును రక్షించుకొనుటగా తేజస్సు, తేజస్సు ప్రాప్తిగా ఆపస్సు, తేజస్సు

కంచికామకోటి పీఠాధిపతులు పూజ్య శ్రీ శ్రీ శ్రీ జగద్గురు జయేంద్ర సరస్వతీ స్వాములవారితో పూజ్యశ్రీ స్వాములవారు, 1999 మే



శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వాములవారితో శ్రీ స్వాములవారు, 1993 సం॥ శ్రీ శుక్లబ్రహ్మాశ్రమంలో

పూజ్యశ్రీ స్వాములవారు స్థాపించిన భక్తకన్నప్ప కంటి ఆసుపత్రి



కంటి ఆసుపత్రిలో కంటిని పరీక్షించుచున్న డా॥ వేణుగోపాలాచారి. ఎం.ఎస్.

దండపాణిగా పూజ్యశ్రీ స్వాములవారు (1994 సం॥)



విస్తారంగా పృథివి, తేజస్సునందు ఆర్తి-జిజ్ఞాసులుగా ఓషధిలక్షణం, సాధనచేత తేజస్సును గ్రహించెడి అన్నలక్షణం, ఇందుకు తగువిధంగ పాలన-పూరణలుగ సాధన అనెడి పురుషలక్షణం-ఈ క్రమంలో జీవుడు జీవసృష్టిగా రచింపబడినాడు.

తన జీవసృష్టి- రచనతో సాధనచేస్తూ, జీవుడు, తన గ్రాహ్యసృష్టి-రచనను పూర్ణంగా అందుకొనగలిగిన అవకాశంతోకూడా రచింపబడినాడు. శక్తి సమర్థత, జ్ఞాన సమర్థతయందు ఎఱుక, తేజస్ ఎఱుకను పదును పెట్టుకొంటూ రక్షించుకొనుట, వీర్య ఎఱుకను ప్రవర్తనలో ప్రసరింపజేయుట, బలఫలితంగా అట్టి ఎఱుక తన ప్రాణమగుట, ఐశ్వర్య సమర్థత సంపదయగుట, ఇది, జీవునికి షడ్గుణమైన భగవాన్ లక్షణం. ఈ అవకాశమును అందుకొనుట జీవునికి అద్వైతసృష్టిగా రచన. జీవుడు ఈ అద్వైతసృష్టిగా కూడా రచింపబడినాడు.

ఈవిధంగా, జీవుడు, గ్రాహ్యసృష్టి, జీవసృష్టి. అద్వైతసృష్టి సమన్వయంగా రచింపబడినాడు. ఈ పరిధిని దాటి పోలేడు. ఒకవేళ దాటి, అన్యమును ఊహించినా ఉన్నదన్నా, ఇందుకు తనకు తన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన ఆనందములే లక్షణములు. తన ఉనికిని బాహ్యంచేసి, అన్యమునకు ఊహగాగాని ఉన్నదనిగాని గ్రహించాలి. అంటే, తన ఉనికినే అన్యమునందు పరావర్తనంచేసి తనయందు గ్రహించాలి. తన ఉనికినే గ్రహించాలి, తనయందే గ్రహించాలి. జీవుని గ్రాహ్యమునకు, తన సత్-ఉనికియే ఉన్నది. స్వప్నంలో, వివిధములైన నామరూప పదార్థములు, ప్రాణులు, మనష్యులు, సంఘటనలు, అన్నీ దృశ్యమే అయినా, అవన్నీ కలగనేవాని మనోరూపములే. తన మనస్సునే బయట పరావర్తనంచేసి, తిరిగి తన మనస్సునే తన మనస్సునందే గ్రహిస్తున్నాడు. ఇందుకే, దృశ్యరూప స్వప్నం అసత్యం-లేనిదే. ఇట్లే అన్యదృష్టిచేత జీవుడు/ మనుష్యుడు, తనను బయటకు పరావర్తనంచేసి, తనను ద్వైతంగా దర్శనం చేస్తున్నాడు. ఈవిధంగా, అద్వైతసృష్టియైన మనిషి, ద్వైతసృష్టిచేత ద్వైతసృష్టిని కల్పించుకొంటున్నాడు. తన అద్వైతమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను బయట ప్రయోగించి, దుర్వినియోగం చేసికొంటున్నాడు. బయటిది సత్ ఉన్నదంటున్నాడు. చైతన్య ఆకర్షించి చైతన్యవంతం చేస్తున్నదంటున్నాడు, ప్రకాశ ప్రత్యక్షంగ తెలుస్తున్నదంటున్నాడు, జ్ఞాన దాని ఎఱుకయే జ్ఞానం అంటున్నాడు, ఆనంద దానితోటిదే ఆనందమంతా అంటున్నాడు. ఇది, అతని ద్వైతగ్రాహ్యం, తన లక్షణములను అద్వైతంగా తనదిగా తనయందు గ్రహించెడి అద్వైతగ్రాహ్యమును విడిచి, తన లక్షణములను తనకంటె వేఱుగా బయట ప్రయోగించి, ద్వైతంగా తనయందే గ్రహించెడి ద్వైతగ్రాహ్యం.

శతం జయతీతి శతజయన్తీ. ఈ ద్వైతదోషమును జయించిన స్థితి మహాత్ములకు నిత్యజీవనం. శతమ్ ఏతీతి శతాయుః. ఇణ్-గతౌ. ద్వైతదోషమును క్షీణింపజేసెడి స్థితిని, ఎన్ని కోట్లజన్మలకైనా, సాధువుగానే, పొందుట శతాయువు. (నూఱుసంవత్సరములని ప్రసిద్ధార్థం కాదు). ఈ అవకాశమును తాము యథాశక్తి దర్శించి పొంది, అందఱికి అందింపజేసెడి తపస్సును మహాత్ములు ప్రీతితో ఆచరిస్తారు. అట్టి కోవకు చెందిన పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారి తత్త్వపరమైన శతజయంతి తేజస్సును వైభవమును అందఱు అందుకొని, ఆచరణచే తమదిగ చేసికొని, తరింతురుగాక!

ఓం తత్ సత్



స్వామి విద్యాప్రకాశానంద గీతాప్రచార సంఘం, కర్నూలు

– డి.వి.రమణ(కర్నూలు)

ఆవిర్భావము!

మా తండ్రిగారు కీ॥శే॥ దోమా కాశీవిశ్వనాథ గుప్తగారు పరమధార్మికులు. భారతీయ సంస్కృతిని అమితంగా ప్రేమించి, ఆరాధించే స్వభావం కలవారు. ఈ గీతా ప్రచారసంఘ కార్యక్రమాలను నేను చేపట్టడానికి నాకు ప్రేరణ కలిగించిన స్ఫూర్తిదాతలు వారే. వారు ఎప్పడూ ఏదో ఒక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించేవారు. అందులో భాగంగా గీతాజ్ఞాన యజ్ఞాలను స్వామి శ్రీ విద్యా ప్రకాశానంద స్వాములవారి చేత 2 సం॥లకు ఒక పర్యాయం నిర్వహించేవారు.వారు నిర్వహిస్తున్న గీతా ప్రచార కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగించాలనే ప్రగాఢమైన కోరిక నాలో ఆనాడే ఉదయించింది. భగవదిచ్ఛ అలా ఉండడంచేతనో ఏమో 1985 లో శ్రీవిద్యాప్రకాశానంద స్వామీజీ ద్వారా నాన్నగారు గీతా యజ్ఞము నిర్వహించిన తదుపరి 1986 రథసప్తమి నాడు దివంగతులయ్యారు. అంతకు మునుపే వారు ఈ పవిత్ర కార్యక్రమాన్ని కొనసాగించాలని, వారి చివరి కోరికగా నన్ను కోరడం, దానికి తోడు నా అంతరంగమున ఆ సదాశయము పాదుకొని యుండడం చేత 1986 ఏప్రిల్ మాసంలో, శ్రీవిద్యా ప్రకాశానందస్వాముల వారిని ప్రార్థించి గీతాజ్ఞానయజ్ఞము 18 రోజులు కర్నూలులో నిర్విఘ్నంగా నిర్వహించడమైనది. సాధారణంగా స్వామీజీ 3 సం॥లకు ఒకే ఊరిలో ఒక్కమారు ఒకే ఉరిలో ఈ పవిత్ర యజ్ఞాన్ని నిర్వహించేవారు. అయితే మా తండ్రిపైయున్న అభిమానము, నాపై గల వాత్సల్యము వల్ల కేవలం 6 నెలల్లోపునే మరల ఈ యజ్ఞం కర్నూలులో నిర్వహించడం మా కర్నూలు నగరమందలి భక్తుల అదృష్టంగా భావించాను. ఆ యజ్ఞము ఎంతో వైభవంగా ఎంతో నిష్ఠగా జరిగింది. భక్తులు సుమారు వేల సంఖ్యలో హాజరై ఆనందపరవశులయ్యారు. 18వ రోజు యజ్ఞపరిసమాప్తి చేసే రోజు 10 వేల మంది భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమము ఎంతో సంతృప్తిగా నిర్వహించడం జరిగింది. అంతమందికి ఎలాంటి లోటు లేకుండా ఏ పొరపాటు దొరలకుండా యజ్ఞం నిర్విఘ్నంగా జరగడం మాకు, కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులకూ ఎంతో హర్షాతిరేకాన్ని కలిగించింది. నాడు కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ప్రముఖ పారిశ్రామిక వేత్తలు నేటి మంత్రి వర్యులైన శ్రీ టి.జి. వెంకటేష్ గారు ఆ కార్యక్రమం పట్ల ఆకర్షితులై ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమములు ముందు ముందు జరుపుటకు ఒక వ్యక్తి కంటే ఒక వ్యవస్థ అవసరమనీ ఆ విధంగా మీరు చేసే ప్రయత్నానికి నేను సర్వ విధాలా సహాయ సహకారాలు అందిస్తానని అందుకు ఉపయుక్తమైన సంఘాన్ని వ్యవస్థీకరించవలసిందిగా కోరారు. వారిచ్చిన ప్రోత్సాహంతో ద్విగుణీకృతోత్సాహంతో పూజ్యశ్రీ శ్రీశ్రీవిద్యా ప్రకాశానందగిరి స్వాములవారికి ఆ విషయం నివేదించి వారి ఆశీస్సులు పొందడమైనది. వారి సువర్ణ కరకమలములచే కర్నూలు గీతామందిరమునందు 1986 లో స్వామి విద్యాప్రకాశానంద



గీతా ప్రచార సంఘము, కర్నూలు పేరుతో ఈ ధార్మిక సంఘాన్ని ప్రారంభించడమే గాక శ్రీటి.జి.వెంకటేష్ గారు ఛైర్మన్, నేను అధ్యక్షులుగా సంఘాన్ని రిజిష్టర్ చేయడమైనది. నాటి నుండి నేటి వరకు సంఘకార్యక్రమాలు దిగ్విజయంగా భవ్యంగా జరుగుతున్నాయి.

సంఘ ఆశయాలు, ఆచరణలో ప్రగతి ఫలాలు

ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన రావాలని, ప్రతిచిన్న విషయానికి వ్యక్తులు ఆవేశకావేశాలకులోను కాకుండా, శాంతియుత సహజీవనం సాగించాలని ఆకాంక్షిస్తూ, ఆ సదాశయ సాధనకు గీతాబోధనామృతము అత్యంత ఆవశ్యకం అని భావించి " స్వామి విద్యా ప్రకాశానంద గీతా ప్రచార సంఘం" స్థాపించడం జరిగింది. సంఘ వ్యవస్థాపన సందర్భంలో వ్యవస్థాపక సభ్యులతో శ్రీ శీ శ్రీ విద్యా ప్రకాశానందస్వామీజీ వారు – ఈ సంఘం గీతా ప్రచారాన్ని తలకెత్తుకొని భగవద్గీత సందేశసారాన్ని సమాజంలోని ప్రతి వ్యక్తికి చేరవేయవలసిన గురుతర బాధ్యతను స్వీకరించవలసిందిగా తెలిపారు. వారి ఆదేశానుసారం మంత్రివర్యులు శ్రీ టి.జి.వెంకటేష్ వంటి పెద్దల సహకారంతో స్వామీజీ మా భుజస్కంధాలపై పెట్టిన బాధ్యతను నిర్వహింపబూనుకున్నాము. నాటి నుండి నేటి వరకు క్రమం తప్పకుండా గీతా జ్ఞాన యజ్ఞములను జరుపుతూ గీతా ప్రచార కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నాము. శ్రీ స్వామి విద్యా ప్రకాశానంద స్వాములవారు జీవితులై యున్నంతకాలం ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి స్వామి వారు వచ్చి స్వయంగా గీతాయజ్ఞమును నిర్వహించి కర్నూలు భక్తులను ధన్యులను జేసేవారు.అయితే "అధికస్య అధికంఫలం" అన్న విశ్వాసంతో గీతా ప్రచార సంఘం నడుమ నడుమ ఎందరో మహానుభావులను రప్పించి, ఆధ్యాత్మిక ప్రవచనాలు ఇప్పించి భక్తుల హృదయక్షేత్రాలలో ఆధ్యాత్మిక బీజాలను నాటడానికి ఎంతగానో కృషి చేసింది. సంఘం గీతాజ్ఞాన యజ్ఞాలనే గాక ఇతర ధార్మిక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

దైవిక కార్యక్రమాలు ఎవరు ఏ సంస్థ నిర్వహించినా ఆ కార్యక్రమానికి తోడ్పాటు అందించడం సంఘం యొక్క నైతిక బాధ్యతగా భావిస్తూ ఎన్నో కార్యక్రమాలకు సహకారం అందించడం జరిగింది. ఉదాహరణకు చిన్మయ మిషన్ కార్యక్రమాలు, శ్రీఅమృతానందమయి(కేరళ) సంస్థ కార్యక్రమాలు, పూజ్యశ్రీ రవిశంకర్ గురూజీ సంఘం కార్యక్రమాలు అలాంటి వాటిలో కొన్ని.

ఎక్కడ ఏ మంచి కార్యక్రమం ఉన్నా దానికి అండగా నిలచే సంఘంగా, కర్నూలు నగరంలో వాసికెక్కిన గీతాప్రచార సంఘం యొక్క నిబద్ధత దృష్టి యందుంచుకొని, మాన్యులు మా సంఘం ఛైర్మన్ శ్రీ టి.జి. వెంకటేష్ గారు శ్రీదేవీ నవరాత్రుల్లో అమ్మవారి ఆరాధన, నిమజ్జన మహోత్సవాలను సంఘం భుజస్కందాలపై పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని సంఘం 1999 సం॥ నుండి శరన్నవరాత్రుల మహోత్సవాలను ఆ తొమ్మిది రోజులు ఉదయం హోమం, సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనాలను ప్రసిద్ధపండితులు, పీఠాధిపతులచే నిర్వహించడం జరుగుతున్నది. చివరి రోజు అమ్మవారి విగ్రహాలను పూర్ణకుంభములతో దాదాపు 2,000 మంది మహిళలు వెంటరాగా ఎంతో వైభవంగా ఊరేగింపుగా వెళ్ళి తుంగభద్రానదిలో శ్రీదుర్గాఘాట్ నందు నిమజ్జనం నిర్వహిస్తున్నాము. ఈ విధంగా ఈ కార్యక్రమం నిర్వహించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు నగరం అగ్రగామిగా నిలుస్తున్నది.

ఈ గీతా ప్రచార సంఘాన్ని పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వాములవారు ప్రారంభించినారు.

ఈ సంఘం అధ్వర్యంలో కర్నూలులో ఎందరో మహానుభావులు పాల్గొని వారి దివ్యప్రవచనాలు అందించారు. గత 25 సంవత్సరాలుగా సంఘ కార్యక్రమాలల్లో మైలు రాళ్ళుగా నిలిచిన విశేషాలు

1. 1986 లో " స్వామి విద్యాప్రకాశానంద గీతాప్రచార సంఘం" స్థాపితం

2. 2004 లో అష్టాదశ గీతాజ్ఞాన యజ్ఞం, 18 రోజులు 6 మంది ప్రముఖులచే గీతాజ్ఞానయజ్ఞం.

3. 2011 లో రజతోత్సవ గీతా వైభవం, 35 రోజులు, 18 మంది ప్రముఖ పీఠాధిపతులచే గీతా జ్ఞానయజ్ఞం నిర్వహణ.

4. గత 13 సంవత్సరాలుగా ప్రతి దసరా నవరాత్రులు దివ్యంగా, భవ్యంగా హెూమములు, ప్రవచనములు, సంగీత విభావరి, భరతనాట్య కార్యక్రమములు జరిపించుచున్నాము.

శ్రీ సంఘం సాధించిన ప్రగతిని - శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామీజీ అనుగ్రహ విభూతిగా భావిస్తూ, ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతూ ధార్మిక కార్యక్రమాల్లో ఎప్పుడు ముందు వరుసలో ఉంటూ, మహనీయుల ప్రవచనాలతో గీతాజ్ఞానయజ్ఞాలతో ప్రజలను ఆధ్యాత్మిక మార్గం వెంట అడుగులు వేయించడంలో స్వామివారి ఆశీస్సులను కోరుకుంటూ...

ధార్మిక సేవలో.....స్వామి విద్యాప్రకాశానంద గీతా ప్రచార సంఘం, కర్నూలు ముందు వుంటున్నది.



With Best Compliments From :

State Bank of Hyderabad
Srikalahasthi Branch
Chittoor-Dt.
A.P.



శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి గీతా సమాజము -ముంబాయి.

- దూస రాములు(వర్ల, ముంబాయి)

పూజ్యశ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు 1978 సంవత్సరంలో శ్రీ ద్యావనగిరి ప్రభులింగం గారి ద్వారా ఆహ్వానింపబడి ముంబాయికి వచ్చినారు. శ్రీవారు స్వహస్తాలతో కొంత పైకము నిచ్చి ఈ గీతాసమాజానికి ప్రారంభోత్సవం చేశారు. నాటి నుండి ద్యావనగిరి ప్రభులింగంగారి పట్టుదలతో కొందరు భక్తులు చేరి పూజలు, భజనలు, చేస్తూ సమాజాన్ని నడిపినారు. కొంతకాలానికి భక్తులలో పట్టుదల సన్నగిల్లినది.

ఈ పరిస్థితులలో 1991 సంవత్సరం సెంచురిమిల్లు కామగార్ హరిసంత్ సేవాసమాజం ఆహ్వానంపై సెంచురిమిల్లులో ఉపన్యసించుటకు రెండవ దఫా పూజ్యశ్రీశ్రీశ్రీస్వామివారు ముంబాయికి వచ్చారు. తొమ్మిది రోజులు శ్రీస్వామిప్రవచనాలు అనర్గళంగా జరిగినవి. ప్రజలు బాగా ఆకర్షింపబడినారు. చాలా మంది శ్రీస్వాములవారి వద్ద మంత్రోపదేశం తీసుకొన్నారు. సమాజాన్ని శ్రద్ధతో నడుపమని శ్రీస్వాములవారు చెప్పగా 1991 సంవత్సరం ఉగాదినాడు కటకం నర్సయ్యగారింటిలో సమాజ సమావేశాలు ఉత్సాహంగా మరల ప్రారంభమయినవి. శ్రీ ద్యావనగిరి ప్రభులింగంగారు అధ్యక్షులుగా, దూస రాములుగారు ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగినది. నాటినుండి దూసరాముల నేతృత్వంలో గీతాసమాజం బాగా జరగడం ప్రారంభమైంది. వారం వారం సత్సంగాలు, భజనలు జరుగుతూండినవి.

1992 సంవత్సరంలో మరల పూజ్యశ్రీశ్రీశ్రీ స్వాములవారు 3వ మారు ముంబాయికి రావడము జరిగినది. మరల చాలమంది దీక్షలు తీసుకొని భక్తులు కావడం జరిగినది. అప్పుడు భక్తులందరు కలసి దూసరాముల సారథ్యంలో బి.డి.డి. చాల్ (వర్లీ)లో ఒక గది గీతాసమాజానికి ఖరీదు చేసి అందు సమాజాన్ని పెట్టినారు. అప్పటినుండి ఆ గదిలో శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి గీతాసమాజాన్ని నడుపుతూన్నాము.

పూజ్యశ్రీగురుదేవులు వారిస్థానంలో శ్రీవిద్యా స్వరూపానందగిరి స్వాములవారిని పీఠాధిపతులుగా ఏర్పాటు చేసిన తరువాత శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాములవారు ప్రతి సంవత్సరం నవంబరు లేక డిశంబరు నెలలో ముంబాయి వచ్చి తొమ్మిది రోజులు గీతాజ్ఞాన సప్తాహం నడిపి మార్కండేయమందిరములో సాయంకాలం ప్రవచనాలు చేస్తున్నారు.

2003 సంవత్సరం అక్టోబరు 10,11,12 తేదీలలో మూడురోజులు ఈ సమాజ రజతోత్సవం చాల గొప్పగా మహావైభవంగా జరిగినది. శ్రీశుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు శ్రీస్వామీజీ అధ్యక్షతన ఈ రజతోత్సవములో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ స్వామీజీలందరు పాల్గొని ప్రవచనలు చేశారు. సమాజ సభ్యులందరి పూర్తి కృషితో ఈ రజతోత్సవాలు ముంబాయి తెలుగువారిలో ఒక గుర్తించదగినదిగా నిలచిపోయింది. 2003 సం॥రం నుండి ప్రతిసంవత్సరం శ్రీస్వాములవారి జయన్తి ఉత్సవాలు, పుణ్యారాధన, సమాజ వార్షికోత్సవం ముంబాయిలోని ఈ సమాజంలో బాగా చేస్తున్నాము.

ఇప్పుడు 2012 సంవత్సరం నుండి సమాజం ఉచితంగా వైద్యశిబిరం పెట్టి డా॥ దూస కుమారస్వామి (ఎముకల స్పెషలిస్టు) గారిచే ఎముకల జబ్బులకు చికిత్సలు చేయిస్తున్నాము. ఈ 2013 సం॥ ఏప్రిల్ 28 తేదినుండి జరుగు శ్రీగురుదేవుల శతజయన్త్యుత్సవాలలో మా ముంబాయి గీతాసమాజం అందరువచ్చి సేవచేసి గురు ఋణం తీర్చుకోవాలను కొంటున్నాము. ఆ తరువాత మా ముంబాయిలో కూడ శతజయన్త్యుత్సవాలను జరపాలని అనుకొంటున్నాము.

ఈ శతజయన్త్యుత్సవాలు అమోఘంగా, ఘనంగా జరగాలని గురుదేవులను, శ్రీకాళహస్తీశ్వరుని ప్రార్థిస్తున్నాము.

శ్రీవిద్యాప్రకాశానంద సత్సంగ సేవాసమాజము, హైదరాబాద్

శ్రీమహాగణాధిపతయే నమః

- బి.కోటయ్య(కార్యదర్శి)

శ్రీవిద్యాప్రకాశానంద సత్సంగసేవాసమాజం హైదారబాద్‌లో దిల్‌సుఖ్ నగర్ పి & టి కాలని గౌతమ్ నగర్‌లో 1995 ఏప్రిల్ లో శ్రీస్వామివారి అనుగ్రహ అనుమతితో మాస్వగృహమునందు ప్రారంభింపబడినది. నేను అంతకు ముందు స్వామి ప్రవచనముల వాల్ పోష్టరులు మున్నగునవి పంచినాను. తదుపరి Nizam College లో స్వామిప్రవచన సందర్భంలో శ్రీ పి. వేంకటేశ్వరులు గారు(Kakathiya Comet) శ్రీ శేషన్న చెన్నవారు, స్వర్గీయ బి.శ్రవణ్‌కుమార్ మున్నగువారు నన్ను ప్రోత్సహించి, శ్రీస్వామివారి కార్యక్రమములలో సేవచేయు భాగ్యం కలిగించారు. తదుపరి DSNR నందు శ్రీస్వామివారిప్రవచన సందర్భంగా పూజ్యశ్రీ స్వామివారిని మాఇంటికి ఆహ్వానించి, పాదపూజకావించి, సత్కరించి, "స్వామి ! నేను చాలబీద కుటుంబంలో జన్మించి, పెద్దచదువు నిమిత్తం హైదరాబాద్ వచ్చినాను. కాని, నాకుటుంబ పరిస్థితి, అర్థికదుస్థితి వలన నేను ఉన్నత విద్యఅభ్యసింప లేక ఆర్.టి.సిలో ఉద్యోగంలో స్థిరపడినాను. మీప్రవచనములను వినుటవలన, మీ సేవ చేయుటవలన, మీ జ్ఞాన యజ్ఞమునందు సేవచేయుటవలన జ్ఞానోదయం కలిగి, నేను ఉన్నత విద్యనభ్యసింపలేక పోయినా తోటి బీదవిద్యార్థులకు సహకరించి, సేవ చేయునిమిత్తం, శ్రీవిద్యాప్రకాశానంద సత్సంగసేవాసమాజం అను పేరుతో (మీ వద్ద అంతకముందు ఉపదేశం తీసుకొనుట వలన) ఈ సంస్థనుప్రారంబించి దీనజనులకు మీ పేరుతో సేవచేయ నిశ్చయించినాను" అని శ్రీ స్వామివారికి విన్నవించినాను. వారి అనుగ్రహంతో నేను, శ్రీమతి PCA Rajayam గారు, సర్గీయ శ్రావణ్‌కుమార్‌గారు కలసి ఈ సమాజాన్ని ప్రారంభించినాము. తరువాత 5 గురు విద్యార్థులకు సహాయం చేయుటతో మాఇంటిలో ప్రారంభించాము. శ్రీస్వామివారి జయన్తికి, మరల గురుపూర్ణిమకు దీనిని నిర్వహిస్తూ వచ్చాము. తరువాత పెద్దల్ని సంప్రదించి క్రమక్రమముగా అభివృద్ధి పరచి ఎందరో అనాథ విద్యార్ధినీ విద్యార్థులకు విద్యావసర వస్తువులు ఇచ్చే అవకాశం కలిగింది. వీరందరికి భోజనం ఏర్పాటు చేశాము.

తరువాత మాసంస్థకు కార్యనిర్వహణ సభ్యులు కూడ ఉన్నారు వారు శ్రీ జి.రామరాజు, కె.సుబ్బయ్య, కృష్ణమూర్తి, కృష్ణప్రభు, పి.రామకృష్ణ వంటి ఎందరోస్వామి భక్తులు సంస్థ అభివృద్ధి చెందుటకు సహకరించినందు వలన ప్రతిసం॥ము ఆధ్యాత్మికముగా ధార్మికంగా కార్యక్రమములు కొనసాగించు చున్నాము. శ్రీ అన్నపూర్ణకల్యాణమండపం అధినేత శ్రీ ఎఱ్ఱ బీరప్పగారి సహాయంతో శ్రీ సామవేదం షణ్ముఖశర్మగారితో శ్రీశివలీలామృతం, విష్ణుకథామృతం, నారదభక్తి సూత్రాలు పై ప్రవచనలు చేయించాము. శ్రీపరిపూర్ణానందసరస్వతి స్వామిచే 2011 ఫిబ్రవరి నందు భగవద్గీత 15 వ అధ్యాయం గీతాయజ్ఞము శ్రీపద్మావతి కల్యాణ మండపము నందు చేశాము. ధార్మిక కార్యక్రమములు 2005 నుండి నిర్వహించాము. ప్రతిసం॥లో విద్యాసం॥ము ప్రారంభంలో అంధ, అనాథ వికాలాంగులకు సహాయం ఇవ్వడమైనది. ప్రతినెల వారికి ఆదివారం అమృత సురభి కార్యక్రమం అనగా బియ్యం మున్నగు ఆహారపదార్థములు స్వామివారి భక్తుల నుండి సేకరించి గురుపూజ, లక్ష్మి, అన్నపూర్ణ స్తోత్రం చదివి. ప్రతి నెల ఒక అనాథ ఆశ్రమమునకు ఇచ్చుట జరుగుచున్నది. మరియు నెలకొక పర్యాయం మొదటి శనివారం కంటి పరీక్షలు, కళ్ళజోడులు అవసరమైన వారికి కంటి ఆపరేషన్ ఉచితంగా నిర్వహింపబడుచున్నవి.

శ్రీ గీతాప్రచారసమితి, విశాఖపట్నం

యెందూరి కృష్ణమూర్తి, అధ్యక్షులు
శ్రీ గీతా ప్రచార, సమితి, విశాఖపట్నం

ఓం శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి అద్భుత గ్రంథరాజము "గీతా మకరందము" ప్రసాదించిన స్ఫూర్తియే 1973 సం॥ నుండి విశాఖపట్నంలో భగవత్సందేశ ప్రచారసేవ గావిస్తున్న "శ్రీ గీతా ప్రచార సమితి" ఆవిర్భావానికి కారణమని ముందుగా మనవి చేస్తున్నాను.

దీనికి ముఖ్య కారకులు డా॥ వి.వి. రంగనాథం గారు మరియు పురుషోత్తమ తీర్థమహారాజు గారు. ఈ కార్యక్రమము దినదినప్రవర్ధమానమై విశాఖపట్నములోనే కాక, పరిసర ప్రాంతములలో కూడా గీతాప్రచారములో భక్తులు వేల సంఖ్యలో పాల్గొని ఆనందమును పంచుకుంటున్నారు. దుఃఖనివృత్తి, ఆనందప్రాప్తి ఇదే పరమాత్మ ఆదేశము. అదే స్వామివారి ప్రచారము.

శ్రీస్వామి వారు 1989వ సంవత్సరములో 15-5-1989 నుండి 4-6-1989 వరకు విశాఖపట్నం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 20 రోజుల పాటు గీతా జ్ఞానయజ్ఞ సందర్భములో అమూల్యమైన ఉపన్యాసములు ఇచ్చినారు. దీనికి పూర్వము అనకాపల్లిలో ఉపన్యాసములు జరిగే సమయమున విశాఖలోని గీతాభక్తులు అనకాపల్లి వెళ్ళి స్వామి వారిని దర్శించి విశాఖలో గీతాభవనం నిర్మించాలని, దాని నిమిత్తం స్వామి వారికి విశాఖ యజ్ఞంలో వచ్చే విరాళం శ్రీగీతా ప్రచార సమితికి ప్రసాదించుమని ప్రార్థన చేసినాము. స్వామి వారు వెంటనే స్పందించి అపారమైన దయతో అంగీకారము తెలిపి 18 రోజులలో వచ్చిన విరాళము రూ. 55,000/- మరియు వారి శుకబ్రహ్మ ఆశ్రమము నుండి కూడా 2,000/- అనుగ్రహించినారు. మొత్తము సొమ్ము బేంక్‌లో జమచేసినాము. స్వామివారి అనుగ్రహముతో 1999లో గీతా భవనము ఏర్పడినది. గీతాచార్యుడు "బీజం మామ్" అన్నట్లుగా విశాఖలో గీతా భవనము ఏర్పడుటకు బీజం వేసినది గీతాచార్యుని ప్రతినిధియైన మన స్వామి. కావున స్వామి వారు ఎంత దయామయులో తేటతెల్ల మగుచున్నది. స్వామివారి ఆశీస్సులతో గీతాభవనమునందలి ధ్యానమందిరములో నలు వైపుల 701 గీతాశ్లోకములు పాలరాతిపై చెక్కించి అతికించడమయినది. అలాగే ఐదు అడుగుల ఎత్తు పాలరాతి విశ్వరూప విగ్రహము ప్రతిష్ఠించడ మయినది.

శ్రీ వారివాక్కు చమత్కారము, చిన్న చిన్న కథలు పామరు జనులను కూడా ఆకట్టుకొని లక్షలమందిని ఆనందబరచింది. వారు ఇంపుగా సొంపుగా చక్కటి తెలుగులో ఉపన్యాసములు చెప్పుటయేకాకుండా భక్తులు నిత్య జీవితంలో ఎలా వ్యవహరించాలి, ఏ సంస్కారముతో నడుచుకోవాలి అని నొక్కి నొక్కి చెప్పేవారు. ఆంధ్రప్రదేశ్ అంతా కొన్ని లక్షలమంది భక్తులు తయారయ్యారు. విశాఖలోని పాఠశాలలో బాలబాలికలకు భగవద్గీతతో పరిచయము, పెద్దలకు సత్సంగము ద్వారా సారాంశాన్ని అందజేసినారు. ఆ రోజులలో ఆడపిల్లలను పుష్పవతి అయిన తరువాత ఒంటరిగా బయటకు పంపేవారు కారు. కాని స్వామి వారి

ఉపన్యాసము అనగానే తల్లిదండ్రులే ప్రోత్సహించేవారు.

ఉదయం ప్రత్యేక సమావేశాలలో జిజ్ఞాసగల అనేకమంది విద్యావంతులు, పండితులు, భక్తులు అల్లిపురంలో ఉన్న శ్రీ వరిగాల నాని గారి ఇంట్లో జరిగే సమావేశాలలో వారి అనేక ప్రశ్నలకు, సందేహాలకు విపులముగా శ్రీవారు విసుగు లేకుండా సమాధానం చెప్పే వారు. ప్రతి విషయానికి గీతయందలి తత్సంబంధమయిన శ్లోకాన్ని ఉదహరించి సందేహాలను నివృత్తిచేసేవారు.

వారిలో ఆడంబరం ఎక్కడా కనబడలేదు, కోపము కూడా ఉండేది కాదు. పెద్దవారు అయినా, చిన్న పిల్లలు అయినా వారి ప్రశ్నలకు పూర్తి సమాధానం ఇచ్చి పంపేవారు. కానుకలకు ఎప్పుడూ తాపత్రయపడలేదు. ఎవరు దైవకార్యం కొరకు ఎంత సమర్పించినా నవ్వుతూ స్వీకరించేవారు. సమయపాలనకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చేవారు. పూజ్యశ్రీ స్వాములవారు ఆహారం విషయంలో ఎన్నో ముఖ్య విషయాలను, ముఖ్యముగా ప్రతివారు తీసుకోవలసిన శ్రద్ధలు తెలియపరిచి సాత్త్విక ఆహారం, త్వరగా జీర్ణమయ్యే ఆహారం మానవ జీవితానికి ముఖ్యం అని చెప్పేవారు. అప్పుడే నిజమైన ఆరోగ్యమైన జీవితాన్ని గడపవచ్చును అని కొన్ని కథలు చెబుతూ నవ్వించేవారు.

నిజముగా చెప్పాలంటే స్వామివారి ప్రవచనములు అనేకమంది బాలబాలికలను పెద్దలను చైతన్యవంతులుగా చేయటం వలన విశాఖపట్టణంలో 50పైగా గీతా సత్సంగములు ఏర్పడి ప్రచారము నిత్యమూ జరుగుతున్నది. శ్రీగీతాప్రచార సమితి ప్రతిపాదించిన "రోజుకొక శ్లోకము" మరియు ఆహారము తీసుకొనే ముందు పారాయణం చేయవలసిన 2 శ్లోకములు

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।
ప్రాణపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥
(15-4)

బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్ ।
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా (4-24)

ప్రచారములోనికి వచ్చినవి. విశాఖపట్నం ప్రాధాన్యత పెరుగుచున్న కొలదీ జనాభా పెరుగుచున్నది. కావున ఇంకా 50 సత్సంగాలు ఏర్పడి గీతాసారం అందరికీ అందించాలని మా సమితి కృషి చేస్తున్నది. స్వామి వారి గీతాసార ప్రవచనాలు రాబోయే తరాలకు కూడా ఉపయోగపడి మానవులు ఆనందజీవితాన్ని గడుపుతారని ఆశిస్తున్నాము.

ఓం తత్సత్ ఓమ్

ప్రపంచములో రెండువస్తువు లున్నవి. ఒకటి శిరస్సు (Head), రెండు హృదయము (Heart). ఇందులో మొదటిదానిని అశ్రయించుట అనగా, ప్రపంచములోని సమస్త లౌకికవిద్యలను, వాఙ్మయమును పరిగ్రహించుట యగును. రెండవదానిని ఆశ్రయించుట యనగా దైవగుణములు కలిగి భక్తి జ్ఞానవైరాగ్య ములను జేపట్టి పవిత్రమైన శీలమును గలిగియుండుట యగును. ఈ రెండింటిలో మొదటిదానికంటె, రెండవది భగవంతుని దృష్టిలో మిన్న. శిరస్సును వికసింపచేసి, హృదయమును సంకుచిత మొనర్చినచో నేమి ప్రయోజనము? అన్ని విద్యలు నేర్చుకొనినప్పటికిని, ప్రేమ, దయ, పరోపకారము, మున్నగు దైవగుణములు లేనిచో, ఏమి లాభము? కావున ప్రపంచవిద్యలతో పాటు దైవగుణములనుకూడ అలవరచుకొనుడు. - **శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి**

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్కూల్ ఆఫ్ భగవద్గీత

- బండి రమేశ్ కుమార్,
ఈదు శ్రీనివాసరావు(విశాఖపట్నం)

విశాఖపట్టణంలో **"శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్కూల్ ఆఫ్ భగవద్గీత", శ్రీశ్రీశ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారి** దివ్యహస్తముల మీదుగా శ్రీఖర నామ సంవత్సర, మాఘ శుద్ధ త్రయోదశి అనగా తేది 05-02-2012 (ఆదివారం) ఉదయం గం॥ 9.09 ని॥లకు ప్రారంభించబడినది. మరికొంతమంది పండితులు, పురప్రముఖులు కూడా ఈప్రారంభోత్సవ కార్యక్రమములో పాల్గొన్నారు.

భగవద్గీత శుద్ధపఠనం ఉచితంగా నేర్పడం లక్ష్యముగా ప్రారంభమైన ఈ స్కూల్లో సుమారు 60 మంది విద్యార్థులు **"గీతాగానప్రవీణ", "గీతాగానశిరోమణి"** సంపూర్ణ భగవద్గీత కంఠస్థ పరీక్షలో శ్రీగీతాప్రచారసమితి వారిచే **"బంగారు పతకము"** పొందిన శ్రీ **బండి రమేశ్ కుమార్**గారిచే శిక్షణ పొందుతున్నారు. దీనిలో బాలబాలికలు, యువతీయువకులు, స్త్రీపురుషులు నేర్చుకుంటున్నారు.

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి బోధను సమాజంలో వ్యాపింపచేయడం లక్ష్యముగా ప్రారంభమైన ఈ స్కూల్లో నేటికి ఆరు అధ్యాయాలు తాత్పర్యసహితముగా కూడా బోధించబడినవి. "ఆచార్య సార్వభౌమ" శ్రీ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి (ఆంధ్రా యూనివర్సిటీ తెలుగు విశ్రాంత ఆచార్యులు) గారి సూచనలు, సలహాలతో బోధ జరుగుతోంది.

ఇకపై భగవద్గీతతో పాటు శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రం, ముకుందమాల, శ్రీలక్ష్మీనృసింహకరావలంబ స్తోత్రం, శ్రీమద్భాగవతములోని ప్రహ్లాదోపాఖ్యానం, గజేంద్రమోక్షణం, గోపికాగీతం ఇత్యాది అంశములు కూడా బోధించబడును.

శిక్షణా స్థలం : శ్రీ శివానందాశ్రమం (శ్రీవిశ్వనాథాలయ ప్రాంగణం) లయన్స్ క్లబ్ వెనుక, రామ్ నగర్, వైజాగ్.

కోర్సు సమయం : ఒక సంవత్సర కాలము

శిక్షణా సమయం : ప్రతి ఆదివారము మరియు ముఖ్య శెలవు దినములలో ఉదయం 10-12గంటలకు

ఫోన్ నెంబర్ : 9441050226, 9848582661, 9848628081

గమనిక: త్వరలో సాయంత్ర సమయాలలో కూడా (వారానికి రెండు రోజులు) శిక్షణాతరగతులు ప్రారంభింపబడును.

అమూల్యమగు ఈ జన్మను ఇంద్రియసౌఖ్యముల కొఱకు ధారపోసి తుదకు శోకసంతప్తులగుట విజ్ఞులకు పాడి గాదు. కావున ఓ సాధకుడా! రేపు, మాపు అనక ఇప్పటి నుండియే పరమాత్మచింతన కుపక్రమించి, బ్రహ్మానంద సామ్రాజ్యాభిషిక్తుడవు కమ్ము.

- **శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి**



శ్రీ స్వాములవారి పేరుతో నిర్వహింపబడుతున్న విద్యాసంస్థలు, ఆధ్యాత్మికసంస్థలు

- డా॥ సముద్రాల దశరథ, తిరుపతి.

1. శ్రీస్వామి విద్యాప్రకాశానంద గవర్నమెంటు ఆర్ట్సు అండ్ సైన్సు కాలేజి, శ్రీకాళహస్తి.

శ్రీ స్వాములవారి పేరుమీద 22-08-1966లో ఈ కళాశాల ప్రారంభోత్సవం జరిగింది. నాటి న్యాయశాఖామంత్రి శ్రీ పి.వి.నరసింహారావు (తరువాత భారతదేశ ప్రధాని) గారు కళాశాలను ప్రారంభించారు. అప్పటి విద్యాశాఖామంత్రి శ్రీకాళహస్తి వాస్తవ్యులు శ్రీ అద్దూరి బలరామిరెడ్డిగారు ఆ సభకు అధ్యక్షత వహించారు. కళాశాల కమిటీ ఉపాధ్యక్షులు శ్రీ పి.ఆర్. మాధవరావుగారు స్వాగతం పలికారు. కొన్ని లక్షలమంది విద్యార్థులు ఇక్కడ విద్యనార్జించారు.

2. శ్రీస్వామి విద్యాప్రకాశానంద గవర్నమెంటు బాలికల జూనియర్ కాలేజి, శ్రీకాళహస్తి.

ఈ కళాశాల 1982లో ప్రారంభమయ్యింది. ఇందుకుగాను శ్రీస్వామి వారు భూరి విరాళం అందజేశారు. ఇక్కడ చదివిన విద్యార్థినులు ఉత్తమ ఆదర్శజీవనాన్ని గడుపుతున్నారు.

3. శ్రీస్వామి విద్యాప్రకాశానంద గవర్నమెంటు బాలుర జూనియర్ కాలేజి, శ్రీకాళహస్తి.

4. శ్రీస్వామి విద్యాప్రకాశానందగిరిస్వామి గీతాసమాజము, వర్లీ, బొంబాయి.

ఈ గీతా సమాజము 1978 వ సంవత్సరంలో శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి అమృతహస్తాల మీదుగ ప్రారంభింపబడింది. అప్పుడు స్వాములవారు స్వయంగా కొంతపైకమును సమాజానికి విరాళంగా సమర్పించారు. 2003 వ సంవత్సరం అక్టోబర్ 10,11,12 తేదీలలో ఈ సమాజ రజతోత్సవాలు శ్రీవిద్యాస్వరూపానంద స్వామీజీ అధ్యక్షతన అద్భుతంగా జరిగాయి. అందువలన బొంబాయిలోని తెలుగువారందరికీ ప్రత్యేక గుర్తింపు కలిగింది. ఈ సమాజం కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాక డా॥ దూస.కుమారస్వామి (ఎముకల నిపుణులు) వారిచే వైద్యశిబిరాన్ని 2012లో ప్రారంభం చేయించి ఉచితంగా వైద్యసేవలు కూడా అందిస్తున్నది.

ఇక్కడ స్వాములవారి జయన్త్యుత్సవాలు, పుణ్యారాధన, సమాజవార్షికోత్సవాలు చక్కగా నిర్వహింపబడుతున్నాయి.

5. శ్రీస్వామి విద్యాప్రకాశానంద గీతాసంఘము విశాఖపట్నం. (షిప్‌యార్డు)

ఈ సంఘంవారి గీతాభవనం స్వాములవారి దివ్యహస్తాలతో ప్రారంభింపబడింది. ఇందుకుగాను శ్రీస్వామివారు 57,000/- రు॥లు విరాళమిచ్చారు. ఈ భవనంలో అయిదు అడుగుల ఎత్తు పాలరాతి విశ్వరూప విగ్రహం ప్రతిష్ఠించబడింది. ఇక్కడ గీతలోని శ్లోకాలన్నింటినీ పాలరాతిపై చెక్కించి అతికించారు. ఈ సంఘంద్వారా 50 కి పైగా గీతాసత్సంగాలు ఏర్పడ్డాయి.

6. శ్రీవిద్యాప్రకాశానంద సత్సంగ సేవాసమాజము, దిల్‌సుఖ్‌నగర్,(గౌతంనగర్) హైద్రాబాద్.

ఇది 1991లో శ్రీ స్వాములవారి దివ్యహస్తాలమీదుగ ప్రారంభింపబడినది. నాటినుండి నేటివరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు నారాయణసేవ (అన్నదానం), ఉచితనేత్రశిబిరాలను నిర్వహించడం,అంధ, అనాథ, వికలాంగులైన విద్యార్థినీ విద్యార్థులకు ఫీజులు కట్టడం, ఉచితంగా బట్టలు పంచడం వంటి సేవాకార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. ఈ సంస్థకు విరాళమిచ్చే దాతలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారు 80 జి చట్టం క్రింద ఆదాయపుపన్ను రాయితీ సౌకర్యం కూడా కల్పించారు. ఈ సమాజానికి అధ్యక్షులుగా శ్రీరామరాజుగారు, ఉపాధ్యక్షులుగా శ్రీమతి పి.యల్.ఎ.రాజ్యంగారు, కార్యదర్శిగా శ్రీబి.కోటయ్యగారు వ్యవహరిస్తున్నారు.

7. స్వామి విద్యాప్రకాశానంద గీతా ప్రచారసంఘం, కర్నూల్.

1986 లో స్వాములవారి చేతులమీదుగ ప్రారంభింపబడినది. ఈ సంస్థకు ప్రెసిడెంట్‌గా శ్రీడి.వి. రమణగారు, ఛైర్మన్‌గా శ్రీ టి.జి.వెంకటేష్‌గారు వ్యవహరిస్తున్నారు. ప్రతిసంవత్సరం వేసవిలో గీతాజ్ఞాన యజ్ఞం జరుగుతుంది. ఈ సందర్భంలో పీఠాధిపతులు మొదలైన ప్రముఖవక్తలు ఈ కార్యక్రమంలో గీతమీద మరియు ఆధ్యాత్మికంగా ఉపన్యసిస్తూంటారు. దసరాలో అమ్మవారి విగ్రహం చేయించి, ఇక్కడ నెలకొల్పి 10 రోజులపాటు పూజలు, అభిషేకాలు నిర్వహించి 11 వ రోజు నిమజ్జనం జరిపిస్తారు.

8. శ్రీవిద్యాప్రకాశానంద సత్సంగ సేవాసమాజము, నంద్యాల. దీనికి స్థానిక నందిపైపుల ఇండస్ట్రీస్ సంస్థాపకులు, ప్రస్తుత ఎం.పి. శ్రీ యస్.పి.వై.రెడ్డి గారు ఛైర్మన్, గెలివి వెంకటసుబ్బయ్యగారు ప్రముఖులు.

9. శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి గీతాశ్రమము, ఐలాపురం, కోరట్లమండలం.

ఇందు శివాలయం 1996 వ సంవత్సరం ఫిబ్రవరి 9 వ తేదీనాడు శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వామివారి చేతులమీదుగ ప్రారంభింపబడినది. అదేరోజు శివలింగప్రతిష్ఠ కూడా జరిగింది. విశేషదినాలలో పూజలు జరుగుతూంటాయి. ముఖ్యంగా శ్రావణమాసంలో స్త్రీలు ఉదయం, సాయంత్రం ఉపవాసాలుండి సాయంత్రం భజనలు చేసి హారతులిస్తారు. ఈ ఆశ్రమానికి అధ్యక్షులుగా శ్రీ టి. పెద్ద వెంకటిగారు, కార్యదర్శిగా శ్రీ టి.వెంకట్రాములు గారు వ్యవహరిస్తున్నారు. ఇది మూడెకరాల స్థలంలోవుంది. మూడు ఇండ్లు కూడా విడివిడిగా వున్నాయి.

10. శ్రీస్వామి విద్యాప్రకాశానంద గీతాశ్రమము, బీరవెల్లి, సారంగపూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా. ఇది గురుదేవులు పూజ్యశ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాముల వారి దివ్యహస్తములచే 10-3-1983 తేది భూమి చేయడం ద్వారా ప్రారంభమైంది. ఇది మూడెకరాల స్థలంలో వుంది. ఇందు ముముక్షునిలయం, గురుమందిరం, సత్సంగహాలు, వంటశాలలు గలవు. ఈ ఆశ్రమ సంఘం ప్రతిగ్రామంలో 18 అధ్యాయాల గీతాపారాయణ, ప్రవచన అనే కార్యక్రమాన్ని 108 గ్రామాలలో చేశారు. ఈ ఆశ్రమం, మౌక్తికోత్సవం,

రజతోత్సవం జరుపుకొన్నది. ఇచట సత్సంగాలు, పారాయణలు, పండుగదినాలలో సమష్టి పూజలు వగైరా జరుగుచున్నవి. అధ్యక్షులు రామిరెడ్డిగారు, కార్యదర్శి కె.మురళీమనోహర్, గౌరవాధ్యక్షులు ఎ. నర్సయ్య, టి.భూమన్న.

11. శ్రీవిద్యాప్రకాశానందగిరి స్కూల్ ఆఫ్ భగవద్గీత, విశాఖపట్టణం.

ఈ సంస్థ 05-02-2012 వ సంవత్సరం నాడు శ్రీశ్రీశ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారి దివ్యహస్తాల మీదుగ ప్రారంభింపబడింది. ఇక్కడ భగవద్గీత తాత్పర్యసహితంగా ఉచితంగా నేర్పబడుతోంది. దీని సంచాలకులు "గీతాగాన శిరోమణి'' బండిరమేష్ కుమార్‌గారు, ఈదు శ్రీనివాసరావుగారు. ఇందు బాలబాలికలకు, యువకులకు, గృహస్థులకు ఉచితంగా భగవద్గీత నేర్పబడుతుంది.

12. శ్రీవిద్యాప్రకాశానంద బ్రహ్మనిష్ఠాశ్రమము, విజయనగర్ కాలనీ, వెంకటాపూర్, నిర్మలమండలము, అదిలాబాద్‌జిల్లా.

ఇది అదిలాబాద్ జిల్లా నిర్మల్ పట్టణానికి దగ్గరలో వెంకటాపూర్ గ్రామం, విజయనగర్ కాలనీలో ఒక చిన్న గుట్టపై వుంది. 1-4-1998న ప్రారంభింపబడింది. ప్రశాన్తవాతావరణం సాధకులకు మంచిచోటు. ఆదివారం శలవు దినాలలో సమిష్టి గీతాపారాయణ, విశేష శ్రీరామనవమి వంటి పండుగ దినాలలో విశేషకార్యక్రమాలు జరుగుచున్నవి. దీని అధ్యక్షులు రుద్రనారాయణ, ఉపాధ్యక్షులు బి. లింగన్న, కార్యదర్శి పి. లింబన్న, కోశాధకారి సాయన్న.

With Best Compliments From :

BHANODAYA KALAMKARI

Desired to Success.....!

P. PADMAVATHI

D/o Krishna Reddy

UNESCO Award Winner

4/517-2D, near Sukhabramhasramam Road,

Srikalahasthi - 517 644

E-mail : campadma009@gmail.com.,

padma-79@ymail.com

info@bhanodayakalamkari.in

www.bhanodayakalamkari.on

జగద్గురు శంకరుల
మఠామ్నాయము

– శ్రీ విద్యా స్వరూపానందగిరి స్వాములవారు

శ్రో ॥ చతుర్దిక్షు ప్రసిద్ధాసు ప్రసిద్ధ్యర్థం స్వనామతః ।
చతురో మఠాన్ కృత్వా శిష్యాన్సంస్థాపయద్విభుః ॥

తా॥ తన సాంప్రదాయ ప్రసిద్ధికొఱకు శ్రీ జగద్గురు శంకరాచార్యులవారు ప్రసిద్ధములైన నాల్గు దిక్కులందు (తూర్పు, దక్షిణ, పశ్చిమ, ఉత్తర దిశలందు) తన పేరుతో నాల్గుమఠాలను స్థాపించి అందు తన శిష్యులను నియమించారు.

ఆ మఠాలు

1. ప్రథమే పశ్చిమామ్నాయే శారదామఠ ఉచ్యతే ।
కీటవారః సంప్రదాయః తస్య తీర్థాశ్రమే పదే ॥

ద్వారకాఖ్యంతు తత్ క్షేత్రం దేవస్సిద్ధేశ్వరో భవేత్ ।
భద్రకాళీ తు దేవీస్యాదాచార్యో విశ్వరూపకః ॥

గోమతీతీర్థమమలం బ్రహ్మచారీ స్వరూపకః ।
సామవేదస్య వక్తా చ తత్ర ధర్మం సమాచరేత్ ॥

తా॥ పశ్చిమదిశలో మఠము శారదామఠము. కీటవార సంప్రదాయము. వీరి సంన్యాసులకు తీర్థ, ఆశ్రమ అని పేర్లు. వీరి క్షేత్రము –ద్వారక, సిద్ధేశ్వరుడు దేవత. భద్రకాళీ దేవి. గోమతి తీర్థము, బ్రహ్మచారి స్వరూప. వీరికి సామవేదం వేదము, 'తత్త్వమసి' మహావాక్యము. హస్తామాలకాచార్యుల వారు ప్రథమాచార్యులు.

2. ద్వితీయేచ పూర్వామ్నాయే గోవర్ధనమఠఃస్మృతః ।
భోగవారః సంప్రదాయః వనారణ్యే వదేతతః ॥

పురుషోత్తమాఖ్యం క్షేత్రం జగన్నాథోఽస్యదేవతా ।
విమలాఖ్యాతు దేవీస్యా దాచార్యః పద్మపాదకః ॥

తీర్థం మహోదధి ప్రోక్తం బ్రహ్మచార్ ప్రకాశకః ।
ఋగ్వేదస్య వక్తా చ తత్ర ధర్మం సమాచరేత్ ॥

తా॥ రెండవదగు తూర్పుదిక్కునగల మఠము –గోవర్ధన మఠము. భోగవార సంప్రదాయము. సంన్యాసులకు వన, అరణ్య అని పేర్లు. పురుషోత్తమ క్షేత్రం. వీరికి జగన్నాథుడు దేవత. విమలా దేవి. పద్మపాదాచార్యులవారు మొదటి ఆచార్యుడు. మహోదధి తీర్థము. ప్రకాశ అని బ్రహ్మచారి. వేదము ఋగ్వేదము, 'ప్రజ్ఞానం బ్రహ్మ' వీరి మహావాక్యము.

3. తృతీయే హ్యుత్తరామ్నాయే, జ్యోతిర్నామ మఠో భవేత్।
ఆనందవారో విజ్ఞేయః సంప్రదాయోఽస్య సిద్ధికృత్ ॥

పదాని తస్స ఖ్యాతాని, గిరిపర్వతసాగరాః ।
బద్రికాశ్రమ క్షేత్రం చ నారాయణోఽస్యదేవతా ॥

దేవీపుణ్యగిరి ర్జ్ఞేయా, తోటకాచార్య ఉచ్యతే ।
తీర్థమలకనందాఖ్యం జ్ఞానధ్యానప్రకాశకమ్ ॥

సేవితం సర్వదేవైశ్చ ఆనందాఖ్యోబ్రహ్మచారీ ।
తస్య వేదోఽ పృథర్వాఖ్యః తత్రధర్మం సమాచరేత్ ॥

తా॥ మూడవది ఉత్తరదిశ. ఈ దిక్కులో మఠము(పేరు) జ్యోతిర్మఠము. ఆనందవార సంప్రదాయము. ఈ సంన్యాసులకు -గిరి, పర్వత, సాగర అనిపేర్లు. బదరికాశ్రమం వీరికి క్షేత్రము. నారాయణుడు వీరికి దేవత. పుణ్యగిరి దేవి. తోటకాచార్యులవారు మొదటి ఆచార్యుడు. జ్ఞానధ్యానాలను ప్రకాశింపజేసే అలకనంద తీర్థము. ఆనంద బ్రహ్మచారి. అధర్వణవేదం వీరికి వేదము. 'ఆయమాత్మా బ్రహ్మ' అనేది వీరి మహావాక్యము.

4. చతుర్థే దక్షిణామ్నాయే శృంగేరీ మఠ ఉచ్యతే ।
భూరివారాభిధస్తస్య సంప్రదాయో మహోత్తమః ॥

పదాని త్రీణి ఖ్యాతాని సరస్వతీ భారతీ పురీ ।
రామేశ్వరాఖ్యం క్షేత్రం చాదివారాఖ్యదేవతా ॥

కామాక్షి తస్యదేవీ స్యాత్సర్వకామ ఫలప్రదా ।
సురేశ్వరాఖ్య ఆచార్యః
తుంగభద్రేతి తీర్థకమ్ ॥

చేతనాఖ్యో బ్రహ్మచారీ యజుర్వేదస్యపాఠకః ।
ఏవం విధినా యుక్తో హి తత్ర ధర్మం సమాచరేత్ ॥

తా॥ నాల్గవది దక్షిణాదిశమఠము శృంగేరి మఠము అనిపేరు. భూరివార సంప్రదాయము. ఈ సంన్యాసులకు -సరస్వతీ, భారతీ, పురీ అని పేర్లు. రామేశ్వరం వీరికి క్షేత్రము. ఆదివరాహ దేవత. అన్ని కోరికలనిచ్చు కామాక్షి వీరికిదేవి. సురేశ్వరాచార్యులు ప్రథమాచార్యులు. తుంగభద్రతీర్థము. చైతన్యబ్రహ్మచారి(నామము). యజుర్వేదము వీరి వేదము. 'అహం బ్రహ్మాస్మి' మహావాక్యము.

పైన తెల్పిన చతురామ్నాయమఠముల దశనామముల వివరణ-

"తీర్థాశ్రమ వనారణ్య గిరి పర్వత సాగరాః ।
సరస్వతీ భారతీ చైవ పురేతి దశనామకాః ॥

తా॥ శంకరాచార్యుల ఈ సంప్రదాయములో తీర్థ, ఆశ్రమ, వన, అరణ్య, గిరి, పర్వత, సాగర, సరస్వతీ, భారతీ, పురి. అని దశనామములు.

ఈ దశ నాములవారిని గురించిన వివరణలో 'గిరి' నామమును గురించి మాత్రము ఇచట వివరింతును-

గిరి వాసో గిరివనే నిత్యం గీతాధ్యయన తత్పరః ।
గంభీరాచల బుద్ధిశ్చ గిరినామా స ఉచ్యతే ॥

తా॥ గిరినామ సంన్యాసులు కొండచరియలందు (కొండల సమీపంలో) నివసించాలి. నిత్యము గీతాధ్యయన తత్పరులుగా వుండాలి. గంభీరమైన, నిశ్చలమైన బుద్ధి గలవాడుగా వుండాలి. అని మఠామ్నాయము.

సంసార రోగ నివారణకు జపము, ధ్యానము, ఆత్మవిచారణ మున్నగునవి యన్నియు మందు. భూతదయ, పరోపకారము, పవిత్రాచరణ మున్నగునవి పథ్యము. కావున రెండింటిని శీలించువాడు భవరోగ రహితుడై పరిపూర్ణశాన్తిని అనుభవించగలడు.

వ్యాధి తొలగవలెననిన మందును తినుటతోబాటు పథ్యమును గూడ సరిగా ఆచరింపవలయును గదా!. పూజా జప ధ్యానాదులే మందు. సర్వభూత దయయే పథ్యము. దైవ చింతనయే మందు. ధర్మాచరణమే పథ్యము. భవరోగ వినాశనమునకు రెండును ఆవసరములే యని జ్ఞాపకముంచుకొనవలెను.

- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు



సన్న్యాస సంప్రదాయము

శ్రీ శంకరానందగిరి స్వాములవారు,
పెనమలూరు

(పూజ్యశ్రీ శంకరానందగిరి స్వాములవారు - మొదట శ్రీవ్యాసాశ్రమంలో బ్రహ్మచారిగా వుండి కాశిలో వేదాన్తాచార్య చదివారు. పరమాత్మానందాశ్రమాధిపతులుగా వున్నారు.)

ప్రియాత్మబంధువులారా!

మానవ జీవితాన్ని నాల్గుభాగాలు చేసి వేదం నాలుగు ఆశ్రమాలను చెప్పింది. ప్రారంభం నుండి, 25;26 నుండి, 50;51 నుండి, 75;76 నుండి శరీరపతనం వరకు బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసమని. ఈ క్రమం 100 సంవత్సరాల ఆయువును దృష్టియందుంచుకుని క్రమ సన్న్యాస విధానం చెప్పబడుతుంది. కాని "యదహరేవ విరజేత్ తదహరేవ ప్రవ్రజేద్ బ్రహ్మచర్యాద్వా, గృహాద్వా, వనాద్వా" ఏ రోజు సంపూర్ణ వైరాగ్యం కలిగితే ఆ రోజే సన్న్యసించాలి, గృహస్థాశ్రమం నుండిగాని, వానప్రస్థం నుండిగాని, లేక ప్రప్రథమం బ్రహ్మచర్య ఆశ్రమం నుండి గాని' అనే శాస్త్ర వాక్యాలు మనకు వినిపిస్తాయి. అనగా ఏదో ఒక జన్మకు మూడింటిని వదలి జీవుడు తురీయుడు కావాలనే శాస్త్రం శాసిస్తూ వుంది. అయితే మానసిక పరిపక్వత లేదా సంపూర్ణ వైరాగ్యం లేందే సన్న్యాసం నిలువదని కూడ శ్రుతిస్మృతి వాక్యాలు మనకు దృష్టిగోచరం అవుతూవున్నాయి.

న కర్మణామనారంభా న్నైష్కర్మ్యం పురుషోశ్నుతే ।
న చ సంన్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥

కర్మలు చేయక నిష్కర్మత్వం రాదు. వాటి త్యాగం చేత మాత్రమే సన్న్యాసి కాలేడు.

"కామ్యానాం కర్మణాం న్యాసం సంన్యాసం కవయో విదుః"

"సర్వకర్మ ఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః"
"అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః
స సంన్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్నచాక్రియః"
"ఆరురుక్షోర్మునేర్యోగం కర్మకారణముచ్యతే
యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే"

ఈలాంటి భగవద్గీతా వాక్యాలు 'కామ్యకర్మలత్యాగం' 'కర్మఫల త్యాగం' 'సర్వసంకల్ప త్యాగం' సన్న్యాసమని చెపుతున్నాయి. వీటిలో సందేహాలు సంభవించవచ్చు. "సోపానారోహణ న్యాయం"గా మానసిక పరిపక్వత ననుసరించి అన్వయం చేసుకోవాలి. సంస్కార రహితులు, పుణ్యలేశంతో ప్రాపంచిక వ్యవహారంతో నిరంతరం ఆధ్యాత్మికతలో ఉండరు, అందుకని కామ్య కర్మలను వదలి, నిష్కామ కర్మలు చేయాలి. అనగా ఫలం భగవదర్పితం కావాలి. దాంతో సంస్కారం అభివృద్ధి చెందినందున సర్వసంకల్ప త్యాగరూప మానసిక పరిపక్వత ఏర్పడుతుంది.